సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 247

సోమవారం 22-5-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



బెంగళూరు ఖేల్‌ఖతం

6 వికెట్ల తేడాతో గెలిచిన గుజరాత్ ప్లే ఆఫ్‌కు ముంబై జట్టు - 12లో



రాబడి చూడొద్దు

జీవిత బీమాపై తీసుకోవాల్సిన జాగ్రత్తల మీద కథనం - 13లో



మా మద్దతు మీకే

ఢిల్లీలో పరిపాలనాధికారులపై అజమాయిషీ విషయంలో కేజ్రీవాల్‌కు మద్దతుగా నిలుస్తామని బిహార్ సీఎం నితీశ్ చెప్పారు.

వివరాలు 6లో ▶



రక్షణ వలయంలో శ్రీనగర్

శ్రీనగర్‌లో నేటి నుంచి జీ-20 టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.


వివరాలు 6లో ▶



ఐరాసను సంస్కరించాల్సిందే

ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలను తక్షణమే సంస్కరించుకోవాల్సిన అవసరముందని ప్రధాని మోదీ జీ-7 సదస్సులో పేర్కొన్నారు.

వివరాలు 6లో ▶



మనది ఒకే మూలం కాదు

మనమంతా ఒకే ఆదిమ జాతి నుంచి పుట్టుకొచ్చామనే సిద్ధాంతం తప్పని ఓ తాజా అధ్యయనం వెల్లడించింది.

వివరాలు 6లో ▶

ఏది నిజం?

ఆసుపత్రిలో చేరటంపైనా

రోగిష్టి రాతలేనా?

- అవినాశ్‌రెడ్డి తల్లి అనారోగ్యంపై 'ఈనాడు' దారుణ కథనాలు
- కర్నూలు ఆసుపత్రిలో చేరటంపైనా విషపూరిత కల్పనలు
- డాక్టర్ హితేష్ నిపుణుడైన కార్డియాలజిస్టు అనేది చెప్పరేం?
- విశ్వభారతి ఆస్పత్రి కార్డియాలజీకి పేరున్నదని ప్రస్తావించరేం?
- అవన్నీ వదిలి ఆ వైద్యుడు పులివెందుల వాసి అని మాత్రమే రాస్తారా?
- ఎంపీ అవినాశ్‌ను పరామర్శించిన వారి కులాన్ని ప్రస్తావించటమేల?
- రామోజీని పరామర్శించినవారి కులాల గురించి ఎన్నడైనా రాశారా?.. సీఐడీ దర్యాప్తు అంటే.. అంబులెన్స్‌ను పిలిపించి డ్రామాలాడిందెవరు?
- నోటికి మాస్కు, నడుముకు బెల్టుతో అనారోగ్యపు 'సెటప్' చేసుకున్నదెవరు?
- ఇంతటి దుర్మార్గాలు స్వయంగా చేసి.. ఇతరులపై ఆరోపణలేల?

4 లో

పారిశ్రామిక దూకుడు



శరవేగంగా జరుగుతున్న రామాయపట్నం పోర్టు పనులు

రాష్ట్ర ప్రభుత్వ కృషికి అవార్డుతో జాతీయ స్థాయిలో గుర్తింపు

మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ అడుగులు

- కొత్తగా 4 పోర్టు నగరాలు రామాయపట్నం, మూలపేట, కాకినాడ, బందరు
- వీటికి అదనంగా మినీ పోర్టుల తరహాలో తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం
- పోర్టులను ఆనుకుని పారిశ్రామిక పార్కుల అభివృద్ధి
- పరిశ్రమలకు 80% ఉత్పత్తి వ్యయం తగ్గేలా రూ.18,897 కోట్లు వెచ్చిస్తున్న సర్కార్
- అనుమతులు, ఆర్థిక వనరులు సిద్ధమయ్యాకే పక్కాగా ప్రారంభమైన పనులు
- మూడు పారిశ్రామిక కారిడార్లు కలిగిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డు
- మూడు కారిడార్లలో రూ.11,753 కోట్లతో పారిశ్రామిక పార్కుల అభివృద్ధి
- భోగాపురం ఎయిర్‌పోర్టుతోపాటు రామాయపట్నం తెట్టు వద్ద మరో ఎయిర్‌పోర్టు
- విశాఖ, అనంతపురంలో రెండు మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధి
- వీటికి అదనంగా కొప్పర్తి, ఓర్వకల్లుల్లో ఎంఎల్‌పీల అభివృద్ధికి ప్రతిపాదనలు
- ప్రభుత్వ తోడ్పాటుతో రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొస్తున్న దిగ్గజ కంపెనీలు
- విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులే నిదర్శనం

బ్రాండ్ ఏపీ

సాక్షి, అమరావతి: పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనలో రాష్ట్రం వేగంగా దూసుకెళుతోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడు పారిశ్రామిక కారిడార్లతో పాటు 974 కి.మీ సుదీర్ఘ తీర ప్రాంతాన్ని కలిగి ఉండటం లాంటి అనుకూలతలను అందిపుచ్చుకుంటూ పురోగమిస్తోంది. విద్యుత్, నీరు, రోడ్లు, లాజిస్టిక్స్‌తో పాటు వివాద రహితంగా అభివృద్ధి చేసిన భూములను సమకూర్చడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో

మిగతా 2వ పేజీలో ▶

రామోజీ మంటకు 'మందు' ఉందా?

మద్యం విధానంపై ఈనాడు కబోది కథనాలు

ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్ కేసులతో రాష్ట్రాన్ని ముడిపెడుతూ రోత రాతలు

- అక్కడి విధానాలతో మనకు ఏమాత్రం పొంతన లేదు
- టీడీపీ మద్యం సిండికేట్‌కు చెక్ పెట్టిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- షాక్ కొట్టేలా ధరలు.. పరిమిత వేళలో ఆంక్షలతో విక్రయాలు
- రాష్ట్రంలో మద్యం డిస్టిలరీలన్నీ బాబు హయాంలోనివే
- కొత్తగా ఒక్క డిస్టిలరీకి అనుమతి ఇవ్వని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- అన్ని డిస్టిలరీల నుంచి 5% చొప్పున మద్యం కొనుగోళ్లు
- అదే బాబు హయాంలో 3 డిస్టిలరీల నుంచే 47.09 శాతం కొనుగోళ్లు



సాక్షి, అమరావతి: కల్లు తాగిన కోతి వనమంతా చెరచినట్లుగా ఇతర రాష్ట్రాల్లో మద్యం కుంభకోణాలు బయటపడితే ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు కేసులు పెట్టరంటూ గగ్గోలు పెట్టడం రామోజీరావు మానసిక స్థితిపై సందేహాలను రేకెత్తిస్తోంది! నేరం జరిగిన చోట.. అభియోగాలు నమోదైన చోట కేసులు పెడతారుగానీ మీ కడుపుమంట తీరేందుకు కేసులు పెట్టాలంటే ఎలా? ఒకపక్క తాను చంకనెక్కించుకునే చంద్రబాబును ప్రజలు ప్రతిసారీ తిరస్కరిస్తున్నారు.. మరోపక్క చిట్‌ఫండ్స్ ముసుగులో నిర్మించుకున్న అక్రమ సౌధం పునాదులు కదిలిపోతుండటంతో తాగుబోతు కథనాలకు తెగబడ్డారని స్పష్టమవుతోంది!

ఏమైనా పోలిక ఉందా?

ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్‌లో సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసులతో ఏపీకి ఎలాంటి సంబంధం లేదు. ఇంకా చెప్పాలంటే అసలు వాటి మద్యం విధానాలతో మన రాష్ట్రానికి పోలికే లేదు. ఢిల్లీలో మద్యం దుకాణాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు నిర్వహించారు. అందులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో సీబీఐ కేసు నమోదు చేసింది. ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

మిగతా 4వ పేజీలో ▶

హజ్ యాత్ర ఏర్పాట్లకు ఏడు కమిటీలు



హజ్-2023 యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు ఏపీ హజ్ కమిటీ చర్యలు చేపట్టింది. వసతి, ఆహారం, రవాణా తదితర ఏర్పాట్ల కోసం ఏడు సబ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్ తెలిపారు.

14 లో

బెంగళూరులో వరదలు.. ఏపీ యువతి మృతి



భాను (ఫైల్)

కర్ణాటక రాజధాని బెంగళూరులో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కేఆర్ సర్కిల్ అండర్ పాస్ వద్ద కారు వరద నీటిలో చిక్కుకోవడంతో భానురేఖారెడ్డి(22) అనే మహిళ మరణించారు. ఆమె స్వస్థలం కృష్ణా జిల్లా తేలప్రోలు. కుటుంబసభ్యులతో కలిసి నగరాన్ని చూసేందుకు వెళ్లగా ఈ ప్రమాదం జరిగింది.

6 లో

బందరు పోర్టు పనులకు నేడే శుభారంభం

రూ.5,156 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం జగన్ భూమిపూజ

- భూసేకరణ, అన్ని అనుమతులు, ఫైనాన్షియల్ క్లోజర్ అయిన తర్వాతే పనులు ప్రారంభం
- పోర్టు రాకతో వాణిజ్య కార్యకలాపాల విస్తరణ
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉపాధి
- 24-30 నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యం.. దీనితో మారనున్న కృష్ణాజిల్లా ముఖచిత్రం




పోర్టు నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భూమిపూజ చేసే ప్రాంతం

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయవాడ: మచిలీపట్నం ప్రజల దశాబ్దాల కలను నెరవేరుస్తూ రూ.5,156 కోట్ల వ్యయంతో చేపడుతున్న పోర్టు నిర్మాణ పనులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ప్రారంభించనున్నారు. భూసేకరణ పూర్తిచేసి, అన్ని అనుమతులు సాధించి, న్యాయ వివాదాలు పరిష్కరించి, టెండర్లు ఖరారుచేసి, ఫైనాన్షియల్ క్లోజర్ పూర్తిచేసి కొబ్బరికాయ కొట్టిన తర్వాత పనులు ఆగకుండా శరవేగంగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను సిద్ధంచేసింది. పూర్తిగా ప్రభుత్వ వ్యయంతో నిర్మిస్తున్న ఈ పోర్టు రాకతో వాణిజ్య కార్యకలాపాలు విస్తరించి రానున్న కాలంలో కృష్ణాజిల్లా ముఖచిత్రం మారనుంది.

75 ఏళ్లలో ఆరు, ఈ నాలుగేళ్లలో నాలుగు..

స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో రాష్ట్రంలో కేవలం ఆరు పోర్టులు కడితే, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో నవశకానికి నాంది పలుకుతూ అధికారంలోకి వచ్చిన కేవలం నాలుగేళ్లలోపే మరో నాలుగు పోర్టుల నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రామాయపట్నం, కాకినాడ గేట్‌వే పోర్టుల్లో పనులు శరవేగంగా జరుగుతుండగా, మూలపేట పోర్టు పనులు కూడా

మిగతా 2వ పేజీలో ▶



పార్లమెంటు 2.0

సర్వాంగ సుందరంగా కొత్త భవనం

28న ప్రారంభించనున్న ప్రధాని మోదీ

6 లో



2,000 నోట్ల మార్పిడికి ధ్రువీకరణ పత్రాలు అక్కర్లేదు

రూ.20,000 వరకు విలువ చేసే రూ.2,000 నోట్లను మార్చుకునేందుకు ఎటువంటి ఫారం అవసరం లేదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) స్పష్టం చేసింది. వినియోగదారుడు ఎలాంటి ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించాల్సిన అవసరం లేదని పేర్కొంది. నోట్ల మార్పిడి ప్రక్రియ సజావుగా జరిగేందుకు ప్రజలకు అవసరమైన తోడ్పాటు అందించాలని తమ స్థానిక ప్రధాన కార్యాలయాలకు సూచించింది.

- వివరాలు 5లో



ఉన్నతవిద్యకు సారథులు

- ఎస్ఈపీ సారథి పేరుతో యూజీసీ సరికొత్త కార్యక్రమం
- ఉన్నత విద్యాసంస్థలు, వర్సిటీల్లో స్టూడెంట్ అంబాసిడర్ల నియామకం
- కొత్త విద్యావిధానంపై అవగాహన, ఉన్నతవిద్య ప్రోగ్రామ్‌ల ప్రోత్సాహమే లక్ష్యం

సాక్షి, అమరావతి: ఉన్నతవిద్యలో మరిన్ని సంస్కరణల దిశగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అడుగులు వేస్తోంది. నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)పై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు అభిప్రాయ సేకరణ చేసేలా కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి

మిగతా 2వ పేజీలో ▶



వచ్చే ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడగాలో అర్థం కావట్లేదు!!

తప్పుదోవ పట్టించేందుకే

తప్పుడు రాతలు

విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తున్నా వాస్తవాలకు 'ఈనాడు' రామోజీ వక్రీకరణ

ఫ్యాక్ట్ చెక్

- విద్యా సంవత్సరంలో త్రైమాసికం ముగిసిన తర్వాత విద్యా దీవెన చెల్లింపు
- అక్టోబర్-నవంబర్-డిసెంబర్ 2022కు మార్చి 19న రూ.684.52 కోట్ల చెల్లింపు
- జనవరి-ఫిబ్రవరి-మార్చి 2023 త్రైమాసికానికి రూ.702.99 కోట్లు మే 24న విడుదలకు ఏర్పాట్లు
- సంక్షేమ కేలండర్ ప్రకారం క్రమం తప్పకుండా నిధులు విడుదల
- విద్యా రంగంలో సంస్కరణలకు ఈ 45 నెలల్లో చేసిన వ్యయం రూ.57,642.36 కోట్లు
- గత ప్రభుత్వపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,778 కోట్లు కూడా చెల్లింపు
- ఈ ప్రభుత్వం ఏడాదికి చెల్లిస్తున్న మొత్తం రూ.3,311 కోట్లు..
- విద్యా దీవెన, వసతి దీవెనకు ఇప్పటిదాకా రూ.14,210 కోట్లు చెల్లింపు.. అయినా.. విద్యార్థులకు బకాయిలంటూ రామోజీ రోత రాతలు



మార్చి 19న జగనన్న విద్యా దీవెన చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న సీఎం జగన్ (ఫైల్)

సాక్షి, అమరావతి: విద్యపై చేసే ఖర్చు భవిష్యత్తు తరానికి పెట్టుబడి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. 'జగనన్న విద్యా దీవెన' పథకం కింద సంక్షేమ కేలండర్ ప్రకారం విద్యా సంవత్సరంలో త్రైమాసికానికి ఒకసారి క్రమం తప్పకుండా నిధులు విడుదల చేస్తోంది. ఈ క్రమంలోనే పేదింటి పిల్లలు కూడా

మిగతా 14వ పేజీలో ▶

ఆలివ్ రిడ్లే.. సముద్రంలోకి వెడలె

- ఈ ఏడాదిలో ఇప్పటివరకు సముద్రంలోకి వదిలిన తాబేలు పిల్లల సంఖ్య 2.39 లక్షలు
- 3 వేల తాబేళ్ల గూళ్లను రక్షించిన ట్రీ ఫౌండేషన్, అటవీ శాఖ
- ఈ ఏడాది కాపాడిన తాబేళ్ల గుడ్లు 3.41 లక్షలు



సాక్షి, అమరావతి: ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ చర్యల్లో భాగంగా ట్రీ ఫౌండేషన్, రాష్ట్ర అటవీ శాఖ రాష్ట్రంలోని సముద్ర తీరప్రాంతం వెంబడి ఈ ఏడాదిలో ఇప్పటివరకు 3,036 తాబేళ్ల గూళ్లను రక్షించాయి. ఆ గూళ్లలో 3.41 లక్షల గుడ్లను కాపాడగా.. వాటినుంచి 2.39 లక్షల తాబేళ్ల పిల్లలు పుట్టుకొచ్చాయి. వాటన్నిటినీ సముద్రంలోకి వదిలారు. శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, సూళ్లూరుపేట జిల్లాల్లోని తీర ప్రాంతాల్లో ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 23వ తేదీన అంతర్జాతీయ తాబేళ్ల దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

మాచ్‌ఖండ్‌లో 6 యూనిట్లలో విద్యుత్‌ ఉత్పత్తి

రెండేళ్ల విరామం తర్వాత రెండు యూనిట్లు మళ్లీ ప్రారంభం

సాక్షి, అమరావతి: ఒడిశాలోని మాచ్‌ఖండ్‌ జల విద్యుత్‌ కేంద్రంలో మొత్తం ఆరు యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి. అత్యంత పురాతనమైన ఈ పవర్‌ హౌస్‌లో రెండు యూనిట్లు దాదాపు రెండేళ్లుగా పనిచేయడం లేదు. నాలుగు మాత్రమే పనిచేస్తూ వచ్చాయి. ఈ వేసవిలో విద్యుత్‌ డిమాండ్‌ అనూహ్యంగా పెరిగిన నేపథ్యంలో ఈ రెండు యూనిట్లు ఉత్పత్తి పునరుద్ధరించడం వల్ల భారీ ఊరట లభించినట్టయ్యింది. రెండేళ్లుగా పనిచేయని నాలుగో యూనిట్‌ ఆదివారం విద్యుత్‌ ఉత్పత్తిని పునరుద్ధరించింది. దీంతో మాచ్‌ఖండ్‌ పవర్‌ హౌస్‌లో మొత్తం ఆరు యూనిట్లు అందుబాటులోకి వచ్చి పూర్తిస్థాయిలో విద్యుత్‌ ఉత్పాదన చేస్తున్నాయి. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ అందించిన సాంకేతిక సహకారం, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహం వల్లే మాచ్‌ఖండ్‌లో రెండు యూనిట్లలో విద్యుత్‌ ఉత్పత్తి పునఃప్రారంభించగలిగామని జెన్‌కో ఎండీ డైరెక్టర్‌ చక్రధర్‌ బాబు తెలిపారు.

విశాఖలో నేవల్‌ ఆర్మమెంట్‌ డైరెక్టర్‌ జనరల్‌ పర్యటన



అడిషనల్‌ ఆర్మ్‌డ్‌ ఫెసిలిటీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేఎస్‌సీ అయ్యర్‌

సాక్షి, విశాఖపట్నం: రక్షణ మంత్రిత్వ శాఖ అనుబంధ నేవల్‌ ఆర్మమెంట్‌ డైరెక్టర్‌ జనరల్‌ కేఎస్‌సీ అయ్యర్‌ మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం విశాఖపట్నం వచ్చారు. నేవల్‌ ఆర్మ్‌డ్‌ డిపో(ఎన్‌ఏడీ)లో 'లైఫ్‌ ఎక్స్‌టెన్షన్‌ ఆఫ్‌ మిస్సైల్స్‌' అంశంపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యర్‌ మాట్లాడుతూ దేశ రక్షణకు అవసరమైన ఆయుధ సంపత్తిపై దృష్టి సారించాలని, భవిష్యత్తులో ప్రపంచంలోనే బలీయమైన శక్తిగా భారత నౌకాదళం ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎన్‌ఏడీలో అడిషనల్‌ ఆర్మ్‌డ్‌ ఫెసిలిటీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. దీని ద్వారా ఆయుధ సంపత్తికి సంబంధించిన సరఫరా చైన్‌లో ఉన్న అంతరాన్ని తగ్గించడంతోపాటు ఇండియన్‌ నేవీ పోరాట సామర్థ్యాన్ని పెంపొందించగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రక్షణ శాఖకు సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేట్‌ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యవేడు టీడీపీ మాజీ ఎమ్మెల్యే కారు ఢీకొని యువకుడికి గాయాలు

వరదయ్యపాళెం: తిరుపతి జిల్లాలో ఆదివారం సత్యవేడు టీడీపీ మాజీ ఎమ్మెల్యే హేమలత కారు ఢీకొని ఒక యువకుడు గాయపడ్డాడు. అతడిని శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు. బాధితుడు వరదయ్యపాళెం సమీపంలోని వడ్డిపాళేనికి చెందిన బేల్దారి మేస్త్రి సురేష్‌ కథనం మేరకు.. అతడు ద్విచక్ర వాహనంపై వెళుతూ తడ-శ్రీకాళహస్తి ప్రధాన రోడ్డులోకి ప్రవేశించే సమయంలో వరదయ్యపాళెం నుంచి సత్యవేడు వైపు వెళ్తున్న సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు ఢీకొంది. సురేష్‌ చేతికి, తలకి బలమైన గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే మాజీ ఎమ్మెల్యే హేమలత వరదయ్యపాళెంలోని ఓ టీడీపీ నేత ఇంటికి వెళ్లారు. గాయపడిన సురేష్‌ను కుటుంబసభ్యులు, స్థానికులు వరదయ్యపాళెంలో ప్రాథమిక వైద్యం చేయించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాళహస్తికి తరలించారు. బాధితుడికి రూ.3 వేలు ఇచ్చిన టీడీపీ నేతలు ప్రమాదం గురించి గోప్యంగా ఉంచారు. బేలుదారు మేస్త్రిగా రోజూ పనికివెళ్తేగానీ పూటగడవని తమకు దిక్కెవరంటూ బాధితుడు, అతడి కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో ఆదివారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	42.8	28.3
రాజమహేంద్రవరం	41.5	26.0
మార్కాపురం	41.0	28.0
కర్నూలు	40.6	29.1
తిరుపతి	40.0	27.0
నంద్యాల	39.0	27.6
నెల్లూరు	38.7	27.7
విజయవాడ	38.0	27.0
ఏలూరు	38.0	27.0
శ్రీకాకుళం	38.0	27.0
అనకాపల్లి	36.8	25.5
విశాఖపట్నం	35.8	27.6
తెలంగాణలో..		
ఆదిలాబాద్‌	43.0	29.0
రామగుండం	42.2	25.0
హైదరాబాద్‌	40.3	26.9

పారిశ్రామిక దూకుడు!





శరవేగంగా సాగుతున్న జువ్వలదిన్నె, రామాయపట్నం ఫిషింగ్‌ హార్బర్ల పనులు

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలనిస్తున్నాయి. పారిశ్రామిక రాయితీలతోపాటు మౌలిక వసతులపై అధికంగా దృష్టిసారించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన సీఎం జగన్‌ కోవిడ్‌ సంక్షోభ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చర్యలు తీసుకున్నారు. రాష్ట్రం గుండా వెళ్తున్న మూడు పారిశ్రామిక కారిడార్లు విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్‌-బెంగళూరు కారిడార్లలో రూ.11,753 కోట్లతో ఆరు పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు రూ.18,897 కోట్లతో నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్‌ హార్బర్ల నిర్మాణాన్ని కోవిడ్‌ సమయంలో ఏకకాలంలో చేపట్టారు. అంతేకాకుండా విశాఖ, అనంతపురంలో మల్టీ మోడల్‌ లాజిస్టిక్‌ పార్కుల నిర్మాణాన్ని చేపట్టడమే కాకుండా కొప్పర్తి, ఓర్వకల్లు వద్ద మరో రెండు మల్టీ మోడల్‌ లాజిస్టిక్‌ పార్కుల కోసం ప్రతిపాదనలు పంపారు. మరోవైపు కాకినాడ వద్ద రూ.1,000 కోట్లతో బల్క్‌డ్రగ్‌ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నారు. వీటివల్ల అభివృద్ధి చేసిన 50,000 ఎకరాలు అందుబాటులోకి రావడంతో పాటు రాష్ట్రంలో ఏర్పాటైన పరిశ్రమల ఉత్పత్తి వ్యయం 80%వరకు తగ్గనుంది. తద్వారా అంతర్జాతీయ కంపెనీలతో పోటీపడే స్థాయికి ఎదగనున్నట్లు పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పారిశ్రామిక మౌలిక వసతుల కోసం ఈ స్థాయిలో వ్యయం చేస్తున్న రాష్ట్రం దేశంలో మరెక్కడా లేదని పేర్కొంటున్నాయి.

కోవిడ్‌లోనే కొప్పర్తి నోడ్‌ రెడీ

ఒకపక్క కోవిడ్‌ సంక్షోభం వెంటాడుతున్నా విశాఖ-చెన్నై కారిడార్‌ పరిధిలోని కొప్పర్తి నోడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అందుబాటులోకి తెచ్చింది. విశాఖ-చెన్నై కారిడార్‌లో భాగంగా కొప్పర్తి వద్ద 6,739 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందులో 801 ఎకరాల్లో వైఎస్సార్‌ ఈఎంసీ, 3,053 ఎకరాల్లో వైఎస్సార్‌ జగనన్న మెగా ఇండస్ట్రియల్‌ హబ్‌ను అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చింది. ఇదే కారిడార్‌లో భాగంగా నక్కపల్లి, రాంబిల్లి, శ్రీకాళహస్తి, కొప్పర్తి నోడ్‌లను ఏడీబీ, నిక్‌డిక్ట్‌ నిధులతో అభివృద్ధి చేస్తోంది. ఏడీబీ నిధులతో తొలిదశలో రూ.2,900 కోట్లతో అభివృద్ధి చేయగా రెండోదశలో రూ.1,633 కోట్లతో అభివృద్ధి పనులకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఈనెల 23న ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ ఒక్క కారిడార్‌ పరిధిలోనే 26,182 ఎకరాలు అందుబాటులోకి రానున్నాయి. ఇక చెన్నై-హైదరాబాద్‌ కారిడార్‌ కింద కృష్ణపట్నం వద్ద 11,096 ఎకరాల్లో క్రిస్‌ సిటీని, హైదరాబాద్‌ -బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లు వద్ద 9,305 ఎకారాలను అభివృద్ధి చేయనుంది. ఈ పారిశ్రామిక పార్కులకు అవసరమైన నీటి వసతికి సంబంధించిన పనులను కూడా ఏపీఐఐసీ మొదలు పెట్టింది. మరోవైపు ఇప్పటికే కర్నూలు ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తేగా భోగాపురంతోపాటు రామాయపట్నం తెట్టు వద్ద మరో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

గత ప్రభుత్వానికి భిన్నంగా..

టీడీపీ అధికారంలో ఉండగా తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోకుండా ఎన్నికలకు నెలన్నర ముందు ఎలాంటి అనుమతులు లేకుండా చంద్రబాబు కొబ్బరికాయ కొట్టి షూటింగ్‌ ముగించారు. ఇలాంటి వ్యవహారాలకు తావులేకుండా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టుల నిర్మాణానికి అవసరమైన అన్ని కీలక అనుమతులు సాధించడంతోపాటు ఆర్థిక వనరులు (ఫైనాన్షియల్‌ క్లోజర్‌) సమకూరిన తర్వాతే పనులు ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే రామాయపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టుల నిర్మాణం మొదలు కాగా ఈనెల 22వతేదీన మచిలీపట్నం పోర్టు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం ఏపీ మారిటైమ్‌ బోర్డును నెలకొల్పడమే కాకుండా మూడు పోర్టులకు ప్రత్యేక కంపెనీలను ఏర్పాటు చేశారు. 2022 జూలైలో పనులు ప్రారంభించిన రామాయపట్నం శరవేగంగా సాకారమవుతోంది. ఈ ఏడాది చివరినాటికల్లా తొలి ఓడను ఇక్కడకు రప్పించే లక్ష్యంతో ముందుకువెళుతున్నారు.

60,000 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి

పోర్టులకు అదనంగా 60,000 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి కల్పించేలా తొమ్మిది ఫిషింగ్‌ హార్బర్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. తొలిదశలో చేపట్టిన జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్‌ హార్బర్లలో పనులు వేగంగా జరుగుతుండటంతో త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. జువ్వలదిన్నె పనులు 86 శాతానికిపైగా పూర్తి కాగా నిజాంపట్నంలో 62% జరిగాయి. మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్‌ హార్బర్ల పనులు 50% దాటాయి. ప్రైవేట్‌ రంగంలో నిర్మిస్తున్న కాకినాడ గేట్‌వే పోర్టుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మూడు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్‌ హార్బర్ల కోసం రూ.18,897 కోట్లు వ్యయం చేస్తోంది. ఈ పోర్టులను ఆనుకుని భారీ పారిశ్రామిక నగరాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఇందుకోసం ముగ్గురు ఐఏఎస్‌ అధికారులతో కమిటీని నియమించారు. రాష్ట్రంలో నెలకొల్పే పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను సమకూర్చడంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఇందుకోసం 192 స్కిల్‌ హబ్స్‌ ఏర్పాటుతోపాటు 26 స్కిల్‌ కాలేజీలను ఏర్పాటు చేసింది.

జాతీయ స్థాయిలో గుర్తింపు..

అత్యంత ప్రతిష్టాత్మకంగా తీరప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రముఖ బిజినెస్‌ దినపత్రిక 'ఎకనామిక్‌ టైమ్స్‌' దేశీయ ఇన్‌ఫ్రా రంగంపై ఏటా ప్రకటించే అవార్డుల్లో ఈసారి మనకు చోటు దక్కింది. దేశంలో పోర్టు ఆధారిత మౌలిక వసతుల కల్పనలో ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం సాధించిన అత్యున్నత ప్రగతిని గుర్తిస్తూ ఇన్‌ఫ్రా ఫోకస్‌ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక మౌలిక వసతులకు పెద్దపీట వేస్తుండటంతో దిగ్గజ సంస్థలైన అదానీ, అంబానీ, మిట్టల్‌, బిర్లా, భంగర్‌, భజాంకా, సంఘ్వీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో విశాఖ వేదికగా జరిగిన గ్లోబల్‌ ఇన్వెస్టర్‌ సమ్మిట్‌లో 386 ఒప్పందాల ద్వారా రూ.13,11,468 కోట్ల విలువైన పెట్టుబడులు రావడమే దీనికి నిదర్శనం. గతేడాది చివరి త్రైమాసికంలో అత్యధిక పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రంగా ఏపీ మొదటి స్థానంలో ఉన్నట్లు ప్రాజెక్ట్స్‌ టుడే సర్వే వెల్లడించింది.

పోర్టులు	తొలిదశ వ్యయం	సామర్థ్యం	విస్తీర్ణం
రామాయపట్నం	రూ.3,736.14కోట్లు	34.04 ఎంటీపీఏ	851.15 ఎకరాలు
మూలపేట	రూ.4,361.91కోట్లు	23.5 ఎంటీపీఏ	1254.72 ఎకరాలు
మచిలీపట్నం	రూ.5,155.73కోట్లు	35.12 ఎంటీపీఏ	1922.97 ఎకరాలు
కేసెజ్‌ పోర్టు (పీపీపీ విధానంలో)	రూ.2,123.43 కోట్లు	16 ఎంటీపీఏ	1944 ఎకరాలు

ఫిషింగ్‌ హార్బర్‌	ప్రాజెక్ట్‌ వ్యయం	మత్స్యకారుల లబ్ధి	బోట్లు నిలిపే సామర్థ్యం
జువ్వలదిన్నె	రూ.288.80 కోట్లు	6,100	1,250
నిజాంపట్నం	రూ.451 కోట్లు	9,000	1,600
మచిలీపట్నం	రూ.422 కోట్లు	3,300	550
ఉప్పాడ	రూ.361 కోట్లు	17,700	2,500
బుడగట్ల పాలెం	రూ.365.80 కోట్లు	3,840	780
పూడిమడక	రూ.392.53 కోట్లు	4,870	930
కొత్తపట్నం	రూ.392.53 కోట్లు	4,200	820
ఓడరేవు	రూ.417.55 కోట్లు	9,500	1,650
బియ్యపు తిప్ప	రూ.429.43 కోట్లు	2,348	441
మొత్తం	రూ.3,520.56 కోట్లు	60,858	10,521

పారిశ్రామిక కారిడార్లు

పారిశ్రామిక క్లస్టర్లు	అభివృద్ధి చేస్తున్న ఎకరాలు
విశాఖ-చెన్నై కారిడార్‌	
నక్కపల్లి	4,319 ఎకరాలు
రాంబిల్లి	2532 ఎకరాలు
శ్రీకాళహస్తి	12,592 ఎకరాలు
కొప్పర్తి	6,739 ఎకరాలు
చెన్నై బెంగళూరు కారిడార్‌	
క్రిస్‌ సిటీ	11,096 ఎకరాలు
హైదరాబాద్‌-బెంగళూరు కారిడార్‌	
ఓర్వకల్లు	9,305 ఎకరాలు

అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా..



పోర్టులు, పారిశ్రామిక పార్కుల నిర్మాణం ద్వారా ఏపీలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా సీఎం జగన్‌ స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. సహజ వన రు లను వినియోగించుకుంటూ 3 ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టారు. రామాయపట్నం పోర్టుతో ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, మచిలీపట్నంతో కృష్ణా, ఎన్టీఆర్‌, మూలపేటతో శ్రీకాకుళం జిల్లాలు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా 3 పారిశ్రామిక కారిడార్ల ద్వారా 50,000 ఎకరాల భూమిని అందుబాటులోకి తెస్తున్నాం. అన్ని అనుమతులు, ఆర్థిక వనరులు సమకూరిన తర్వాతే సీఎం జగన్‌ పనులు ప్రారంభిస్తున్నారు.

– గుడివాడ అమర్నాథ్‌, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి

వ్యయం తగ్గించడమే లక్ష్యం



పరిశ్రమల ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడంపై సీఎం దృష్టి సారించారు. లాజిస్టిక్‌ వ్యయం తగ్గించడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని నియంత్రించి అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీ పడేవిధంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నాం. యూరోప్‌లోని రోస్టర్‌ డ్యామ్‌, జపాన్‌లోని యకహోమా తరహాలో పోర్టు నగరాలను అభివృద్ధి చేయాలన్నది లక్ష్యం. కొత్తగా నిర్మిస్తున్న నాలుగు పోర్టుల వద్ద పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు ఇన్‌లాండ్‌ వాటర్‌వేస్‌, గ్యాస్‌, రోడ్లు, రైల్వే, విద్యుత్‌, నీటి సరఫరా లాంటి మౌలిక వసతులు కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

– కరికాల వలవన్‌, పరిశ్రమలు, పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

ఎంవోయూల కంటే ఎక్కువగా..



మూడు పారిశ్రామిక కారిడార్లలో అన్ని మౌలిక వసతులతో పారిశ్రామిక పార్కులను ఏడీబీ, నిక్‌డిక్ట్‌ నిధులతో అభివృద్ధి చేయడంతో పాటు నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్‌ హార్బర్లను ఏకకాలంలో నిర్మిస్తున్నాం. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెంది రాష్ట్ర జీడీపీ పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఫిషింగ్‌ హార్బర్లు, పోర్టుల వద్దే ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్లను ప్రోత్సహిస్తున్నాం. ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో విశాఖ గ్లోబల్‌ ఇన్వెస్టర్‌ సమ్మిట్‌లో ఒప్పందం చేసుకున్న రూ.13.11 లక్షల కోట్ల కంటే ఎక్కువగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్‌, వీసీఎండీ ఏపీఐఐసీ, సీఈవో ఏపీ మారిటైమ్‌ బోర్డు

బందరు పోర్టు పనులకు నేడే శుభారంభం



మచిలీపట్నంలోని భారత్‌ స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ మైదానంలో సిద్ధమవుతున్న సభా వేదిక

▶ మొదటి పేజీ తరువాయి

ఇటీవలే ప్రారంభమయ్యాయి. ఇక సోమవారం నుంచి ఈ జాబితాలో మచిలీపట్నం పోర్టు కూడా చేరనుంది.

25వేల మందికి ఉపాధి..

35.12 మిలియన్‌ టన్నుల వార్షిక సామర్థ్యంతో రెండు జనరల్‌ కార్గోకు, ఒకటి బొగ్గుకు, మరొకటి మల్టీపర్పస్‌-కంటైనర్‌తో ఎగుమతి, దిగుమతులకు ఉపయోగపడేలా మొత్తం నాలుగు బెర్తులతో మచిలీపట్నం పోర్టును 24-30 నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పోర్టు పనుల పూర్తితో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉపాధి లభించనుంది. వాణిజ్య కార్యకలాపాలు విస్తరించేకొద్దీ 16 బెర్తులతో 116 మిలియన్‌ టన్నుల వార్షిక సామర్థ్యంతో పోర్టును విస్తరించేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇక ఈ పోర్టు ద్వారా రాష్ట్రంలోని గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్‌, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు తెలంగాణలోని ఖమ్మం, కరీంనగర్‌, ఆదిలాబాద్‌, నల్గొండ, వరంగల్‌ జిల్లాలకు ఎరువులు, బొగ్గు, వంటనూనె, కంటైనర్ల దిగుమతులు, వ్యవసాయ ఉత్పత్తులు, సిమెంట్‌, సిమెంట్‌ క్లింకర్‌, గ్రానైట్‌, ముడి ఇనుము ఎగుమతులకు వేదికగా మారనుంది. సుమారు రూ.16,000 కోట్ల వ్యయంతో రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే, మూలపేట పోర్టుల నిర్మాణాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 75 వేల మందికి ఉపాధి లభించనుంది.

తొలి ఏడాదే కార్పొరేషన్‌, పరిపాలనా అనుమతులు..

తూర్పు తీరంలో ఆంగ్లేయులతో పాటు డచ్‌, పోర్చుగీస్‌ వారికి సైతం వ్యాపార కేంద్రంగా మచిలీపట్నం పోర్టు విలసిల్లింది. వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే పోర్టు నిర్మాణానికి 2020 ఫిబ్రవరి 4న మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌ పేరుతో ప్రత్యేక సంస్థ ఏర్పాటు.. రూ.5,156 కోట్లతో పోర్టు నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న పోర్టు నిర్మాణానికి కీలకమైన పర్యావరణ అనుమతులు, ఏప్రిల్‌ 13న కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు, 2023 మార్చిలో 1,923 ఎకరాల భూసేకరణ పూర్తయిన తర్వాత మే 22న పోర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నారు.

మారనున్న సముద్ర తీర ప్రాంత ముఖచిత్రం

ఆగ్నేయాసియాకు ముఖద్వారంగా 974 కి.మీ తీరంతో దేశంలోనే రెండో అతిపెద్ద సముద్ర తీరం గల రాష్ట్రంలో ప్రస్తుతమున్న ఆరు పోర్టులకు అదనంగా ఏపీ మారిటైమ్‌ బోర్డు నాలుగు పోర్టులను అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే ఉన్న విశాఖపట్నం మేజర్‌ పోర్టు, ఐదు నాన్‌ మేజర్‌ పోర్టుల ద్వారా ఏటా 320 మిలియన్‌ టన్నుల వార్షిక సామర్థ్యాన్ని రాష్ట్రం కలిగి ఉంది. అలాగే..

- కొత్తగా నిర్మిస్తున్న పోర్టుల ద్వారా 2025-26 నాటికి అదనంగా మరో 110 మిలియన్‌ టన్నుల రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.
- పారిశ్రామికాభివృద్ధి, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమిచ్చేలా కొత్తగా నిర్మిస్తున్న మచిలీపట్నం పోర్టు సమీపంలో పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు 4,000 ఎకరాల సాల్ట్‌ భూములను ప్రభుత్వం గుర్తించింది.
- తీర ప్రాంతం మరియు పోర్టు పరిసర ప్రాంతాల పారిశ్రామికీకరణ దిశగా అడుగులు వేయడంతో పాటు పోర్టు అనుసంధానిత లాజిస్టిక్స్‌ ఏర్పాటు ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు అవకాశం లభించనుంది.
- ప్రతీ 50 కి.మీకు ఒక పోర్టు లేదా ఫిషింగ్‌ హార్బరు ఉండేలా మత్స్యకారులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో 10 ఫిషింగ్‌ హార్బర్లు, ఆరు ఫిష్‌ ల్యాండింగ్‌ సెంటర్లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది.
- వీటిద్వారా 2035 నాటికి రాష్ట్ర సముద్ర వాణిజ్య విలువ 20 బిలియన్‌ డాలర్లకు చేర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.
- ఇక రాష్ట్రానికి ప్రకృతి ప్రసాదించిన అతిపెద్ద సముద్ర తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో దేశంలోని అతిపెద్ద పోర్టుల్లో ఒకటిగా, రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో కీలకంగా మార్చే విధంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మచిలీపట్నం పోర్టును అభివృద్ధి చేయనున్నారు.

మచిలీపట్నం పోర్టు విశేషాలు

- భూసేకరణ, ఇతర అనుబంధ పోర్టులతో కలిపి మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.5,155.73 కోట్లు
- వార్షిక సామర్థ్యం 35.12 మిలియన్‌ టన్నులు
- బెర్తుల సంఖ్య 4
- భూసేకరణ.. 1,923 ఎకరాలు
- ఎన్‌హెచ్‌ 216ను అనుసంధానం చేస్తూ 6.5 కి.మీ. మేర నాలుగు లేన్ల రహదారి
- పెడన రైల్వేస్టేషన్‌ నుంచి పోర్టు వరకు 7.5 కి.మీ రైల్వే లైన్‌ నిర్మాణం
- బందరు కెనాల్‌ నుండి 11 కి.మీ పైప్‌లైన్‌ ద్వారా 0.5 ఎంఎల్‌డీ (మిలియన్‌ లీటర్స్‌ పర్‌ డే) నీటి సరఫరా
- పెడన 220 కేవీ సబ్‌స్టేషన్‌ నుండి 15 ఎంవీఏ (మెగా వోల్ట్‌ యాంప్‌) విద్యుత్‌ సరఫరా

నేడు మచిలీపట్నానికి సీఎం వైఎస్‌ జగన్‌

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ సోమవారం కృష్ణాజిల్లా మచిలీపట్నంలో పర్యటించనున్నారు. ఉ.8.30 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయల్దేరి మచిలీపట్నం మండల పరిధిలోని తపసిపూడి గ్రామానికి చేరుకుంటారు. పోర్టు నిర్మాణ ప్రదేశంలో భూమి పూజచేసి పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం మచిలీపట్నంలోని పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి జిల్లా పరిషత్‌ సెంటర్‌లోని భారత్‌ స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగసభ ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. కార్యక్రమం అనంతరం సీఎం జగన్‌ మచిలీపట్నం నుంచి బయలుదేరి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

హడావుడిగా బాబు శంకుస్థాపన

నిజానికి.. అధికారంలో ఉన్న కాలంలో పోర్టు నిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టని చంద్రబాబు 2019 ఎన్నికలు దగ్గర పడిన సమయంలో బందరు పోర్టుకు ఎటువంటి అనుమతులు, నిధులు లేకుండా హడావుడిగా శంకుస్థాపన చేశారు. పోర్టు నిర్మాణానికి అవసరమైన పర్యావరణ అనుమతులు, ఫైనాన్షియల్‌ క్లోజర్‌, రోడ్డు కనెక్టివిటీ, భూసేకరణ చేయకుండానే మొక్కుబడిగా శంకుస్థాపన చేసి ఈ ప్రాంత ప్రజలను మాయచేశారు.



పోర్టు పనులను సీఎం ప్రారంభించిన అనంతరం నిర్మాణ పనులు చేపట్టేందుకు కొండరాళ్లను తరలిస్తున్న లారీలు

ఆలివ్‌ రిడ్లే.. సముద్రంలోకి వెడలె



తాబేళ్ల పిల్లల్ని సముద్రంలోకి వదులుతున్న ట్రీ ఫౌండేషన్‌, అటవీ శాఖ సిబ్బంది

▶ మొదటి పేజీ తరువాయి

ఈ వివరాలను విడుదల చేసింది. ట్రీ ఫౌండేషన్‌ అటవీ శాఖతో కలిసి గత 16 సంవత్సరాలుగా సముద్ర తాబేళ్ల రక్షణ, సముద్ర జీవ సంరక్షణలో పాలుపంచుకుంటోంది. ఈ 16 సంవత్సరాల్లో ఇప్పటివరకు 33.68 లక్షలకు పైగా సముద్ర తాబేలు పిల్లలను సముద్రంలో వదిలారు.

వేల కిలోమీటర్లు ప్రయాణించి..

ఆగ్నేయ సముద్ర తీర ప్రాంతంలోని ఒడిశా, ఆంధ్రా ప్రాంతాలు ఆలివ్‌ రిడ్లే జాతి తాబేళ్లు గుడ్లు పెట్టడానికి అనువైనవి. ఏటా ఈ తీరాల్లో గుడ్లు పెట్టేందుకు వేల తాబేళ్లు సముద్రంలో వేల కిలోమీటర్లు ప్రయాణించి ఈ తీరానికి వచ్చి గుడ్లు పెడతాయి. తీరంలో గుడ్లు పెట్టిన తాబేళ్లు వెళ్లిపోయాక.. ఆ గూళ్లు ప్రమాదంలో పడుతున్నాయి. అందుకే చాలా సంవత్సరాలుగా ట్రీ ఫౌండేషన్‌ వంటి సంస్థలు అటవీ శాఖతో కలిసి వాటి సంరక్షణకు నడుం బిగించాయి.

వెయ్యి తాబేళ్లలో ఒకటే..

ప్రతి ఆడ తాబేలు ఒక సీజన్‌లో (డిసెంబర్‌ నుంచి మార్చి) రెండుసార్లు గుడ్లు పెట్టడానికి సముద్రం నుంచి తీర ప్రాంతానికి వస్తుంది. గుడ్డు నుంచి పిల్ల బయటకు రావడానికి 48 నుంచి 60 రోజులు పడుతుంది. ఉష్ణోగ్రత 25 నుంచి 30 డిగ్రీలుంటే.. మగ పిల్లలు, 30 నుంచి 35 డిగ్రీలుంటే ఆడ పిల్లలు జన్మిస్తాయి. గుడ్డు నుంచి బయటకు వచ్చిన పిల్ల తాబేళ్లు నక్షత్రాలు, చంద్రుడి వెలుతురు ఆధారంగా సముద్రంలోకి చేరుకుంటాయి. పిల్ల తాబేళ్లకు బొడ్డు దగ్గర యోక్‌ సాక్‌ (పచ్చసొనలా) ఉంటుంది. దీని ద్వారానే పిల్ల తాబేళ్లకు 48 గంటల వరకు పోషకాహారం అందుతుంది. అందుకే గుడ్డు నుంచి బయటకు వచ్చిన పిల్ల తాబేళ్లను వెంటనే సముద్రం తీరంలో విడిచిపెట్టాలి. ఈ పనిని చాలాకాలంగా మేం చేస్తున్నాం. పుట్టిన తాబేళ్లకు వాటి మెదడు కణాల చుట్టూ మేగ్నటైట్‌ సెల్స్‌ ఉంటాయి. ఇవి వాటికి జీపీఎస్‌లా ఉపయోగపడతాయి. అందుకే ఆడ తాబేళ్లు 12 నుంచి 15 సంవత్సరాలకు అవి పుట్టిన తీరానికి గుడ్లు పెట్టడానికి వస్తాయి. వెయ్యి తాబేలు పిల్లలు సముద్రంలోకి వెళితే గుడ్లు పెట్టే సమయానికి ఒకే ఒక తాబేలు మాత్రమే మిగులుతుంది. మిగిలిన 999 పిల్లలు పెద్ద చేపలకు ఆహారమైపోతాయి.

– డాక్టర్‌ సుప్రజ ధారిని, ఛైర్‌పర్సన్‌, ట్రీ ఫౌండేషన్‌

ఉన్నతవిద్యకు సారథులు

▶ మొదటి పేజీ తరువాయి

'నూతన విద్యావిధానం-స్టూడెంట్‌ అంబాసిడర్‌ ఫర్‌ అకడమిక్‌ రిఫామ్స్‌ ఇన్‌ ట్రాన్స్‌ఫార్మింగ్‌ హయ్యర్‌ ఎడ్యుకేషన్‌ (ఎన్‌ఈపీ సారథి)అని పేరుపెట్టింది. ఇందులో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ వారినే ఆయా వర్సిటీల్లో స్టూడెంట్‌ అంబాసిడర్లుగా నియమించనుంది. ఉన్నత విద్యాసంస్థలు, వర్సిటీల నుంచి ముగ్గురు విద్యార్థుల పేర్లను ప్రతిపాదించాలని సూచించింది. ప్రతిపాదిత విద్యార్థుల్లో కమ్యూనికేషన్‌ స్కిల్స్‌, ఔట్‌రీచ్‌ ప్రోగ్రామ్‌లు నిర్వహించే సంస్థాగత సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావాలను కలిగి ఉండాలని సూచించింది.

దేశవ్యాప్తంగా 300 మంది ఎంపిక

వర్సిటీల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా జూలైలో 300 మందిని ఎన్‌ఈపీ సారథులుగా ఎంపిక చేయనుంది. వీరు ఆయా క్యాంపస్‌లలో కొత్త విద్యావిధానంపై సంపూర్ణ అవగాహన కల్పించడంతోపాటు ఎన్‌ఈపీ అమలులో విద్యార్థులు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించడం, ఎన్‌ఈపీ కార్యక్రమం అమలును అర్థం చేసుకోవడానికి యూజీసీకి ఫీడ్‌బ్యాక్‌ మెకానిజం అందించడం, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషిచేయడంలో కీలకపాత్ర పోషించనున్నారు. ఎన్‌ఈపీ సారథి సేవలకు గుర్తింపుగా యూజీసీ ప్రత్యేక సర్టిఫికెట్‌ ఇవ్వనుంది. వివిధ స్థాయిల్లో ఉన్నతవిద్యను అభ్యసిస్తూ.. సర్టిఫికెట్‌, డిప్లొమా, అండర్‌ గ్రాడ్యుయేట్‌, పోస్టు గ్రాడ్యుయేట్‌ డిగ్రీని చేస్తున్న విద్యార్థులు ఈ ప్రోగ్రామ్‌కు అర్హులు. ఎన్‌ఈపీ సారథికి ఎంపికైనవారు యూజీసీ అధికారిక సోషల్‌ మీడియాను వినియోగించుకోవచ్చు. వీరికి యూజీసీ ఆన్‌లైన్‌లో నిర్వహించే అన్ని ఈవెంట్స్‌కు శాశ్వత ఆహ్వానంతోపాటు యూజీసీ న్యూస్‌లెటర్‌లో వ్యాసాలను ప్రచురించే అవకాశం దక్కుతుంది.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేకు టీడీపీ ఎంపీ కేశినేని కితాబు



ట్యాంక్ వద్ద కొళాయిని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

నందిగామ: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తన నియోజకవర్గ అభివృద్ధి కోసం బాగా కృషి చేస్తున్నారని టీడీపీ ఎంపీ ప్రశంసల వర్షం కురిపించారు. నందిగామ నియోజకవర్గంలోని చందర్లపాడు మండలం, తోటరావులపాడు గ్రామంలో విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) కేటాయించిన ఎంపీ ల్యాండ్స్ రూ.47 లక్షలతో 60 వేల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. ఈ ట్యాంక్ ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందిస్తున్నారని, నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని నాలుగేళ్లుగా చూస్తున్నానని తెలిపారు. తమ పార్టీలు వేరైనా, ఎవరి పార్టీ పాలసీ వారికి ఉన్నా, అభివృద్ధి కోసం అందరం కలిసి పని చేస్తామని చెప్పారు. నందిగామ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ఏమి అడిగినా కూడా ఎంపీ కేశినేని నాని సహకరిస్తున్నారని చెప్పారు.

ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సైనికుల సమావేశంలో సజ్జల భార్గవ



సమావేశాన్ని ప్రారంభిస్తున్న సజ్జల భార్గవ

బనశంకరి: సోషల్ మీడియాను ఆయుధంలా సద్వినియోగం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ వైఎస్సార్‌సీపీ జయకేతనం ఎగురవేయడమే ఆశయమని వైఎస్సార్‌సీపీ మీడియా, సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ సజ్జల భార్గవ చెప్పారు. బెంగళూరులోని ది కోరమంగల క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన బెంగళూరు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ, జగనన్న ప్రభుత్వంపై టీడీపీ, ఎల్లో మీడియా చేస్తున్న అసత్య, అభూత కల్పన, దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా, యూట్యూబ్ ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 175కు 175 సీట్లలో విజయం సాధించేలా పాటుపడదామన్నారు. జగనన్న ప్రభుత్వం విస్తృతంగా చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలపై సోషల్ మీడియా వేదికగా ముమ్మర ప్రచారం సాగించాలని, తద్వారా చంద్రబాబు గ్యాంగ్, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని చెప్పారు. సోషల్ మీడియా సైనికులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా మధుసూదన్, అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధి పండుగాయల రత్నాకర్, రాష్ట్ర యాదవసంఘం అధ్యక్షుడు హరీశ్‌యాదవ్, ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, భారీసంఖ్యలో ఐటీ వింగ్, సోషల్ మీడియా సైనికులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ఘనంగా ఎన్టీఆర్ శత జయంత్యుత్సవాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్, టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి నౌపడ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమంలో వక్తలైన సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, ఫారిన్ కరస్పాండెంట్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.వెంకటనారాయణ తదితరులు ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఢిల్లీలో పలు రంగాల్లో సేవలందిస్తున్న తెలుగు వారిని ఎన్టీఆర్ పురస్కారాలతో సత్కరించారు.

బీసీలకు ప్రాధాన్యం కల్పించిన ఎన్టీఆర్

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

పాత గుంటూరు: ఎన్టీఆర్ వచ్చాకే బీసీలకు ప్రాధాన్యం కల్పించారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చెప్పారు. గుంటూరులో ఆదివారం బీసీల ఐక్య కార్యాచరణపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో బలహీనవర్గాలకు అత్యంత ప్రాధాన్యం దక్కిందన్నారు. సీఎం జగన్‌కు విభజించడం, పాలించడం అలవాటైందని చెప్పారు. దశమి రోజున మేనిఫెస్టో విడుదల చేస్తామని, విస్తృతమైన చర్చ జరిగాక ఎన్నికల్లో తుది మేనిఫెస్టో ప్రవేశపెడతామని చెప్పారు. టీడీపీ నేత యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఉండాలన్నారు. కార్యక్రమంలో జనసేన నేత బొనబోయిన శ్రీనివాస్‌యాదవ్, టీడీపీ నేతలు కొల్లు రవీంద్ర, దువ్వారపు రామారావు, పత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో మళ్లీ ఏపీనే టాప్

వ్యవసాయ పనులు లేని వేసవి రోజుల్లో పేదలకు పనులు

- 50 రోజుల్లో 6.83 కోట్ల పనిదినాలపాటు పనుల కల్పన
- రూ.1,657 కోట్ల మేర పేదలకు లబ్ధి
- మొత్తం 31.70 లక్షల కుటుంబాలకు మేలు

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దాదాపు పూర్తిగా ఆగిపోయే వేసవి కాలంలో పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించడంలో ఆంధ్రప్రదేశ్ ఈ ఏడాది కూడా మొదటి స్థానంలో నిలిచింది. పనులు దొరకక పేదలు నగరాలకు వలస పోయే దుస్థితి లేకుండా సొంత ఊళ్లలోనే వారికి పనులు కల్పించడంలో ఏపీ ఏటా ముందుంటోంది. ప్రత్యేకించి వేసవి రోజుల్లో ఉపాధి పనుల కల్పనలో గత నాలుగేళ్లగా మన రాష్ట్రమే దేశంలో తొలి స్థానంలో నిలుస్తోంది. ఈ వేసవిలో కూడా ఏప్రిల్ 1 నుంచి శనివారం (మే 20) వరకు 6.83 కోట్ల పనిదినాల పాటు రాష్ట్ర ప్రభుత్వం పనులు కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 99 శాతం గ్రామ పంచాయతీలు అంటే.. 13,132 గ్రామ పంచాయతీల్లో కేవలం 50 రోజుల్లోనే మొత్తం 31.70 లక్షల కుటుంబాలకు పని దొరికింది. ప్రభుత్వం కల్పించిన పనులతో ఈ కుటుంబాలు రూ.1,657.58 కోట్ల మేర లబ్ధి పొందడం విశేషం. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం.. దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో నిలిచిన తమిళనాడు 50 రోజుల కాలంలో 5.20కోట్ల పనిదినాలపాటు పనులు కల్పించింది. మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ ఉన్నాయి.





ఒక్కొక్కరికి రోజుకు రూ.245

ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు ఈ ఏడాది అధిక మొత్తంలో కూలి సైతం గిట్టుబాటు అయ్యింది. ఈ 50 రోజుల్లో కూలీలకు సరాసరిన రోజుకు రూ.245 చొప్పున కూలి లభించింది. మరోవైపు ఈ పనులకు 60 శాతానికి పైగా మహిళలే హాజరై ఉపాధి పొందారు. అలాగే మొత్తం 6.83 కోట్ల పనిదినాల పాటు ఉపాధి పొందిన వారిలోనూ దాదాపు 32% మేర ఎస్సీ, ఎస్టీలే ఉన్నారని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 500 మంది జనసేన కార్యకర్తలు

గాజువాకలో పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

గాజువాక: విశాఖజిల్లా గాజువాకలో ఆదివారం 500 మంది జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనగర్ నుంచి జగ్గు జంక్షన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 72వ వార్డు యువ నాయకుడు కొసిరెడ్డి గణేష్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన దంతవైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనసేన నుంచి 500 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అవి పేదలకు అందుతున్న విధానం చూసి వారు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. 72వ వార్డు ప్రజల కోరిక మేరకు వార్డులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడానికి కృషిచేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 72వ వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ (వాసు), నాయకురాలు రోజారాణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు

పేద రోగులకు టీడీపీ పాలనలో ఏం మేలు చేశారు?

- ఒక్క వైద్య పథకమైనా తెచ్చారా?
- కనీసం ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ కూడా ఏర్పాటు చేయలేకపోయారు
- వైద్యులు, సిబ్బందిని నియమించలేకపోయారు
- ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారు
- మీకు వైద్య, ఆరోగ్య రంగం గురించి మాట్లాడే హక్కు లేదు
- చంద్రబాబు, లోకేశ్‌పై వైద్య శాఖ మంత్రి విడదల రజిని ధ్వజం



చిలకలూరిపేట: వైద్య, ఆరోగ్య రంగానికి టీడీపీ పాలనలో ఏం మేలు చేశారో చెప్పాలని చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌కు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని సవాల్ విసిరారు. పేదల కోసం ఒక్క వైద్య పథకాన్ని అయినా ప్రవేశపెట్టారా? అని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చిన ఘనత చంద్రబాబుదని మండిపడ్డారు. ఆదివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తన హయాంలో రాష్ట్రానికి కనీసం ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీని తీసుకురాలేకపోయారని విమర్శించారు. కొత్త ఆస్పత్రులను ఏర్పాటు చేయడం తర్వాత సంగతి.. కనీసం పాత ఆస్పత్రులను బాగు చేయాలనే ఆలోచన కూడా చంద్రబాబుకు రాలేదని దుయ్యబట్టారు. వైద్య సిబ్బందిని నియమించాలన్న ఆలోచన కూడా గత ప్రభుత్వం చేయలేదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ నిధులకు పూర్తిగా కోత విధించి.. దానిని అటకెక్కించేందుకు ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తులు నేడు వైద్య, ఆరోగ్య శాఖ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వం గ్రామీణ ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని తీసుకువస్తే.. దీన్ని కూడా తక్కువ చేసి మాట్లాడటం లోకేశ్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు.

ఇదీ మా ఘనత..

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కోసం ఏకంగా రూ.8,300 కోట్లు ఖర్చు చేసిందని మంత్రి రజిని వెల్లడించారు. టీడీపీ హయాంలో ఆరోగ్యశ్రీ కింద కేవలం 1,059 ప్రొసీజర్లు ఉంటే.. ఆ సంఖ్యను ఏకంగా 3,257కు పెంచామని చెప్పారు. ఈ స్థాయిలో పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్న రాష్ట్రం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన రోగులకు వారి ఆరోగ్యం కుదుటపడే వరకు ఆరోగ్య ఆసరా ద్వారా అండగా ఉంటున్న గొప్ప సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యులే నేరుగా ఇళ్లకే వెళ్లి రోగులకు వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో ఐదు కాలేజీలను ఈ ఏడాది నుంచే ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత లేకుండా ఏకంగా 49 వేలకు పైగా పోస్టుల భర్తీ చేపట్టామని చెప్పారు. నాడు–నేడు ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు వైద్య, ఆరోగ్య రంగాన్ని అన్ని విధాలుగా బలోపేతం చేస్తున్న ప్రభుత్వం తమదని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ చేస్తున్న విష ప్రచారానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

ఏనాడైనా పేదలకు అర సెంటు స్థలమిచ్చావా?

- చంద్రబాబుపై రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ధ్వజం
- పేదల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేరుస్తుంటే.. దానినీ చులకన చేస్తావా?
- నీ పార్టీని ప్రజలు సెంటు స్థలంలోనే శాశ్వతంగా పూడ్చేస్తారు



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

సాక్షి, తిరుపతి: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్ నెరవేరుస్తుండటాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు సహించలేకపోతున్నారని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. అందుకే పేదల ఇళ్ల స్థలాలను చులకన చేసి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 14 ఏళ్ల హయాంలో ఏనాడైనా పేదలకు అర సెంటు స్థలమిచ్చావా? అని చంద్రబాబును నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ ఆధ్వర్యంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి మునిబాల్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం తిరుపతిలో బీసీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ చంద్రబాబు పెత్తందారులకు దోచిపెట్టడం తప్ప పేదలను పట్టించుకోలేదని విమర్శించారు. పేదలకిచ్చే భూమి సమాధికి సరిపోతుందంటూ చులకన చేస్తున్న చంద్రబాబును, టీడీపీని రాజకీయంగా అదే సెంటు భూమిలో ప్రజలు పూడ్చిపెడతారని హెచ్చరించారు. సీఎం వైఎస్ జగన్ మాత్రమే అన్ని వర్గాలకు ఉన్నతమైన పదవులు ఇచ్చి గౌరవించారని కొనియాడారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్రాన్ని డిమాండ్‌చేశారు. డిమాండ్ల సాధన కోసం బీసీలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, జాతీయ బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుర్గేష్‌యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఆంధ్రప్రదేశ్ బీసీసంఘం మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్లబండ్ల పోటీలు



తొండంగి మండలం ఏ.కొత్తపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎడ్లబండ్ల పోటీలు

తొండంగి: కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏ.కొత్తపల్లిలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్లబండ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఏ.కొత్తపల్లి గ్రామకమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో అనకాపల్లి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి ఎడ్ల పందాల పోటీదారులు పాల్గొన్నారు. సీనియర్స్ జూనియర్స్ విభాగంలో ఈ పోటీలు జరిగాయి. సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గుమ్మిలేరుకు చెందిన కోర వీరవెంకటసత్యవేణికి చెందిన రెండు జోడీల ఎడ్లు నిలిచాయి. తృతీయ స్థానం అనకాపల్లి జిల్లా చుక్కపల్లికి చెందిన మజ్జి రాజేష్ ఎడ్లబండి గెలుచుకుంది. వీరికి రూ.15 వేలు, రూ.12వేలు, రూ.10వేలు నగదుతోపాటు జ్ఞాపికలను అందజేశారు. జూనియర్స్ విభాగంలో ధర్మవరానికి చెందిన దొడ్డిపట్ల కోటిశ్రావణ్ ఎడ్లు బండి ప్రథమ, కొవ్వాడకు చెందిన మట్టానవనీత్ శ్రీమణికంఠ ద్వితీయ, వడిశలేరుకు చెందిన పైడిశెట్టి సూర్యనారాయణ తృతీయ, వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి చతుర్ధ స్థానం సాధించారు. వీరికి రూ.12వేలు, రూ.10 వేలు, రూ.8వేలు, రూ.5వేలు నగదుతోపాటు జ్ఞాపికలను అందజేశారు.

టీడీపీ అల్లరిమూకల పైశాచికత్వం

- వైఎస్సార్‌సీపీ నేత, ఆయన కుటుంబంపై కర్రలు, రాళ్లతో దాడి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



చిన్నరెడ్డెప్ప ఇంటిపై దుండగులు విసిరిన రాళ్లు



తలకు గాయమైన సుభద్ర

గంగవరం (చిత్తూరు జిల్లా): వైఎస్సార్‌సీపీ నేత, ఆయన కుటుంబసభ్యులపై టీడీపీ అల్లరిమూకలు దాడులకు తెగబడిన ఘటన చిత్తూరు జిల్లాలో శనివారం రాత్రి జరిగింది. ఘటనపై బాధితులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గంగవరం మండలంలోని మార్జేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, గ్రామ సచివాలయ కన్వీనర్ చిన్నరెడ్డెప్ప కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత శంకరప్ప కుటుంబ సభ్యులైన ఆ పార్టీ కార్యకర్తలు 20 మందికి పైగా దాడి చేశారు. శనివారం జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా టీడీపీ కార్యకర్తలు కొంతమంది చిన్నరెడ్డెప్ప ఇంటి ముందు టపాసులు కాల్చడంతో పశువులు బెదిరాయి. దీంతో కాస్త పక్కన కాల్చుకోవాలని చిన్నరెడ్డెప్ప కోరాడు. దీంతో టీడీపీ కార్యకర్తలు 'మాకు నువ్వేంది చెప్పేది.. టపాసులు ఇక్కడే పెడతాం' అంటూ చిన్నరెడ్డెప్పపై దాడికి తెగబడ్డారు. టీడీపీ కార్యకర్తలు సునీల్, చరణ్, విశ్వేశ్వరయ్య, యువరాజు, భాను, బాలరాజు, అశోక్, అమర్‌నాథరెడ్డి, కార్తీక్, మరికొంతమంది కలిసి చిన్నరెడ్డెప్ప, అతని భార్య సుభద్ర, తండ్రి శ్రీరాములు, తల్లి మునివెంకటమ్మ, సమీప బంధువులు రత్నారెడ్డి, యశ్వంత్, చంద్రప్పపై దాడి చేశారు. ఇంటిపై రాళ్లు విసరడంతో కిటికీలు, తలుపులు పగిలిపోగా కర్రలు, రాళ్లతో దాడి చేసి ఇంట్లో ఉన్నవారిని తీవ్రంగా గాయపరిచారు. క్షతగాత్రులు ప్రస్తుతం పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, గతంలో టీడీపీ కార్యకర్త చరణ్ గ్రామంలోని ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించడంతో చిన్నరెడ్డెప్ప, యువతి బంధువులు చరణ్‌ను మందలించారు. దీంతో కక్ష గట్టిన చరణ్.. యువతి అన్నపై అప్పట్లో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ నేపథ్యంలో పాతకక్షలను మనసులో పెట్టుకుని ఉద్దేశపూర్వకంగానే చరణ్, ఇతర టీడీపీ కార్యకర్తలు తమపై దాడికి పాల్పడినట్లు బాధితులు చెప్పారు. టీడీపీ నేతల నుంచి తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి గ్రామానికి చేరుకుని ఘటనపై విచారించారు. శంకరప్పతో సహా దాడికి పాల్పడిన వారందరిపై కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన అశోక్‌ను అదుపులోకి తీసుకున్నారు.

చకచకా..

గ్రామ సచివాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణం

- తూర్పు గోదావరి జిల్లా లక్ష్యం 390 భవనాలు
- ఇప్పటికే 327 పూర్తి
- యుద్ధ ప్రాతిపదికన మిగిలిన పనులు



కడియం మండలంలో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న గ్రామ సచివాలయం

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాల అమలులో గ్రామ/వార్డు సచివాలయాలది కీలక భూమిక. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా తీసుకువచ్చిన ముఖ్య వ్యవస్థ ఇది. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా ప్రజల ముంగిటకు చేర్చేందుకు, ప్రభుత్వ సేవలన్నింటినీ ఒకే గొడుకు కిందకు తీసుకువచ్చేందుకు.. గ్రామంలోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలనూ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సచివాలయ వ్యవస్థకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇంతటి ప్రాధాన్యం సంతరించుకున్న సచివాలయాల్లో ఉద్యోగులు ఆహ్లాదకర వాతావరణంలో విధులు నిర్వర్తించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటి వరకూ అద్దె గృహాల్లో నడుస్తున్న సచివాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తోంది. వీటిల్లో అన్ని రకాల వసతుల కల్పనకూ అడుగులు వేస్తోంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా రూ.150 కోట్లతో 390 సచివాలయ భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేలా అధికారులకు దిశా నిర్దేశం చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో, జిల్లా అధికారుల పర్యవేక్షణతో ఈ పనులు చకచకా సాగుతున్నాయి.

నిర్మాణాలు వేగవంతం

ప్రభుత్వ ప్రాధాన్యానికి అనుగుణంగా వివిధ ప్రభుత్వ భవన నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నాం. వీటిని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎలాంటి జాప్యం లేకుండా పనులు చేపట్టేలా పర్యవేక్షణ పెంచాం. రాజానగరం నియోజకవర్గంలో ఒక్కటి మినహా మిగిన లక్ష్యం పూర్తయింది. మిగిలిన ప్రాంతాల్లో సైతం వంద శాతం లక్ష్యాన్ని సాధించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నాం.

– కె.మాధవీలత, కలెక్టర్

రూ.150.20 కోట్లతో..

జిల్లా వ్యాప్తంగా 390 సచివాలయ భవనాల నిర్మాణానికి రూ.150.20 కోట్లతో ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నిధులు సకాలంలో విడుదల చేయడంతో నిర్మాణాల్లో వేగం పుంజుకుంది. ఇప్పటికే 327 సచివాలయాలు అన్ని హంగులతో పూర్తయ్యాయి. వీటిల్లో 152 భవనాలను అన్ని సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి, సచివాలయాల నిర్వహణకు అప్పగించారు. వీటిలో ఇప్పటికే సచివాలయ సేవలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ సచివాలయ భవన నిర్మాణ పనులు 72 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. వీటిపై కలెక్టర్ కె.మాధవీలత ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయా ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

చంద్రబాబుకు ‘ఎన్టీఆర్ హంతక బిరుదు’


డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం రూరల్: పిల్లనిచ్చిన మావ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కుర్చీ లాక్కుని.. ఆయన చావుకు కారణమైన చంద్రబాబుకు 'ఎన్టీఆర్ హంతక బిరుదు' ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) మంత్రి కొట్టు సత్యనారాయణ కోరారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కొత్తూరు అరుంధతిపేటలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రిలో జరిగే టీడీపీ మహానాడులో ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఇవ్వాలని తీర్మానం చేయాలనుకోవడం చంద్రబాబు స్వార్థపూరిత రాజకీయాలకు నిదర్శనమన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడైనా ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఇవ్వాలని కోరుతూ తీర్మానం చేశారా.. అని ప్రశ్నించారు. కేవలం ఓట్ల కోసమే చంద్రబాబు మళ్లీ ఎన్టీఆర్ జపం చేస్తూ.. 'భారతరత్న' ఇవ్వాలని దొంగ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఎన్టీఆర్ పేరు వినపడకుండా చేయాలని, ఎవరూ తలుచుకోకుండా చేయాలని, పూర్తిగా ఎన్టీఆర్ పేరును నిర్మూలించాలని చంద్రబాబు దుర్మార్గపు ఆలోచన చేసిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. ఇప్పుడు ఎన్నికలొస్తున్నాయి కాబట్టి ఎన్టీఆర్ జపం చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలతో ప్రజలకు డబ్బులు పంచుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాల్జేస్తున్నారని, మన రాష్ట్రం శ్రీలంక, మరో పాకిస్తాన్‌లా అయిపోతుందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు... ఇప్పుడు తనకు ఓట్లు వేస్తే ప్రజల్ని కోటీశ్వరులను చేస్తానంటున్నాడని ఎద్దేవా చేశారు. నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న ఆర్థిక లబ్ధితో ప్రతి కుటుంబం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. వైఎస్ జగన్ చలవతో జనం సంతోషంగా ఉండటాన్ని చూసి తట్టుకోలేని చంద్రబాబు దానిని పాడు చేయాలని కుట్రలు పన్నుతున్నాడన్నారు.

బీజేపీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అనుసరిస్తున్న విధానాలను ఇళ్లకు వెళ్లి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తపై ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. విజయవాడలో ఆదివారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం సోము వీర్రాజు మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గ్రామ స్థాయికి తీసుకెళ్లేందుకు 13 రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం నుంచి 25 వరకు అన్ని జిల్లాల్లో కార్యవర్గ సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఈ నెల 30 నుంచి జూన్ 30 వరకు నెల పాటు అందరి ఇళ్లకు వెళ్లేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 125 కుటుంబాలు, 25 వర్గాల ప్రజలను సమీకరిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళనకు పిలుపునివ్వడం సిగ్గుచేటని, ఉద్యోగులు.. కార్మిక నాయకులుగా మారి ఆందోళన బాట పడుతున్నారని దుయ్యబట్టారు. బీజేపీ నాయకులు పాతూరి నాగభూషణం, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎవరు కథలు చెప్పగలరో
వాళ్లు సమాజాన్ని పాలిస్తారు.
– ప్లేటో

ఆసుపత్రిలో చేరటంపైనా రోగిష్టి రాతలేనా?

అవినాశ్ రెడ్డి తల్లి అనారోగ్యంపై 'ఈనాడు' దారుణ కథనాలు

కర్నూలు ఆసుపత్రిలో చేరటంపైనా విషపూరిత కల్పనలు

- కోర్టు నోటీసులను ఎర్ర గంగిరెడ్డికి ఇవ్వటానికి సునీత ప్రయత్నించారా?
- నోటీసులివ్వాల్సింది కోర్టు కదా? ఇలా 'కవర్' చేయడానికి కాస్తయినా సిగ్గుండాలి కదా?
- దస్తగిరి మాదిరే ఎర్ర గంగిరెడ్డినీ ప్రలోభపెట్టాలని సునీత భావించటం అబద్ధమా?
- న్యాయ ప్రక్రియలోనే లేని విచిత్రాలు ఈ కేసులోనే ఎందుకు జరుగుతున్నాయి?
- ఎలా హత్య చేశాడో వివరంగా చెప్పిన వ్యక్తికి క్షమాభిక్ష పెట్టిందీ ఈ కేసులోనే..
- తండ్రిని హత్య చేసిన వ్యక్తితో కలిసి... కుమార్తె న్యాయపోరాటం చేస్తున్నదీ ఈ కేసులోనే
- ఇదంతా బాబు డైరెక్షన్లో జరుగుతోంది అనటానికి ఇంతకన్నా ఏం కావాలి?



వ్యక్తిత్వాన్ని చంపేయాలంటే రామోజీరావు తరవాతేఎవరైనా!!. తన ప్రయోజనాలకు అడ్డంగా ఉంటే ఎవరి పరిస్థితైనా అంతే!. అది ఎన్‌టీ రామారావయినా... లక్ష్మీ పార్వతయినా... సొంత పార్టీవారైనా.. ఇంకెవ్వరైనా అంతే!. తన ప్రయోజనాలు కాపాడినన్నాళ్లూ మహోన్నతుడిగా కీర్తించిన ఎన్‌టీఆర్‌ను... చంద్రబాబు డైరెక్షన్‌లో పనిచేయలేదన్న ఒకే ఒక కారణంతో చివరి రోజుల్లో 'ఈనాడు' ఎలా బ్రాండ్ చేసిందో ఈ రాష్ట్రంలో తెలియనిదెవరూ లేరు. అలాగే లక్ష్మీ పార్వతిని కూడా!. ఇక టీడీపీ నేతలు కాని వారి పరిస్థితి చెప్పక్కర్లేదు. చంద్రబాబుతో పొత్తులో లేనప్పుడు నరేంద్ర మోదీ వ్యక్తిత్వాన్ని సైతం వక్రీకరించి రాసిన కలం అది. ఇప్పుడు కడప ఎంపీ అవినాశ్ రెడ్డి విషయంలోనూ రామోజీరావు అదే చేస్తున్నారు. ఆయనకు సంబంధించిన ప్రతి అంశాన్నీ వక్రీకరిస్తూ... మెల్లగా జనం మెదళ్లలో విషం నింపుతున్నారు. ఆఖరికి ఆయన తన తల్లిని ఆసుపత్రిలో చేర్చడాన్ని సైతం రాజకీయం చేస్తున్నారు. ఆమెను చూడటానికి కడప నుంచి వ్యక్తులొస్తే అది కూడా రాజకీయమే. ఆసుపత్రిలో పరిచయం ఉన్న వైద్యుడున్నారంటూ... దానికీ విషం పులిమారు. మరీ ఇంత సిగ్గుమాలిన రాతలా రామోజీరావు గారూ? ఇంతటి మీ విషపూరిత మనస్తత్వాన్ని తట్టుకోలేకే... మీ తనయుడు సుమన్ సైతం మిమ్మల్ని ఇంట్లో ఉన్న క్యాన్సర్‌గా అభివర్ణించారని మరిచిపోయారా?

అయినా చంద్రబాబును మళ్లీ అధికారంలోకి తీసుకురావాలంటే ఇంతలా దిగజారిపోవాలా? 'ఈనాడు' కరపత్రానికన్నా ఘోరమైన స్థాయికి దిగజార్చేయాలా? బాబు అధికారంలో లేక... మీ అవినీతి సామ్రాజ్యం చిన్నబోతోందనా? అక్రమాలతో, చట్టవిరుద్ధంగా నిర్మించుకుని విస్తరించిన మీ ఆర్థిక సామ్రాజ్యానికి బీటలు పడుతున్నాయనా? కనీస మానవతా విలువలు లేకపోవటం దుర్మార్గం కాదా రామోజీరావు గారూ?

ఏ ఆసుపత్రిలో చేర్చాలో మీరే చెబుతారా?

ఎంపీ అవినాశ్‌రెడ్డి తల్లి లక్ష్మమ్మ హఠాత్తుగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆమెను పులివెందుల నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకు వెళదామనుకున్నారు. కానీ మార్గం మధ్యలోనే పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో... కర్నూలులోని విశ్వభారతి ఆసుపత్రిలో చేర్పించి అత్యవసర వైద్యం అందిస్తున్నారు. అందులో తప్పుబట్టాల్సిందేముంటుంది? అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా దగ్గర్లోని మెరుగైన ఆసుపత్రికి తీసుకెళతారు. అది సహజమేగా! కానీ.. 'ఈనాడు' చూసే కోణం వేరు కదా. ప్రతి అక్షరాన్నీ చంద్రబాబు సంక్షేమం కోసం తాకట్టు పెట్టడం ఆ పత్రిక బాధ్యత మరి!. అందుకనే ఈ విషయాన్ని కూడా వక్రీకరించారు. తన పత్రికలో పెద్ద పెద్ద అక్షరాలతో అచ్చు వేస్తూ... దానికి తన సొంత పైత్యాన్ని కూడా కొంత జోడించారు. పులివెందులలో ఎవరికి ఆరోగ్యం బాగాలేకపోయినా బెంగళూరుకో, హైదరాబాద్‌కో తీసుకెళ్లాలని... మరెక్కడికీ తీసుకెళ్లకూడదని పెద రాయుడి తీర్పుని చ్చేశారు. ఆ రెండు ప్రాంతాలకూ కాకుండా మరెక్కడికి తీసుకెళ్లినా ఏదో మతలబు ఉన్నట్టేనంటూ పైత్యాన్ని తారస్థాయిలో చూపించారు. ఊహాజనితమైన కారణాలను జోడించేశారు.

కర్నూలులోని విశ్వభారతి ఆసుపత్రిలో ఓ వైద్యుడికి ముఖ్యమంత్రి కార్యాలయంతో సంబంధాలు ఉన్నాయంటూ... వైద్యం చేసిన కార్డియాలజిస్టు అవినాశ్ రెడ్డికి స్నేహితుడంటూ నీచపు రాతలకు దిగారు. కర్నూలులోని విశ్వభారతి ఆసుపత్రి కార్డియాలజీకి పేరున్న ఆసుపత్రి అని... డాక్టర్ హితేష్ కార్డియాలజీలో విశేషమైన ప్రఖ్యాతులున్న వైద్యుడనే వాస్తవాలను మాత్రం ఎక్కడా ప్రస్తావించలేదు. అయినా సీఎంఓ నిజంగా జోక్యం చేసుకుని ఉంటే... సూచనలు చేసి ఉంటే.. కర్నూలులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పిస్తారు కదా? ప్రయివేటు ఆసుపత్రిలో ఎందుకు చేర్పిస్తారు? ప్రయివేటు ఆసుపత్రులను కూడా ప్రభుత్వం నియంత్రించగలదా? ఇదెక్కడి తలకాయ లేని ఆరోపణ రామోజీ రావుగారూ? మంచి వైద్యం కావాలనుకున్నప్పుడు మంచి ఆసుపత్రిలో చేరుస్తారు. ఆ విభాగంలో నిపుణుడైన వైద్యుడికి చూపిస్తారు. ఇక్కడ జరిగింది అదే. దీనిక్కూడా విషపూరిత వక్రభాష్యాలేల? వైద్యుడి ఊరుపైనా విష ప్రచారమేనా?

డాక్టర్ హితేష్‌ది పులివెందుల కనక... ఆయన అవినాశ్‌కు మిత్రుడు కనక చేర్పించారనటం వెనక కనీస ఇంగితమైనా ఉందా? పులివెందుల వాసులెవరూ బాగా చదువుకుని నిపుణులైన డాక్టర్లుగా, ఉన్నతాధికారులుగా ఉండకూడదా? ఇవెక్కడి రాతలు? 'ఈనాడు', దాని మిత్ర ఎల్లో మీడియా... ఇదే తరహాలో పులివెందులపై, రాయలసీమపై మూడు దశాబ్దాలుగా దుష్ప్రచారం చేయటం తెలియని విషయం కాదు. దీనికి కారణమల్లా ఒక్కటే. తెలుగుదేశం పార్టీ లేనప్పుడు కూడా ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్నవారిని రామోజీరావు తన రాతలతో భయపెట్టి తన దారికి తెచ్చుకోగలిగారు. ఒక్క వైఎస్ రాజశేఖరరెడ్డిని తప్ప. వైఎస్సార్‌ది పులివెందుల కనక. అంతే!.

సీఐడీ అంటే మంచమెక్కింది మీరేగా?

దర్యాప్తును తప్పించుకునేందుకు అనారోగ్యం అంటూ హఠాత్తుగా మంచం ఎక్కేయడం మీ మాదిరి ఎవరికి తెలుస్తుంది రామోజీరావు గారూ? అక్రమంగా చిట్స్ నడుపుతూ... చట్టాలన్నీ ఉల్లంఘిస్తున్న 'మార్గదర్శి'పై మిమ్మల్ని ప్రశ్నించడానికి సీఐడీ అధికారులు మీ చిత్రపురి కోటకు వచ్చినపుడు జరిగిందేమిటో రాష్ట్రమంతా చూసింది కదా?. అప్పటికప్పుడు యశోద ఆసుపత్రి నుంచి అంబులెన్స్ రామోజీ నివాసానికి వచ్చింది. ఓ డాక్టర్, ఇతర సిబ్బంది కూడా వచ్చారు. అప్పటికప్పుడు ఆయన నడుముకు ఓ బెల్ట్ కట్టారు. ముక్కుకు మాస్కు పెట్టారు. చేతికి సెలైన్ తగిలించారు. మంచం పక్కనే ఆక్సిజన్ సిలిండర్ పెట్టారు. సినిమా సెట్టింగ్‌ను తలపిస్తూ 'అనారోగ్యం' కథను రక్తికట్టించేందుకు నానా తంటాలూ పడ్డారు. మార్గదర్శి చిట్స్ అక్రమాలపై సీఐడీ అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ అనారోగ్యం నటిస్తూ మాట్లాడలేనన్న రీతిలోనే సమాధానాలు చెప్పారు రామోజీరావు. కానీ ప్రశ్నల వీడియో షూటింగ్ ఆగినపుడల్లా మామూలు రామోజీలా తన అహాన్ని ప్రదర్శిస్తూనే వచ్చారు. అంటే.. ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా తప్పించుకోవటానికే ఇంతటి డ్రామా నడిపారని తెలియటం లేదా? తాను అలా చేశాను కనక అంతా తనలానే ఉంటారనుకుంటే ఎలా?

బాలకృష్ణ ఇంట్లో కాల్పులపై పెన్ను మూసిన రామోజీ బాలయ్యకు మతిస్థిమితం లేదని ఎందుకు రాయలేదు?

తిరుగులేని ప్రజాభిమానాన్ని పొందిన వైఎస్సార్ కుటుంబమంటే... రామోజీరావుకు ఏమాత్రం పడదు. అందుకే హద్దుల్లేని విష ప్రచారానికి దిగుతారు. ఇదే రామోజీరావు... తనవాడు కాబట్టి అడ్డదారిలో వచ్చిన చంద్రబాబుకు భజన చేస్తూనే ఉంటారు. చంద్రబాబు వియ్యంకుడు బాలకృష్ణ ఇంట్లో కాల్పులు జరిపితే ... నిర్మాత బెల్లంకొండ సురేశ్, జ్యోతిష్యుడు సత్యనారాయణ చౌదరి తీవ్రంగా గాయపడ్డారు. ఆ తరవాత ఆ ఇంట్లో ఒక వాచ్‌మేన్ అనుమానాస్పదంగా మరణించాడు. దీనిపై రామోజీ అక్షరం ముక్క కూడా రాయలేదు. అరెస్టును తప్పించుకునేందుకు అప్పటికప్పుడు బాలకృష్ణ ఆసుపత్రిలో చేరినా... ఎన్టీఆర్ కుటుంబానికి సన్నిహితుడైన కాకర్ల సుబ్బారావు డైరెక్టర్‌గా ఉన్న నిమ్స్‌లోనే చేర్చినా... కేసు నుంచి బయటపడడానికి తనకు మతిస్థిమితం లేదని బాలకృష్ణ సర్టిఫికెట్ తెచ్చుకున్నా... 'ఈనాడు' పెన్ను కదిపితే ఒట్టు. ఎందుకంటే బాలకృష్ణ తమవాడు. కాబట్టి కాల్పులు జరపొచ్చు. అరెస్టు కాకుండా ఆసుపత్రిలో చేరొచ్చు. కేసు నుంచి బయటపడటానికి మతి స్థిమితం లేదని సర్టిఫికెట్ తెచ్చుకోవచ్చు. అదే ప్రత్యర్థులైతే... వారి చర్యల్లో ఎలాంటి తప్పూ లేకున్నా 'ఈనాడు' సందేహాలు వ్యక్తంచేస్తూనే ఉంటుంది. లేని దురుద్దేశాలు ఆపాదిస్తుంది. ఎందుకంటే ఆ పత్రికది జగమెరిగిన దౌర్భాగ్యపు పాత్రికేయం మరి!.

పరామర్శించేవారి కులాలూ రాస్తారా?

వైఎస్ కుటుంబంపై అక్కసు కొద్దీ రామోజీరావు నానాటికీ మరింత దిగజారిపోతున్నారు. వైఎస్సార్ జిల్లా ఎంపీ కనక ఆసుపత్రిలో ఉన్న అవినాశ్ రెడ్డి తల్లిని పరామర్శించేందుకు పులివెందులతో పాటు వైఎస్సార్ జిల్లాకు చెందిన చాలామంది కర్నూలు ఆసుపత్రికి వచ్చారు. అది సహజం. దాన్ని కూడా 'ఈనాడు' తనదైన కోణంలో వక్రీకరించింది. పైగా పరామర్శించిన వారి కులాలను ప్రస్తావిస్తూ సరికొత్త స్థాయికి దిగజారింది. పులివెందులకు చెందిన దంతలూరి కృష్ణ కర్నూలు ఆసుపత్రికి రాగా... ఆయన పేరును దంతులూరి కృష్ణ అని కాకుండా... ఆయన కులాన్ని ప్రస్తావిస్తూ 'మంగలి కృష్ణ'అని రాయటమెందుకు? మరి రామోజీరావును పరామర్శించేందుకు చంద్రబాబు వచ్చినప్పుడు 'కమ్మ చంద్రబాబు'అని రాయలేదే...! తనను పరామర్శించేందుకు వచ్చిన మురళీమోహన్, రాఘవేంద్రరావు తదితరుల పేర్ల ముందు 'కమ్మ' అని చేర్చలేదే? ఎందుకీ విపరీతపు రాతలు?

సీబీఐ దర్యాప్తును ప్రభావితం చేసేందుకే కుట్ర

వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు తాము నిర్దేశించినట్టే జరగాలన్నది చంద్రబాబు కుట్ర. దానికి అనుగుణంగా రామోజీరావు చేస్తున్న దుష్ప్రచారమే ఇది. నిజానికి కోర్టులో ఏదైనా పిటిషన్ దాఖలు చేస్తే ప్రతివాదులకు కోర్టే నోటీసులు పంపుతుంది. దానిపై కౌంటర్ వేయమని చెబుతుంది. అంతేగానీ పిటిషన్ వేసినవారే ఆ నోటీసులను తీసుకువెళ్లి ప్రతివాదులకు అందించరు కదా?. న్యాయ ప్రక్రియలోనే ఎక్కడా లేని ఈ వింత ఆచారానికి వివేకానందరెడ్డి కేసులో ఆయన కుమార్తె సునీత ఎందుకు ప్రయత్నిస్తున్నారు? దానికి 'ఈనాడు' ఎందుకు వత్తాసు పలుకుతోంది? ఇదంతా కుట్ర కాదా? ఇదంతా చంద్రబాబు డైరెక్షన్లో జరుగుతోందనటానికి ఇంకా ఏం కావాలి?

వివేకా హత్య కేసు దర్యాప్తును జూన్ నెలాఖరుకు పూర్తి చేసి జులై 1న ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డిని బెయిల్‌పై విడుదల చేయాలని హైకోర్టు ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ సునీత సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దానిపై సుప్రీంకోర్టు ఎర్ర గంగిరెడ్డికి నోటీసులిచ్చింది. అవి కోర్టు ద్వారా ఆయనకు అందుతాయి. కానీ సునీత ఆ నోటీసులను తన లాయర్ ద్వారా ఎర్ర గంగిరెడ్డికి అందించేందుకు హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు వెళ్లారని 'ఈనాడు' రాసింది. ఇంత కవరేజీ అవసరమా రామోజీ?

ఇదీ... అసలు వాస్తవం

వాస్తవమేంటంటే... ఎర్ర గంగిరెడ్డిని కలవాలని సునీత ప్రయత్నించారు. తాను చెప్పినట్లుగా నడుచుకుంటే కేసు నుంచి తప్పించటంతో పాటు అదనపు లాభాలుంటాయని ప్రలోభపెట్టడానికి ఆమె ఎర్ర గంగిరెడ్డిని కలవాలనుకున్నారు. దస్తగిరి మాదిరే గంగిరెడ్డినీ ప్రలోభపెట్టి కుట్రలో కొత్త అంకానికి తెర లేపాలనుకున్నారు. జైలు అధికారులు అంగీకరించలేదు. కలవాలని ప్రయత్నించిన విషయం మాత్రం బయటకు పొక్కింది. ప్లాను బెడిసికొట్టడంతో దీంతో చంద్రబాబు డైరెక్షన్లో 'ఈనాడు' కవరేజీ మొదలుపెట్టింది. కోర్టు నోటీసులను అందించడానికే సునీత వెళ్లబోయారని చెత్త రాతలు రాసేసింది. సునీతకు అసలు అంత అవసరం ఏమొచ్చిందో చెప్పాలి కదా? కోర్టులు చేయాల్సిన పనిని ఆమే 'వ్యయప్రయాసల కోర్చి' చేస్తున్నారంటే దాని పరమార్థమేంటి? వివేకాను హత్య చేశానని అంగీకరించిన దస్తగిరికి ఇప్పటికే సునీత పూర్తి స్థాయిలో అండదండలిస్తున్నారు. అదే రీతిలో ఎర్ర గంగిరెడ్డినీ ప్రలోభపెట్టి ఈ కేసు నుంచి తన భర్త రాజశేఖరరెడ్డిని, బావ శివప్రకాశ్ రెడ్డిని పూర్తిగా తప్పించాలన్నది ఆమె ఉద్దేశం. అది బయటపడకుండా 'ఈనాడు' నోటీసుల రాగం అందుకోవటమే కుట్రకు నిదర్శనం.

ఏది నిజం?


రామోజీ మంటకు 'మందు' ఉందా?

▶ మొదటి పేజీ తరువాయి

గతంలో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న మద్యం దుకాణాల విధానాన్ని రద్దు చేసింది. ధనార్జనకు దూరంగా ప్రభుత్వమే పరిమిత వేళల్లో ఆంక్షలతో వీటిని నిర్వహిస్తోంది. అలాంటప్పుడు అక్రమాలకు తావు లేదన్నది సుస్పష్టం. అయినప్పటికీ ఢిల్లీతో ముడిపెట్టాలని రామోజీ ప్రయత్నించడం బరి తెగింపు కాదా? ఇక ఛత్తీస్‌గఢ్‌లో మద్యం వ్యవహారాలపై ఈడీ నమోదు చేసిన కేసు వ్యవహారాలు పూర్తి భిన్నం. అక్కడ కొందరు నాయకులు సిండికేట్‌గా ఏర్పడి మద్యం దుకాణాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. అనధికారికంగా తయారైన మద్యాన్ని విక్రయించడంతోపాటు డిస్టిలరీల నుంచి కొనుగోలు చేసే మద్యాన్ని ప్రభుత్వ గిడ్డంగులకు కాకుండా నేరుగా దుకాణాలకు సరఫరా చేస్తున్నారని అభియోగాలు నమోదయ్యాయి. ఇక్కడ అసలు అలాంటి పరిస్థితే లేదని అందరికీ తెలుసు. రాష్ట్రంలో మద్యం తయారు చేస్తున్న 20 డిస్టిలరీలన్నీ గతంలో చంద్రబాబు, అంతకు ముందు ప్రభుత్వాల హయాంలో అనుమతి ఇచ్చినవే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఒక్క డిస్టిలరీకి కూడా అనుమతి ఇవ్వకపోవడం గమనార్హం.

నాడు మూడు డిస్టిలరీలకే 47.09 శాతం ఆర్డర్లు

- 74 శాతం మద్యం కొనుగోళ్లు 16 డిస్టిలరీలకే ఇచ్చారంటూ ఈనాడు గగ్గోలు పెట్టింది. వాస్తవం ఏమిటంటే రాష్ట్రంలో ఉన్నవే 20 డిస్టిలరీలు. వాటిలో 16 డిస్టిలరీలకు 74 శాతం ఆర్డర్లిచ్చారు. సగటున ఒక్కో డిస్టిలరీకి దాదాపు ఐదు శాతం ఇచ్చినట్లు. దీన్ని తప్పంటే ఎలా? మిగిలిన నాలుగు డిస్టిలరీలకు 26 శాతం ఆర్డర్లు వచ్చినట్లేగా? సగటున ఇది 6 శాతం కన్నా ఎక్కువే కదా?. మరి వీళ్లకు అన్యాయం జరిగినట్లా?
- చంద్రబాబు హయాంలో కేవలం 5 డిస్టిలరీల నుంచే 50 శాతం కన్నా ఎక్కువ మద్యం కొన్నారు. అంటే సగటున ఒక్కో డిస్టిలరీకీ 10 శాతం ఇచ్చారు. మిగిలిన 15 డిస్టిలరీలకూ కలిపి 50 శాతం. అంటే దాదాపుగా 3 శాతం. ఇదీ.. అసలు కథ!
- టీడీపీ హయాంలో 2017–18లో మొత్తం రూ.8,106 కోట్ల విలువైన మద్యం ఆర్డర్లు ఇచ్చారు. వాటిలో ఐదు కంపెనీలకే ఏకంగా రూ.4,122.28 కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చారు. ఇందులో పెర్ల్ డిస్టిలరీస్‌కు ఒక్కదానికే రూ.1,374.79 కోట్లు, పెర్నోడ్ రిచర్డ్ ఇండియా లిమిటెడ్‌కు రూ.548.03 కోట్లు, ఎస్వీయార్ డిస్టిలరీస్‌కు రూ.395.1 కోట్లు, అలైడ్ బ్లెండర్స్ డిస్టిలరీస్‌కు రూ.457.86 కోట్లు, ఎస్వీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌కు రూ.319.57 కోట్ల మద్యం ఆర్డర్లు ఇచ్చారు. అంటే ఐదు కంపెనీలకు 50 శాతం కంటే ఎక్కువ ఆర్డర్లిచ్చారు. సగటున వీటికి 10 శాతం కంటే ఎక్కువే.
- చంద్రబాబు హయాంలో 2018–19లో మొత్తం రూ.4,765.75 కోట్ల విలువైన మద్యం ఆర్డర్లివ్వగా 3 డిస్టిలరీలకు ఏకంగా రూ. 2,244.44 కోట్ల విలువైన ఆర్డర్లివ్వటం గమనార్హం. పెర్ల్ డిస్టిలరీస్‌కు రూ.1,462.41 కోట్లు, సెంటినీ బయో ప్రొడక్ట్స్‌కు రూ.638.52 కోట్లు, ఎస్వీవై ఆగ్రో ప్రొడక్ట్స్‌కు రూ.143.51కోట్లు ఆర్డర్లు ఇచ్చారు. అంటే ఈ మూడు డిస్టిలరీలకు ఏకంగా 47.09 శాతం. ఒక్కోదానికీ 15 శాతం కంటే ఎక్కువే. దీన్ని ఏమంటారు రామోజీ?



'అదాన్' అంటూ వక్రభాష్యం...

అదాన్ డిస్టిలరీ నుంచే ఎక్కువగా మద్యం కొనుగోలు చేస్తున్నారంటూ ఈనాడు కన్నీళ్లు కార్చింది. నిజమేంటంటే... అసలు అదాన్ డిస్టిలరీస్ అనేదే లేదు. దానికి ప్రభుత్వం ఎలాంటి ఆర్డరూ ఇవ్వలేదు. టీడీపీ సీనియర్‌నేత అయ్యన్నపాత్రుడి కుమారుడు, ఆయన భాగస్వాములు కలిసి విశాఖ డిస్టిలరీస్ ఏర్పాటు చేశారు. గతేడాది అయ్యన్న కుమారుడు ఆ సంస్థ నుంచి బయటికొచ్చేశారు. మిగతా భాగస్వాములు దాన్ని అదాన్ కంపెనీకి సబ్ లీజుకు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. అదీ కథ. పైపెచ్చు ఈ కంపెనీకి అడ్డగోలుగా ఆర్డర్లు ఇచ్చేశారన్నది కూడా పచ్చి అబద్ధమే. వైఎస్సార్ సీపీ పాలనలో ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ ఇప్పటిదాకా రూ.17,570 కోట్ల విలువైన మద్యానికి ఆర్డర్లిస్తే అందులో విశాఖ డిస్టిలరీస్‌కు ఇచ్చింది రూ.1,164 కోట్లు. అంటే 6 శాతం. మొత్తం డిస్టిలరీలు 20 ఉన్నపుడు అందులో ఒక డిస్టిలరీకి 6 శాతం ఆర్డర్లిస్తే అది అడ్డగోలుగా ఇవ్వటం ఎలా అవుతుందో రామోజీరావే చెప్పాలి.

మద్యం దందాకు చెక్ పడటంతో

చంద్రబాబు హయాంలో యథేచ్ఛగా సాగిన మద్యం దందాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడ్డుకట్ట వేసిందనే వాస్తవాన్ని ఈనాడు పత్రిక తట్టుకోలేకపోతోంది. గతంలో మద్యం దుకాణాలన్నీ టీడీపీ నేతలు సిండికేట్ గుప్పిట్లో పెట్టుకుని దాదాపు 24 గంటలపాటు నిర్వహిస్తూ 25 శాతం అధిక ధరలకు విక్రయిస్తూ దోపిడీకి పాల్పడ్డారు. ఈ దందాకు రామోజీ వత్తాసు పలికేవారు. ఎందుకంటే బాబు – రామోజీ మధ్య ఉన్నది మద్యం బంధమే అన్న వాస్తవం బహిరంగ రహస్యం. 1989–94లో అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడం, తమ పోటీ పత్రిక 'ఉదయం' ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు రామోజీరావు సంపూర్ణ మద్య నిషేధం ఉద్యమాన్ని ప్రోత్సహించారు. ఎన్టీరామారావు అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్య నిషేధాన్ని విధించారు. ఆ తర్వాత ఎన్టీరామారావుకు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు సీఎం అయ్యారు. వెంటనే రామోజీరావు ఏమాత్రం సిగ్గూ ఎగ్గూ లేకుండా ప్లేటు ఫిరాయించి సంపూర్ణ మద్య నిషేధం విధానానికి టాటా చెప్పారు. అంతే.. నిషేధాన్ని చంద్రబాబు ఎత్తేశారు. అప్పుడే రామోజీ ఫిల్మ్‌సిటీ నిర్మాణం చేపట్టారు. అందులోని స్టార్‌హోటళ్లలో మద్యం విక్రయాల కోసం రామోజీరావు ప్రజల రక్తమాంసాలతో వ్యాపారం చేశారు.

నేడు సమర్థంగా మద్యం విధానం

మద్యం మాఫియా అరాచకాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ముగింపు పలికారు. ప్రైవేట్ మద్యం దుకాణాల విధానాన్ని రద్దు చేస్తూ తీసుకున్న ఒక్క విధాన నిర్ణయంతో విప్లవాత్మక సంస్కరణకు శ్రీకారం చుట్టారు. 2019 అక్టోబరు 1 నుంచి మద్యం దుకాణాలన్నీ ప్రభుత్వపరం చేశారు. మద్యం మాఫియాను తుడిచిపెట్టేశారు. దశలవారీగా నియంత్రించేందుకు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు.

దుకాణాల వేళలు కుదింపు

టీడీపీ హయాంలో ప్రైవేట్ మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు విక్రయాలు సాగించేవి. అనధికారికంగా 24 గంటలూ విక్రయిస్తూ ఉండేవి. ఇప్పుడు సమయాన్ని కుదించి కచ్చితంగా అమలు చేస్తున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకే విక్రయాలను అనుమతించారు.

బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌లు రద్దు

చంద్రబాబు హయాంలో ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుబంధంగా 43 వేల బెల్ట్ దుకాణాలు ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే బెల్ట్ దుకాణాలను పూర్తిగా తొలగించింది. గతంలో మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లను అనుమతించారు. అవి అనధికారికంగా బార్లగా చలామణి అయ్యేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఇవీ రద్దయ్యాయి.

దుకాణాలు కుదింపు

టీడీపీ హయాంలో 4,380 మద్యం దుకాణాలు ఉండగా ఇప్పుడు 2,934కి తగ్గిపోయాయి. ఈ సంఖ్యను ఇంకా తగ్గించే ఉద్దేశంలో ప్రభుత్వం ఉంది. ఇక బార్ల సంఖ్యను పెంచలేదు. 2019లో ఖరారు చేసిన 840 బార్లే ఉన్నాయి. కొత్త బార్లకు లైసెన్సులు ఇవ్వలేదు.

భారీగా తగ్గిన అమ్మకాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయి. రాష్ట్రంలో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. టీడీపీ హయాంతో పోలిస్తే రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం విక్రయాలు సగానికి పడిపోయాయి. అందుకు గణాంకాలే తార్కాణం.

షాక్ కొట్టేలా ధరలు..

మద్యం విక్రయాలను నిరుత్సాహపర్చడమే తమ పార్టీ విధానమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు చాలాసార్లు స్పష్టంగా చెప్పారు. విక్రయాలను ప్రోత్సహించి సొమ్ము చేసుకోవడం తమ లక్ష్యం కాదని స్పష్టంచేశారు. అందుకే అధికారంలోకి వచ్చాక మద్యం ధరలను షాక్ కొట్టేలా పెంచారు. అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఏఆర్‌ఈటీ) పన్నునూ విధించారు. దీంతో మద్యం ధరలు పెరిగాయి. మద్యపాన వ్యసనాన్ని నిరుత్సాహ పరిచేందుకు విధించిన ఏఆర్‌ఈటీ పన్నుతో రాబడి పెరుగుతున్నట్లు కనిపిస్తున్నా వాస్తవానికి మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. పేదలు ఈ వ్యసనానికి క్రమంగా దూరమవుతున్నారు.

టీడీపీ హయాంలో మద్యం విక్రయాల పెరుగుదల ఇలా.. (కేసుల్లో)

ఏడాది	ఐఎంఎల్ (మద్యం) విక్రయాలు	బీరు విక్రయాలు
2014-15	2.88కోట్లు	1.74కోట్లు
2015-16	3.06కోట్లు	1.69కోట్లు
2016-17	3.32కోట్లు	1.74కోట్లు
2017-18	3.60 కోట్లు	2.27 కోట్లు
2018-19	3.84 కోట్లు	2.77 కోట్లు



వైఎస్సార్‌సీపీ వచ్చాక మద్యం విక్రయాల తగ్గుదల ఇలా.. (కేసుల్లో)

ఏడాది	ఐఎంఎల్ (మద్యం) విక్రయాలు	2018-19తో పోలిస్తే తగ్గిన విక్రయాలు	బీరు విక్రయాలు	2018-19తో పోలిస్తే.. తగ్గిన విక్రయాలు
2019-20	3.08 కోట్లు	20 శాతం	2.12 కోట్లు	23 శాతం
2020-21	1.94 కోట్లు	50 శాతం	57 లక్షలు	79 శాతం
2021-22	2.78 కోట్లు	28 శాతం	82 లక్షల కేసులు	70 శాతం
2022-23	3.35కోట్లు	13శాతం	1.16కోట్లు	59శాతం

తగ్గిన విక్రయాలు కనపడలేదా?

మద్యం ద్వారా ఆదాయం పెరిగింది కాబట్టి మద్యం ఏరులైపారుతోందంటూ ఈనాడు ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తోంది. వాస్తవం ఏమిటంటే... పేదలకు అందుబాటులోలేకుండా చేసేందుకు మద్యం ధరలు పెంచడంతోనే ఆదాయం పెరిగినట్టు కనిపిస్తోంది. మద్యం విక్రయాల పరిమాణం మాత్రం గణనీయంగా తగ్గింది. చంద్రబాబు సీఎంగా ఉండగా 2018- 19లో రాష్ట్రంలో 384.31 లక్షల మద్యం కేసులు, 277.1 లక్షల బీర్ కేసులు విక్రయాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత 2019–20లో మద్యం కేసులు 308.49 లక్షలు, బీరు కేసులు 212.91లక్షల కేసులే విక్రయించారు. 2020–21లో అయితే మద్యం కేసులు 187.55 లక్షలు, బీరు కేసులు 56.97 లక్షలతో విక్రయాలు తగ్గిపోయాయి. ఇక 2021–22లో మద్యం కేసులు 266.08 లక్షలు, బీరు కేసులు 81.67 లక్షలు విక్రయాలు జరిగాయి. 2022–23లో మద్యం కేసులు 335.98 లక్షలు, బీరు కేసులు 116.76 లక్షల కేసులే విక్రయించారు. మరి ఎలా చూసినా గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే విక్రయాలు తగ్గిపోవడం ఈనాడుకు కనపడకపోవటాన్ని ఏమనుకోవాలి?

గ్రహం అనుగ్రహం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.తదియ రా.10.06 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** మృగశిర ఉ.9.53 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** సా.6.54 నుండి 8.37 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.20, నుండి 1.14 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.46 వరకు, **అమృతఘడియలు:** రా.12.54 నుండి 2.35 వరకు. ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.22.

క్లుప్తంగా...

వాసవీ మాతకు మూడు కేజీల బంగారు చీర



బంగారు చీర అలంకరణలో ఉన్న వాసవీ మాతకు హారతి ఇస్తున్న అర్చకుడు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లా కేంద్రం కాకినాడలో వాసవీ మాతకు భక్తులు రూ.2 కోట్ల విలువైన 3 కేజీల బంగారంతో చీర తయారు చేయించారు. ఈ బంగారు చీరను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఆర్యవైశ్యుల సహకారంతో ఈ చీరను తయారు చేయించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 110 సంవత్సరాల కిందట నిర్మించిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి బంగారు చీర చేయించడం గొప్ప విషయమని కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



గర్భాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, చిత్రంలో స్వర్ణలతారెడ్డి

రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఏడుకొండల వేంకటేశ్వరస్వామి మన్యంలో కొలువుదీరాడు. తిరుమల, తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రంపచోడవరం ప్రాంతంలోని పులిమెట్టపై రూ.6 కోట్లతో నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ట ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ శిఖరంపై ఏర్పాటు చేసే కలశాలకు పూజలు జరిపారు. ఉత్సవ విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం గర్భాలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతారెడ్డి పాల్గొన్నారు. కాగా, సోమవారం మహాసంప్రోక్షణ, స్వామివారి కల్యాణం జరుగనున్నాయి. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరు కానున్నారు.

మల్లన్న సేవలో కేంద్ర మంత్రి పాండే



మల్లన్న దర్శనానికి వెళుతున్న పాండే

శ్రీశైలం టెంపుల్ (నంద్యాల): శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లను కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ మహేంద్రనాథ్ పాండే ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆహ్వానం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్లను పాండే దర్శించుకుని రుద్రాభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలను, అధికారులు శేషవస్త్రాలు, ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. అలాగే, ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లను దర్శించుకున్నారు.

84 ఏళ్ల వృద్ధురాలికి అరుదైన ఆపరేషన్

- నోటి క్యాన్సర్ తొలగించి ఆ భాగం పునర్నిర్మాణం



కోలుకున్న చెన్నమ్మతో వైద్యులు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జనరల్ సర్జరీ విభాగంలో వృద్ధురాలికి నోటి క్యాన్సర్ ఆపరేషన్ చేయడమే కాకుండా ఆ భాగాన్ని వైద్యులు పునర్నిర్మించారు. ఈ వివరాలను ఆదివారం ప్రొఫెసర్ డాక్టర్ మాధవీశ్యామల మీడియాకు చెప్పారు. శంకిరేనిపల్లికి చెందిన చెన్నమ్మ (84) నోటి క్యాన్సర్‌తో బాధపడుతూ గత నెల జనరల్ సర్జరీ ఓపీకి వచ్చారు. ఆమెకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఇటీవల కాంపోజిట్ రిసెక్షన్, రీకన్‌స్ట్రక్షన్ అనే ఆపరేషన్ చేశారు. 84 ఏళ్ల వృద్ధురాలికి ఇలాంటి శస్త్రచికిత్స చేయడం చాలా అరుదు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో దీనికి రూ.10 లక్షలు ఖర్చవుతుంది. దీనిని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా నిర్వహించారు. ఆపరేషన్‌లో మాధవీ శ్యామలతో పాటు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జయరామ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చంద్రారెడ్డి, శృతి, సృజన్, అనెస్థీషియా వైద్యులు కొండారెడ్డి పాల్గొన్నారు.

లక్షలాది అవ్వాతాతల కళ్లల్లో వెలుగులు

53,416 మంది అవ్వాతాతలకు ఉచిత కంటి శస్త్రచికిత్సలు పూర్తి

8.81 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు

- వైఎస్సార్ కంటి వెలుగు కింద 31.77 లక్షల మందికి కంటి పరీక్షలు/
- ఉచిత సర్జరీలకు జిల్లాకో రూ.లక్ష మొబిలైజేషన్ నిధులు
- వైఎస్సార్ జిల్లాలో పక్షం రోజుల్లోనే 3,650 శస్త్ర చికిత్సలు
- మిగతా జిల్లాల్లోనూ త్వరగా క్యాటరాక్ట్ సర్జరీలు పూర్తి చేయండి
- జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవ్వాతాతల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. వారికి క్రమం తప్పకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచనుగా వారున్న చోటుకే పింఛను డబ్బు పంపిస్తున్నారు. మరో పక్క వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా మలి వయసులో చూపు మసకబారిన అవ్వాతాతల కళ్లల్లో వెలుగులు నింపుతున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాదే సీఎం జగన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోవిడ్ మహమ్మారి రావడంతో ఆ సమయంలో కొంత అవరోధం కలిగింది. కోవిడ్ ప్రభావం తగ్గగానే మళ్లీ ప్రారంభించారు. రాష్ట్రంలోని 60 సంవత్సరాలు దాటిన అవ్వాతాతలకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు ఉచితంగా ఇస్తున్నారు. అవసరమైన వారికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. 56,88,424 మంది అవ్వా తాతలకు కంటి పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటికే 31,77,994 మందికి పరీక్షలు చేశారు. 11,46,659 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. ఇప్పటివరకు 8,81,659 మంది అవ్వా తాతలకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. మిగతా వారికి కూడా కళ్లద్దాలను ఆర్డర్ ఇచ్చారు. 1,86,628 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్ చేయాల్సి ఉందని గుర్తించగా ఇప్పటి వరకు 53,416 మందికి ఉచితంగా ఈ సర్జరీలు చేసి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు తెచ్చారు.

ఎన్జీవోల సమన్వయంతో త్వరగా సర్జరీలు చేయండి : సీఎస్

వైఎస్సార్ కంటి వెలుగు కింద అవ్వా తాతలకు ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీ, క్యాటరాక్ట్ ఆపరేషన్ల పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ కార్యక్రమంపై వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో కలిసి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. కంటి పరీక్షల బృందం గ్రామాల పర్యటన షెడ్యూల్‌ను ముందుగానే విలేజ్ హెల్త్ క్లినిక్స్, గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్యశ్రీ ఎంప్యానల్ ఆస్పత్రులతో సమన్వయం చేసుకొని క్యాటరాక్ట్ సర్జరీలను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. వైఎస్సార్ జిల్లా అధికారులు పక్షం రోజుల్లోనే 3,650 శస్త్రచికిత్సలు చేయించారని చెప్పారు. మిగతా జిల్లాలు కూడా ఆపరేషన్లు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. శస్త్ర చికిత్సలకు జిల్లాకు లక్ష రూపాయల చొప్పున మొబిలైజేషన్ నిధులను విడుదల చేశామన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం పురోగతిని పక్షం రోజులకోసారి పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా అవ్వా తాతలకు కళ్లద్దాల పంపిణీ, క్యాటరాక్ట్ సర్జరీలు ఇలా

జిల్లా పేరు	కళ్లద్దాలు పంపిణీ పూర్తి	శస్త్రచికిత్సలు పూర్తి
శ్రీకాకుళం	23,329	7,756
వైఎస్సార్	40,695	4,491
పార్వతీపురం మన్యం	51,380	4,540
అల్లూరి సీతారామరాజు	29,622	667
నంద్యాల	29,981	1,010
విజయనగరం	40,284	8,588
అనకాపల్లి	42,517	4,380
తూర్పు గోదావరి	21,443	487
కర్నూలు	46,237	1,422
కాకినాడ	18,220	659
పల్నాడు	38,142	2,688
కృష్ణా	47,163	1,203
ప్రకాశం	29,076	806
ఏలూరు	39,031	539
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	34,670	347
నెల్లూరు	26,680	196
అన్నమయ్య	47,447	1,694
శ్రీ సత్య సాయి	46,648	2,206
తిరుపతి	17,099	366
గుంటూరు	34,914	3119
విశాఖపట్నం	31,960	1,411
బాపట్ల	22,840	1,866
పశ్చిమ గోదావరి	36,602	238
అనంతపురం	30,733	977
చిత్తూరు	22,439	261
ఎన్టీఆర్	32,507	1,499
మొత్తం	8,81,659	53,416

కంటి వెలుగుతో చూపు

మాది పేద కుటుంబం. భర్త చనిపోయాడు. ఎవరూ లేరు. జగనన్న ఇస్తున్న పింఛను మీద జీవిస్తున్నాను. ఒక రోజు కంటిలో మసక వచ్చింది. వస్తువులు కనపడడంలేదు. మా ప్రాంతంలోని ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రత్నంను సంప్రదించగా, కంటికి క్యాటరాక్ట్ సమస్య ఉందని చెప్పారు. దాని కి ఖర్చు భరించలేనని చెప్పడంతో వెంటనే కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఉచితంగా చేస్తామన్నారు. మార్చి 29న ఆపరేషన్ చేశారు. ఇప్పుడు కన్ను బాగా కనిపిస్తోంది. నా పని నేను చేసుకుంటున్నాను. జగనన్న ఇస్తున్న పింఛన్ డబ్బులు, కంటి వెలుగు పథకం ద్వారా ఆపరేషన్ చేయించుకొని సంతోషంగా జీవిస్తున్నాను.

–డి. లక్ష్మీ నారాయణమ్మ, 65 సంవత్సరాలు, మధురవాడ,బాపూజీ నగర్, విశాఖపట్నం

రూ.2,000 నోట్ల మార్పిడికి ధ్రువీకరణ పత్రాలు అక్కర్లేదు

- బ్యాంకు శాఖలకు ఎస్‌బీఐ సూచనలు



న్యూఢిల్లీ: రూ.20,000 వరకూ విలువ చేసే రూ.2,000 నోట్లను మార్చుకొనేందుకు ఎటువంటి ఫారం లేదా రిక్విజిషన్ స్లిప్ అవసరం లేదని ప్రభుత్వరంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తెలిపింది. అలాగే వినియోగదారుడు ఎటువంటి ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించాల్సిన అవసరం లేదని స్థానిక ప్రధాన కార్యాలయాలకు పంపిన సూచనల్లో పేర్కొంది. నోట్ల మార్పిడి ప్రక్రియ సజావుగా జరిగేందుకు ప్రజలకు అవసరమైన తోడ్పాటు అందించాలని సూచించింది. రూ.2,000 నోట్లను మార్చుకోదల్చుకున్న వారు ఎన్ని సార్లయినా బ్యాంకును సందర్శించవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. రూ.2,000 కరెన్సీ నోట్లను చలామణీ నుంచి ఉపసంహరిస్తున్నట్లు, మే 23 నుంచి సెప్టెంబర్ 30 వరకూ ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవచ్చని లేదా మార్చుకోవచ్చని ఆర్‌బీఐ శుక్రవారం ప్రకటించడం తెలిసిందే. దీంతో చాలా మంది వినియోగదారులు శనివారం నుంచే తమ ఖాతాల్లో జమ చేసుకొనేందుకు, మార్చుకొనేందుకు బ్యాంకులకు వెళ్లినప్పటికీ బ్యాంకు సిబ్బంది వారిని తిప్పి పంపారు. కొందరు కస్టమర్లు నగదు డిపాజిట్ మెషీన్ల ద్వారా తమ ఖాతాల్లోకి రూ.2,000 నోట్లను డిపాజిట్ చేసుకున్నారు. దేశవ్యాప్తంగా జ్యువెలరీ షాపుల్లో బంగారం, ఇతర విలువైన ఆభరణాలను కొనుగోలు చేసేందుకు పలువురు ప్రయత్నించారు. అయితే రూ.2,000 నోట్లను తీసుకొనేందుకు ఆభరణాల సంస్థలు సందేహించి, నగదు కొనుగోళ్ల పరిమితి నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాలు అడిగినట్లు సమాచారం. రూ.2,000 నోట్ల రద్దుతో చిన్న వ్యాపారులపై ఎటువంటి ప్రభావం ఉండదని, కానీ పెద్ద సంఖ్యలో ఆ నోట్లను నిల్వ చేసుకున్న సంపన్నులపై ప్రభావం ఉండొచ్చని అఖిల భారత ట్రేడర్ల సమాఖ్య సీఏఐటీ పేర్కొంది.

పసిడికి ‘2000’ బూస్ట్!

- రూ.2,000 నోట్ల ఉపసంహరణతో కొనుగోళ్లపై ఆసక్తి

ముంబై: రూ.2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించిన నేపథ్యంలో దేశీయంగా పసిడి, వెండి కొనుగోళ్లపై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. రూ.2,000 నోట్లతో కొనుగోళ్లు జరిపే ఉద్దేశంతో కొనుగోలుదారులు పెద్ద ఎత్తున ఆరాలు తీస్తున్నట్లు ఆభరణాల విక్రయ సంస్థలు వెల్లడించాయి. అయితే కేవైసీ (నో యువర్ కస్టమర్) నిబంధనలను కఠినంగా పాటిస్తుండటంతో గత రెండు రోజులుగా వాస్తవంగా లావాదేవీలు ఆ స్థాయిలో ఏమీ జరగలేదని పేర్కొన్నాయి. కానీ రూ.2,000 నోట్లకు బదులుగా పసిడిని విక్రయించేందుకు కొందరు జ్యువెలర్లు 5–10 శాతం ఎక్కువ వసూలు చేయడం మొదలుపెట్టాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫలితంగా 10 గ్రాముల పసిడి రూ.66,000 పలుకుతోందని వివరించాయి. మరోవైపు 2016లో పెద్ద నోట్ల రద్దు సమయంలోలాగా ఆందోళనకర పరిస్థితేమీ లేదని ఆభరణాల సంస్థల సమాఖ్య జీజేసీ తెలిపింది. ‘రూ.2,000 నోట్లతో బంగారం లేదా వెండిని కొనుగోలు చేసేందుకు చాలా ఎంక్వైరీలు వచ్చాయి. కానీ కఠినతరమైన కేవైసీ నిబంధనల కారణంగా వాస్తవంగా జరిగిన కొనుగోళ్లు తక్కువే’ అని జీజేసీ చైర్మన్ సైయ్యమ్ మెహ్రా తెలిపారు. నోట్ల ఉపసంహరణకు నాలుగు నెలల సమయం ఉన్నందున ప్రజల్లో తీవ్ర భయాందోళనలు ఏమీ లేవని వివరించారు.

చికెన్.. ధర కొండెక్కెన్!

- నెల క్రితం కిలో రూ.200
- ప్రస్తుతం రూ.300కు చేరిన ధర
- కోడి గుడ్లకూ పెరిగిన డిమాండ్



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): చికెన్ ధర ఒక్కసారిగా పెరిగిపోయింది. శుభకార్యాల వేళ ధర పెరగడంతో ప్రజలు తప్పనిసరిగా చికెన్ కొనుగోలు చేస్తున్నారు. ధరలతోపాటు వేసవి తీవ్రత పెరిగినా చికెన్ కొనుగోళ్లు ఏమాత్రం తగ్గటం లేదు. సరిగ్గా నెల రోజుల క్రితం చికెన్ కిలో ధర రూ.200 పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో కిలోకు రూ.100 పెరిగిపోయింది. విజయవాడలోని పాతబస్తీ తదితర ప్రాంతాల్లో ఉన్న చేపల మార్కెట్ వంటి పెద్ద ప్రాంగణాల్లో స్కిన్ రూ.290 స్కిన్‌లెస్ రూ.300 చొప్పున విక్రయిస్తుండగా.. సాధారణ మార్కెట్లలో మాత్రం రూ.300లకు తగ్గకుండా విక్రయాలు చేస్తున్నారు.

వేసవి.. ఆపై శుభకార్యాలు

వేసవి సీజన్‌లో సాధారణంగా చికెన్ ధర పెరగటం సహజం. ఈ ఏడాది సాధారణ స్థాయి కంటే అధికంగా పెరుగుతుండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరగటం వల్ల వందల కొద్దీ కోళ్లు చనిపోతుండటంతో పౌల్ట్రీ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆ నష్టాన్ని తట్టుకునేందుకు ధరలను పెంచాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. దానికి తోడు వైశాఖ, జ్యేష్ఠ మాసాల్లో వివాహ ముహూర్తాలు ఉండటం వల్ల డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవటం ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు వివరిస్తున్నారు.

గుడ్డు ధరలూ పెరిగాయ్

కోడిగుడ్లకు డిమాండ్ భారీగా పెరిగింది. కోడిగుడ్లు అమ్మే దుకాణాల వద్ద భారీగా క్యూలైన్లు కనిపిస్తున్నాయి. గత నెలలో పాతిక గుడ్లు సుమారు రూ.100 నుంచి రూ.110 వరకూ విక్రయించారు. ఇప్పుడు 25 కోడిగుడ్లు రూ.135కు హోల్‌సేల్ వ్యాపారులు విక్రయిస్తుండగా.. రిటైల్‌గా ఒక్కొక్కటి రూ.6, రూ.6.50 చొప్పున విక్రయిస్తున్నారు. రైతుబజార్‌లో ఆదివారం 25 గుడ్లు రూ.127 ధర పలికాయి.

నేటినుంచి సీహెచ్‌వోలకు నైపుణ్యశిక్షణ

- జిల్లా, బోధనాస్పత్రుల్లో ప్రారంభం

సాక్షి, అమరావతి: గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లలో (సీహెచ్‌వోల్లో) నైపుణ్యాల పెంపునకు వైద్యశాఖ సోమవారం నుంచి ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. జిల్లా, బోధనాస్పత్రుల్లో సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో బ్యాచ్‌కు 40 మంది చొప్పున వారం రోజులు శిక్షణ ఇస్తారు. కాలిన గాయాలు, రోడ్డు ప్రమాదాల బాధితులకు ఎమర్జెన్సీ మెడికల్ కేర్, గాయాలకు కట్టుకట్టడం, కుట్లువేయడం, ఇంజెక్షన్లు చేయడం, ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం, ప్రాథమిక చికిత్స, ఇతర నర్సింగ్ కేర్ సేవల్లో శిక్షణ ఇస్తారు. వీరు బీఎస్సీ నర్సింగ్ చేసిన సమయంలో ఈ అంశాలపై అవగాహన కలిగి ఉంటారు. వీటిపై మరింత లోతైన అవగాహన కల్పించడంతోపాటు క్లినికల్ మేనేజ్‌మెంట్‌లో సామర్థ్యాలను అభివృద్ధి చేయడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం. ఎమర్జెన్సీ మెడికల్ కేర్‌లో భాగంగా సీపీఆర్ నిర్వహణ, పాముకాటుకు గురైన వారిని ప్రాణాపాయం నుంచి తప్పించడానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా శిక్షణ ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక గ్రామాల్లో ప్రతి 2,500 మంది జనాభాకు ఒకటి చొప్పున 10,032 విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. ప్రతి క్లినిక్‌లో బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత ఉన్న వారిని సీహెచ్‌వోగా నియమించింది. ఆరోగ్య అత్యవసర సమయాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలు అందించడం, ఇతర క్లినికల్ మేనేజ్‌మెంట్‌కు వీలుగా వీరిలో సామర్థ్యాలను పెంచాలని సీఎం జగన్ ఆదేశించారు. సీఎం ఆదేశాలతో సీహెచ్‌వోలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి వైద్యశాఖ కార్యాచరణ రూపొందించింది. శిక్షణ కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రతి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్ తెలిపారు. పాముకాటుకు గురైన, పురుగుమందు తాగిన, వివిధ అత్యవసర పరిస్థితుల్లోని బాధితులకు తక్షణమే ప్రాథమిక వైద్యసేవలను అందించడానికి వీలుగా సీహెచ్‌వోల్లో నైపుణ్యాలు పెంచడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి సీహెచ్‌వో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుంటూరులో బీఆర్ఎస్ కార్యాలయం


- ప్రారంభించిన తోట చంద్రశేఖర్



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్

గుంటూరు (మెడికల్): ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, వైఎస్సార్‌సీపీలకు ప్రత్యామ్నాయం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అని ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు ఆటోనగర్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ వైఫల్యాలతో విసుగెత్తిన ప్రజలు మరో ప్రత్యామ్నాయం లేక వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్నారు. రాష్ట్రాన్ని అథోగతి పాల్జేస్తున్నారని, విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేస్తుంటే వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఏమీ మాట్లాడటం లేదని అన్నారు. ప్రైవేటు పరం చేస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను కేసీఆర్ ప్రధాని కాగానే.. వెనక్కి తీసుకుంటామని బహిరంగంగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఒక్క గుంట భూమి ఉన్న రైతు మరణించినా వారం రోజుల్లో ఆ రైతు నామినీ ఖాతాలో రూ.5 లక్షలు జమ అవుతున్నాయన్నారు. దేశంలోనే సీనియర్ నేతగా చెప్పుకునే చంద్రబాబుకు ఏనాడైనా ఇలాంటి ఆలోచన వచ్చిందా అని ప్రశ్నించారు. ఏపీలో ఒక్క నగరాన్ని కూడా అభివృద్ధి చేయటం లేదని, ఏపీకి సమర్థ నాయకత్వం లేకపోవటం వల్లే అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని అన్నారు.

ఆచార్య అల్లం అప్పారావు హఠాన్మరణం



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు అల్లం అప్పారావు(74) అమెరికాలో హఠాన్మరణం చెందారు. అమెరికాలో స్థిరపడిన తన కుమారుడు, కుమార్తె కుటుంబాలతో గడపడానికి ఆయన ఇటీవల అమెరికా వెళ్లారు. ప్రస్తుతం డల్లాస్‌లో కుమార్తె ఇంటి వద్ద ఉన్న ఆచార్య అల్లం అప్పారావుకు శనివారం నిద్రలోనే గుండెపోటు రావడంతో మృతిచెందారు. ఆయన ఉదయం వాకింగ్‌కు వెళ్లి వచ్చిన తర్వాత కొద్దిసేపు విశ్రాంతి కోసం నిద్రకు ఉపక్రమించారు. నిద్రలోనే తీవ్ర గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు సన్నిహితులు తెలిపారు. ఆచార్య అల్లం అప్పారావు ఏయూ కంప్యూటర్ సెంటర్ డైరెక్టర్‌గా, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా, చీఫ్ వార్డెన్‌గా, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, జేఎన్‌టీయూకే ఉప కులపతిగా, సీఆర్ రావు అడ్వాన్స్‌డ్ ఇనిస్టిట్యూట్ (హైదరాబాద్) డైరెక్టర్‌గా, ఎస్ఐటీటీఆర్(చెన్నై) చైర్మన్‌గా బాధ్యతలను సమర్థంగా నిర్వహించారు. ఆచార్య అల్లం అప్పారావు మృతి పట్ల ఏయూ అధికారులు, ఆచార్యులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

ప్రాణం కాపాడిన ‘దిశ’

- ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని రక్షించిన పోలీసులు
- ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాలో ఘటన

బుచ్చిరెడ్డిపాళెం: ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని దిశ యాప్ ద్వారా వచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు రక్షించారు. ఈ ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పెద్దూరులో జరిగింది. పోలీసుల ఆదివారం తెలిపిన వివరాల మేరకు... పెద్దూరుకు చెందిన తాతా సురేంద్ర అనే వ్యక్తికి మానసికస్థితి సరిగా లేదు. ఆయన శనివారం సాయంత్రం పెద్దూరులోని తమ ఇంటికి కొద్దిదూరంలో ఉన్న ఖాళీ ప్రదేశానికి వెళ్లి తన భార్య కీర్తనకు వీడియోకాల్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. భయపడిన కీర్తన వెంటనే తన ఫోన్‌లో ఉన్న దిశ యాప్‌కు సంబంధించిన నంబర్‌కు ఫోన్ చేసి తన భర్త గురించి తెలియజేసింది. దిశ యాప్ ద్వారా క్షణాల్లో బుచ్చిరెడ్డిపాళెం పోలీసులకు సమాచారం అందడంతో వారు కీర్తనను వెంటబెట్టుకుని సురేంద్ర ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే సురేంద్ర పురుగుమందు తాగాడు. వెంటనే సురేంద్రను బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని చంద్రబాబు రాజకీయం

- బహుజన పరిరక్షణ సమితి నేతలు
- 966వ రోజుకు చేరిన రిలే దీక్షలు



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో పేదల ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వం శరవేగంగా ఏర్పాట్లు చేయడం బహుజన పరిరక్షణ సమితి నేతలు హర్షం వ్యక్తం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 966వ రోజుకు చేరాయి. శిబిరాన్ని పలువురు నేతలు సందర్శించి ప్రసంగించారు. భూమి ద్వారానే ఆర్థిక ఎదుగుదల సాధ్యమవుతుందని గ్రహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పట్టాలిచ్చి పక్కా గృహం నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాలు అందించడంతో విపరీతమైన ఆదరణ వస్తుందని గ్రహించిన టీడీపీ నేతలు.. తాము అధికారంలోకొస్తే పేదలకు మూడు సెంట్లు కేటాయిస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో బాబు ఆయన కుమారుడు యాత్రల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని ప్రజలను మభ్యపెట్టాలని చూడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

• తెలంగాణ

యాదాద్రికి భారీగా భక్తులు



యాదగిరిగుట్ట: వేసవి సెలవులు ముగుస్తుండటంతో యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. ఆదివారం శ్రీస్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో రద్దీ నెలకొంది. స్వామి వారి ధర్మదర్శనానికి 3 గంటలకు పైగా సమయం, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయ క్యూలైన్లు, ముఖ మండపం, ప్రసాద విక్రయశాల, బస్టాండ్, విష్ణు పుష్కరిణి, కల్యాణకట్ట వంటి ప్రాంతాల్లో భక్తులు ఎక్కువగా కనిపించారు. కాగా, శ్రీస్వామిని 35 వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని తమ మొక్కులు తీర్చు కున్నారు. నిత్యకల్యాణ మండపం భక్తులతో నిండిపోయింది. కాగా, వివిధ పూజలతో ఆదివారం ఒక్క రోజు రూ.50,96,399 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

కానిస్టేబుల్ తుది రాత పరీక్ష ప్రాథమిక కీ విడుదల

- నేటి నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో..
- అభ్యంతరాలు తెలిపేందుకు ఈనెల 24 వరకు గడువు
- టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా వివిధ విభాగాల్లోని కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నిర్వహించిన తుది రాత పరీక్ష ప్రాథమిక కీ సోమవారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండనుంది. ఈ మేరకు టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www. tslprb. in వెబ్‌సైట్‌లో ప్రాథమిక కీ ని చూడవచ్చని తెలిపారు. ప్రాథమిక కీపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రతి ప్రశ్నకు వేర్వేరుగా అభ్యంతరాలు వెబ్‌సైట్‌లో సూచించిన వెబ్ టెంప్లేట్ ఫార్మట్‌లో ఈనెల 24 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. అదేవిధంగా అభ్యంతరాలకు సంబంధించిన ఆధారాలను, డాక్యుమెంట్లను సైతం జత చేయాలని సూచించారు. అభ్యంతరాలు ఉన్న ప్రతి ప్రశ్నకు వేర్వేరుగా సూచించిన ఫార్మట్‌లోనే అభ్యంతరాలు పంపాలని, లిఖితపూర్వకంగా నేరుగా పంపే అభ్యర్థనలు పరిగణనలోకి తీసుకోమని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ల స్కాన్ కాపీలను తుది కీ విడుదల చేసిన తర్వాత మాత్రమే అభ్యర్థుల యూజర్ అకౌంట్లకు పంపుతామని శ్రీనివాసరావు వెల్లడించారు.

క్లుప్తంగా

రూ.270కి మూడు ఇళ్లు

రోమ్: ఇటలీలో నాలుగైదేళ్ల కిందటి వరకు కొన్ని గ్రామాలకు వెళితే కారు చౌకగా ఇళ్లు లభించేవి. ఒక దాలర్ ఇస్తే చాలు ఇక ఇల్లు వారి పేరు మీద రిజిస్టర్ అయిపోయేది. సిసిలీలో ఒక మారుమూల విసిరేసినట్టున్న ఇల్లు కొనడానికి ఒక డాలర్ ఖర్చు పెడితే చాలు. దీనికి కారణం ఆ ప్రాంతం నుంచి ప్రజల వలసలే. కాలిఫోర్నియాకు చెందిన రుబియా డేనియల్స్ అనే మహిళ 2019లో కేవలం 3.30 డాలర్లకి (రూ.270) మూడు ఇళ్లను కొనుగోలు చేసింది. ఈ నాలుగేళ్లలో పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రజలు మళ్లీ గ్రామాల బాటపడుతున్నారు. దీంతో ఆమె కొనుగోలు చేసిన ఇళ్లకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఆమె ఆ ఇళ్లను పునరుద్ధరించే పనిలో ఉన్నారు. ఒక ఇంట్లో తానుంటానని, మరొకటి ఆర్ట్ గ్యాలరీగా మార్చి, ఇంకొకటి అద్దెకిస్తానని చెబుతున్నారు.

కేరళలో కాలనీయే ఖాళీ ..!

కొచి: కేరళలోని కొట్టాయం జిల్లా కై పుజా గ్రామంలో ఒక కాలనీలో ఇళ్లన్నీ ఖాళీగా ఉన్నాయి. ఆ కాలనీలో ఉన్న 100కి పైగా ఇళ్లు అమ్మకానికి పెట్టారు. ఇవన్నీ ఎన్నారైలకు చెందిన ఇళ్లే. ఒకప్పుడు ఈ ప్రాంతం నుంచి మెరుగైన జీవితం కోసం ప్రజలు వివిధ దేశాలకు వెళ్లిపోయారు. అక్కడ సంపాదించిన డబ్బులతో తమ ప్రాంతంలో అత్యాధునిక సౌకర్యాలతో ఇళ్లు నిర్మించారు. రిటైర్‌మెంట్ జీవితం ఆ ఇళ్లల్లోనే గడిపారు. వారి తదనంతరం పిల్లలు విదేశాల్లో స్థిరపడడంతో ఆ ఇళ్లన్నీ ఇప్పుడు ఖాళీగా ఉన్నాయి. సకల సౌకర్యాలు ఉన్న ఆ కాలనీ ఒకేసారి ఖాళీ అయిపోయింది. అయితే అక్కడ మంచి సదుపాయాలు ఉండడంతో చాలా మంది ఆ ఇళ్లను కొనడానికి మొగ్గు చూపిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ రియల్ ఎస్టేట్ బూమ్ పెరిగింది.

ఆరేళ్ల క్రితం ఇల్లు లేదు... ఇప్పుడు మిలియనీర్

కాలిఫోర్నియా: ఆరేళ్ల క్రితం నిలువ నీడలేని అమెరికన్ మహిళ నక్కతోక తొక్కారు. అదృష్టం లాటరీ రూపంలో తలుపు తట్టి రాత్రికి రాత్రి కోట్లకు పడగలెత్తారు. లాటరీలో 50 లక్షల డాలర్లు గెలుచుకున్నానని తెలియగానే ఆమె మొదట నమ్మలేదు. అది నిజమేనని అర్థమయ్యాక ఆమె ఆనందానికి అంతేలేదు. కాలిఫోర్నియాకు చెందిన లూసియా ఫోర్‌సెథ్‌ను చాలా కాలంగా ఆర్థిక కష్టాలు వేధిస్తున్నాయి. ఆరేళ్ల క్రితం ఇల్లు కూడా లేదు. కష్టపడి చదివి డిగ్రీ సంపాదించారు. చిన్న ఉద్యోగం వచ్చింది. కారులో ఆయిల్ కొట్టించినప్పుడు చిల్లర లేక అయిష్టంగానే లాటరీ టిక్కెట్ తీసుకున్నారు. దాంతోనే ఆమె ఇంట డాలర్ల వర్షం కురిసింది. ఈ ఏడాది లూసియా పెళ్లి చేసుకోనున్నారు. జీవిత భాగస్వామితో పాటు ఈ లాటరీ టిక్కెట్ తన జీవితాన్నే మార్చేసిందని సంబరపడుతున్నారు.



ఆధునిక మానవుని మూలాలు ఎక్కడున్నాయి? ఆఫ్రికా అన్నది అందరూ చెప్పే సమాధానం. తొలి మానవులు అక్కడే పుట్టి, అక్కణ్నుంచే ప్రపంచమంతా వ్యాపించారని దశాబ్దాలుగా వింటూ వస్తున్నాం కూడా. అంత వరకూ నిజమే అయినా మనమంతా ఒకే ఆదిమ జాతి నుంచి పుట్టుకొచ్చామన్న సిద్ధాంతం మాత్రం తప్పంటోంది ఓ తాజా అధ్యయనం. మన మూలాలు ఆఫ్రికాలోని కనీసం రెండు విభిన్న జాతుల్లో ఉన్నాయని చెబుతోంది. కనుక ఆధునిక మానవుని జన్మస్థలం ఫలానా అంటూ ఇదమిత్థంగా తేల్చి చెప్పలేమన్నది దాని సారాంశం..

- సాక్షి, నేషనల్ డెస్క్

మనది ఒకే మూలం కాదు

కనీసం రెండు ఆదిమ జాతుల నుంచి పుట్టుకొచ్చాం..

10 లక్షల ఏళ్ల కింద ఆఫ్రికాలోని భిన్న ప్రాంతాల్లో మూలాలు

ఆధునిక మానవుని పుట్టుకపై కొత్త అధ్యయనం వాదన

మన ఆవిర్భావానికి ఒకే మూలమంటూ లేదని తాజా అధ్యయనం ఒకటి చెబుతోంది. 10 లక్షల ఏళ్ల క్రితం ఆఫ్రికావ్యాప్తంగా ఉనికిలో ఉన్న పలు ఆదిమ మానవ జాతులు హోమోసెపియన్స్‌గా పిలిచే ఆధునిక మానవుని పుట్టుకకు కారణమని అంటోంది. ''ఆ కాలంలో ఆఫ్రికాలో నివసించి, క్రమంగా ఆ ఖండమంతటా వ్యాపించి పరస్పరం కలిసిపోయిన కనీసం రెండు ఆదిమ జాతులు మన ఆవిర్భావానికి మూలం. ఆఫ్రికాలో పలు ప్రాంతాల్లో నివసిస్తున్న వారి జన్యు డేటాను లోతుగా పరిశోధించిన మీదట ఈ నిర్ణయానికి వచ్చాం'' అని అధ్యయనంలో పాల్గొన్న పరిశోధకులు చెబుతున్నారు. దీని వివరాలను జర్నల్ నేచర్‌లో ప్రచురించారు. ''మన ఆవిర్భావానికి కారకుడైన ఆదిమ మానవులు ఒకే జాతికి చెందిన వారని మానవ వికాసంపై దశాబ్దాలుగా జరిగిన పరిశోధనల్లో చాలావరకు చెప్పుకొచ్చాయి. వారు ఆఫ్రికాలో తొలుత చెట్లపై నివసించి, అనంతరం క్రమంగా నేల మీదికి దిగారన్నది వాటి సారాంశం. కానీ ఆఫ్రికావ్యాప్తంగా మానవ ఆవాసాలకు సంబంధించిన శిలాజ, పురాతత్వ రికార్డులు ఈ వాదనతో సరిపోలడం లేదు. ఆఫ్రికాలో పలు ప్రాంతాల్లో సంచరించిన ఒకటికి మించిన ఆదిమ జాతులు వేలాది ఏళ్లపాటు పరస్పర వలసలు తదితరాల ద్వారా కలగలిసిపోయి క్రమంగా ఆధునిక మానవుని ఆవిర్భావానికి దారితీశాయన్నది మా పరిశోధనలో తేలింది. హేతుబద్ధంగా ఆలోచించినా 'ఒకే మూలం' సిద్ధాంతం కంటే ఇదే సమంజసంగా తోస్తోంది కూడా'' అని పరిశోధనకు నేతృత్వం వహించిన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా జెనెటిసిస్ట్ డాక్టర్ బ్రెన్నా హెన్ వివరించారు.

ఇలా చేశారు...

డాక్టర్ హెన్ సారథ్యంలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశల్లోని ప్రఖ్యాత సంస్థలకు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనంలో పాలుపంచుకున్నారు. ఆఫ్రికాలోని పలు ప్రాంతాలకు చెందిన 290 మంది జన్యు అమరికను వారు లోతుగా విశ్లేషించారు. దాంతోపాటు ఆఫ్రికాలో ఉన్న భిన్న జాతుల వారి డీఎన్ఏను ఇందుకు ఎంచుకున్నారు. పశ్చిమ ఆఫ్రికాలో సియెరా లియోన్‌లో నివసించే మెండే రైతు జాతి, ఇథియోపియాలో ఆదిమ వేటగాళ్ల నుంచి రూపాంతరం చెందిన గుముజ్ జాతి, అమ్హరాగా పిలిచే అక్కడి రైతులతో పాటు నమా అనే దక్షిణాఫ్రికాలోని వేటగాళ్ల సంతతి నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించారు. వాటిలోని వైవిధ్యాన్ని బట్టి లక్షల ఏళ్ల క్రితం ఆ డీఎన్ఏలు ఎలా ఉండేవో, ఇన్నేళ్ల పరిణామక్రమంలో ఏ విధంగా మారుతూ వచ్చాయో అత్యాధునిక సాఫ్ట్‌వేర్ ఆధారంగా సిమ్యులేషన్ విధానంలో ఆవిష్కరిస్తూ వచ్చారు. ఇప్పటిదాకా లభించిన అతి పురాతన మానవ శిలాజం (3 లక్షల ఏళ్ల నాటిది) ఆఫ్రికాకు చెందినదే. అంతేగాక అతి పురాతన రాతి పనిముట్లు కూడా అక్కడే దొరికాయి. ప్రధానంగా ఈ రెండింటి ఆధారంగానే ఆఫ్రికానే మన జన్మస్థానమని గత అధ్యయనాల్లో చాలావరకు నిర్ధారణకు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆఫ్రికావాసుల డీఎన్ఏను బ్రిటిష్ వారి డీఎన్ఏతోనూ, క్రొయేషియాలో దొరికిన దాదాపు 50 వేల ఏళ్ల నాటి మన పూర్వీకుడైన నియాండర్తల్ మానవుని డీఎన్ఏతోనూ పోల్చి చూశారు. ఆఫ్రికావ్యాప్తంగా ఒకటికి మించిన ఆదిమ జాతులు వేల ఏళ్ల క్రమంలో తమలో తాము కలిసిపోయిన ఫలితంగానే మనం పుట్టుకొచ్చామని తేల్చారు. కనీసం రెండు ప్రధాన ఆదిమ జాతులు మన ఆవిర్భావానికి మూల కారకులని డాక్టర్ హెన్ సూత్రీకరించారు. వాటికి స్టెమ్1, స్టెమ్2గా పేరు పెట్టారు.

ఆ ఆధారాలే ఉంటేనా...!

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న మనుషులందరి మూలాలూ కచ్చితంగా 10 లక్షల ఏళ్ల నాటి ఈ రెండు ఆదిమ జాతుల్లోనే ఉన్నట్టు కచ్చితంగా చెప్పగలమని బృందం సభ్యుడైన విస్కాన్సిన్–మాడిసన్ వర్సిటీ పాపులేషన్ జెనెటిసిస్ట్ ఆరన్ రాగ్స్‌డేల్ అంటున్నారు. ఎలా చూసినా మనందరి జన్మస్థానం ఆఫ్రికాలోని ఒకే ప్రాంతమన్న వాదనకు కాలం చెల్లినట్టేనని ఆయన చెప్పుకొచ్చారు. ''కాకపోతే 10 లక్షల ఏళ్ల నాటి మానవ శిలాజ తదితర జన్యు ఆధారాలేవీ ఇప్పటి దాకా మనకు దొరకలేదు. లేదంటే ఆధునిక మానవుని (హోమోసెపియన్స్) ఆవిర్భావం, విస్తరణ తదితరాలపై ఈ పాటికే మరింత స్పష్టత వచ్చేది'' అన్నారాయన.

రూ.2 కోట్ల భారీ నష్టపరిహారం

రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉద్యోగి కుటుంబానికి ట్రిబ్యునల్‌లో ఊరట

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగి కుటుంబానికి రూ.2 కోట్లకు పైగా నష్టపరిహారం ఇవ్వాలని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీకి ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. మనీష్ గౌతమ్ అనే ప్రభుత్వ ఉద్యోగి ఢిల్లీలోని రోహిణి మార్గ్‌లో 2019 మే 31న రోడ్డు పక్కన నడుస్తుండగా వేగంగా వచ్చిన కారు ఢీ కొంది. ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలైన గౌతమ్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ ఆ మర్నాడు జూన్ 1న మరణించారు. అయితే బాధితుడు నిర్లక్ష్యంగా ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, అందుకే నష్టపరిహారం ఇవ్వాల్సిన పని లేదని ఇన్సూరెన్స్ కంపెనీ చేసిన వాదనలను ట్రిబ్యునల్ న్యాయమూర్తి తోసిపుచ్చారు. గౌతమ్ కుటుంబ సభ్యులకు 2 కోట్ల 50 వేల రూపాయలు చెల్లించాల్సిందేనని ఆదేశించారు.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురు దుర్మరణం

కన్సాస్ సిటీ: అమెరికాలో మిస్సోరి రాష్ట్రం కాన్సాస్‌లో ఆదివారం జరిగిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఇండియానా అవెన్యూలోని క్లైమాక్స్ లాంజ్ వద్ద జరిగిన ఈ ఘోరంలో మరణించిన వారి వివరాలు, కాల్పులకు కారణాలను అధికారులు వెల్లడించలేదు. దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు.

ఐరాసను సంస్కరించాల్సిందే

నేటి అవసరాలను తీర్చేలా లేదు: మోదీ

- జీ-7 సదస్సులో ప్రధాని వ్యాఖ్యలు
- ఇతరుల సార్వభౌమత్వాన్ని గౌరవించాలి
- అంతర్జాతీయ వేదికపై చైనాకు చురకలు



మోదీ, సునాక్ ఆత్మీయ పలకరింపు

హిరోషిమా: ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలను నేటి వాస్తవాలకు అద్దం పట్టేలా, అవసరాలను తీర్చేలా తక్షణం సంస్కరించుకోవాల్సిన అవసరముందని ప్రధాని నరేంద్ర మోదీ కుండబద్దలు కొట్టారు. లేదంటే ఐరాస, భద్రతా మండలి వంటివి కేవలం నామమాత్రపు చర్చా వేదికలుగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. ఆదివారం జపాన్‌లోని హిరోషిమాలో జీ-7 సదస్సునుద్దేశించి ఆయన మాట్లాడారు. ''ప్రపంచ శాంతే ప్రధాన లక్ష్యంగా స్థాపించుకున్న ఐరాస యుద్ధాలు, సంక్షోభాలను ఎందుకు నివారించలేకపోతోంది? శాంతి గురించి పలు ఇతర వేదికలపై చర్చించుకోవాల్సిన అవసరం ఎందుకు తలెత్తుతోంది? ఉగ్రవాదపు నిర్వచనాన్ని కూడా ఐరాస ఎందుకు అంగీకరించడం లేదు? ఆలోచిస్తే తేలేదొక్కటే. ఐరాస ప్రస్తుత ప్రపంచపు వాస్తవాలకు అనుగుణంగా లేదు. గత శతాబ్దానికి చెందిన ఇలాంటి అంతర్జాతీయ సంస్థలు 21వ శతాబ్దపు అవసరాలను తీర్చలేకపోతున్నాయి. ఇవన్నీ చాలా సీరియస్‌గా దృష్టి సారించాల్సిన విషయాలు'' అని అభిప్రాయపడ్డారు. ఉక్రెయిన్ యుద్ధం మానవతకు సంబంధించిన సంక్షోభమని మోదీ పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ చట్టాలను, దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను అందరూ గౌరవించాలని రష్యా, చైనాలను ఉనుద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి విషయాల్లో యథాతథ స్థితిని మార్చేందుకు జరిగే ఏకపక్ష ప్రయత్నాలపై దేశాలన్నీ ఉమ్మడిగా గళమెత్తాలని పిలుపునిచ్చారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి దిగడం, లద్దాఖ్ దురాక్రమణకు కొన్నేళ్లుగా చైనా చేస్తున్న యత్నాల నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యుద్ధాన్ని ఆపేందుకు భారత్ సాధ్యమైన ప్రయత్నాలన్నీ చేస్తుందని హామీ ఇచ్చారు. దీనికి చర్చలు, రాయబారమే ఏకైక పరిష్కారమని తాము ముందునుంచీ చెబుతున్నామని గుర్తు చేశారు. నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకూ బుద్ధుని బోధల్లో చక్కని పరిష్కారాలున్నాయన్నారు. హిరోషిమా పార్కులోని స్మారక మ్యూజియాన్ని దేశాధినేతలతో కలిసి మోదీ సందర్శించారు. అణుబాంబు దాడి మృతులకు నివాళులర్పించారు.

మీకు మహా డిమాండ్!

మోదీతో బైడెన్, అల్బనీస్ వ్యాఖ్యలు

- **మీ ఆటోగ్రాఫ్ అడగాలేమో: బైడెన్**



పపువా న్యూ గినియాలో మోదీకి నమస్కరిస్తున్న ప్రధాని జేమ్స్ మరాపే

జీ-7 సదస్సులో భాగంగా జరిగిన క్వాడ్ దేశాధినేతల భేటీలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రధాని మోదీ దగ్గరికి వచ్చి మరీ ఆత్మీయంగా ఆలింగనంచేసుకుని ముచ్చటించడం తెలిసిందే. మోదీ విషయమై తమకెదురవుతున్న గమ్మత్తైన ఇబ్బందిని ఈ సందర్భంగా బైడెన్ ఆయన దృష్టికి తెచ్చారట. వచ్చే నెల మోదీ వాషింగ్టన్‌లో పర్యటించనుండటం తెలిసిందే. ఆ సందర్భంగా మోదీ పాల్గొనే పలు కార్యక్రమాల్లో ఎలాగైనా ఆయనతో భేటీ ఏర్పాటు చేయించాల్సిందిగా అమెరికా ప్రముఖుల నుంచి లెక్కలేనన్ని 'రిక్వెస్టులు' వచ్చిపడుతున్నాయట! వాటిని తట్టుకోవడం తమవల్ల కావడం లేదని బైడెన్ చెప్పుకొచ్చారు. భేటీలో ఉన్న ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ కూడా తామూ అచ్చం అలాంటి 'సమస్యే' ఎదుర్కొంటున్నామంటూ వాపో యారు! మోదీ మంగళవారం ఆస్ట్రేలియా రాజధాని సిడ్నీలో 20 వేల మంది సామర్థ్యమున్న స్టేడియంలో ఓ కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. దానికి టికెట్లు కావాలని లెక్కకు మించిన డిమాండ్లు, రిక్వెస్టులు వచ్చి పడుతున్నాయని అల్బనీస్ చెప్పుకొచ్చారు. ఇటీవలి భారత్ పర్యటన సందర్భంగా గుజరాత్‌లో 90 వేల మంది సామర్థ్యంతో కిక్కిరిసిన స్టేడియంలో తామిద్దరం ఎలా ప్రజలకు అభివాదం చేసిందీ గుర్తు చేసుకున్నారు. దాంతో బైడెన్ స్పందిస్తూ బహుశా తాను మోదీ ఆటోగ్రాఫ్ తీసుకోవాలేమో అంటూ చమత్కరించారు! గత మార్చిలో భారత్–ఆస్ట్రేలియా టెస్ట్ మ్యాచ్‌ను మోదీ, అల్బనీస్ ప్రారంభించడం తెలిసిందే.



పార్లమెంటు 2.0

సర్వాంగ సుందరంగా కొత్త భవనం

28న ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంటు కొత్త భవనం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. త్రిభుజాకృతిలో నిర్మించిన ఈ భవనం దేశ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతూనే ఆధునిక హంగుల కలబోతగా కూడా నిలిచింది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 28 ఆదివారం కొత్త భవనాన్ని ప్రారంభించనున్నారు. వందేళ్ల నాటి పాత పార్లమెంటు భవనం నేటి అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో కొత్త భవన నిర్మాణం అవసరమైంది. సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా కొత్త భవనాన్ని టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కేవలం రెండున్నరేళ్లలో నిర్మించింది. ఆర్కిటెక్ట్ బిమల్ పటేల్ నేతృత్వంలో నిర్మాణం సాగింది. ప్రస్తుతం పార్లమెంటు పక్కనే నిర్మించిన కొత్త భవనంలో అతి పెద్ద హాళ్లు, కమిటీ రూములు, సెంట్రల్ హాలు, అతి పెద్ద లైబ్రరీ, విశాలమైన పార్కింగ్ వంటి సదుపాయాలన్నీ ఉన్నాయి.


- రూ.20 వేల కోట్లతో కూడిన సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా రూ.970 కోట్లతో పార్లమెంటు భవనాన్ని నిర్మించారు.
- లోక్‌సభ హాలును జాతీయ పక్షి నెమలి థీమ్‌తో నిర్మించారు. 888 మంది సభ్యులు కూర్చోవచ్చు. సభ్యుల సంఖ్య పెరిగినా ఇబ్బంది లేకుండా ప్రస్తుత లోక్‌సభ హాలు కంటే మూడు రెట్లు పెద్దగా రూపొందించారు. పార్లమెంటు సంయుక్త సమావేశాలకు కూడా చక్కగా సరిపోతుంది. 1,272 మంది సందర్శకులు సమావేశాలను తిలకించవచ్చు.
- రాజ్యసభ హాలును జాతీయ పుష్పం తామర థీమ్‌తో నిర్మించారు. 384 మంది సభ్యులు కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లున్నాయి.
- పార్లమెంటు భవన మూడు ప్రధాన ద్వారాలకు జ్ఞాన, శక్తి, కర్మ ద్వారాలని పేర్లు పెట్టారు. వీఐపీలు, ఎంపీలు, సందర్శకులకు మరో మూడు ప్రవేశ ద్వారాలున్నాయి.
- అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో 150 ఏళ్ల పాటు చెక్కు చెదరకుండా ఉండేలా భవన డిజైన్‌ను అహ్మదాబాద్‌కు చెందిన హెచ్‌సీపీ డిజైన్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్ రూపొందించింది. ఇది భూకంపాల్ని కూడా తట్టుకుంటుంది.
- రాజస్తాన్‌కు చెందిన ధోల్‌పూర్ రాళ్లతో భవనానికి అద్భుతమైన లుక్ వచ్చింది.
- పార్లమెంటు భవనంలోని ఇంటీరియర్స్ భారత సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా, భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తుకు తెచ్చేలా పలు ప్రాంతీయ కళా రూపాలతో రూపొందాయి.
- భవన నిర్మాణంలో అడుగడుగునా పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేశారు. గ్రీన్ ఎనర్జీతో 30% దాకా విద్యుత్ ఆదా అవుతుంది. అత్యాధునిక టెక్నాలజీ వాడటంతో భవన నిర్వహణ ఖర్చులో ఏడాదికి రూ.1,000 కోట్లకు పైగా ఆదా అవుతుందట.
- పార్లమెంటు భవనం పైకప్పు మీద కాంస్యంతో తయారు చేసిన మన జాతీయ చిహ్నం నాలుగు సింహాలను ఏర్పాటు చేశారు. ఇది 9,500 కిలోల బరువుతో 6.5 మీటర్ల ఎత్తుంది.
- భవన నిర్మాణంలో ప్రత్యక్షంగా 2 వేల మంది కార్మికులు, పరోక్షంగా 9 వేల మంది, వివిధ రాష్ట్రాలకు చెందిన 200 మంది కళాకారులు పాలుపంచుకున్నారు.
- ఆవరణలో రెండు మర్రి చెట్లు నాటారు.
- దివ్యాంగులకు అనుకూలంగా, వారు స్వేచ్ఛగా తిరిగేలా నిర్మాణం జరిగింది.
- భవనం గోడలపై పలు శ్లోకాలను రాశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

చరిత్రలోకి తొంగి చూస్తే..

ప్రస్తుత పార్లమెంటు భవనం బ్రిటిష్ కాలం నాటిది. న్యూఢిల్లీ నగర రూపకర్తలైన ఎడ్విన్ ల్యూటెన్స్, హెర్బర్ట్ బేకర్ దీన్ని డిజైన్ చేశారు. 1921 నుంచి ఆరేళ్ల పాటు భవన నిర్మాణం సాగింది. ఈ వృత్తాకార భవనానికి 83 లక్షలు ఖర్చు అయింది. 1927 జనవరి 18న గవర్నర్ జనరల్ లార్డ్ ఇర్విన్ దీన్ని ప్రారంభించారు. దీన్ని మ్యూజియంగా మార్చనున్నారు.





ఎందుకీ నిర్మాణం?

ప్రస్తుత పార్లమెంటు భవనం అవసరాలు తీర్చేలా లేదు. నియోజకవర్గాల పునర్విభజన జరిగి సభ్యుల సంఖ్య పెరిగితే సరిపోదు. మంత్రులు, మీటింగ్ హాల్స్ కొరత ఉంది. భవనంలో మార్పులు చేర్పులు చేస్తే నిర్మాణం దెబ్బతినే ప్రమాదముంది. దానికి భూకంపాల్ని తట్టుకునే సామర్థ్యం లేదు. ఢిల్లీ ఏమో అత్యంత ప్రమాదకరమైన భూకంప జోన్-4లో ఉంది. అగ్నిప్రమాదాలను ఎదుర్కొనే ఆధునిక సౌకర్యాలూ లేవు.

రాష్ట్రపతి ప్రారంభించాలి: రాహుల్

న్యూఢిల్లీ: పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవంపై రాజకీయ రగడ మొదలైంది. భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలే తప్ప ప్రధాని కాదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. ప్రధాని ప్రారంభించడం రాజ్యాంగపరంగా సరైంది కాదంటూ కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ కూడా ట్వీట్లు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 79 ప్రకారం లోక్‌సభ, రాజ్యసభలతో కూడిన పార్లమెంటుకు రాష్ట్రపతే అధిపతి గనుక నూతన భవనాన్ని ఆయనే ప్రారంభించాలన్నారు. ఆర్జేడీ, ఎంఐఎం కూడా ప్రధాని ప్రారంభించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. అంతేగాక హిందూత్వవాది వి.డి. సావర్కర్ జయంతి నాడే (ఈ నెల 28న) ప్రారంభోత్సవం జరపనుండటాన్నీ విపక్షాలు తీవ్రం ఆక్షేపిస్తున్నాయి.

రక్షణ వలయంలో శ్రీనగర్

శ్రీనగర్: శ్రీనగర్‌లో నేటి నుంచి జీ–20 టూరిజం వర్కింగ్ గ్రూప్ మూడో సమావేశాలు మొదలవుతున్న విషయం తెలిసిందే. ఉగ్ర బెడద నేపథ్యంలో భద్రతా బలగాలు అత్యంత అప్రమత్తత ప్రకటించాయి. నేషనల్ సెక్యూరిటీ గ్రూప్(ఎన్ఎస్‌జీ) కౌంటర్ డ్రోన్ బృందాలు గగనతలంపై కన్నేసి ఉంచాయి. సుందర దాల్ సరస్సుపై నేవీ మెరైన్ కమాండోలు గస్తీ చేపట్టారు. పలు కీలక ప్రాంతాల్లో భారీగా మోహరింపులు, తనిఖీలు ముమ్మరమయ్యాయి. వివిధ దేశాల నుంచి హాజరయ్యే 60 మంది ప్రతినిధులు, 20 మంది జర్నలిస్టుల కోసం సమావేశాల వేదికైన షేర్–ఇ–కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(ఎస్కేఐసీసీ) వద్ద యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆర్టికల్ 370 రద్దు, కశ్మీర్‌ను జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అనే కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించాక జరుగుతున్న మొట్టమొదటి అంతర్జాతీయ సమావేశమిది. దీంతో, సమావేశ వేదికతోపాటు, వారు బస చేసే ప్రాంతం, ఆ పక్కనే ఉన్న జబర్వాన్ పర్వతశ్రేణిపై ఆర్మీ బలగాలను రంగంలోకి దించారు. ఉగ్రమూకలు ఐఈడీలతో విధ్వంసానికి పాల్పడే అవకాశముందన్న హెచ్చరికల నేపథ్యంలో సోదాలు ముమ్మరం చేశారు. పాక్ కేంద్రంగా పనిచేసే జైషెమొహ్మద్‌కు చెందిన ఓ వ్యక్తిని ఆదివారం కుప్వారా జిల్లాలో సోదాల సమయంలో బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. సైన్యం కదలికల సమాచారాన్ని అతడు పాక్‌కు చేరవేస్తున్నట్లు గుర్తించారు. పూంఛ్‌లో సరిహద్దులకు సమీపంలో మెంధార్ సెక్టార్ వద్ద అనుమానాస్పద కదలికలతో బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని సమాచారం. ఆ చుట్టుపక్కల అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టాయి. సోదాలు పూర్తయ్యేదాకా ఎవరూ ఇల్లు వదిలి బయటకు రావద్దని ప్రజలను అధికారులు కోరారు.

రూ.31.67 కోట్ల అంబర్‌గ్రిస్ స్వాధీనం

న్యూఢిల్లీ: డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు తమిళనాడులోని ట్యుటికోరన్‌లో అత్యంత ఖరీదైన అంబర్‌గ్రిస్(తిమింగలం వాంతి)ని పట్టుకున్నారు. ట్యుటికోరన్‌లోని హార్బర్ బీచ్ ఏరియా నుంచి శ్రీలంకకు ఓ ముఠా అంబర్‌గ్రిస్‌ను తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అధికారులు సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ వాహనంలో తరలిస్తున్న 18.1కిలోల బరువైన అంబర్ గ్రిస్ సంచీ దొరికింది. ఇందుకు సంబంధించి తమిళనాడు, కేరళలకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనమైన అంబర్‌గ్రిస్ విలువ రూ.31.67 కోట్లని అంచనా. సుగంధ ద్రవ్యాల తయారీలో వాడే అంబర్‌గ్రిస్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువ గిరాకీ ఉంది. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం స్పెర్మ్ వేల్ ఉత్పత్తుల ఎగుమతి, రవాణాలపై నిషేధం ఉంది. గత రెండేళ్లలో ట్యుటికోరన్ తీరంలో స్మగ్లర్ల నుంచి రూ.54 కోట్ల విలువైన 40.52 కిలోల అంబర్‌గ్రిస్‌ను పట్టుకున్నట్లు డీఆర్ఐ తెలిపింది.

కేంద్రంతో వివాదంలో మా మద్దతు మీకే

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో బిహార్ సీఎం నితీశ్ మంతనాలు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ప్రభుత్వాధికారుల అజమాయిషీ విషయంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని జేడీయూ నేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్ భరోసా ఇచ్చారు. ఆదివారం నితీశ్ ఢిల్లీలో కేజ్రీవాల్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఆయన వెంట బిహార్ డిప్యూటీ సీఎం, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కూడా ఉన్నారు. ఢిల్లీలోని ప్రభుత్వాధికారులపై అజమాయిషీ రాష్ట్ర ప్రభుత్వానిదేనంటూ ఈనెల 11న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం, ఆ తీర్పును పూర్వపక్షం చేసేలా కేంద్రం శుక్రవారం ఆర్డినెన్స్ జారీ చేయడం తెలిసిందే. నితీశ్‌తో చర్చల అనంతరం సీఎం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. ఆర్డినెన్స్ స్థానంలో కేంద్రం ప్రవేశపెట్టే బిల్లును రాజ్యసభలో తిప్పికొట్టేందుకు మద్దతివ్వాలంటూ అన్ని ప్రతిపక్ష పార్టీల నేతలను కలిసి కోరుతానన్నారు. రెండు, మూడు రోజుల్లో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌లను కలుస్తానన్నారు. ప్రతిపక్ష పార్టీలతో మాట్లాడాలంటూ నితీశ్ కుమార్‌కు కూడా విజ్ఞప్తి చేశానన్నారు.



ఇదేమిటో గుర్తు పట్టారా? తొలి ప్రయాణమే తుది ప్రయాణంగా మారి 1,500కు పైగా ప్రాణాలను బలిగొన్న టైటానిక్. వందేళ్లుగా సముద్ర గర్భంలో దాదాపు 4 కిలోమీటర్ల లోతులో ఉంది. దాని శిథిలావస్థను అత్యంత స్పష్టంగా, పూర్తి స్థాయిలో కళ్లకు కట్టిన తాజా ఫొటో ఇది...

బెంగళూరులో ఆకస్మిక వరదలు

తెలుగు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం



అండర్‌పాస్‌లో మునిగిన కారు. (ఇన్‌సెట్లో) ఆస్పత్రిలో సీఎం సిద్ధరామయ్య పరామర్శ

యశవంతపుర/ఉంగుటూరు(గన్నవరం): కర్ణాటక రాజధాని బెంగళూరులో ఆదివారం సాయంత్రం గంటకు పైగా భారీ వర్షం కురిసింది. ఓ కారు వరద నీటిలో చిక్కుకుని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 22 ఏళ్ల తెలుగు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భానురేఖా రెడ్డి దుర్మరణం పాలయ్యారు. కుటుంబసభ్యులతో కలిసి ఆమె వెళ్తున్న ట్యాక్సీ కేఆర్ సర్కిల్ అండర్ పాస్‌లో భారీగా నిలిచిన వరద నీటిలో చిక్కింది. నీరు పెరిగి కారును ముంచెత్తింది. కారును బయటకు తీసి డ్రైవర్, మరో నలుగురిని ఆస్పత్రికి తరలించారు. భాను అప్పటికే చనిపోయింది. సీఎం సిద్ధరామయ్య ఆస్పత్రిని సందర్శించి బాధితులను ఓదార్చారు. రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు.

డీఎస్పీపై సస్పెన్షన్ వేటు

సాక్షి, చెన్నై : చెంగల్పట్టులో ఇటీవల కల్తీ సారా తాగి ఎనిమిది మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఆ జిల్లా ఎస్పీ, ఎక్సైజ్ అధికారులు, పోలీసులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో తాజాగా మధురాంతకం డీఎస్పీ మేఘమలైను వీఆర్‌కు పంపించారు. ఈ పోస్టులో దిండుగల్ డీఎస్పీ శివశక్తిని నియమించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అధికారుల్లో కలవరం మొదలైంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని కొందరు అధికారులు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

న్యూస్‌రీల్

గ్రీన్ సిటీ లక్ష్యంగా మొక్కల పెంపకం



చెత్తతొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు సుబ్రమణియన్, మెయ్యనాథన్

సాక్షి,చెన్నై : నగరాలను పచ్చదనంతో ముంచెత్తడమే లక్ష్యంగా ప్రభుత్వం మొక్కల పెంపకాన్ని విస్తృతం చేస్తోందని ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ తెలిపారు. చెన్నైలోని బీసెంట్ నగర్, మెరీనా బీచ్‌లలో చెత్త తొలగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. మంత్రులు ఎం. సుబ్రమణియన్, మెయ్యనాథన్ జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వచ్ఛంద సంఘాలు, సేవలకు, విద్యార్థులతో కలిసి సముద్ర తీరంలోని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా మంత్రి సుబ్రమణియన్ మీడియాతో మాట్లాడుతూ, ఒక్క రోజులో చెత్త తొలగించడం అసాధ్యమని పేర్కొన్నారు. అయితే ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రజలు బీచ్‌లకు వచ్చే సమయాలలో ప్లాస్టిక్ వస్తువులను దూరంగా ఉంచాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. సముద్ర తీరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని, ప్రజలు దీనిని గుర్తెరిగి ముందుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో చెన్నై కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్, పర్యావరణ శాఖ కార్యదర్శి సుప్రియా సాహూ పాల్గొన్నారు. ఇక పుదుచ్చేరిలో సముద్రతీరంలో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ ప్రారంభించారు.

టాస్మాక్ బార్‌లో మద్యం తాగి ఇద్దరి మృతి

సాక్షి, చెన్నై: టాస్మాక్ బార్‌లో మద్యం తాగి ఇద్దరు కార్మికులు ఆదివారం మరణించారు. వివరాలు.. తంజావూరు జిల్లా కీర అలంగం గ్రామం చేపల మార్కెట్ వద్ద టాస్మాక్ మద్యం దుకాణం ఉంది. సాధారణంగా మద్యం దుకాణాలు మధ్యాహ్నం 12 గంటలకు తెరుచుకుంటాయి. అయితే, ఈ దుకాణాలకు అనుబంధంగా ఉన్న టాస్మాక్ బార్లలో మాత్రం నిత్యం యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో స్థానిక చేపల మార్కెట్ కార్మికులు కుప్పుస్వామి, వివేక్ ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో మద్యం తాగారు. ఆ బార్ నుంచి బయటకు రాగానే నురగలు కక్కుతూ కిందపడ్డారు. స్థానికులు వీరిని ఆసుపత్రికి తరలించారు. అయితే వారు అప్పటికే మరణించారు. కల్తీ మద్యం కారణంగా ఇద్దరు మరణించినట్లు తెలియడంతో చేపల మార్కెట్ కార్మికులు టాస్మాక్ బార్‌పై తమ ప్రతాపం చూపించారు. 12 గంటల సమయంలో దుకాణం తెరిచేందుకు వచ్చిన టాస్మాక్ సిబ్బందిపై దాడి చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. టాస్మాక్ బార్ సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రంలో కల్తీ సారా మరణాలు వివాదాన్ని రేపిన నేపథ్యంలో తాజాగా టాస్మాక్ బార్‌లో మద్యం తాగి ఇద్దరు మరణించడం కలకలం రేపింది.

రాజీవ్‌కు ఘన నివాళి

– త్యాగభూమికి జ్యోతి యాత్ర



ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నేతలు అళగిరి, చిరంజీవి, సెల్వ పెరుంతొగై

సాక్షి, చెన్నై: దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ వర్గాలు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు నివాళులర్పించారు. టీఎన్‌సీసీ నేతృత్వంలో శ్రీపెరంబదూరులోని త్యాగభూమిగా పిలవబడే రాజీవ్ స్మృతి వనంలో నేతలు అంజలి ఘటించారు. అనంతరం రాజీవ్ జ్యోతి యాత్రను నిర్వహించారు. వివరాలు.. రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేందుకు టీఎన్‌సీసీ వర్గాలు ఏర్పాట్లు చేశాయి. కాంచీపురం జిల్లా శ్రీపెరంబదూరులోని రాజీవ్ స్మృతివనానికి ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ రావాల్సిన నేపథ్యంలో చివరి క్షణంలో పర్యటన రద్దయ్యింది. దీంతో టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి నేతృత్వంలో త్యాగభూమిలో కార్యక్రమాలు జరిగాయి. ఉదయాన్నే పెద్దఎత్తున కాంగ్రెస్ వర్గాలు రాజీవ్ స్మృతివనానికి చేరుకున్నారు. అక్కడి పుష్పాంజలి ఘటించారు. రాజవ్ జ్యోతి యాత్రతో ముందుకెళ్లారు. ఎంపీలు తిరునావుక్కరసర్, విజయ్ వసంత్, కాంగ్రెస్‌శాసన సభా పక్ష నేత సెల్వ పెరుంతొగై, నేతలు తంగబాలు, చిరంజీవి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే టీఎన్‌సీసీ కార్యాలయంలోనూ రాహుల్ చిత్ర పటానికి నేతలు అంజలి ఘటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ కార్యాలయాల్లోనూ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే శాంతి, సామరస్యాలను చాటే విధంగా నేతలు ప్రతిజ్ఞ చేశారు.

తెరపైకి డిప్యూటీ సీఎం పదవి

రాష్ట్ర కేబినెట్‌లోని ఇద్దరు మంత్రులు ఉప ముఖ్యమంత్రులు అయ్యే అవకాశం కనిపిస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఇందుకోసం సీనియర్ మంత్రి దురై మురుగన్, సీఎం స్టాలిన్ వారసుడు ఉదయ నిధి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై ఆదివారం నిర్వహించిన డీఎంకే ఉన్నత స్థాయి కమిటీలో సుదీర్ఘ చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అలాగే దివంగత డీఎంకే అధినేత కరుణానిధి శత జయంతి ఉత్సవాలను ఏడాది పొడవునా నిర్వహించాలని అందులో నిర్ణయించారు.

- ఇద్దరికి అవకాశం
- పరిశీలనలో దురై మురుగన్, ఉదయనిధి పేర్లు
- డీఎంకే ఉన్నత స్థాయి భేటీలో చర్చ
- జూన్ 3న చెన్నైలో భారీ బహిరంగ సభ
- జూన్ 20న తిరువారూర్‌లో కరుణ కోట్టం ప్రారంభోత్సవం
- హాజరుకానున్న బిహార్ సీఎం నితీష్‌కుమార్



డీఎంకే ఉన్నత స్థాయి సమావేశంలో సీఎం స్టాలిన్, దురై మురుగన్, నెహ్రూ, కనిమొళి తదితరులు

సాక్షి, చెన్నై: డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కాగానే మంత్రివర్గంలో సీఎం స్టాలిన్ కీలక మార్పులు చేశారు. అలాగే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల బదిలీలు కూడా పెద్దఎత్తున చేపట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కేబినెట్‌లోని ఇద్దరు మంత్రులకు డిప్యూటీ సీఎంలుగా పదోన్నతి కల్పించాలని సీఎం స్టాలిన్ నిర్ణయించినట్లు సమాచారం. పెట్టుబడుల మహానాడు నేపథ్యంలో తాను ఇక, తరచూ విదేశీ టూర్లకు వెళ్లాల్సిన అవసరం ఉంది. దీంతో తన ప్రతినిధులుగా డిప్యూటీ సీఎంల ద్వారా రాష్ట్ర పరిపాలనా వ్యవహారాలు సాగించే విధంగా సీఎం స్టాలిన్ కార్యాచరణలో ఉన్నట్లు సమాచారం. ఇదే అదనుగా తన వారసుడు ఉదయ నిధిని అందలం ఎక్కించేందుకు వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. కేవలం తన వారసుడికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తే సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేసే అవకాశం ఉండడంతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా సీనియర్ మంత్రి దురై మురుగన్‌ను సైతం అందలం ఎక్కించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఆదివారం నిర్వహించిన డీఎంకే ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం పదవులపై సుదీర్ఘంగా చర్చించారు. సీఎం నిర్ణయానికి సమావేశంలోని వారంతా ముక్త కంఠంతో ఆమోద ముద్ర వేసినట్టు తెలుస్తోంది. ఈ దృష్ట్యా, మరికొద్ది రోజుల్లో దురై మురుగన్, ఉదయనిధి స్టాలిన్‌లు డిప్యూటీ సీఎంలుగా బాధ్యతలు స్వీకరించే అవకాశం కనిపిస్తోంది.

ఏడాది పొడవునా కరుణ శత జయంతి ఉత్సవాలు

డీఎంకే ఉన్నత స్థాయి కమిటీ సమావేశం ఆదివారం ఉదయం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగింది. ఇందులో సీఎం స్టాలిన్‌తో పాటు పార్టీ సీనియర్లు దురై మురుగన్, టీఆర్ బాలు, కేఎన్ నెహ్రూ, టీకేఎస్ ఇళంగోవన్, ఆర్ఎస్ భారతీ, కనిమొళి, ఐ. పెరియ స్వామి, తిరుచ్చి శివ, దయానిధిమారన్, ఎంఆర్‌కే పన్నీరు సెల్వం పొన్ముడి, ఎ. రాజ, వెల్లకోవిల్ స్వామినాథన్, వేలు తదితరులు పాల్గొన్నారు. ఇందులో డిప్యూటీ సీఎం పదవీ విషయంపై సుదీర్ఘ చర్చ జరిగినట్టు , చివరకు తుది నిర్ణయం స్టాలిన్‌కు ఉన్నత స్థాయి కమిటీ అప్పగించినట్లు సమాచారం. ఇక, కరుణానిధి శత జయంతి ఉత్సవాల గురించి చర్చించి కొన్ని తీర్మానాలు చేశారు. కరుణ శత జయంతి వేడుకలను ఏడాది పొడవునా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఉత్సవాలకు జూన్ 3న శ్రీకారం చుట్టనున్నారు. భవిష్యత్ తరాలకు సైతం కరుణానిధి సేవలు గుర్తు చేసే విధంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు.

23న సింగపూర్ పర్యటన

ఈనెల 23వ తేదీన సీఎం, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ సింగపూర్‌కు బయలుదేరనున్నారు. ఈ వివరాలను పరిశ్రమల శాఖ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. జనవరి 2024లో జరిగే పెట్టుబడుల మహానాడు నేపథ్యంలో పెట్టుబడిదారులను ఆకర్షించే విధంగా ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటన ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఆ తదుపరి జపాన్, ఇంగ్లండ్ తదితర దేశాల్లో సీఎం పర్యటిస్తారని వెల్లడించారు.

భారీ బహిరంగ సభ

జూన్ 3వ తేదీన ఉత్తర చెన్నైలో లౌకిక వాద పార్టీల కూటమి నేతృత్వంలో భారీ బహిరంగ సభకు తీర్మానించారు. అలాగే కరుణ జన్మించిన తిరువారూర్‌లో ఏర్పాటు చేసిన కలైంజ్ఞర్ కోట్టంను జూన్ 20వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ వేడుకకు బిహార్ సీఎం నితీష్‌కుమార్ హాజరు కానున్నట్టు ప్రకటించారు. కరుణానిధి జయంతి రోజైన జూన్ 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలకు కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. అలాగే, డీఎంకే ఆవిర్భవించి 75 వసంతాలు కాబోతున్న నేపథ్యంలో పార్టీ జెండాలు వాడవాడల్లో ఎగిరే విధంగా పాత జెండా స్తంభాలను పునరుద్ధరించాలన్నారు. అలాగే కొత్తగా జెండా స్థూపాలను నిర్మించాలని సూచించారు. డీఎంకే కార్యకర్తలందరూ ఒకే కుటుంబం అని చాటే విధంగా 70 ఏళ్లకు పైబడిన పార్టీ సీనియర్లను గౌరవించుకునే విధంగా, విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ చేయాలని తీర్మానించారు. కాగా ఈ సమావేశానంతరం తిరునల్వేలి సెంట్రల్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ వహాబ్‌ను తొలగించి, టీపీఎం మైదీన్ ఖాన్‌ను నియమిస్తున్నట్లు డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ప్రకటించారు.

ఆవిన్ వాటర్

- రోజుకు లక్ష బాటిళ్ల ఉత్పత్తే లక్ష్యం
- అమ్మ వాటర్‌కు మంగళం



ఆవిన్ పార్లర్

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే హయాంలో తీసుకొచ్చిన అమ్మ వాటర్ బాటిల్ పథకానికి డీఎంకే ప్రభుత్వం తాజాగా మంగళం పాడింది. ఈ పథకాన్ని పక్కన పెట్టి ఆవిన్ సంస్థ నేతృత్వంలో వాటర్ బాటిళ్ల తయారీకి చర్యలు తీసుకుంటోంది. రోజుకు లక్ష బాటిళ్ల ఉత్పత్తే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేసింది. వివరాలు.. అన్నాడీఎంకే హయాంలో దివంగత సీఎం జయలలిత పేరిట అమ్మ పథకాలను హోరెత్తించిన విషయం తెలిసిందే. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నేతృత్వంలో అమ్మ వాటర్ బాటిళ్లను ఉత్పత్తి చేశారు. ఇందుకోసం చెన్నై శివారులో ఓ ప్లాంట్‌ను సైతం ఏర్పాటు చేశారు. అన్ని బస్టాండ్‌లు, బస్సులలో ఈ వాటర్ బాటిల్‌ను విక్రయించే విధంగా ప్రత్యేక కౌంటర్ల ద్వారా చర్యలు తీసుకున్నారు. అయితే రాష్ట్రంలో అధికారం మారినానంతరం అమ్మ పథకాలు ఒక్కొక్కటి కనుమరుగు అవుతూ వస్తున్నాయి. తాజాగా అమ్మ వాటర్ బాటిల్ కనుమరుగు అయ్యింది. ఈ స్థానంలో ఆవిన్ వాటర్ బాటిల్‌ను మార్కెట్‌లోకి తెచ్చేందుకు సిద్ధమయ్యారు.

ఆవిన్ నేతృత్వంలో..

రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆవిన్ నేతృత్వంలో పాల ప్యాకెట్లు, పాలతో తయారు అయ్యే పలు రకాల ఉత్పత్తులు సిద్ధం చేస్తున్న విషయం తెలిసిందే. అలాగే స్వీట్లు, శీతల పానీయాలను ఉత్పత్తి చేస్తున్నారు. ఇవన్నీ ఆవిన్ పార్లర్ల ద్వారా, ప్రైవేటు దుకాణాల్లో వీటి విక్రయాలు జరుగుతున్నాయి. తాజాగా, ఆవిన్ వాటర్ బాటిళ్లను సైతం విక్రయించేందుకు రెడీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆవిన్ పాల ఉత్పత్తి కేంద్రాల్లోనూ ఈ వాటర్ బాటిళ్ల తయారీ చేపట్టనున్నారు. ఒక లీటరు, అర లీటరు చొప్పున బాటిళ్లను సిద్ధం చేసి మార్కెట్లోకి పంపించేందుకు కార్యాచరణ సిద్ధమైంది. రోజుకు లక్ష బాటిళ్ల ఉత్పత్తి చేయాలని టార్గెట్ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ఒప్పందాలను కోరుతూ ఆదివారం ఆవిన్ సంస్థ ప్రకటన చేసింది. ఈ ప్రక్రియను త్వరితగతిన ముగించి జూన్‌లో ఆవిన్ బాటిళ్లను మార్కెట్లోకి తెచ్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే..

- నేటి నుంచి గ్రామాల్లో అమలు
- లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఆన్‌లైన్ మయం అయ్యాయి. గ్రామాల్లో సోమవారం నుంచి అన్ని వ్యవహారాలు ఆన్‌లైన్ ద్వారా సాగే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో ప్రభుత్వ పథకాలు, ఇతర వ్యవహారాలు, ఆస్తి తదితర పన్నుల చెల్లింపు, అన్ని రకాల అనుమతుల కోసం లబ్ధిదారులు, ప్రజలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే ప్రక్రియ గతంలో మొదలైన విషయం తెలిసిందే. అయితే గ్రామ పంచాయతీలలో ఈ ప్రక్రియ అమల్లోకి రాలేదు. ప్రస్తుతం రాష్ట్రంలోని 12 వేల గ్రామ పంచాయతీలన్నీ కంప్యూటరీకరణ చేశారు. అన్ని చోట్ల ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను పంచాయతీ రాజ్ శాఖ సిద్ధం చేసింది. దీంతో సోమవారం నుంచి పంచాయతీలలో అన్ని రకాల సేవలు ఆన్‌లైన్ ద్వారానే జరగనున్నాయి. అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు, పన్నుల చెల్లింపు తదితర అన్ని ప్రక్రియలు ఆన్‌లైన్ ద్వారానే చేపట్టనున్నారు. లబ్ధిదారులు కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదని, పథకాలు ఆన్‌లైన్ ద్వారానే పొందొచ్చని అధికారులు వెల్లడించారు. ఈ ప్రక్రియను సీఎం స్టాలిన్ సోమవారం లాంఛనంగా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

మంత్రి సెంథిల్ బాలాజీని డిస్మిస్ చేయండి



గవర్నర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ నేతలు

- గవర్నర్‌కు బీజేపీ నాయకుల విజ్ఞప్తి

సాక్షి, చెన్నై: ఎక్సైజ్, విద్యుత్ శాఖమంత్రి సెంథిల్ బాలాజీని డిస్మిస్ చేయాలని రాష్ట్ర గవర్నర్‌ఆర్ఎన్ రవిని బీజేపీ అధ్యక్షుడు అన్నామలై నేతృత్వంలోని బృందం విజ్ఞప్తి చేసింది. ఆదివారం అన్నామలై నేతృత్వంలో బీజేపీ శాసన సభా పక్ష నేత నయనార్ నాగేం ద్రన్‌తో పాటు బీజేపీ మహిళా మోర్చా నేతలు ఆర్ఎన్ రవిని రాజ్ భవన్‌లో కలిశారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను గవర్నర్‌కు వినతి పత్రం ద్వారా వివరించారు. కల్తీ సారా మరణాలను గుర్తుచేశారు. టాస్మాక్‌లో అధిక ధరలకు మద్యం విక్రయాలను వివరించారు. టాస్మాక్ మద్యం రూపంలో జరుగుతున్న అక్రమార్జనపై ఫిర్యాదు చేశారు. గవర్నర్‌ను కలిసినానంతరం మీడియాతో అన్నామలై మాట్లాడుతూ, రాష్ట్రంలో కల్తీ సారా రూపంలో 23 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఈ కల్తీ సారా విక్రయాల వెనుక ఉన్న వారిని గురించి కఠిన చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. రాష్ట్రంలో టాస్మాక్ రూపంలో వస్తున్న ఆదాయం గురించి ప్రభుత్వం సమగ్ర వివరాలను వెల్లడించడం లేదని, దీనిపై తాము ఓ నివేదికను విడుదల చేయనున్నామన్నారు. రాష్ట్ర విద్యుత్ , ఎక్సైజ్ శాఖమంత్రి గతంలో చేసిన అక్రమాలపై విచారణకు సుప్రీం కోర్టు ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన మంత్రి పదవిలో ఉంటే ఈ విచారణ న్యాయబద్ధంగా జరిగే అవకాశం లేదని ఆయన్ని వెంటనే డిస్మిస్ చేయాలని గవర్నర్‌ను కోరినట్టు పేర్కొన్నారు.

ట్రాఫిక్ పర్యవేక్షణకు 'ప్రత్యేక' వాహనాలు



రొటేట్ సీసీ కెమెరాలు, రాడార్ సిస్టమ్ కలిగిన కొత్త వాహనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

సాక్షి, చెన్నై: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని వెంటాడే విధంగా నిఘా నేత్రాలతో గస్తీ వాహనాలు రంగంలోకి దిగనున్నాయి. తొలి విడతగా చెన్నైలో 2 వాహనాలను సిద్ధం చేశారు. ఇందులో రాడార్‌తో పాటు సీసీ కెమెరాలు, ఆటోమెటిక్ చలాన్ సిస్టమ్ వంటి సదుపాయాలు ఉన్నాయి. వివరాలు.. చెన్నైలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారి భరతం పట్టే విధంగా పోలీసులు ఆయా సిగ్నళ్లలో సోదాల్లో నిమగ్నమై ఉన్న విషయం తెలిసిందే. అయినా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు వెళ్లే వాహన చోదకులు కూడా ఉన్నారు. ఇలాంటి వారి భరతం పట్టే విధంగా కొత్త సాంకేతికతను అనుసరించాలని నిర్ణయించారు. జమ్మూకశ్మీర్, ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లో గస్తీ వాహనాలకు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ఏవిధంగా పోలీసులు ముందుకెళ్తున్నారో? దానిని అనుసరించేందుకు సిద్ధమయ్యారు. ప్రయోగాత్మకంగా రెండు వాహనాలను సిద్ధం చేశారు. ట్రాఫిక్ గస్తీ వాహనాలుగా వీటికి పేరు పెట్టారు. ఈ వాహనాల పైభాగంలో రోటెట్ సీసీ కెమెరాలు, రాడార్ సిస్టమ్ వంటి సదుపయాలు కల్పించారు. ఇవన్నీ ఆటోమెటిక్‌గా పనిచేస్తాయి. ఏదేని వాహనం అతి వేగంగా దూసుకెళ్లినా, నిబంధనలు అతిక్రమించి పరుగులు తీసినా తక్షణం ఈ సీసీ కెమెరాలు ఆ దృశ్యాలను బంధిస్తాయి. అలాగే ఆటో మెటిక్‌గా ఆయా వాహనదారులకు జరిమానా మొత్తం వారి రిజిస్టర్డ్ మొబైల్ ఫోన్లకు మెసేజ్‌గా వెళ్తుంది. అంతేకాకుండా ఇతర సిగ్నళ్లలో ఉన్న సిబ్బందికి ఆ వాహన సమాచారం కూడా చేరుతుంది. దీంతో ఆ వాహనదారుడి భరతం పట్టేందుకు వీలుగా పోలీసులు ముందుకెళ్తారు. ఈ వాహనాలను ముఖ్య ప్రాంతాలు, రహదారుల్లో ఏదో ఒక చోట పార్కింగ్ చేసి ఉంచితే చాలు, ఎవరి సాయం లేకుండా ఆ వాహనాలలోని ఆటోమెటిక్ సిస్టమ్ ఆధారంగా పనులు చకచక సాగిపోతాయి. వాహన దారులు ఈ వాహనాన్ని చూస్తే చాలు హడలెత్తి పోయే విధంగా పోలీసులు దూకుడు పెంచబోతున్నారు.

తొలిసారిగా..

ప్రయోగాత్మకంగా ఈ వాహనాన్ని చెన్నైలో ఆదివారం తొలిసారిగా పరిశీలించారు. తొలి విడతగా రెండు వాహనాలు కొనుగోలు చేశామని, పనితీరు ఆధారంగా మరిన్నింటిని తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసు యంత్రాంగం పేర్కొంది. ఈ వాహనం గురించి సంబంధిత తయారీ సంస్థకు చెందిన ప్రతినిధి శ్రీప్రియ మాట్లాడుతూ, ఈ వాహనంలో రాడార్, కెమెరాలు రాత్రి పగలు చక్కటి విజువల్స్‌తో అందిస్తాయని వివరించారు. ఒక వాహనంలో ఎవ్వరెవ్వరు ఉన్నారో అనే వివరాలతో కూడిన ఫొటోలను సైతం ఇందులోని వసతుల ఆధారంగా సేకరించేందుకు వీలుందని తెలిపారు. ఈ వాహనాన్ని ఎవ్వరూ ఆపరేటింగ్ చేయాల్సిన అవసరం లేదని, అంతా ఆటోమెటిక్ సిస్టమ్ అని పేర్కొన్నారు.

జువైనల్ హోమ్‌లో ఘర్షణ

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- 21 మందిపై కేసు నమోదు

తిరువొత్తియూరు: చెంగల్పాట్టులోని జువైనల్ హోమ్ మైనర్ యువకుల మధ్య ఏర్పడిన ఘర్షణలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. దీనిని సంబంధించి పోలీసుల 21 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు.. చెంగల్పట్టు జువైనల్ హోమ్‌లో చిన్న చిన్న నేరాలకు పాల్పడిన కొందరిని నిర్బంధించి ఉన్నారు. ఇందులో చెన్నై, చెంగల్పట్టు, విల్లుపురం, విరుదాచలం మొదలైన ప్రాంతాలకు చెందిన దాదాపు 42 మంది ఉన్నారు. వీరికి అలాగే 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. షిఫ్టుల వారీగా 20 మంది పోలీసులు బందోబస్తులో నిమగ్నమై ఉన్నారు. ఈ దశలో, జువెనైల్ రిఫార్మేటరీలో చేరిన పిల్లలు 2 గ్రూపులుగా ఏర్పడి శనివారం సాయంత్రం వారి మధ్య అకస్మాత్తుగా ఘర్షణలకు దిగారు. పిడిగుద్దులతో పరస్పరం దాడులు చేసుకున్నారు. దీని కారణంగా, అక్కడ ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. సేలం, విరుదాచలం, అమ్మపేట్టైకి చెందిన ముగ్గురు బాలురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ విషయంపై చిల్డ్రన్స్ కరెక్షనల్ స్కూల్ నిర్వాహకులు చెంగల్పట్టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘర్షణలో పాల్గొన్న 21 మంది చిన్నారులపై 6 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిండి, చెంగల్పట్టులో సీఎస్ పర్యటన



పరిశీలిస్తున్న సీఎస్ ఇరై అన్బు

సాక్షి, చెన్నై: గిండి, చెంగల్పట్టులలోని ప్రభుత్వ వృత్తి శిక్షణ కేంద్రాలను ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇరై అన్బు తనిఖీ చేశారు. ఇక్కడి సౌకర్యాలు, ఏర్పాట్లపై ఆరా తీశారు. తర్వాత అధికారులతో సమీక్షించారు. వివరాలు.. సీఎం స్టాలిన్ ఆదేశాల మేరకు 71 విభాగాలు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ కింద పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆధునికతకు అనుగుణంగా పరిశ్రమలకు సంబంధించి వృత్తి శిక్షణ కేంద్రాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నారు. శిక్షణ నిమిత్తం రూ. 2,877 కోట్లతో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. 5 దీర్ఘకాలిక, 23 స్వల్పకాలిక కొత్త ఒకేషనల్ విభాగాల్లో శిక్షణకు చర్యలు తీసుకున్నారు. ఈ శిక్షణ తరగతులు ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ తరగతులు, ప్రాజెక్ట్ కోసం ప్రతి శిక్షణ కేంద్రానికి రూ. 3.73 కోట్లు కేటాయించారు. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీతో కలిసి ప్రతి ప్రభుత్వ అప్రెంటీస్‌లకు ఈ కేంద్రాల్లో మెరుగైన శిక్షణకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయా శిక్షణ కేంద్రాల్లో కల్పించిన వసతులు, వృత్తి శిక్షణే లక్ష్యంగా సిద్ధం చేసిన ఆధునిక పరిజ్ఞానాలను అధ్యయనం చేయడానికి ఆదివారం సీఎస్ ఇరై అన్బు ఆకస్మిక తనిఖీలపై దృష్టి పెట్టారు. గిండి, చెంగల్పట్టులోని వృత్తి శిక్షణ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్మిక సంక్షేమ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీముద్దీన్, ఉపాధి, శిక్షణ విభాగం కమిషనర్ వీర రాఘవ రావు, చెంగల్పట్టు కలెక్టర్ రాహుల్‌నాథ్ తదితరులు సీఎస్‌కు వివరాలను తెలియజేశారు.

క్లుప్తంగా

సమర్థంగా డిజిటల్ సమస్యల పరిష్కారం

సాక్షి, చెన్నై : డిజిటల్ సేవలు, సమస్యల పరిష్కారం దిశగా సమర్థంగా తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నామని థామస్ కుక్ చైర్మన్ మాధవన్ మీనన్ తెలిపారు. ఆదివారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో థామస్ కుక్ ఇండియా ఎఫ్‌వై 23లో సాధించిన ఫలితాలను ఆయన వెల్లడించారు. తమ కార్యకలాపాల ద్వారా వచ్చే మొత్తం ఆదాయం కూడా ఎఫ్‌వై 23లో 163 శాతం పెరిగినట్టు వివరించారు. ఒక దశాబ్దంలో అత్యధిక ఆపరేటింగ్ ద్వారా ఉత్తమ సేవలను అందించామన్నారు. ట్రేడింగ్‌వాల్యూమ్, విస్తరణ, డిజిటల్ పరిష్కారాల ద్వారామెరుగైన ఉత్పాదకత సాధించామన్నారు. వ్యాపార విభాగాలు, భౌగోళిక ప్రాంతాలలో బలమైన ఫార్వర్డ్ బుకింగ్‌తో ఉత్తమ పనితీరును ప్రదర్శిస్తూ, మరింతగా సేవలను విస్తరించనున్నామన్నారు.

ఘనంగా విష్ణు కాళియమ్మన్ ఆలయ ఉత్సవాలు


పాల బిందెలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

తిరుత్తణి: మామందూరులో విష్ణు కాళియమ్మన్ ఆలయ ఉత్సవాలు ఆదివారం కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మామందూరు ఆలయం, గ్రామవీధులు విద్యుద్దీపాలణ చేపట్టి.. సర్వాంగసుందరంగా అలంకరించారు. ఉదయం 10 గంటల సమయంలో మహిళలు పాలబిందెలతో ఎల్లయమ్మన్ ఆలయం వద్దకు చేరుకుని మేళ తాళాలతో గ్రామ వీధు 108 పాల బిందెల ఊరేగింపుగా విష్ణు కాళియమ్మన్ ఆలయం చేరుకున్నారు. మహిళలు అమ్మవారికి పాలాభిషేకం పూజలు చేపట్టారు. అనంతరం పుష్పాలతో అమ్మవారిని అలంకరించి దీపారాధన పూజలు చేపట్టారు. ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక సర్పంచ్ హంస ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవ ఏర్పాట్లను విజయవంతంగా చేపట్టారు.

ఎండీఎంకేలో సంస్థాగత సందడి

- జూన్ ఒకటి నుంచి నామినేషన్లు
- 14న సర్వసభ్య సమావేశం


తనయుడు దురైతో వైగో

సాక్షి, చెన్నై: మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కళగం (ఎండీఎంకే)లో సంస్థాగత సందడి ప్రారంభమైంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గం, నిర్వాహక కమిటీ, తదితర కమిటీల పదవులకు ఎన్నికలు నిర్వహించాలని తాజాగా ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో నిర్ణయించారు. అలాగే జూన్ 14వ తేదీన పార్టీ సర్వ సభ్య సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వివరాలు.. గతంలో డీఎంకేలో చీలికతో ఆవిర్భవించిన పార్టీ ఎండీఎంకే అనే విషయం తెలిసిందే. ఈ పార్టీ ప్రధాన కార్యదర్శిగా వైగో వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం తన వారసుడు దురై వయ్యాపురిని వైగో రాజకీయంగా తెర మీదకు తీసుకురావడంతో ఎండీఎంకేలో విభేదాలు నెలకొన్నాయి. ప్రధాన కార్యదర్శి తదుపరి తామే అన్న ధీమాతో ఉన్న తిరుప్పూర్ దురై స్వామి తదితర నేతలు ప్రస్తుతం పార్టీలో ఉంటునే వైగోకు వ్యతిరేకంగా వ్యాఖ్యల తూటాలను పేల్చుతున్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీ సంస్థాగత సమరానికి వైగో నిర్ణయించడాన్ని తిరుప్పూర్ దురై స్వామి తదితర సీనియర్ నేతలు అస్త్రంగా చేసుకుంటున్నారు. పార్టీ రాష్ట్ర కమిటీతో పాటు ఇతర కమిటీలకు జరిగే ఎన్నికల్లో వైగో వారసుడికి చెక్ పెట్టే రీతిలో తమ వ్యూహాలకు పదును పెట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే, ఈ ఎన్నికలు తన వారసుడిని మరింత అందలం ఎక్కించడమే లక్ష్యంగా వైగో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జూన్ ఒకటో తేదీ ఆయా కమిటీల ఎన్నికలకు నామినేషన్లు స్వీకరిస్తారు. అది కూడా ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే. మూడో తేదీ వరకు ఉప సంహరణ ప్రక్రియ ఉంటుంది. ఈ వ్యవహారాలన్నీ ఎగ్మూర్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయం మాత్రమే జరుగుతాయి. ఆ తదుపరి జూన్ 14వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం ద్వారా ఆయా కమిటీల పదవుల భర్తీతో పాటు తన వారసుడికి ప్రమోషన్ ఇచ్చే దిశగా వైగో పావులు కదుపుతున్నట్లు తెలిసింది.

వేర్వేరు చోట్ల ఏడుగురి ఆత్మహత్య

తిరువొత్తియూరు: పదో తరగతి, ప్లస్–1 పరీక్ష ఫలితాల్లో తక్కువ మార్కులు రావడంతో విరక్తి చెందిన ఏడుగురు విద్యార్థులు వేరువేరు చోట్ల ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు.. కడలూరు జిల్లా చిదంబరం సమీపంలో ఉన్న కేఆర్ఎం నగర్ ప్రాంతానికి చెందిన మురుగేషన్ కుమారుడు జీవ (16) తను అక్కడ ఉన్న ప్రైవేటు పాఠశాలలో ప్లస్–1 చదువుతున్నాడు. పరీక్షల్లో కేవలం 250 మార్కులు రావడంతో శుక్రవారం రాత్రి రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే ఈరోడ్డు జిల్లా రామన్ పాలక్కాడుకు చెందిన తమిళ్ సెల్వి ఇతను కుమారుడు తానేశ్వరన్ (16) ప్లస్–1 పరీక్షల్లో తక్కువ మార్కులు శుక్రవారం రాత్రి బాత్రూంలో ఉరేసుకుని బలవన్మరనానికి పాల్పడ్డాడు. ఇక రాణిపేట జిల్లా పులివలం కాలానికి చెందిన మునుస్వామి ఆటో డ్రైవర్. ఇతని కుమార్తె దీపిక (16) ప్లస్–1లో నాలుగు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యింది. దీంతో విరక్తి చెంది శనివారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అలాగే సోలింగనల్లూర్ లో చదువుతున్న ప్లస్–1 విద్యార్థిని రీట (17) తక్కువ మార్కులు రావడంతో శనివారం ఉదయం ఉరివేసుకొని తనువు చాలించింది. అలాగే నాగై జిల్లా కడంబాడి ఉదయ ఎంబీఆర్ నగర్ సునామీ క్వాటర్స్‌కు చెందిన ఇందిరా కుమార్తె గుణవతి (15) ఈమె పదో తరగతి పరీక్షల్లో సైన్స్‌లో ఫెయిల్ అయ్యింది. దీంతో విరక్తి చెంది ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చెన్నై సమీపంలోని పుళల్ బుద్ధగరం అన్నై ఇందిరా నగర్‌కు చెందిన కార్తీక్ (16) ప్లస్–1 విద్యార్థి శనివారం ఉదయం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే పదో తరగతి ఆవడికి చెందిన సంయుక్త (16) పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించినా.. ప్లస్–1లో తాను అనుకున్న కోర్సు దొరక్కపోవడంతో బలవన్మరనానికి పాల్పడింది. దీంతో వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

వేలూరు, తిరువణ్ణామలైలో రాజీవ్ వర్ధంతి సభలు


ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేలూరు: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలో రాజీవ్ చిత్ర పటాన్ని ఉంచి కాంగ్రెస్ శ్రేణులు పూల మాల వేసి నివాలులు అర్పించాయి. అనంతరం కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరుకొని తీవ్ర వాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఆ పార్టీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు వాహీద్‌బాషా మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో నిరుపేద ప్రజలకు అవసరమైన పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా మిగిలిపోయారన్నారు. దేశంలో తీవ్ర వాద శక్తులు లేకుండా చేసేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టీకా రామన్, మాజీ జిల్లా అధ్యక్షులు కదీర్‌వేలన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తరలింపులో నిర్లక్ష్యం తగదు


పాఠశాల బస్సులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ భాస్కర పాండియన్

వేలూరు: ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను సురక్షితంగా పాఠశాలకు తీసుకెళ్లేందుకు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ భాస్కర పాండియన్ సూచించారు. తిరుపత్తూరు జిల్లాలోని ప్రైవేటు పాఠశాల బస్సుల కండిషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్సులలో విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో నిర్లక్ష్యం తగదన్నారు. అదే విధంగా పాఠశాల బస్సులను నడిపేందుకు సీనియర్ డ్రైవర్‌లను నియమించి ప్రతి బస్సుకూ క్లీనర్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి బస్సులను నడిపే డ్రైవర్‌ల లైసెన్స్‌లను రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పాఠశాల బస్సుల కండిషన్, బస్సులు టైర్లు, అద్దాలు, తలుపులు, సీట్లు, డ్రైవర్ లైసెన్స్, బస్సులో ప్రథమ చికిత్స బాక్స్, స్పీడు కండీషన్ తదితర వాటిని పరిశీలించారు. ప్రతి బస్సుకు అత్యవసర దారిని ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా మంటలను అదుపు చేసే సామగ్రిని బస్సులో తప్పక ఉంచాలన్నారు. విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో బస్సులను అతి వేగంగా నడపరాదని డ్రైవర్‌లకు సూచించారు. అనంతరం తిరుపత్తూరు, జోలార్‌పేట డివిజన్ పరిధిలోని ప్రైవేటు పాఠశాల, కళాశాలలకు చెందిన 230 బస్సులను తనిఖీ చేశారు. ఆయన వెంట డీఆర్‌ఓ ప్రేమలత, ఆర్టీఓ రామకృష్ణన్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ఇంజినీరింగ్ కౌన్సిల్ ఏర్పాటుకు డిమాండ్


సివిల్ ఇంజినీర్ల సంఘ సమావేశంలో ప్రసంగిస్తున్న నవీన్‌కుమార్

తిరువళ్లూరు: భవన నిర్మాణానికి ఉపయోగించే వస్తువుల ధరను నిర్ణయించడానికి తప్పనిసరిగా ఇంజినీరింగ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని తమిళనాడు సివిల్ ఇంజినీర్‌ల సంఘం సమావేశంలో తీర్మానించారు. తమిళనాడు సివిల్ ఇంజినీర్ల సంఘం తిరువళ్లూరు జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు కార్యక్రమం ఆదివారం ఉదయం ఓ ప్రైవేటు కల్యాణమండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడిగా నవీన్ కుమార్, కార్యదర్శిగా గాండీబన్, కోశాధికారిగా జగదీష్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నీవన్‌కుమార్ మాట్లాడుతూ సిమెంట్ ఇనుము, ఇటుక, ఇసుక ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ ధరలను నిర్ణయించడానికి ప్రత్యేక కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వ పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు విజయకుమార్, శ్రీనివాసన్, శరవణన్, విజయకుమార్, వినోద్‌రాజ తదితరులు పాల్గొన్నారు.

అమ్మయార్‌కుప్పంలో వేడుకగా దుర్యోధన వధ


దుర్యోధన వధ నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

పళ్లిపట్టు: అమ్మయార్‌కుప్పంలో దుర్యోధన వధ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. వివరాలు.. ఆర్కేపేట యూనియన్ అమ్మయార్‌కుప్పంలో ద్రౌపదీదేవి ఆలయ అగ్నిగుండ ఉత్సవ వేడుకలు మే 4న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల సందర్భంగా రోజూ అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. పగటి సమయాల్లో మహాభారత ఉపన్యాసం, రాత్రి వేళల్లో వీధి నాటకాలు ప్రదర్శించారు. ఉత్సవ వేడుకల్లో చివరి రోజైన ఆదివారం ఉదయం దుర్యోధన వధ నాటక ప్రదర్శన చేపట్టారు. భీముడు, దుర్యోధనుడు వేషధారణలో కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. అమ్మయార్‌కుప్పం చుట్టు పక్కల గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం కంకణాలు దరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించారు. అదే విధంగా వంగనూరు, విలక్కనాంపూడి పుధూర్‌లోనూ అగ్నిగుండ వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఉత్సవ వేడుకల్లో తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్, మాజీ ఎంపీ హరి సహా ప్రముఖులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగులో నటించడానికి రెడీ


నటి దుషారా విజయన్

తమిళ సినిమా: రాజకీయ నేపథ్యం నుంచి సినీ రంగ ప్రవేశం చేసిన నటి దుషారా విజయన్. బోదై ఏరి బుద్ధి మారి చిత్రంతో కథానాయకిగా పరిచయమైన ఈమె ఆ తర్వాత దర్శకుడు పా.రంజిత్ దృష్టిలో పడ్డారు. అలా ఆయన నిర్వహించిన ఆడిషన్‌లో సెలెక్ట్ అయ్యి సార్పట్టా పరంపరై చిత్రంలో కథానాయకగా నటించారు. అందులో నటుడు ఆర్యకు జంటగా మరియమ్మ అనే పాత్రను పోషించారు. ఒక ధైర్యవంతురాలైన పల్లెటూరి యువతగా ఆ పాత్రకు జీవం పోసి అందరి ప్రశంసలను అందుకున్నారు. ఆ తర్వాత దర్శకుడు పా.రంజిత్‌నే రూపొందించిన నక్షత్రం నగర్గిరదు చిత్రంలోని నటించారు. ప్రస్తుతం కళువేత్తి మూర్కన్, అనీతి, నటుడు అర్జున్‌దాస్ సరసన ఒక చిత్రం అంటూ మూడు, నాలుగు చిత్రాలు దుషారా చేతిలో ఉన్నాయి. వీటిలో అరుళ్ నిధికి జంటగా నటించిన కళువేత్తి మూర్కన్ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 26వ తేదీన తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఎస్.అంబేత్ కుమార్ నిర్మించిన ఈ చిత్రానికి గౌతమ్ రాజ్ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం నటి దుషారా విజయన్ చెన్నైలో మీడియాతో ముచ్చటించారు. అవి మాట్లాడుతూ కళువేత్తి మూర్కన్ తనకు స్పెషల్ చిత్రమని పేర్కొన్నారు. నటుడు అరుళ్ నిధితో కలిసి నటించడం మంచి అనుభవంగా పేర్కొన్నారు. అయితే ఆయన సెట్‌లో ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడరని అన్నారు. తాను ఇందులో కవిత అనే బ్యాంక్ ఉద్యోగి పాత్రలో నటించినట్లు చెప్పారు. చిత్రంలో అరుళ్ నిధితో కలిసి నటించిన రొమాన్స్ సన్నివేశాలు డిఫరెంట్‌గా ఉంటాయని చెప్పారు. దర్శకుడు పా..రంజిత్ సార్పట్టా పరంపరైకు సీక్వెల్ చేసే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోందనీ అదే జరిగితే అందులో తానే నటిస్తానని చెప్పారు. తాను నట జీవితం సార్పట్టా పరంపరై చిత్రంలోని మరియమ్మ పాత్రకు ముందు, ఆ తరువాత అన్నట్టుగా మారిందన్నారు. తెలుగు చిత్రాల్లో నటించాలన్న కోరిక ఉందనీ అయితే తనకు నచ్చిన పాత్రలు వస్తే కచ్చితంగా నటిస్తానని చెప్పారు.

తమిళంలో సూపర్ హీరో చిత్రం వీరన్

తమిళ సినిమా: టి.జి.త్యాగరాజన్ సమర్పణలో ఇంతకుముందు పలు విజయవంతమైన సినిమాలను నిర్మించిన సత్య జ్యోతి ఫిలిమ్స్ సంస్థ తాజాగా నిర్మించిన చిత్రం వీరన్. మరకత నాణయం చిత్రం ఫేమ్ ఏఆర్‌కే శరవణన్ దర్శకత్వం వహించిన ఇందులో నటుడు హిప్ హాప్ ఆది తమిళ కథానాయకుడిగా నటించారు. నటి ఆదిర రాజ్ నటిగా నటించిన ఇందులో నటుడు వినయ్, మునిష్కాంత్, కాళీ వెంకట్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూన్ 2వ తేదీన తెరపైకి రానుంది. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం చెన్నైలో ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్శకుడు శరవణన్ మాట్లాడుతూ 2017లో చిత్రం తయారు చేసుకుని నటుడు హిప్ హాప్ ఆది తమిళ వినిపించారన్నారు. ఈ కథలోని ఫాంటసీ సూపర్ హీరో అంశాలు, తదితర విషయాలపై నమ్మకం కలగడంతో ఆయన ఇందులో నటించడానికి అంగీకరించినట్లు చెప్పారు. ముఖ్యంగా ఈ చిత్రం రూపొందడానికి కారణం అయిన నిర్మాతలలో ఒకరైన అర్జున్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారన్నారు. చిత్ర కథానాయకుడు ఆది తమిళ మాట్లాడుతూ కుటుంబ సపరివార సమేతంగా చూసి ఆనందించే కథా చిత్రం వీరన్ అని తెలిపారు. ముఖ్యంగా ఇందులో పిల్లలు చూసి ఆనందించే వాళ్ల విషయాలు ఉన్నాయన్నారు. జూన్ నెలలో పాఠశాలు ప్రారంభం కానుండటంతో, అంతకుముందుగా జూన్ రెండవ తేదీన ఈ చిత్రాన్ని పిల్లలు చూసి ఆనందించే విధంగా విడుదల చేస్తున్నట్లు చెప్పారు. చాలా కాలం తర్వాత తమిళంలో వస్తున్న సూపర్ హీరో కథ చిత్రం వీరన్ అని తెలిపారు. చిత్రంలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని, ఇంతకుముందు ఈ తరహా యాక్షన్ సన్నివేశాల్లో తాను నటించలేదని పేర్కొన్నారు. సత్య జ్యోతి ఫిలిమ్స్ సంస్థలో తాను నటించిన మూడో చిత్రం ఇదని చెప్పారు. అదేవిధంగా ఇప్పటివరకు తాను నటించిన ఐదు చిత్రాల్లో ఇదే భారీ బడ్జెట్ కథా చిత్రం అని హిప్ హాప్ ఆది తమిళ పేర్కొన్నారు.


వీరన్ చిత్ర యూనిట్

కోలీవుడ్ టాక్స్

విశ్వనటుడికి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు


నటుడు కమలహాసన్

తమిళ సినిమా: నటుడు కమలహాసన్ గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. నటుడు నిర్మాత దర్శకుడు గాయకుడు రచయిత ఇలా పలు ముఖాలు కలిగిన అరుదైన కళాకారుడు కమలహాసన్. తమిళం తెలుగు మలయాళం హిందీ వంటి పలు భాషల్లో కథానాయకుడిగా విజయాలను సాధించిన నటుడు ఈయన. అంతేకాకుండా పలు సరికొత్త విషయాలను సినిమాకు పరిచయం చేసిన ఘనత కూడా కమలహాసన్‌కే చెందుతుంది. పలు భాషల్లో ఇప్పటికే 232 చిత్రాల్లో నటించిన కమలహాసన్ ఇటీవల తన సొంత బ్యానర్లో నిర్మించి కథానాయకుడిగా నటించిన విక్రమ్ చిత్రం సంచలన విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో నటిస్తున్న ఇండియన్– 2 ఈయనకు 233వ చిత్రం అవుతుంది. తదుపరి తన 234 చిత్రాన్ని మణిరత్నం దర్శకత్వంలో చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇక నిర్మాతగాను నటుడు ధనుష్, శింబు, శివకార్తికేయన్ వంటి స్టార్ హీరోలతో చిత్రాలు నిర్మిస్తున్నారు. లేకపోతే ఈయన ఇప్పటికే పలు రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ, పద్మ విభూషణ్ వంటి అత్యున్నత అవార్డులతో సత్కరించింది. కాగా తాజాగా ఈ విశ్వ నటుడు విశ్వ వేదికపై జీవిత సాఫల్య అవార్డును అందుకోబోతున్నారు. ఈ నెల 27వ తేదీన అబుదాబిలో జరగనున్న అంతర్జాతీయ భారతీయ చలనచిత్రోత్సవ వేడుకల్లో కమల్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించడం గమనార్హం.

హీరో విజయ్ 68వ చిత్రం షురూ

తమిళ సినిమా: నటుడు విజయ్ ప్రస్తుతం లియో చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ జూన్‌లో పూర్తి కానుంది. కాగా విజయ్ నటించిన 68వ చిత్రం షురూ అయింది. ఈ చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కాల్పాత్తి ఎస్.అఘోరం, కల్పాత్తి ఎస్. గణేష్, కల్పాత్తి ఎస్ సురేష్ నిర్మించనున్నారు. ఇది మీరు నిర్మిస్తున్న 25వ చిత్రం అవుతుంది. అదేవిధంగా ఇంతకముందు ఈ సంస్థలో విజయ్ కథానాయకుడిగా నటించిన బిగిల్ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. ఆ విధంగా ఆయన ఈ సంస్థలో రెండవ సారి నటించడానికి సిద్ధం అవుతున్నారు. దీనికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహించనున్నారు. ఈయన నటుడు విజయం డైరెక్ట్ చేసినట్లు ఇంతకుముందే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అదే ఇప్పుడు నిజం అవుతోంది. యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందించనున్నారు. ఈ విషయాన్ని ఏజీఎస్ సంస్థ అధినేతలు ఆదివారం అధికారికంగా మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తాము ఇంతకుముందు నిర్మించిన చిత్రాలన్నిటికంటే భారీ బడ్జెట్‌తో నిర్మించనున్న చిత్రం ఇదేనని చెప్పారు. ఇందులో నటించనున్న ఇతర నటీనటులు, సాంకేతిక వర్గం వివరాలను సరైన సమయంలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతానికి విజయ్ 68 పేరుతో రూపొందనున్న ఈ చిత్రాన్ని 2024లో విడుదల చేయటానికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.


ఏజీఎస్ సంస్థ అధినేతలు


నటి మాళవిక మోహన్

సెట్‌లో ఆయన సరదా..సరదాగా..!

తమిళ సినిమా: ముంబైలో చదివి, పెరిగిన మలయాళీ నటి మాళవిక మోహన్. తొలుత మాతృభాషలో నటిగా పరిచయమై ఆ తర్వాత కన్నడం, హిందీ, తమిళం అంటూ పాన్ ఇండియా నటిగా మారిపోయింది. ముఖ్యంగా తమిళంలో రజనీకాంత్ కథానాయకుడుగా నటించిన పేట చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. అందులో నటుడు శశి కుమార్‌కు భార్యగా విలక్షణ పాత్రలో నటించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత మాస్టర్ చిత్రంలో విజయ్‌తోను, ధనుష్‌కు జంటగా మారన్ చిత్రంలోనూ నటించి గుర్తింపు తెచ్చుకుంది. ఈ బోల్డ్ అండ్ బ్యూటీ ప్రస్తుతం విక్రమ్ సరసన తంగలాన్ చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రం కోసం చాలా కసరత్తులే చేసింది ముఖ్యంగా కర్రసాము విలువ విద్యలో శిక్షణ పొందింది. ఆ ఫొటోలను ఇటీవల సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయగా అవి ట్రెండింగ్ అయ్యాయి. పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్న తంగలాన్ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకుంది. అయితే ఇటీవల షూటింగ్‌లో విక్రమ్ గాయాలపాలు కావడంతో ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో షూటింగ్ నిలిచిపోయింది. విక్రమ్ పూర్తిగా కోలుకున్న తర్వాత తంగలాన్ చిత్ర షూటింగ్ తిరిగి ప్రారంభం అవుతుందని చిత్రవర్గాలు పేర్కొన్నారు. కాగా ఈ చిత్రంలో విక్రం సరసన నటించిన అనుభవం గురించి నటి మాళవిక మోహన్ కోరుకుంటూ తంగలాన్ చిత్రంకు సంబంధించినంత వరకు విక్రమ్ లేకపోతే తను ఈ ప్రయనాన్ని ఊహించుకోలేనని పేర్కొంది. ప్రతి సన్నివేశంలోనూ ఆయన తనకు ఎంతగానో సహకరించేవారు అని చెప్పింది. ఆయన తనే కాకుండా తన చుట్టూ ఉన్న వారంతా బాగా నటించాలని కోరుకునే నటుడు అని చెప్పింది. అలా తమలోని నటనను బయటికి తీసి ఉత్సాహపరిచే వారిని పేర్కొంది. విక్రమ్ సెట్‌లో ఎప్పుడు చాలా జాలీగా ఉంటూ కామెడీ చేస్తూ వాతావరణాన్ని ఆహ్లాదంగా మారుస్తారని నటి మాళవిక మోహన్ చెప్పింది.


నటుడు విజయ్

క్లుప్తంగా

మహిళ నుంచి రూ.2.75 కోట్ల మోసం
• వ్యక్తి అరెస్ట్

కొరుక్కుపేట: పుదువాయిలో ఆన్‌లైన్ వ్యాపారంలో రెట్టింపు లాభం పొందవచ్చునని ఓ మహిళ నుంచి రూ.2.75 కోట్లు మోసం చేసిన వ్యక్తిని కొడైకెనాల్‌లో సీబీసీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. పుదుచ్చేరి ముత్యాల్‌పేటలోని గణేష్ నగర్‌కు చెందిన కార్తికేయ ఆన్‌లైన్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో రెట్టింపు లాభం వస్తుందని నమ్మించి ముత్యాలపేటలోని చోలై నగర్‌కు చెందిన రాజేశ్వరి నుంచి రూ.2.75 కోట్లు తీసుకుని మోసం చేశాడు. బాధితురాలు పుదుచ్చేరి సీబీసీఐడీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్తికేయ రాజేశ్వరినే కాకుండా మరో 8 మందిని కూడా లక్షల్లో మోసం చేసినట్టు తేలింది. నిందితుడు కొడైకెనాల్ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం అందడంతో సీబీసీఐడీ పోలీసులు అక్కడికి చేరుకుని అరెస్టు చేశారు. అనంతరం పుదుచ్చేరి తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

చెన్నై విమానాశ్రయంలో ఇద్దరు నిందితుల అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంలో హత్య, నకిలీ పాస్ పోర్ట్ కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంకు శ్రీలంక మీదుగా దుబాయ్ నుంచి విమానం వచ్చింది. అధికారులు ప్రయాణికుల పత్రాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో మదురై జిల్లాకు చెందిన సిద్దిక్ (31) పత్రాలను తనిఖీ చేయగా అతనిపై 2014లో హత్య ఆరోపణలపై కేసు నమోదైనట్టు గుర్తించారు. దీనిపై మదురై మున్సిపల్ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. దీంతో సిద్దిఖీని అదుపులోకి తీసుకుని మదురై నగర పోలీసులకు సమాచారం అందించారు. అలాగే సౌదీ అరేబియా నుంచి శ్రీలంక మీదుగా చెన్నైకి వచ్చిన నెల్లైకి చెందిన ఖాజా మొయిద్దీన్(57) కేసులో నిందితుడిగా ఉన్నట్టు గుర్తించారు. నెల్లై పోలీసులకు సమాచారం అందించి అతన్ని అప్పగించారు.

వృద్ధ మహిళలపై లైంగిక దాడి
• యువకుడి అరెస్ట్

కొరుక్కుపేట: వృద్ధులపై లైంగిక దాడికి పాల్పడుతున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. నామక్కల్ జిల్లా పల్లిపాళయం సమీపంలోని ఓడపల్లి వన్నంబలయం ప్రాంతంలోని చెరుకు తోటలో వృద్ధురాలు (70) అర్ధనగ్నంగా హత్యకు గురైంది. అలాగే ఈ నెల 12న పల్లిపాలెం సమీపంలోని అడవిలో షెడ్డు నిర్మించుకున్న పళనియమ్మాళ్(64)ను హత్య చేశారు. రెండు ఘటనలు ఒకేలా ఉండడంతో నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు వద్దులను దారుణంగా హత్య చేసిన సెల్వం(32)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతనుసేలం జిల్లా సెల్వం జలకందపురం ప్రాంతానికి చెందినవాడు. మద్యానికి బానిసైన సెల్వం రెండేళ్ల క్రితం పల్లిపాలెం సమీపంలోని అన్నానగర్ ప్రాంతంలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. ఎప్పుడూ మత్తులో ఉండే సెల్వం సైకోలా తిరుగుతున్నాడు. గత 2 నెలల క్రితం పాఠశాల ప్రాంతానికి పరిగెత్తేందుకు వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న పావాయి అనే వృద్ధురాలిని హత్య చేశాడు. అనంతరం 12వ తేదీన అన్నానగర్ సమీపంలోని అడవిలో ఒంటరిగా ఉన్న పళనియమ్మాళ్ అనే వృద్ధురాలిపై లైంగిక దాడి చేసి హత్య చేశాడు. అనంతరం బంగారు పోగులు అపహరించి వెళ్లిపోయాడని తేలింది.

అన్నను హత్య చేసిన తమ్ముడి అరెస్టు

తిరువొత్తియూరు: తిరుచ్చి సమీపంలో బీరు బాటిల్‌తో పొడిచి అన్నను హత్య చేసిన తమ్ముడిని పోలీసులు అరెస్టు చేశారు. మన్నచనల్లూరు సమీపంలో నోచ్చియంకు చెందిన చంద్రశేఖరన్ కుమారులు హరిరాజన్ (44), శరవణన్ (40)కు ఆస్తి పంపకంలో గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో శరవణన్ మద్యం తాగి వచ్చి అన్న, తండ్రితో గొడవ పడుతున్నాడు. 17వ తేదీన నొచ్చియంలో చద్రశేఖరన్, హరిరాజన్ మాట్లాడుతుండగా అక్కడికి వచ్చిన శరవణన్ వారితో గొడవపడ్డాడు. తర్వాత ఆగ్రహించి బీర్ బాటిల్‌ను పగుల గొట్టి హరి రాజన్ కడుపులో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన హరిరాజన్‌ను తిరుచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను శనివారం మృతి చెందాడు. మన్నచనల్లూరు పోలీసులు కేసు నమోదుచేసి శరవణన్‌ను ఆదివారం ఉదయం అరెస్టు చేశారు.

భారతం.. మానవతా విలువలకు ప్రతిబింబం



వక్త డాక్టర్ పాండురంగ కాలియప్పను సత్కరిస్తున్న తమ్మినేని బాబు, పద్మప్రసాద్

కొరుక్కుపేట: మానవతా విలువలకు ప్రతిబింభమే మహాభారతం అని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ పాండురంగ కాలియప్ప వ్యాఖ్యానించారు. పెరంబూర్ తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో అనన్య సామాన్య ధారావాహిక ఉపన్యాస కార్యక్రమం 98వ ప్రసంగం ఆదివారం సాయంత్రం జరిగింది. ఆంధ్ర మహాభారతం-వ్యక్తిత్వ విలువలు అనే అంశంపై తెలుగు శాఖ సహాయ ఆచార్యులు డాక్టర్ పాండురంగ కాలియప్ప వక్తగా పాల్గొని ఉపన్యసించారు. పెరంబూర్ తెలుగు సాహితీ సమితి అధ్యక్షుడు తమ్మినేని బాబు అధ్యక్షత వహించారు.

కోలాహలంగా అగ్నిగుండ ప్రవేశం



అలంకరణలో ద్రౌపదీదేవి



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు



వేలాది మంది భక్తులతో కిక్కిరిసిన ఆలయం

తిరుత్తణి: తిరుత్తణిలోని పురాతన ద్రౌపదీదేవి ఆలయంలో ఆదివారం నిర్వహించిన అగ్నిగుండ ప్రవేశ మహోత్సవంలో 15 వేల మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి తమ మొక్కులు చెల్లించారు. తిరుత్తణిలోని పురాతన ద్రౌపదీదేవి ఆలయంలో 18 రోజుల పాటు అగ్నిగుండ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ధర్మరాజులు సమేత ద్రౌపదీదేవికి ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణ అభిషేక పూజలు చేపట్టారు. అమ్మవారిని పట్టణంలో ఊరేగించారు. భక్తులు 18 రోజుల పాటు కంకణాలు ధరించి ఉపవాస దీక్షలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం అగ్నిగుండ ప్రవేశంకు వీలుగా 15 వేల మంది కంకణాలు దరించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు సాయంత్రం నాలుగు గంటల సమయానికే ఆలయం వద్దకు చేరుకోవడంతో పరిసరాలు కిక్కిరిసాయి. పట్టణంలో ట్రాఫిక్ స్తంభించింది. సాయంత్రం ఆరు గంటల సమయంలో విద్యుద్దీపాలంకరణతో పాటు బాణసంచా వేడుకల నడుమ ఆలయం వద్దకు చేరుకున్న భక్తులు అగ్నిగుండంలో ప్రవేశం చేసి మొక్కులు చెల్లించారు. వేడుకల్లో భక్తులకు ప్రమాదాలు చోటుచేసుకుంటే వెంటనే వైద్య సేవలు కల్పించే విధంగా వైద్య బృందంతో పాటు అంబులెన్స్, అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా వుంచారు. వేడుకల్లో అధిక సంఖ్యలో రాజకీయ నాయకులు, ప్రముఖులు పాల్గొని అమ్మవానిరి దర్శించుకున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, చిత్రంలో నిర్వాహకులు

కొరుక్కుపేట: లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నై పెరియమేడ్, సీతారామ నగర్ తెలుగు ప్రజా సంక్షేమ సంఘం సంయుక్తంగా ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక కొడంగైయూర్‌లోని సీతారామ నగర్లో ఉన్న సీతారామ నగర్ తెలుగు ప్రజా సంక్షేమ సంఘం ప్రధాన కార్యాలయం వేదికగా చెన్నై గ్రీస్ రోడ్డులో ఉన్న అపోలో ఆసుపత్రి సౌజన్యంతో చేపట్టిన ఈ మెగా వైద్య శిబిరాన్ని స్థానికుల ప్రజలతో పాటు చుట్టుప్రక్కల ప్రజలు నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసి పరీక్షలు చేసుకున్నారు. జనరల్ చెకప్, ఈసీజీ, నేత్ర, దంత పరీక్షలను చేశారు. ఇందులో లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ ఎస్.బోస్, డిస్టిక్ చైర్మన్ ఆక్టివిటీస్ స్టీఫెన్ అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నై పెరియమేడ్ అధ్యక్షులు లయన్ మురళీవెంకట్‌రావు, సెక్రటరీ లయన్ టి.సి.బాబు, ప్రాజెక్ట్ చైర్మన్ లయన్ ఆర్ కుమార్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ ఎస్ రాజు, అలాగే సీతారామ నగర్ తెలుగు పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యనిర్వాకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. లయన్ ఎస్ బోస్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, వైద్యుల సలహాలు సూచనలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులకు, సీతారామ నగర్ తెలుగు ప్రజా సంక్షేమ సంఘం నిర్వాహకులకు లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నై పెరియమేడ్ తరఫున ఆ క్లబ్ అధ్యక్షులు మురళీవెంకట్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రాడ్యుయేట్ ప్యాకల్టీ రిక్రూట్‌మెంట్ కౌన్సెలింగ్ వాయిదా

కొరుక్కుపేట: తమిళనాడు పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ఉన్నత, పలు లైఫ్ స్కూల్స్‌లో పనిచేస్తున్న గ్రాడ్యుయేట్ టీచర్లకు సోమవారం జరగాల్సిన బదిలీల కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు అధికారులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు స్కూల్ బోర్డు పరిధిలోని ప్రాథమిక, ఉన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న గ్రాడ్యుయేట్ టీచర్లకు రేపటి నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. అదేవిధంగా గతవారం పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు బదిలీ ప్రారంభం కావాల్సి ఉండగా.. కొందరు కోర్టులో కేసు వేయడంతో పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ల ఉద్యోగ బదిలీల కౌన్సెలింగ్‌ను ఈనెల 15వ తేదీ వరకు నిలిపివేయాలని కోర్టు ఆదేశించింది. దీని ప్రకారం 15వ తేదీ తర్వాత పాఠశాల విద్య పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ల మండలితో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది. ఇదిలా ఉండగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌గా ఉన్న నందకుమార్‌ను అకస్మాత్తుగా కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆస్థానంలో కొత్తవారిని ఇంకా నియమించలేదు. అలాగే ఆ పోస్టులో డైరెక్టర్‌ను నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ కన్సల్టెంట్‌ను నియమించిన తర్వాత గ్రాడ్యుయేట్ టీచర్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయుల తరపున పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ పొయ్యమొళిని అభ్యర్థించారు.

సత్యభామ ఇన్‌స్టిట్యూట్‌కు నాక్ ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు

కొరుక్కుపేట: చెన్నైలోని సత్యబామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) ద్వారా ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించింది. సత్యభామ ఇన్‌స్టిట్యూట్‌లో నాణ్యమైన విద్యతో పాటు విద్యాప్రమాణాలు, మౌలిక సదుపాయాలను నాక్ బృందం పరిశీలించింది. నాక్ స్టాండింగ్ కమిటీ ఈ సందర్భంగా సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి నాక్ ఏ ప్లస్ ప్లస్ గుర్తింపునిచ్చింది. ఆ ఇన్‌స్టిట్యూట్ ఛాన్సులర్ డాక్టర్ మరియాజీనా జాన్సన్ మాట్లాడుతూ నాక్ గుర్తింపు దక్కడం ఆనందంగా ఉందన్నారు. ప్యాకల్టీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, రిక్రూటర్లు, అల్యూమిని, శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

అన్ని గ్రామాల్లో డీఎంకే జెండా రెపరెపలాడాలి



సభ్యత్వ నమోదు దరఖాస్తులను ఎమ్మెల్యే చంద్రన్‌కు అందజేస్తున్న డీఎంకే నేతలు

తిరువళ్లూరు: మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామా ల్లో డీఎంకే జెండా రెపరె పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు డీఎంకే జిల్లా కన్వీనర్ తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ సూచించారు. తిరువళ్లూరు జిల్లా డీఎంకే నేతలు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని పార్టీ సీనియర్ నేత ద్రవిడ భక్తన్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తిరుత్తణి చంద్రన్, విశిష్ట అతిథిగా తిరువళ్లూరు ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ మాట్లాడుతూ డీఎంకేలో కోటి మంది కొత్త సభ్యత్వాలను నమోదు చేయాలని పార్టీ అధిష్టానం ఆదేశించిందన్నారు. అయితే లక్ష్య సాధనలో కొంత వెనుకబడ్డామన్నారు. సభ్యత్వ నమోదుకు మరింత గడువు ఇచ్చిన నేపథ్యంలో కొత్త వారిని పార్టీలో చేర్చే ప్రక్రియను మరింత వేగంగా చేపట్టాలని ఆదేశించారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శత జయంతి ఉత్సవాలను జూన్ 3 నుంచి సంవత్సరం పాటు నిర్వహించాలని నిర్ణయించాం. ఇందులో భాగంగానే జూన్‌మూడున ప్రతి గ్రామంలోనూ పార్టీ జెండాను ఎగరవేయాలని ఆదేశించారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి గుర్తింపును కచ్చితంగా ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కుమరన్, ఉధయమలర్ పాండ్యన్, చిట్టిబాబు, మోతీలాల్, బీకే నాగరాజ్‌తో పాటు పలువురు పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

భవనం పై నుంచి పడి కార్మికుడి మృతి

తిరువొత్తియూరు: భవన నిర్మాణ పనుల్లో 2వ అంతస్తు నుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. వివరాలు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుఖు మొహ్మద్ (22) చెన్నైలోని చూలై హైవేపై కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో ఉంటూ నిర్మాణ పనులు చేస్తున్నాడు. అతను శనివారం నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తూ జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. సహచరులు వెంటనే రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి సుఖు మొహ్మద్ మృతి చెందాడు. పెరియమేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌స్టాగ్రామ్ ఫ్రెండ్‌తో స్కూల్ టీచర్ పరారీ

అన్నానగర్: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడితో స్కూల్ టీచర్ పరారైంది. భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరుచ్చి జిల్లా కోంబైపూదూర్ గ్రామానికి చెందిన పుష్పరాజ్ రెండేళ్ల క్రితం నిత్య అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి పిల్లలు లేరు. నిత్య కోంబైపుదూరులోని ప్ర భుత్వ పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో నవీన్ అనే యువకుడితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. రెండు రోజుల క్రితం నిత్య అదృశ్యమైంది. ఆమె భర్త పుష్పరాజ్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పిడుగుపడి ఇద్దరు యువకుల మృతి

అన్నానగర్: విరుదునగర్ జిల్లా తిరుచ్చులీ సమీపంలోని కుల్లాన యాగన్ పట్టికి చెందిన చిన్న కృష్ణన్ కుమారుడు విజయ్ (20), అతని సోదరుడు పెరియ కృష్ణ కుమారుడు పెరుమాళ్ (29) శనివారం మేకలను మేపేందుకు పొలానికి వెళ్లారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మేకలు ఇళ్లకు తిరిగాయి. మేకలు మేపేందుకు వెళ్లిన వారు ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు, బంధువులు వెతికారు. రాత్రంతా అడవిలో వెతికినా దొరకలేదు. ఆదివారం ఉదయం ఇద్దరు యువకులు పిడుగుపాటుకు గురై శవమై కనిపించారు. దీంతో దిగ్భ్రాంతి చెందిన బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విజయ్, పెరుమాల్ మృతదేహాలను స్వాధీనం చేసుకుని అరుప్పుకోట్టై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన గురించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపోలోలో వెరికోస్ వెయిన్స్ ఆధునిక వైద్య సేవలు

తిరుపతి తుడా: అపోలో ఆసుపత్రిలో అత్యాధునిక వాస్కులర్ సర్జరీ, ప్రొసీజర్స్ ద్వారా వెరికోస్ వెయిన్స్‌కు ఆధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు చెన్నై అపోలో హాస్పిటల్ డాక్టర్ వి.బాలాజీ తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని అపోలో ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడారు. ఎక్కువసేపు కూర్చోవడం, నిల్చుని చేసే ఉద్యోగులు ఎక్కువ మంది వేరికోస్ మెయిన్స్ సమస్యతో బాధపడుతున్నట్టు తెలిపారు. తిరుపతిలోని అపోలో ఆసుపత్రిలో వాస్కులర్ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు వివరించారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



కార్మికుల పాదయాత్రలో ప్రసంగిస్తున్న కన్నన్

తిరువళ్లూరు: దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర తిరువళ్లూరుకు చేరింది. మీంజూరు కాట్టుపల్లిలోని అదానీ పోర్టు నుంచి పాదయాత్ర శనివారం ప్రారంభమైంది. ఈ పాదయాత్రను కన్నన్ ప్రారంభించారు. తిరువళ్లూరు, కాంచీపురం, రాణిపేట, వేలూరు, తిరువణ్ణామలై, కల్లకురుచ్చి, పెరంబలూరు తదితర ఏడు జిల్లాల మీదుగా సాగి మే30న తిరుచ్చిలో ముగియనుంది. ఈ సందర్భంగా కన్నన్ మాట్లాడుతూ వాహన చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. అలాగే విద్యుత్ ముసాయిదా బిల్లును అమలు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

ఆంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేస్తాం



సమావేశంలో పాల్గొన్న స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గం

• నూతన అధ్యక్షుడు ఆర్ఎస్ జయప్రకాష్

కొరుక్కుపేట: స్విమ్మింగ్ క్రీడను అభివృద్ధి చేయడంతో పాటు అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయడానికి కృషి చేస్తానని స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నూతన అధ్యక్షుడు ఆర్ఎస్ జయప్రకాష్ అన్నారు. స్థానిక ఆళ్వార్ పేటలోని సవేరాలో ఆదివారం స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)వార్షిక సర్వసభ్య సమావేశం, కొత్త కార్యవర్గం ఎన్నిక చేపట్టారు. స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నూతన అధ్యక్షుడిగా ఆర్.ఎస్.జయప్రకాష్, సెక్రటరీగా మోనాల్ చోక్షి, కోశాధికారిగా సుదేష్ నాగ్ వెంకర్ ఎన్నికయ్యారు. ఆర్.ఎస్.జయప్రకాష్ మాట్లాడుతూ వరుసగా రెండోసారి స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. మన దేశానికి చెందిన ఇద్దరు స్విమ్మర్లు 2021లో ఒలింపిక్ క్రీడలకు క్వాలిఫైయింగ్ స్టాండర్డ్‌ను సాధించి చరిత్ర సృష్టించారని తెలిపారు. దేశంలో స్విమ్మింగ్ క్రీడను ప్రధాన క్రీడగా తీర్చిదిద్దేలా కృషి చేస్తామన్నారు. క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు, అత్యుత్తమ శిక్షణా సౌకర్యాలు, ప్రపంచ స్థాయి కోచింగ్ అందించేలా పనిచేస్తామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాల క్రీడలను ప్రోత్సహిస్తున్నాయని పేర్కొంటూ 2028 నాటికి ఈత అభివృద్ధిని మరింత పెంచే లక్ష్యంతో ముందుకెళతామని వివరించారు.

అప్పల బాధతో సిద్ధ వైద్యుడి కుటుంబం ఆత్మహత్య

కొరుక్కుపేట: అప్పుల బాధతో సిద్ధ వైద్యుడి కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కలకలం రేపింది. సాలిగ్రామం తిలకర్ వీధిలో నివాసముండే గంగాధరన్ సిద్ధ వైద్యుడు. అతని భార్య చారుమతి (57) హైవే విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. వీరికి కూతురు జనప్రియ ఉన్నారు. గంగాధరన్ కొన్ని నెలలుగా వివిధ సమస్యలతో బాధపడుతున్నాడు. అప్పు ఇచ్చిన వారు డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈ నెల 11వ తేదీ రాత్రి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు బంధువుకు మెసేజ్ పంపాడు. గంగాధరన్, అతని భార్య చారుమతి కుమార్తె జనప్రియ కలిసి విషపు మాత్రలు తిన్నారు. ఈ ఘటనలో గంగాధరన్, ఆయన కూతురు జనప్రియ అక్కడికక్కడే మృతి చెందారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చారుమతిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకుకు డబ్బు చెల్లించలేక..

తిరువొత్తియూరు: నగదు చెల్లించాలని బ్యాంకు అధికారులు నోటీసు ఇవ్వడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుచ్చి జిల్లా కాట్టు నైవేలికి చెందిన మురుగేషన్ (51) కూరగాయలు వ్యాపారి. ఏడాది క్రితం అతని బ్యాంకు ఖాతాకు రూ.2 లక్షలు జమ అయింది. దాన్ని మురుగేషన్ ఖర్చుపెట్టాడు. మురుగేశన్ బ్యాంకు ఖాతాకు పొరపాటున డబ్బులు జమ చేసిన వ్యక్తి సంబంధిత బ్యాంకు శాఖలో ఫిర్యాదు చేశాడు. బ్యాంకు మేనేజర్ పరిశీలించి మురుగేశన్ ఇంటికి వచ్చి విచారణ చేపట్టారు. మళ్లీ రూ.2 లక్షలు చెల్లించాలని సూచించి వెళ్లిపోయారు. వచ్చే ఆదయం తక్కువ కావడంతో అంత మొత్తం ఎలా చెల్లించాలో తెలియక అతను శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మురుగేశన్ భార్య కళా వత్తలై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మురుగేశన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ముసిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం కోసం డబ్బు ఇవ్వలేదని వృద్ధురాలి హత్య

తిరువొత్తియూరు: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని వృద్ధురాలిని హత్య చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నైలోని తిరువల్లిక్కేని ప్రాంతంలో 10వ తేదీన ఆగి ఉన్న ఆటోలో 80 ఏళ్ల వృద్ధురాలు అపస్మారక స్థితికి పడి ఉంది. శరీరంపై గాయాలతో ఉన్న ఆమెను చెన్నైలోని రాయపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ఆమె 14వ తేదీన మృతిచెందిది. ఐస్‌హౌస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన జరిగిన ప్రాంతంలోని నిఘా కెమెరాల పుటేజీలను పరిశీలించగా తిరువళ్లికేణి నీలం పాద్షా ప్రాంతానికి చెందిన అర్జున్ (30) వృద్ధురాలిపై దాడి చేసినట్లు తేలింది. పోలీసుల అతన్ని అరెస్ట్ చేశారు. అర్జున్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో «ఘటన జరిగిన రోజు నేను మద్యం మత్తులో ఉన్నానని, మళ్లీ తాగేందుకు వృద్ధురాలిని డబ్బులు అడిగానని, ఆమె నిరాకరించడంతోపాటు తిట్టడంతో దాడి చేశానని» తెలిపాడు. ఆమె స్పృహతప్పి పడిపోవడంతో దగ్గరే ఉన్న ఆటోలో పడుకోపెట్టి డబ్బులు లాక్కుని పారిపోయానని తెలిపాడు.

ఆటో డ్రైవర్ దారుణ హత్య

అన్నానగర్: తాంబరం సమీపంలో ఆదివారం ఓ ఆటో డ్రైవర్‌ను కత్తితో నరికి హత్య చేసిన 8 మంది ముఠా కోసం పోలీసులు గాలిస్తున్నారు. తాంబరం సమీపం పుదుపెరుంగలత్తూరు కారుమారి యమ్మన్ కోయిల్ వీధికి చెందిన కుమార్ కుమారుడు బాలాజీ (30) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను శనివారం రాత్రి ఇంటి దగ్గర ఉండగా బైకుల్లో వచ్చిన 8 మందితో కూడిన ముఠా కత్తులతో నరికి పారిపోయారు. రక్తపు మడుగులో ఉన్న బాలాజీని ఇరుగుపొరుగు వారు క్రోంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ అతను ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. బీర్కన్‌కరణై పోలీసులు కేసు నమోదు చేసి హంతకుల కోసం గాలిస్తున్నారు.

కల్తీ సారా తాగిన వారిలో మరొకరు మృతి

తిరువొత్తియూరు: కల్తీ సారా తాగిన వారిలో మరో వ్యక్తి మృతి చెందాడు. విల్లుపురం జిల్లా మరకానం సమీపంలోని ఎక్కి యార్కుప్పంలో 13వ తేదీ రాత్రి 70 మందికి పైగా ఫ్యాక్టరీల్లో వినియోగించే మిథనాల్ కలిపిన సారాయి తాగి 13 మంది చనిపోయారు. ఈ స్థితిలో విల్లుపురం ముండ్యం బాగంలోని ప్రభుత్వ వైద్యకేంద్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్తవరాయన్ కుమారుడు కన్నయప్పన్ (48) శనివారం ఉదయం మృతి చెందాడు. దీంతో ఇప్పటి వరకు మృతి చెందిన వారి సంఖ్య 14కు చేరింది. డిశ్చార్జి అయి చికిత్స పొందిన 24 మందిలో ముండ్యంబాక్కం నుంచి ఏడుగురు, పుదుచ్చేరి జిప్మర్ ఆస్పత్రి నుంచి ఒకరు, పుదుచ్చేరి ప్రభుత్వాసుపత్రి నుంచి ఒకరు ఉన్నారు. శనివారం మరో 15 మంది ముండియంబాక్కం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి, ముండియాంబాగ్‌లో 27 మంది రోగులు, పుదుచ్చేరి జిప్‌మార్ ఆసుపత్రి, మరకానంలో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వాసుపత్రిలో 38 మందికి తీవ్ర చికిత్స అందిస్తున్నారు.

సారా విక్రయాలు అరికట్టాలని బీజేపీ నేతల ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

తిరువళ్లూరు: రాష్ట్ర వ్యాప్తంగా కల్తీసారా విక్రయాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతలు శనివారం సాయంత్రం ధర్నా చేశారు. ఇటీవల విల్లుపురం జిల్లాలో కల్తీ సారా తాగి 20 మందికి పైగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తిరువళ్లూరు జిల్లా బీజేపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలు వాసుకి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అశ్విన్‌కుమార్, సెల్వకుమార్ హాజరై ప్రసంగించారు. డీఎంకే అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని ప్రకటించారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తరువాత తమ అనుచరులతో నాటు సారాను విచ్చలవిడిగా విక్రయిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని ఆరోపించారు. కల్తీ సారా తాగి విల్లుపురం జిల్లాలో 20 మందికి పైగా మరణిస్తే వారి కుటుంబాలకు పరిహారం కింద ప్రజాసొమ్మును రూ.10 లక్షలు ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. కల్తీసారాను విక్రయించి కోట్లకు పడగలెత్తిన వారి నుంచి మొత్తాన్ని వసూలు చేసి మృతుల కుటుంబాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రధాన కార్యదర్శులు కరుణాకరన్, ఆర్యశ్రీనివాసన్, జిల్లా కన్వీనర్ బాలాజీ, మండల అధ్యక్షులు పళణి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

భజన పెరుమాళ్ ఆలయంలో విగ్రహాలు చోరీ

తిరువొత్తియూరు: సేలం జిల్లాలో 100 సంవత్సరాలు చరిత్ర గల పురాతన భజన పెరుమాళ్ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు ఏడు దేవతా విగ్రహాలను చోరీ చేశారు. సేలం జిల్లా తారమంగళం చావడి సమీపంలో 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన పురాతన భజన పెరుమాల్ ఆలయం ఉంది. దీనికి సొంతమైన సుమారు 75 సెంటీమీటర్లు పొడవు కలిగిన మూడు పంచలోహ విగ్రహాలు, అర అడుగు ఎత్తు కలిగిన నాలుగు విగ్రహాలు ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఆలయం తలుపులు పగులగొట్టి ఏడు విగ్రహాలను చోరీ చేశారు. గరుడ ఆల్వార్ విగ్రహం మాత్రం చోరీకి గురికాలేదు. దీనిపై సమాచారం అందుకున్న తారామంగళం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వేలిముద్రలు సేకరించారు. అర్చకులు, ఇరుగుపొరుగు వారిని విచారించారు. దుండగుల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

బాలికపై రౌడీషీటర్ దాడి

రౌడీషీటర్‌ను హతమార్చిన జనం


గాయపడిన బాలిక మహేశ్వరి

గుర్రంకొండ: బాలికపై రౌడీషీటర్ దాడి చేయగా.. గ్రామస్తుల చేతిలో ఆ రౌడీషీటర్ హతమైన ఘటన అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం టి.పసలవాంట్లపల్లె పంచాయతీ పరిధిలోని ఎగువ దళితవాడలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎగువ దళితవాడకు చెందిన ఉత్తయ్య (47) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. 12 ఏళ్ల క్రితం చిన్నమండెం మండలం కలిబండకు చెందిన ఓ మహిళతో అతడికి వివాహమైంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. వివాహమైన రెండేళ్లకే ఉత్తయ్య తన భార్యను హత్యచేశాడు. యావజ్జీవ కారాగార శిక్ష అనుభవించి మూడేళ్ల క్రితం గ్రామానికి వచ్చాడు. ఇదే పంచాయతీ ఉదారవాండ్లపల్లెకు చెందిన వి.చలపతికి ఎగువ దళితవాడ పక్కనే పొలాలు ఉన్నాయి. నెల రోజుల క్రితం ఆ పొలాలకు వెళ్లే దారి విషయమై ఉత్తయ్య స్థానికులతో కలిసి చలపతితో వాగ్వాదానికి దిగాడు. అప్పట్లో ఇరువర్గాలు ఘర్షణ పడటంతో గ్రామపెద్దలు జోక్యం చేసుకుని రెండు వర్గాలను శాంతింపచేశారు. దీనిని మనసులో పెట్టుకున్న రౌడీషీటర్ ఉత్తయ్య ఆదివారం సాయంత్రం చలపతి మనవరాలు వి.మహేశ్వరి (13) పొలం వద్ద ఆవులు మేపుతుండగా.. గమనించిన ఉత్తయ్య బాలికపై కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన బాలిక ఉదారవాండ్లపల్లెకు అతి కష్టం మీద చేరుకొంది. బాలికపై దాడిని కళ్లారా చూసిన గ్రామస్తులు ఉత్తయ్యపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో రౌడీషీటర్ ఉత్తయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. బాలిక పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి తరలించారు. కలకడ సీఐ నాగేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గ్రామస్తులదాడిలో అక్కడికక్కడే మృతి చెందిన రౌడీషీటర్ ఉత్తయ్య

'తుంగభద్ర' సామర్థ్యంపై కర్ణాటకాలు

133 టీఎంసీల సామర్థ్యంతో 1952లో డ్యామ్ నిర్మాణం

- పూడిక పేరుకుపోతుండటంతో తగ్గుతున్న నీటినిల్వ సామర్థ్యం
- 2008లో 100.85 టీఎంసీలని తేల్చిన కర్ణాటక

- 2016లో ఆర్వీ అసోసియేట్స్‌తో బోర్డు అధ్యయనం
- అందులో డ్యామ్ నిల్వ సామర్థ్యం 105.78 టీఎంసీలని వెల్లడి
- దీనిని అంగీకరించని కర్ణాటక సర్కారు
- నిల్వ సామర్థ్యం తగ్గిందనే సాకుతో భారీగా జలచౌర్యం
- ఇదే అంశాన్ని ఏపీ ప్రస్తావించడంతో కర్ణాటక మౌనం
- దాంతో 2022–23లో నిల్వ సామర్థ్యాన్ని 105.78 టీఎంసీలుగా బోర్డు ఆమోదం
- ఆ ప్రకారమే మూడు రాష్ట్రాలకు నీటి పంపిణీ
- నీటినిల్వపై కర్ణాటక అడ్డం తిరగడంతో కథ మళ్లీ మొదటికి..



సాక్షి, అమరావతి: తుంగభద్ర డ్యామ్ వేదికగా కర్ణాటక సరికొత్త నాటకానికి తెరలేపింది. డ్యామ్ నీటినిల్వ సామర్థ్యం 100.85 టీఎంసీలు కాదు.. 105.78 టీఎంసీలని తుంగభద్ర బోర్డు 218వ సర్వసభ్య సమావేశంలో అంగీకరించిన కర్ణాటక 219వ సమావేశంలో అడ్డంతిరిగింది. డ్యామ్ నిల్వ సామర్థ్యం 105.78 టీఎంసీలు ఉండదని.. అంతకంటే తక్కువే ఉంటుందని.. మళ్లీ హైడ్రోగ్రాఫిక్ సర్వేచేసి, తేల్చాలని పట్టుబట్టింది. పూడికవల్ల డ్యామ్ నిల్వ సామర్థ్యం తగ్గిందనే సాకుచూపి.. జలవిస్తరణ ప్రాంతంలో చిన్నచిన్న ఎత్తిపోతలు, తాగునీటి పథకాలను చేపట్టి కర్ణాటక యథేచ్ఛగా జలచౌర్యానికి పాల్పడుతుండటంపై బోర్డును ఏపీ ప్రభుత్వం నిలదీసింది. దీనిపై సంయుక్త సర్వేచేసిన బోర్డు.. కర్ణాటక జలచౌర్యానికి పాల్పడుతోందని తేల్చడంతో కర్ణాటకానికి చెక్‌పడింది. దీంతో డ్యామ్ నీటినిల్వ సామర్థ్యంపై ఆ రాష్ట్రం పాత పల్లవి అందుకుందని బోర్డు వర్గాలు వెల్లడించాయి.

పూడికతో 33 టీఎంసీలు తగ్గిన నిల్వ

కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ల ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర డ్యామ్‌ను 1952లో 133 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. అప్పట్లో ఈ డ్యామ్ నిల్వ సామర్థ్యం 132.47 టీఎంసీలని సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) తేల్చింది. దీని నిల్వ సామర్థ్యం, ఏడాదిలో వచ్చే ప్రవాహాల ఆధారంగా అక్కడ 230 టీఎంసీల లభ్యత ఉంటుందని అంచనా వేసిన బచావత్ ట్రిబ్యునల్.. కర్ణాటకకు 151.49, ఏపీకి 72 (హెచ్చెల్సీ 32.50, ఎల్లెల్సీ 29.50, కేసీ 10.00), తెలంగాణకు 6.51 (రాజోలిబండ డైవర్షన్ స్కీం-ఆర్డీఎస్) టీఎంసీల చొప్పున కేటాయించింది. పూడిక కారణంగా నిల్వ సామర్థ్యం 100.85 టీఎంసీలుగా 2008లో నిర్వహించిన సర్వేలో తేలింది. దీంతో.. నీటి లభ్యత ఆధారంగా దామాషా పద్ధతిలో మూడు రాష్ట్రాలకు తుంగభద్ర బోర్డు నీటిని పంపిణీ చేస్తోంది.

133 నుంచి 105.78 టీఎంసీలకు..

తుంగభద్ర డ్యామ్‌లో నీటినిల్వ సామర్థ్యంపై ఆర్వీ అసోసియేట్స్ అనే సంస్థతో తుంగభద్ర బోర్డు 2016లో టోపోగ్రాఫికల్ సర్వేను చేయించింది. అందులో డ్యామ్ సామర్థ్యం 105.78 టీఎంసీలని తేలింది. ఆ సర్వేను కర్ణాటక అంగీకరించకపోవడంతో ఈ అంశంపై మూడు రాష్ట్రాల అధికారులతో జాయింట్ సర్వేను ఈ ఏడాది బోర్డు చేయించింది. ఇందులో డ్యామ్ నిల్వసామర్థ్యం 105.78 టీఎంసీలుగా తేలింది. ఈ క్రమంలోనే చిన్నచిన్న ఎత్తిపోతలు, తాగునీటి పథకాల ద్వారా కర్ణాటక జలచౌర్యానికి పాల్పడుతుండటం బయటపడింది. ఇదే అంశాన్ని ఏపీ ప్రభుత్వం ఎత్తిచూపడంతో గత బోర్డు సమావేశంలో డ్యామ్ నీటి సామర్థ్యాన్ని 105.78 టీఎంసీలుగా కర్ణాటక అంగీకరించింది. 2022–23లో దాన్నే పరిగణలోకి తీసుకున్న బోర్డు.. ఆ నీటిని మూడు రాష్ట్రాలకు పంపిణీ చేసింది.

తెలంగాణ

ఎయిర్‌పోర్టుల్లో 'బిచ్చగాడు'!

- విమానాశ్రయాలే లక్ష్యంగా ఓ యువకుడి నకిలీ యాచన
- టికెట్ కొనుక్కొని ప్రయాణ సమయానికి 4–5 గంటల ముందే లోనికి
- ఒంటరి ప్రయాణికులతో మాట కలిపి.. తండ్రికి అనారోగ్యం పేరుతో వసూళ్లు
- హైదరాబాద్ సహా ఎనిమిది ఎయిర్‌పోర్టుల్లో దందా.. ఆ సొమ్ముతో జల్సాలు
- ఎట్టకేలకు అరెస్టు చేసిన బెంగళూరు పోలీసులు

సాక్షి, హైదరాబాద్: రోడ్డు కూడళ్లు, ప్రార్థనా స్థలాలు, ఫంక్షన్ హాళ్లు తదితర చోట్ల యాచకులను చూస్తూనే ఉంటాం. వృద్ధాప్యం వల్లో లేదా శారీరక వైకల్యం వల్లో యాచించేవారు కొందరైతే దీన్నే దందాగా మార్చుకొని జీవించే వారు ఇంకొందరు కనిపిస్తుంటారు. కానీ ఇలా రోజంతా అడుక్కున్నా ఎవరికైనా లభించేది చిల్లరే... అందుకే సులువుగా నోట్ల కట్టలు సంపాదించేందుకు ఓ యువకుడు ఏకంగా ఎయిర్‌పోర్టులనే లక్ష్యంగా చేసుకొని 'బిచ్చగాడి'అవతారం ఎత్తాడు! శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సహా ఎనిమిది విమానాశ్రయాల్లో నాలుగేళ్లుగా 'యాచిస్తూ'విదేశీయులు, ప్రవాస భారతీయులు సహా అనేక మంది నుంచి భారీగా నగదు వసూలు చేశాడు. చివరకు బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో పట్టుబడ్డాడు. అక్కడి సీఐఎస్ఎఫ్ అధికారుల విచారణలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

పర్సు పోవడంతో ఎదురైన అనుభవంతో...

చెన్నైకు చెందిన విఘ్నేష్ బీటెక్ పూర్తి చేసి కొన్నాళ్లు బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేశాడు. అప్పట్లో అతనికి నాలుగంకెల జీతం కూడా వచ్చేది. ఓసారి బెంగళూరు నుంచి చెన్నై రావడానికి ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకొని విమానాశ్రయానికి వస్తుండగా విఘ్నేష్ పర్సు పోగొట్టుకున్నాడు. విమాన టికెట్ తన ఫోన్‌లోనే ఉన్నప్పటికీ చెన్నైలో దిగాక ఇంటికి వెళ్లేందుకు రూపాయి కూడా లేని పరిస్థితిని బెంగళూరు విమానాశ్రయం లాంజ్‌లో ఓ విదేశీయుడితో పంచుకున్నాడు. అతనిపై జాలిపడ్డ విదేశీయుడు రూ. 10 వేలు ఇచ్చాడు. ఆ తర్వాత కరోనా వ్యాప్తి నేపథ్యంలో ఉద్యోగం కోల్పోవడంతో రోడ్డునపడ్డ విఘ్నేష్... బెంగళూరు ఎయిర్‌పోర్టు అనుభవంతో ఈజీ మనీపై దృష్టిపెట్టాడు.

ముందస్తు షెడ్యూల్‌తో ముష్టి కోసం...

విమానాశ్రయాలనే టార్గెట్‌గా చేసుకొని ప్రయాణికులకు వివిధ పేర్లతో టోకరా వేసి డబ్బు దండుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీనికోసం విఘ్నేష్ నిర్ణీత సమయానికి ముందే తక్కువ ధరకు వచ్చేలా డొమెస్టిక్ విమాన టికెట్లు బుక్ చేసుకొనేవాడు. ఖరీదైన క్యాజువల్స్ ధరించి, చేతిలో లగేజ్ బ్యాగ్‌తో ఎవరికీ అనుమానం రాకుండా ఫ్లైట్ షెడ్యూల్ టైమ్‌కు దాదాపు 4–5 గంటల ముందే ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించేవాడు. ఒంటరిగా ప్రయాణిస్తున్న ప్యాసింజర్‌ను ఎంచుకుని మాటలు కలిపేవాడు. ఆపై ఫోన్ (సైలెంట్ మోడ్‌లో ఉంచి) మాట్లాడినట్లు నటించేవాడు. తన తండ్రి తీవ్ర అనారోగ్యంపాలైనట్లు ఫోన్లో కుటుంబ సభ్యులు చెప్పారని, శస్త్రచికిత్స చేయించేందుకు తన వద్ద డబ్బులేదని ప్యాసింజర్‌కు చెప్పి సాయం కోరేవాడు. దీంతో ఆ ప్యాసింజర్ జాలిపడి వీలైనంత సొమ్ము ఇచ్చేవాడు. ఆ తర్వాత విమానం ఎక్కి మరో నగరంలో దిగి అక్కడా ఇదే పంథాలో దండుకొనేవాడు. ఇలా విఘ్నేష్ ఒక్కోరోజు రూ. 50 వేల నుంచి రూ.60 వేల వరకు సంపాదించేవాడు. నిర్ణీత మొత్తం సంపాదించాకే చెన్నైలోని ఇంటికి తిరిగొళ్లేవాడు. జల్సాలు చేసేవాడు.

ఇప్పటివరకు ఫిర్యాదులు లేకపోవడంతో...

ఈ పంథాలో విఘ్నేష్ హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై, ఢిల్లీ సహా ఎనిమిది నగరాల్లోని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో తన జేబు నింపుకున్నాడు. విఘ్నేష్ మోసగించిన వారిలో అత్యధికులు విదేశీయులే కావడంతో వారికి ఇది మోసమని తెలిసే అవకాశం లేదు. ఈ కారణంగానే 2021 నుంచి విఘ్నేష్ దందా నిరాటంకంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అయితే ఈ నెల 11న బెంగళూరులోని కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఇద్దరికి టోకరా వేసి మూడో వ్యక్తి దగ్గరకు విఘ్నేష్ వెళ్లడాన్ని గమనించిన ఓ సీఐఎస్ఎఫ్ అధికారి అతనిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా అసలు బండారం బయటపడింది. దీంతో ఎయిర్‌పోర్టు అధికారులు విఘ్నేష్‌ను పోలీసులకు అప్పగించారు.

యాసిర్ ఖానే హ్యూమన్ బాంబ్!

- మానవ బాంబుగా మారతానన్న ఉగ్ర సూత్రధారి
- భోపాల్‌లో శిక్షణకు హైదరాబాద్ మాడ్యుల్ ఉగ్రవాదులూ హాజరు
- సమాచారమార్పిడికి సహకరించిన వారి భార్యలు
- పది మందిని విచారిస్తున్న మధ్యప్రదేశ్ ఏటీఎస్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఏకకాల దాడులకు కుట్రపన్ని, మధ్యప్రదేశ్ ఏటీఎస్‌కు హైదరాబాద్–భోపాల్‌లలో చిక్కిన ఉగ్రవాదుల విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆడియోల ద్వారా రెచ్చగొట్టిన అజ్ఞాత వ్యక్తి మాటలు విన్న సూత్రధారి, భోపాల్‌వాసి యాసిర్ ఖాన్ మానవబాంబుగా మారడానికి సిద్ధమయ్యాడని వెలుగులోకి వచ్చింది. భోపాల్ మాడ్యూల్‌లో కీలకంగా వ్యవహరించిన అతను ప్రస్తుతం ఏటీఎస్ కస్టడీలో ఉన్నాడు. ఈ నెల 9న అరెస్టు చేసిన 16 మందిలో 10 మందిని ఏటీఎస్ అధికారులు శుక్రవారం అదనపు కస్టడీకి తీసుకున్న విషయం విదితమే. ఈ కేసు దర్యాప్తు కోసం ఏటీఎస్ అధీనంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. భోపాల్ ఉగ్రవాదులకు అక్కడి ఫామ్ హౌస్‌లలో శిక్షణ శిబిరాలు నిర్వహించారు. వాటిని హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ సలీం, రెహ్మాన్ తదితరులు హాజరైనట్లు వెలుగులోకి వచ్చింది. ఈ శిబిరాలు జరిగిన ప్రాంతాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేకపోవడంతో సమాచార మార్పిడికి, హైదరాబాద్ నుంచి వచ్చిన వారిని ఆ ప్రాంతాలకు చేర్చడానికి భోపాల్ మాడ్యూల్ ఉగ్రవాదుల భార్యలు సహకరించినట్లు ఏటీఎస్ అధికారులు చెబుతున్నారు. శిక్షణ సమయాల్లో ఉగ్రవాదులతోపాటు వారి భార్యల సెల్‌ఫోన్ల టవర్ లోకేషన్లతోపాటు ఇతర సాంకేతిక ఆధారాలను బట్టి దీన్ని నిర్ధారించినట్లు స్పష్టం చేస్తున్నారు. కొన్ని ఫామ్‌హౌస్‌లను గుర్తించిన అధికారులు యజమానులను విచారించాలని నిర్ణయించారు.

ఎన్నికలవేళ ఆత్మాహుతి దాడికి ప్లాన్...

ఫిదాయీగా పిలిచే ఆత్మాహుతి దాడులకు సిద్ధమైన ఈ ఉగ్రవాదుల్లో భోపాల్ మాడ్యూల్‌లో కీలకంగా వ్యవహరించిన జిమ్ ట్రైనర్ యాసిర్ ఖాన్ మానవబాంబుగా మారడానికి సిద్ధమయ్యాడు. దాని కోసం ఇంటర్‌నెట్‌లో కొన్ని వీడియోలను సెర్చ్ చేశాడని ఏటీఎస్ అధికారులు నిర్ధారించారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు రద్దీ ప్రాంతంలో తనను తాను పేల్చుకోవాలని యాసిర్‌ఖాన్ కుట్ర పన్నినట్లు ఆధారాలు సేకరించారు. ఈ ఉగ్రవాదుల్లోని భోపాల్ మాడ్యూల్‌కు దుబాయ్ సహా మరికొన్ని దేశాల నుంచి నిధులు వచ్చినట్లు ఏటీఎస్ ప్రాథమికంగా తేల్చింది. ఈ అంశంపై లోతుగా దర్యాప్తు చేయాల్సిందిగా కోరుతూ ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్‌ను (ఎఫ్ఐయూ) రంగంలోకి దింపాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. అందుకు అంగీకరించిన కేంద్ర ఆర్థిక శాఖ... ఆ మేరకు ఎఫ్ఐయూకి ఆదేశాలు జారీ చేసింది. ఆయుధాలు, డ్రోన్లు, శిక్షణ శిబిరాలు సహా వివిధ అంశాలకు ఈ ఉగ్రవాదులు ఖర్చు పెట్టిన నగదు ఎంత? అది వారికి ఎలా వచ్చింది? విదేశాల నుంచి వారికి సహకరిస్తున్నది ఎవరు? నిధులు పంపింది ఎవరు? తదితర అంశాలపై ఎఫ్ఐయూ దృష్టి పెట్టనుంది. అవసరమైతే ఈడీని రంగంలోకి దింపాలని, ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్‌తోపాటు ఫెమా కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయించాలని ఎఫ్ఐయూ భావిస్తోంది. ఒకట్రెండు రోజుల్లో ఈ విభాగం అధికారులు భోపాల్‌లో చిక్కిన యాసిర్ ఖాన్‌తోపాటు హైదరాబాద్‌లో అరెస్టు అయిన మహ్మద్ సలీంను ప్రశ్నించనున్నట్లు సమాచారం.

తెలంగాణ

ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించిన యశ్వంత్

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన పర్వతారోహకుడు భూక్య యశ్వంత్ నేపాల్‌లోని ఎవరెస్ట్ బేస్ క్యాంపును (ఈబీసీ) అధిరోహించాడు. యశ్వంత్ ఇప్పటికే ప్రపంచంలో పేరుగాంచిన పలు పర్వత శ్రేణులను అధిరోహించాడు. ఈనెల 12వ తేదీన ఎవరెస్ట్ బేస్ క్యాంపు నుంచి ట్రెక్ ప్రారంభించి.. 17న బేస్ క్యాంపు శిఖరం చేరుకున్నట్లు యశ్వంత్ 'సాక్షి'కి ఆదివారం ఫోన్‌లో తెలిపాడు. 5,364 మీటర్ల బేస్ క్యాంపు యాత్ర పూర్తి చేయడానికి 10 రోజులు పట్టిందని పేర్కొన్నాడు. మైనస్ 10 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లో ట్రెక్ చేసినట్లు యశ్వంత్ వెల్లడించాడు.


ఎవరెస్ట్ బేస్ క్యాంపుపై జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న యశ్వంత్

గుడ్ ఈవినింగ్ డాక్టర్!

కర్నూలు పెద్దాసుపత్రిలో సాయంత్రం ఓపీ సేవలు ప్రారంభం

- రాయలసీమతో పాటు తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లాకు ఈ ఆసుపత్రే పెద్దదిక్కు
- రోజూ దాదాపు 2,500 మంది రోగులకు ఓపీ సేవలు
- మధ్యాహ్నం 3 నుంచి 4 వరకు ఓపీతో రోగులకు సౌకర్యం
- వైద్యపరీక్షల నివేదికలు సాయంత్రం వేళ పరిశీలన
- గతంలో రిపోర్టులు అందక మరుసటి రోజు లేక వారం వరకు నిరీక్షణ
- ప్రభుత్వ నిర్ణయంతో మెరుగైన వైద్యం

రోగులకు సత్వర వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బోధనాసుపత్రుల్లో సాయంత్రం ఓపీని ప్రారంభించింది. దీనివల్ల ఉదయం ఓపీలో చికిత్స చేయించుకున్న రోగి పరీక్షలను సాయంత్రం ఓపీలో చూపించుకుని ఇంటికి వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతోంది. గతంలో ఉదయం ఓపీలో చూపించుకోగా పరీక్షలు చేయించుకుని వచ్చేసరికి సంబంధిత వైద్యులు ఉండని పరిస్థితి. ఈ కారణంగా మళ్లీ వారం వరకు నిరీక్షించాల్సిన పరిస్థితి. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోగికి అదే రోజు వ్యాధి నిర్ధారణ, చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాయంత్రం ఓపీ సేవలకు శ్రీకారం చుట్టడం విశేషం.


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఓపీ టికెట్లు ఇస్తారు. ఓపీలలో వైద్యులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అందుబాటులో ఉంటారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ సమయం చాలా ఇబ్బందిగా మారింది. కొంత మంది ఆసుపత్రికి వచ్చేలోపు ఓపీ సమయం ముగిసిపోతుంది. ఇంకొందరు వైద్యుల వద్ద చికిత్స చేయించుకుని వైద్యపరీక్షలకు వెళ్లి వచ్చేలోగా డాక్టర్లు ఓపీలో ఉండని పరిస్థితి. కొన్ని విభాగాల ఓపీ వారం తర్వాత, మరికొన్నింటికి వారంలో రెండుసార్లు మాత్రమే ఓపీ ఉంటుంది. వైద్యపరీక్షలు చేయించుకున్న వారు తిరిగి ఆ రోజున వచ్చి చికిత్స చేయించుకోవాల్సి వచ్చేది. దీనివల్ల వ్యాధి ముదరడంతో పాటు చికిత్స అందక రోగి మరింత ఇబ్బంది పడాల్సి వచ్చేది. దీంతో కొంత మంది రోగులు ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స చేయించుకునేవారు. ఈ ఇబ్బందులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. ఏ రోజు వచ్చిన రోగి అదే రోజే చికిత్స చేయించుకుని వెళ్లేలా ప్రణాళిక రూపొందించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉదయం ఓపీతో పాటు సాయంత్రం ఓపీ కూడా ప్రారంభించారు. రెండు రోజులుగా సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు సైతం వైద్యులు ఓపీలో ఉండి రోగులకు చికిత్స చేస్తున్నారు.

రోజూ 2,500 మందికి పైగా చికిత్స

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రతిరోజూ జిల్లాతో పాటు నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, రాయచోటి, వైఎస్ఆర్, ప్రకాశం, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పలు జిల్లాల రోగులు చికిత్స కోసం వచ్చేవారు. ఈ మేరకు ప్రతిరోజూ ఓపీ రోగుల సంఖ్య సోమ, మంగళ, బుధవారాల్లో 2,500 నుంచి 3వేల వరకు, ఇతర రోజుల్లో 2,200 నుంచి 2,500 వరకు చికిత్స కోసం వస్తున్నారు. వీరితో పాటు వారి వెంట సహాయకులు కూడా వస్తుండటంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేలాది మందితో ఆసుపత్రి ఆవరణ కిటకిటలాడుతోంది. వీరితో పాటు నిత్యం 1,200 నుంచి 1500 మంది వరకు ఇన్‌పేషంట్లుగా చికిత్స అందుకుంటున్నారు. న్యూరోసర్జరీ, మెడికల్, కాలిన రోగుల వార్డు, సర్జికల్ వార్డుల్లో కొందరు ఒక్కోసారి నెలరోజుల పాటు ఉండి చికిత్స అందుకోవాల్సి వస్తోంది. ఇక్కడి వైద్యులపై నమ్మకంతో వందల కిలోమీటర్ల దూరం నుంచి రోగులు ప్రయాస అనుకోకుండా వైద్యం కోసం వస్తున్నారు.


ఓపీ విభాగాల్లో రోగులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

సాయంత్రం ఓపీ వల్ల ఉపయోగాలు

- ▲ దూరప్రాంత వాసులు మళ్లీ మళ్లీ రాకుండా వచ్చిన రోజే చికిత్స అందుకునే అవకాశం.
- ▲ ఉదయం ఓపీ సమయం ముగిసినా తిరిగి సాయంత్రం వరకు ఉండి వైద్యులను కలిసి చికిత్స చేయించుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడింది.
- ▲ దీర్ఘకాలిక వ్యాధుల రోగుల వైద్యపరీక్షల నివేదికలను అదే రోజే వైద్యులు చూసే వెసలుబాటు కలుగుతోంది.
- ▲ ల్యాబోరేటరీలు, ఫార్మసీలలోనూ రద్దీ తగ్గుతోంది.
- ▲ గతంలో ఉదయం ఓపీ తర్వాత క్యాజువాలిటీలో రద్దీ పెరిగేది. ఇప్పుడు మధ్యాహ్నం సైతం వైద్యులు ఓపీలో ఉండటంతో క్యాజువాలిటీలో రద్దీ ఉండటం లేదు.

ఫలితాల ఆధారంగా సూపర్‌స్పెషాలిటీలోనూ అమలు

ఆసుపత్రికి వచ్చిన రోగి సాయంత్రం వరకు ఉండి పూర్తిస్థాయిలో చికిత్స పొందే వెళ్లే పరిస్థితి ఏర్పడింది. గతంలో కొన్నిసార్లు మళ్లీ రావాల్సి వచ్చేది. ఈ మేరకు సాయంత్రం వేళల్లో ప్రతి ఒక్క ఓపీలోనూ వైద్యులు ఉండాలని ఆదేశాలు జారీ చేశాం. దీనివల్ల ఒకేరోజు ఓపీ చికిత్స, వైద్యపరీక్షలు, చికిత్స అందే అవకాశం ఉంది. ముందుగా అన్ని రకాల స్పెషాలిటీలలో సాయంత్రం ఓపీ ప్రారంభించాం. దీని ఫలితాలు చూశాక ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలను బట్టి సూపర్‌స్పెషాలిటీల్లో కూడా ఈ సేవలు అందిస్తాం.

–డాక్టర్‌జి.నరేంద్రనాథ్‌రెడ్డి, సూపరింటిండెంట్, జీజీహెచ్, కర్నూలు

సేవలు చాలా సౌకర్యం

నా భార్యకు కాలులో సమస్య ఉండటంతో ఉదయం ఓపీకి వచ్చాను. వైద్యులు ఎక్స్‌రేతో పాటు అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్ష రాశారు. ఈ పరీక్షలు పూర్తయ్యేలోగా 2 గంటలు అయ్యింది. వైద్యులు 3 గంటల ఓపీకి రావడంతో వారికి చూపించుకుని వెళ్తున్నాం. గతంలో అయితే మళ్లీ రెండు, మూడు రోజులకు రావాల్సి వచ్చేది. ఇప్పుడు ఏ రోజు పరీక్షలు అదే రోజే చూడటం బాగుంది. నందవరం మండలం నుంచి వచ్చాను.

– నౌషాద్, స్టాంటన్‌పురం, కర్నూలు

వేట విరామం వేళ.. వైవిధ్య జీవనమాల

రెండు నెలలు గ్రామ వీధుల్లో మత్స్యకారుల సందడి

చెట్ల నీడన కాలక్షేపం

- ప్రతి ఏడాది మత్స్యకార కుటుంబాలకు అండగా ప్రభుత్వం
- ఇటీవల బ్యాంక్ ఖాతాల్లో ఆర్థిక సాయం జమ
- కొందరు వ్యవసాయం, ఉపాధి పనులపై మక్కువ

కడలిలో చేపల వేట చేసే గంగపుత్రులకు వేట విరామ సమయం చాలా విభిన్నంగా గడుస్తుంది. పదినెలలపాటు వేటలో జీవితం ఒక రకంగా సాగుతుంది. వేసవి కాలంలో మత్స్య సంపద పునరుత్పత్తిలో భాగంలో రెండునెలలపాటు వేటను నిషేధిస్తారు. దీంతో చాలా మంది ఇంటిపట్టునే ఉంటూ బోట్లు, వలల రిపేర్లపై దృష్టి పెడుతుంటారు. సంక్షేమ పథకాలు, విరామ సమయంలో చేసే ఆర్థిక సాయం వారికి ఎంతగానో ఉపయోగపడుతోంది. కొందరు వివిధ పనులకు వెళ్తుంటారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 169 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. సుమారు 1.50 లక్షల మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. అందులో దాదాపు 41 వేల మందికి చేపల వేటే ఆధారం. ప్రతి ఏటా 65 వేల టన్నుల మత్స్య సంపదను సముద్రం నుంచి సేకరిస్తారని గణాంకాలు చెబుతున్నాయి. గంగపుత్రుల జీవనశైలి విభిన్నంగా ఉంటుంది. వేట జరిగే రోజుల్లో అయితే వేకువజామునే దినచర్య ప్రారంభమవుతుంది. సిద్ధం చేసుకున్న వలలను భుజాలపై వేసుకుని బోటులో సముద్రంలోకి వెళ్తారు. సుమారు ఐదు కిలోమీటర్లు వెళ్లి వలలు వేసి మత్స్య సంపదను సేకరించి ఉదయం 8 గంటలకే ఇంటికి చేరుకుంటారు. మత్స్య సంపదను వేలం ద్వారా విక్రయాలు చేసుకుంటారు. మెకనైజ్డ్ బోట్లు ఉన్న వారు మాత్రం వారంరోజులపాటు వేట చేస్తారు. ఇలా పదినెలలపాటు జరుగుతుంది.

విరామ సమయంలో..

ప్రతి ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15వ తేదీ వరకు సముద్రంలో చేపల వేట నిషేధం అమలులో ఉంటుంది. ఈ విరామ సమయంలో మత్స్యకార కుటుంబాల జీవనం కొంత విభిన్నంగా ఉంటుంది. కొందరు స్థానికంగా ఆక్వాకల్చర్‌లో కూలీలుగా, రొయ్యల ప్యాకింగ్, చెరువుల్లో రొయ్యలు పట్టడం, ఇతరత్రా పనులకు వెళ్తారు. ఇంకొందరు ఇంటి వద్దే ఉంటారు. పలువురు మహిళలు ఉపాధి హామీ పనులకు వెళ్తుంటారు. ఒకవేళ పనులు అందుబాటులో లేకుంటే వారు కూడా ఇంటిపట్టునే ఉంటారు. అందరిలో దైవభక్తి కూడా ఎక్కువే. స్థానికంగా ఉండే ఆలయాల్లో ప్రతి ఏటా ఘనంగా ఉత్సవాలు చేస్తుంటారు.


చేపల వేటకు ఉపయోగించే బోట్లు (ఫైల్)

ప్రత్యామ్నాయంగా..

మత్స్యకార పల్లెల్లో చేపల వేటతోపాటు ప్రత్యామ్నాయంగా వ్యవసాయం చేస్తున్న వారు కూడా ఉన్నారు. చదువుకున్న యువత ఉపాధి మార్గాల వైపు దృష్టి పెట్టారు. కావలి రూరల్ మండలంలోని తుమ్మలపెంట పంచాయతీ, ఇందుకూరుపేట మండలంలోని పలు గ్రామాల్లో మత్స్యకారులు వ్యవసాయం చేసుకుంటున్నారు. వేట విరామం సమయంలో భూముల్లో వేరుశనగ పంట సాగు చేస్తున్నారు. యువత మాత్రం చదువలపైనే దృష్టి సారించి విద్యావంతులుగా మారి ఉద్యోగావకాశాలు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం జరుగుతోంది. కానీ చేపల వేటను నమ్ముకున్న కొందరు వేరే ఉపాధి మార్గలపై దృష్టి సారించడం లేదు.

ప్రభుత్వ సాయంతో..

చేపల వేటకు విరామం ఇచ్చిన సమయంలో మత్స్యకారుల జీవన భృతికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.10,000 చొప్పున ఆర్థిక సాయం చేస్తోంది. ఈ సాయం కాస్త ఆ కుటుంబాలకు ఆధారంగా మారుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కూడా వారి మెరుగైన జీవనానికి దోహదపడుతోంది. అనేక పథకాలు పక్కాగా అందుతుండడం వేట విరామం సమయంలో ఆ కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించింది. ఈ ఏడాది జిల్లాలో 12,072 మందికి ప్రభుత్వ సాయం అందింది.


సముద్రంలో వేట చేస్తున్న మత్స్యకారులు (ఫైల్)

రుణాలివ్వాలి

మాకు వ్యవసాయ భూముల్లేవు. పంటలు పండించే విధానం తెలియదు. తెలిసిందల్లా చేపల వేటే. రెండునెలలపాటు ఇళ్ల వద్దే ఉంటాం. ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోంది. ఇంకా వలలు బోట్ల కోసం రాయితీపై రుణాలివ్వాలి.

– ఆవుల గోవింద్, తుమ్మలపెంట

ప్రభుత్వ సాయంతోనే..

వేట విరామ సమయంలో రెండునెలలపాటు ఖాళీగా ఉంటున్నాం. ఆక్వా సాగు చేసే వారు పనులకు పిలిస్తే వెళ్తాం. అర్హత ఉన్న వారికి ప్రభుత్వం రూ.10 వేల వంతున సాయం చేస్తోంది. ఇంకా సంక్షేమ పథకాల ద్వారా వచ్చే నగదుతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం.

– కాటంగారి కనకయ్య, తుమ్మలపెంట

ఉపాధి కల్పించాలి

మా గ్రామాల్లో చాలా వరకు యువకులు చదువుకుని విద్యావంతులుగా మారుతున్నారు. వారు మాత్రం చేపల వేటకు వెళ్లడం లేదు. పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలి.

– కొండూరు వెంకటేశ్వర్లు, రాముడుపాళెం

అర్హులకు సంక్షేమ ఫలాలు

మత్స్యకారులకు వేట విరామంలో ప్రభుత్వ సాయం చేస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 12 వేల మందికి రూ.10 వేల వంతున నగదు అందించాం. అలాగే ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా కూడా బోట్లు, వలలు, అందిస్తున్నాం. ఇంకా మెకనైజ్డ్ బోట్ల పంపిణీకి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు రూపొందిస్తోంది.

– నాగేశ్వరరావు, ఫిషరీస్ జేడీ, నెల్లూరు



సన్నిధి

మంచి మాట

నొప్పి.. బాధ.. దుఃఖం.. శోకం

మనకు నొప్పి తెలుస్తుంది ఆ నొప్పి మనతో ఉన్నప్పుడు. మనం బాధను అనుభవిస్తాం ఆ బాధ మనతో ఉన్నప్పుడు. మనం దుఃఖిస్తాం ఆ దుఃఖం మనతో ఉన్నప్పుడు. మనం ఉన్నందుకు లేదా మనం ఉన్నాం కాబట్టి మనకు నొప్పి, బాధ, దుఃఖం, ఉంటాయి. ఇంకా చెప్పాలంటే మనం ఉన్నాం కాబట్టే అవి ఉంటాయి. ఇవే కాదు శోకం కూడా ప్రతి మనిషికీ ఉంటుంది. ఏదో శోకమో, శోకం ఏదో రకంగానో మనకు ఉంటుంది. నొప్పి, బాధ, దుఃఖం, శోకం ఉన్నాయని, ఉంటాయని మనం ఉండకుండా పోలేం.

ప్రతిమనిషికీ కన్నీరు వస్తుంది. హృదయ వీణ తీగలు తెగిపోయేట్టుగా వ్యథల వేళ్లు మీటిన కారణంగా పలికే అపశ్రుతుల స్వరాలుగా జలజలా కన్నీరు ఒలుకుతుంది. ఆ కన్నీరు మనలో కదలాడుతూ ఉన్న నొప్పి, బాధ, దుఃఖం, శోకం వీటిని మౌనంగా పలికిస్తుంది. నొప్పి, బాధ, దుఃఖం, శోకం తమను తాము తీర్చుకోవడమే లేదా కరిగించుకోవడమే కన్నీరు రావడమేమో?

నొప్పికి కూడా నొప్పి ఉంటుందేమో? బాధ కూడా బాధ పడుతుందేమో? దుఃఖం కూడా దుఃఖిస్తుందేమో? శోకం కూడా శోకిస్తుందేమో? అందుకే అవి కన్నీరుగా బయటకొచ్చేస్తాయేమో? తాము లేకపోతేనే మంచిదని తమంత తాముగా అవి కన్నీరుగా వెళ్లిపోతాయేమో?

కన్నీరు వచ్చేశాక మనిషి మనసు కుదుట పడుతుంది లేదా మనసులోకి ఒక రకమైన ప్రశాంతత వస్తుంది. దానికి కారణం నొప్పి, బాధ, దుఃఖం, శోకం ఇవి పూర్తిగానో, పాక్షికంగానో కన్నీరుగా కరిగి బయటకు వెళ్లిపోవడమేనేమో? లోపల ఉష్ణాలుగా ఉండే నొప్పి, బాధ, దుఃఖం, శోకం కన్నీరుగా వస్తూ ఉండడం వల్లే కన్నీరు వేడిగా ఉంటుందేమో?

నొప్పి, బాధ, దుఃఖం, శోకం కన్నీరుగా బయటకు వచ్చి మన నుంచి తొలగిపోతూ అవి మనకు పాఠం చెప్పి పోతాయి. ఈ పరిణామాన్ని మనం సరిగ్గా గమనించాలి. ఆ పాఠాన్ని అర్థం లేదా అవగతం చేసుకుంటే మనకు ప్రయోజనం కలుగుతుంది, పరిణతి వస్తుంది అటుపైన పరితోషం కూడా ప్రాప్తిస్తుంది.

మనుగడ పదునెక్కాలన్నా, ఫలించాలన్నా మన నొప్పి, బాధ, దుఃఖం, శోకం తెలియజెప్పిన లేదా తెలియజెబుతున్న పాఠాన్ని మనం హృదయస్థం చేసుకోవాలి; బుద్ధికి అద్దుకోవాలి; మనకు మనం ప్రయోజనాన్ని చేకూర్చుకోవాలి.

మనిషికి నొప్పి, బాధ, దుఃఖం, శోకం లేకుండా ఉండవు అని అనడం ఎంత సత్యమో అవి లేకుండా ఉంటే మనిషికి పరిణామం, పరిణతి ఉండవు అని అనడం కూడా అంతే సత్యమే. నిజమే నొప్పి, బాధ, దుఃఖం, శోకం వీటిని ఎవరూ కోరుకోరు. కానీ అవి ఏ మనిషిని వదలవు. అవి మనిషిని గట్టిగా పట్టుకుని మరీ పాఠం చెబుతాయి. మనిషికి మరో రకంగా తెలియరాని పాఠం చెబుతాయి. ఆ పాఠం మనిషికి ఎంతో అవసరం. మనిషి ఆ పాఠాన్ని సరిగ్గా చదువుకోవాలి.

> నొప్పి, బాధ, దుఃఖం, శోకం కన్నీరుగా బయటకు వచ్చి మన నుంచి తొలగిపోతూ అవి మనకు పాఠం చెప్పి పోతాయి. ఈ పరిణామాన్ని మనం సరిగ్గా గమనించాలి. ఆ పాఠాన్ని అర్థం లేదా అవగతం చేసుకుంటే మనకు ప్రయోజనం కలుగుతుంది. పరిణతి వస్తుంది అటుపైన పరితోషం కూడా ప్రాప్తిస్తుంది.

నొప్పి, బాధ, దుఃఖం, శోకం... వీటిని కన్నీరు కరిగిస్తుంది. అటు తరువాత మనసులో ఖాళీ ఏర్పడుతుంది. ఆ ఖాళీ సంతోషం కోసమే! మనంత మనం ఆ ఖాళీని సంతోషంతో నింపుకోవాలి.

మనం ప్రాణంతో ఉంటాం మనలో ప్రాణం ఉన్నప్పుడు. మనం సంతోషంగా ఉంటాం మనలో సంతోషం ఉన్నప్పుడు. మనం సంతోషంగా ఉందాం మనలో సంతోషాన్ని నింపుకుని. సంతోషాన్ని పొందడం, నిలుపుకోవడం మనం నేర్చుకోవాలి.

ఉనికి ఒక అనుభవం; అనుభవం ఒక ఉనికి. మన ఉనికి సంతోషంతో ఉండాలి; సంతోషాన్ని మనం అనుభవంగా సాధించుకుంటూ ఉండాలి.

– రోచిష్మాన్

గురువాణి

కంటికి కనబడని ఆభరణం



ఒకనాడు యవ్వనంలో ఎంతో మిసమిసలాడుతున్న వ్యక్తి... వృద్ధాప్యం వచ్చేసరికి ఒళ్ళంతా ముడతలు పడిపోయి, దవడలు జారిపోయి, జుట్టు తెల్లబడిపోయి ఉండవచ్చు. కానీ భౌతికంగా ఎంత అందంగా ఉన్నారన్నది కాదు, కాలక్రమంలో అది నిలబడదు. భగవంతుడిచ్చిన విభూతులను వయసులో ఉన్నప్పుడే సక్రమంగా వాడుకుని ఆ అందాన్ని పెంచుకోవాల్సి ఉంటుంది. అందువల్ల ఆ చివరి సమయంలో మనిషికి అందం – ఆయన అనుభవం, గతంలో ఆయన ప్రవర్తించిన తీరు, ఆయన నడవడిక మాత్రమే.

''హస్తస్య భూషణం దానం, సత్యం కంఠస్య భూషణం, కర్ణస్య భూషణం శాస్త్రం, భూషణైః కిం ప్రయోజనం'' చేతికి కంకణములు, కేయూరములు, అంగదములు, ఉంగరములు... ఇవన్నీ కూడా అలంకారాలే.. భగవంతుడిచ్చినప్పుడు వేసుకోవడంలో తప్పేమీ లేదు.

కానీ అన్ని ప్రాణులలో ఉన్న ఆత్మ ఒక్కటే...అని.. అవతలి ప్రాణి కష్టాన్ని తన కష్టంగా భావించి ఆదుకోవడం కోసం తన చేతితో తనదైన దానిని ఇవ్వగలిగిన వాడు ప్రాజ్ఞుడు. ఆ చేతికి దానమే అతి పెద్ద అలంకారం. మిగిలిన అలంకారాలు తొలగిపోయినా... పైకి కనబడకపోయినా అది శాశ్వతంగా నిలిచిపోయే, వెలిగిపోయే అలంకారం. దానం చేయడం అంటే ఏమీ మిగుల్చుకోకుండా అని కాదు. తనకున్న దానిలో తన శక్తికొద్దీ ప్రతిఫలాన్ని ఆశించకుండా చేయడం... అలా ఎందుకు? అంటే అలా చేయకుండా ఉండలేకపోవడమే మానవత్వం.

శరీరంలో ఎక్కువగా ఆభరణాలు అలంకరించుకునే అవయవం కంఠం. వాటిలో మంగళప్రదమైనవి, ఐశ్వర్య సంబంధమైనవి ఉంటాయి.. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ... మనిషిని భగవంతుడికి దగ్గరగా తీసుకెళ్ళేది... సత్య భాషణం. నిజాన్ని నిర్భయంగా, ప్రియంగా మాట్లాడడం. సత్యాన్ని మించిన ఆభరణం మరేదీ కంఠానికి అంత శోభనివ్వదు. ఇతర ఆభరణాలను తీసినట్లుగా ఈ ఆభరణాన్ని తీయడం అసాధ్యం. భగవంతుడు మనకు రెండు చెవులిచ్చాడు. మన అందాన్ని పెంచడానికి వీటిని కూడా అలంకరించుకుంటూ ఉంటాం. కానీ వాటికి నిజమైన ఆభరణం.. శాస్త్రాన్ని ఎప్పుడూ వింటూ ఉండడం, అంటే మన అభ్యున్నతికి దోహదపడే మంచి విషయాలను వినడం, అలా విన్న వాటితో సంస్కరింపబడి ఉన్నతిని పొందడం. నోటితో తిన్నది శరీర పుష్టికి కారణమవుతున్నది. చెవులద్వారా విన్నది... మనిషి సౌశీల్యానికి కారణం కావాలి.

ఆయన ఊపిరి వదలడు, ఊపిరి తియ్యడు..అని నిర్ధారించుకున్న తరువాత చిట్టచివరన శరీరాన్ని పంచభూతాల్లో కలిపివేసేటప్పుడు ఇక ఆ శరీరం మీద ఏ ఒక్క ఆభరణాన్ని కూడా ఉంచరు.. అన్నీ తీసేస్తారు... అప్పుడు తీయలేనివి, పైకి కనపడనివి కొన్ని ఉంటాయి... తన జీవిత కాలంలో దానగుణంచేత, సత్యభాషణం చేత, తన ఉన్నతికి పనికొచ్చే విషయాలను శాస్త్రాల ద్వారా వినడం చేత సమకూర్చుకున్న ఆభరణాలు మాత్రం ఉండిపోతాయి. ఇవి నీ పేరు శాశ్వతంగా ఉండిపోవడానికి, కాలంతో సంబంధం లేకుండా నిన్ను పదిమంది ఎప్పుడూ స్మరిస్తూ ఉండడానికి, నిన్ను చాలా మంది ఆదర్శంగా తీసుకోవడానికి, నిన్ను పరమాత్మకు చేరువ చేయడానికి ఎప్పుడూ నిన్ను అలంకరించి నీ అందాన్ని, వైభవాన్ని పెంచుతుంటాయి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి

గద్దలు నేర్పిన పాఠం

పూర్వం జంబూ ద్వీపాన్ని ఏసుకారి అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. అతను మంచివాడే కానీ, కొద్దిగా లోభి. ఆయనకు సంతానం లేదు. ఆ కొద్దిపాటి లోభితనాన్ని వదులుకోమని ఆయన పట్టపు రాణి పదే పదే చెప్పేది. అయినా ఏసుకారి తన పద్ధతి మార్చుకునేవాడు కాదు.

అయాచితంగా వచ్చిన సొమ్ముతో తన బొక్కసాన్ని నింపుకోవాలని చూసేవాడు. ఒకసారి రాజుకు మిత్రుడైన ఒక వ్యాపారి సంపదను కూడా ఏసుకారి రాబట్టి, ధనాగారాన్ని నింపాడు. ఈ చర్య రాణికి నచ్చలేదు. ఆమె వెంటనే ఒక ఉపాయం ఆలోచించింది. రాజు భవనం ప్రక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో కొన్ని మాంసపు ముక్కలు చల్లించి వాటిపై వల పన్నించింది.

ఆమె అనుకున్నట్లే కొద్దిసేపటికి గద్దల గుంపు అటుకేసి వచ్చేసింది. ఇంక అప్పుడు రాజుగారిని తీసుకుని భవనం పై భాగానికి వచ్చింది.


''మహారాజా! అటు చూడండి'' అంటూ గ్రద్దల్ని చూపింది. కొన్ని గ్రద్దలు వలకు దూరంగా నిలబడి వెళ్ళి ముక్కల్ని తినాలా వద్దా' అని ఆలోచిస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాయి. లేచి వలమీదకి వెళ్తున్నాయి గానీ, కిందకు దిగడం లేదు. మరలా వచ్చి వలకు బయట నేలమీద వాలుతున్నాయి.

''రాణీ! ఏమిటిది'' అని అడిగాడు ఏసుకారి.

''ప్రభూ! చూడండి!'' అంది చిరునవ్వుతో మహారాణి.

కొన్ని గ్రద్దలు అప్పటికీ ఆత్రంగా వల మీద వాలాయి. అందినంత మెక్కాయి. పొట్ట నిండింది. బరువెక్కాయి. ఎగరడానికి ప్రయత్నించాయి. రెక్కలు టపటప లాడాయి. కానీ, వాటి బరువుకి అవే లేవలేకపోయాయి. అటూ ఇటూ కదిలి తమ కాళ్ళకి వలను చుట్టుకున్నాయి.

''ప్రభూ! చూశారా! వాటి దురవస్థ. దురాశ ఫలితం ఇది. అజ్ఞానం, అనాలోచన, అతి దురాశ ఆ స్థితికి తెచ్చాయి'' అంది. వారు ఇంకా మాట్లాడుకుంటూనే ఉన్నారు. అంతలో కొన్ని గ్రద్దలు తిన్న ఆహారాన్ని వాంతి చేసుకుంటున్నాయి. దాని వల్ల అవి కాస్త తేలికపడి పైకి లేవడానికి ఇబ్బంది తగ్గింది. అవి మెల్లగా పైకి లేచి వలలో చిక్కుపడకుండా చివరకు బయటపడ్డాయి.



అంతలో కొందరు రాజభటులు వల దగ్గరకు పరుగులు తీస్తూ వెళ్లారు. వలలో చిక్కుబడని గ్రద్దలు ఎగిరి వెళ్ళిపోయాయి. ఎగరలేక, చిక్కుబడ్డవి దొరికిపోయాయి. వాటిలో కొన్నింటిని పట్టుకుని, కాళ్ళు కట్టి వాటిని కావడిలా కర్రకు దూర్చి తీసుకుపోయారు భటులు.

''మహారాజా! చూశారా! దురాశకు పోయేవారు ప్రమాదాన్ని గుర్తించలేరు. చివరికి ప్రాణాల మీదకి తెచ్చుకుంటారు. మనలో కూడా అయాచితంగా వచ్చే సంపదని పోగు చేసుకునే వారికి చివరికి ఇదే గతి. మరి కొందరు కొంత నష్టం జరిగాక అనుభవం ద్వారా తెలుసుకుంటారు. తప్పుని సరిదిద్దుకుంటారు. ఇంకొందరు రాబోయే ప్రమాదాన్ని గుర్తించి, దురాశలకు పోక తగినంతలోనే జీవనం సాగిస్తారు. వీరు వలలో చిక్కుకోనివారు. ప్రాజ్ఞులు'' అని చెప్పింది.

రాణి ఎందుకు అలా చెప్పిందో, ఎవరి కోసం చెప్పిందో, దేనిని ఉద్దేశించి చెప్పిందో రాజుకి అర్థమైంది. మరునాడు ఖజానా తెరిపించాడు. తాను అనాయాసంగా సంపాదించినదంతా రాజ్య సంక్షేమానికి వినియోగించాడు. ఇవ్వవలసిన వారికి తిరిగి ఇచ్చేశాడు.

తృష్ణారహితులకు ఎప్పుడూ ఆపదలు ఆమడ దూరంలో ఉంటాయి అని బుద్ధుడు చెప్పిన ఏసుకారి కథ ఇది.

– డా. బొర్రా గోవర్ధన్

సంగీత రాజ్ ఇక లేరు



రాజ్

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకంది.ప్రముఖ సంగీత దర్శకుడు రాజ్(68) ఆదివారం కన్నుమూశారు. హైదరాబాద్‌లోని స్వగృహంలో గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రాజ్ అసలు పేరు తోటకూర సోమరాజు. ప్రముఖ సంగీత దర్శకుడు టీవీ రాజు, సావిత్రి దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో వెంకట సూర్యనారాయణ రాజు పెద్దవాడు కాగా, తోటకూర సోమరాజు(రాజ్) చిన్నవాడు. 1954 జూలై 27న రాజ్ జన్మించారు. టీవీ రాజు స్వస్థలం రాజమండ్రి సమీపంలోని రఘుదేవపురం. అయితే ఆయన చెన్నైలో స్థిర పడటంతో రాజ్ అక్కడే పుట్టి, పెరిగారు. చిన్నప్పటి నుంచి సినిమా వాతావరణంలో, ముఖ్యంగా సంగీత నేపథ్యంలో పెరగటంతో రాజ్‌కి సంగీతంపై అవగాహన ఉండేది. చదువులో యావరేజ్ స్టూడెంట్ అయిన రాజ్‌కి చిన్నతనం నుంచే సంగీతం నేర్పించారు టీవీ రాజు. ఓ వైపు ఇంటర్ చదువుతూనే మరోవైపు ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి హనుమంతరావు వద్ద అసిస్టెంట్‌గా చేరారు రాజ్. ఆ సమయంలో తన తండ్రి టీవీ రాజు 1973 ఫిబ్రవరి 20న యాభైఏళ్ల వయసులో హఠాన్మరణం చెందారు. దీంతో కొద్ది రోజులు ఏం చేయకుండా అలాగే ఉండిపోయిన రాజ్ ఆ తర్వాత ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్పీ కోదండపాణి వద్ద అసిస్టెంట్‌గా చేరారు. ఓ ఏడాది తర్వాత సాలూరి రాజేశ్వరరావు వద్ద అసిస్టెంట్‌గా చేరి, ఆరేళ్ల పనిచేశారు. సాలూరి రాజేశ్వరరావు కుమారుల్లో ఒకరైన కోటితో రాజ్‌కి మంచి స్నేహం ఏర్పడింది. ఆ తర్వాత 1980లో సంగీత దర్శకుడు చక్రవర్తి వద్ద అసిస్టెంట్‌గా చేరారాయన. అప్పుడు చేతినిండా పని ఉండేది.. జేబు నిండా డబ్బులు వచ్చేవి.



రాజ్ భౌతికకాయం

ఆ సమయంలో 1982 మార్చి 11న రాజ్ వివాహం ఉషతో జరిగింది.

రాజ్–కోటి ద్వయం...

సంగీత దర్శకునిగా రాజ్ అందుకున్న తొలి అవకాశం 'ప్రళయగర్జన'(1983). మోహన్ బాబు హీరోగా పీసీ రెడ్డి దర్శకత్వం వహించిన ఆ చిత్రానికి రాజ్‌కి తొలి సోలో సంగీత దర్శకునిగా అవకాశం వచ్చింది. అయితే తన మిత్రుడు, కొలీగ్ అయిన కోటిని కలుపుకొని సంగీతం అందించాలని నిర్ణయించుకున్నారు రాజ్. ఆ విషయాన్ని కోటికి చెప్పడం.. ఆయన కూడా ఒప్పుకోవడంతో సంగీత ప్రపంచంలో రాజ్–కోటి ద్వయం ప్రారంభమైంది. 'సంసారం, యముడికి మొగుడు, ఖైదీనంబర్ 786, త్రినేత్రుడు, లంకేశ్వరుడు, ముఠామేస్త్రి, బాలగోపాలుడు, బంగారు బుల్లోడు, హలో బ్రదర్, అన్న–తమ్ముడు, శత్రువు' వంటి ఎన్నో సినిమాలకు వారిద్దరూ సంగీతం అందించారు.

సోలో మ్యూజిక్ డైరెక్టర్‌గా...

అనుకోని కారణాల వల్ల కోటి నుంచి విడిపోయిన రాజ్ సోలో మ్యూజిక్ డైరెక్టర్‌గానూ తనదైన శైలిలో సంగీతం అందించి శ్రోతలను మైమరపించారు. 'సిసింద్రీ, రాముడొచ్చాడు, ప్రేమంటే ఇదేరా(నేపథ్య సంగీతం)'.. ఇలా తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 70 సినిమాలకు పనిచేశారాయన. అలాగే పలు టీవీ సీరియల్స్‌కి కూడా సంగీతం అందించారు. అదేవిధంగా నటుడిగానూ పలు సినిమాల్లో మెరిశారు రాజ్. బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా 'హలో బ్రదర్' సినిమాకి 1994లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి రాజ్–కోటి ద్వయం నంది అవార్డు అందుకున్నారు.

మ్యూజిక్ డైరెక్టర్, నేపథ్య సంగీత దర్శకుడు, నటుడు.. ఇలా తనదైన శైలిలో ప్రేక్షకులను అలరించిన రాజ్ మృతితో చిత్రపరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతికి చిరంజీవితో పాటు పలువురు సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించి, ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

రాజ్‌కి భార్య ఉష, కుమార్తెలు దివ్య, దీప్తి, శ్వేత ఉన్నారు. కాగా హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో నేడు (సోమవారం) రాజ్ అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మాకూ షాకింగ్‌గానే ఉంది

– దివ్య, రాజ్ కుమార్తె

ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కార్డియాక్ అరెస్ట్‌తో నాన్న మృతిచెందారు. ఫ్యామిలీని, అభిమానులను ఎప్పుడూ సంతోషపరిచారాయన. నాన్నగారికి చిరంజీవిగారు ఎప్పుడూ ఓ బ్రదర్‌లా సపోర్ట్‌గా ఉన్నారు. నాన్న మరణంపై స్పందించినందుకు ఆయనకు థ్యాంక్స్. ఇటీవల ఓ సినిమా ఫంక్షన్‌లో కలిసిన నాన్న, కోటి అంకుల్ కబుర్లు చెప్పుకున్నారు. నాన్న మరణవార్త చెప్పగానే అంకుల్ షాక్ అయ్యారు.

మా పాటల రూపంలో బతికే ఉంటారు

– కోటి, సంగీత దర్శకుడు

నేను చెన్నైలో ఉండగా రాజ్ చనిపోయారనే చేదు వార్తను విన్నాను. ఇటీవలే ఓ సినిమా ఫంక్షన్‌లో కలుసుకున్నాం. తనకు ఆరోగ్య సమస్యలున్నట్టు నాకు అనిపించలేదు. రాజ్ కూడా నాతో చెప్పలేదు. చక్రవర్తి గారి వద్ద మేమిద్దరం అసిస్టెంట్లుగా పనిచేశాం. రాజ్–కోటిగా ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్స్ ఇచ్చాం. మేం విడిపోయిన తర్వాత కూడా నేను ఎన్ని సినిమాలు చేసినా.. వాటిని కూడా రాజ్–కోటి పాటలు అనేవారు. అలాంటిది ఈ రోజు నా రాజ్ లేడంటే ఎంతో బాధగా ఉంది. మా పాటల రూపంలో నా రాజ్ ఎప్పటికీ బతికే ఉంటాడు.

సినిమా

క్రేజీ కాంబినేషన్



విజయ్

తమిళ హీరో విజయ్, దర్శకుడు వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో సినిమా ఖరారైంది. ఈ క్రేజీ కాంబినేషన్‌లో మూవీని ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కల్పాతి యస్. అఘోరం, యస్. గణేష్, యస్. సురేష్ ఈ సినిమాను నిర్మించనున్నారు. 'బిగిల్' చిత్రం తర్వాత విజయ్‌తో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న రెండో చిత్రం ఇది. పైగా ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు ఇది 25వ చిత్రం కావడం విశేషం. ఈ మూవీకి యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. వచ్చే ఏడాది విడుదల కానున్న ఈ సినిమా గురించి మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు యూనిట్ పేర్కొంది. కాగా విజయ్ ప్రస్తుతం 'లియో' సినిమా చేస్తున్నారు. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబరు 19న విడుదల కానుంది.

కొత్త కథ విన్నారా?



రవితేజ

'డాన్ శీను(2010)', 'బలుపు (2013)', 'క్రాక్ (2021)' చిత్రాల తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో సినిమా సెట్స్‌పైకి వెళ్లేందుకు రంగం సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల గోపీచంద్ మలినేని చెప్పిన ఓ కథ రవితేజకు నచ్చిందట. దీంతో ఈ సినిమాను వీలైనంత త్వరగా సెట్స్‌పైకి తీసుకుని వెళ్లాలనుకుంటున్నారట రవితేజ. ఈ సినిమాను మైత్రీమూవీ మేకర్స్ నిర్మించనుందని భోగట్టా. ఇక ప్రస్తుతం ఫ్యామిలీతో కలిసి యూరప్ ట్రిప్‌లో ఉన్నారు రవితేజ. ఆయన నటించిన 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రం అక్టోబరు 20న రిలీజ్‌కు రెడీ అవుతుండగా, మరో చిత్రం 'ఈగిల్' (వర్కింగ్ టైటిల్) సెట్స్‌పై ఉంది.

కొరియాలో దృశ్యం



జే వోన్, మంగత్ పాతక్

భారతీయ 'దృశ్యం' కొరియా తెరపైకి వెళ్లనుంది. మోహన్‌లాల్ హీరోగా, మీనా, ఆశా శరత్, అన్సిబా హాసన్, సిద్ధిఖ్ ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం 'దృశ్యం'. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో ఆంటోనీ పెరుంబవూర్ నిర్మించిన ఈ చిత్రం 2013లో విడుదలై అద్భుత విజయం సాధించింది. ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ భాషల్లోనూ రీమేక్ అయి హిట్ అయింది. 'దృశ్యం' తర్వాత మోహన్‌లాల్–జీతూజోసెఫ్ కాంబోలో వచ్చిన 'దృశ్యం 2' కూడా వీక్షకుల నుంచి మంచి స్పందనను రాబట్టుకుంది. ఇక దృశ్యం సినిమా హిందీ రీమేక్‌లో అజయ్ దేవగన్ హీరోగా నటించిన విషయం తెలిసిందే. కాగా 'దృశ్యం' ఫ్రాంచైజీ కొరియాలో రీమేక్ కానుంది. సౌత్ కొరియా ఆంథాలజీ స్టూడియోస్, ఇండియన్ పనోరమ స్టూడియోస్ పతాకాలపై చోయ్ జే వోన్, కుమార్ మంగత్ పాఠక్ హిందీ 'దృశ్యం' ని కొరియాలో రీమేక్ చేయనున్నారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న 76వ కాన్స్ చలన చిత్రోత్సవాల్లో ఈ విషయాన్ని చోయ్ జే, మంగత్ పాఠక్ ప్రకటించారు. ఇండియన్, కొరియన్ ప్రొడక్షన్ హౌస్‌లు కలిసి ఓ సినిమాను నిర్మిస్తుండటం ఇదే తొలిసారి. ''సాధారణంగా కొరియన్ చిత్రాలు భారతీయ భాషల్లో రీమేక్ అవుతుంటాయి. కానీ, ఇప్పుడు ఓ ఇండియన్ సినిమా కొరియాలో రీమేక్ అవుతుంది'' అన్నారు పాఠక్.

పరేషాన్ హిట్ కావాలి

– రానా దగ్గుబాటి



పావని, తిరువీర్, రానా

''యంగ్ టీమ్ అంతా ప్రేమించి ప్యూర్ ఎనర్జీతో 'పరేషాన్' సినిమా తీశారు. ఈ చిత్రంలో నేనూ భాగమైనందుకు గౌరవంగా భావిస్తున్నాను. ఈ చిత్రం మంచి హిట్ కావాలి. అలాగే నా తమ్ముడు అభిరామ్ నటించిన 'అహింస' కూడా జూన్ 2న రిలీజ్ అవుతోంది. అన్ని సినిమాలు బాగా ఆడాలి'' అని హీరో రానా దగ్గుబాటి అన్నారు. 'మసూద' ఫేమ్ తిరువీర్ హీరోగా, పావని కరణం హీరోయిన్‌గా రూపక్ రోనాల్డ్‌సన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పరేషాన్'. రానా దగ్గుబాటి సమర్పణలో వాల్తేర్ ప్రొడక్షన్స్‌పై విశ్వతేజ్ రాచకొండ, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ చిత్రం సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా జూన్ 2న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ మూవీ ట్రైలర్‌ను రానా దగ్గుబాటి విడుదల చేశారు. ''వినోదాత్మకంగా రూపొందిన చిత్రమిది'' అన్నారు తిరువీర్. ''పరేషాన్' అందర్నీ నవ్విస్తుంది'' అన్నారు విశ్వతేజ్ రాచకొండ, సిద్ధార్థ్ రాళ్ళపల్లి. ''కుటుంబంతో కలిసి మా సినిమాకి రండి'' అన్నారు రూపక్ రోనాల్డ్‌సన్. ఈ కార్యక్రమంలో పావని కరణం, సంగీత దర్శకుడు యశ్వంత్ నాగ్, సినిమాటోగ్రాఫర్ వాసు, నటుడు మురళి, గీత రచయిత చంద్రమౌళి పాల్గొన్నారు.

ఓ రైతు కథ



రోహిణీ, సన్నీ నవీన్

సన్నీ నవీన్, రోహిణీ రేచల్ జంటగా తోట మల్లికార్జున దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జైత్ర'. అల్లం సుభాష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు చిత్రయూనిట్. అనంతరం తోట మల్లికార్జున మాట్లాడుతూ– ''మట్టితో చుట్టరికం చేసే ఓ రైతు కథే ఈ చిత్రం. రాయలసీమ యాస, నేపథ్యంతో తెరకెక్కించాం'' అన్నారు. ''సాధారణంగా రాయలసీమ నేపథ్యంలో సినిమా అంటే ఫ్యాక్షన్ అనుకుంటారు. కానీ, ఇందుకు విభిన్నంగా రాయలసీమలో నివసించే ఒక రైతు కుటుంబానికి చెందిన కథ, కథనాలతో 'జైత్ర' ప్రేక్షకుల ముందుకు వస్తోంది'' అన్నారు సన్నీ నవీన్. ''ఓ రైతు కథతో చాలా సహజంగా మంచి రాయలసీమ స్లాంగ్‌తో ఈ సినిమా రాబోతోంది'' అన్నారు అల్లం సుభాష్.

ప్రేమ.. సందేశం



పృథ్వీ, సుమయ

పృథ్వీ అంబర్, సుమయా రెడ్డి జంటగా నటిస్తున్న ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ ఫిల్మ్ 'డియర్ ఉమ'. సాయి రాజేష్ మహాదేవ్ దర్శకత్వంలో సుమయా రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీలోని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి విజయ్ కనకమేడల గౌరవ దర్శకత్వం వహించగా, రచయిత కోన వెంకట్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయి రాజేష్ మహాదేవ్ మాట్లాడుతూ– ''ప్రతి వ్యక్తి జీవితంలో ఉండే ఓ అంశం మా చిత్ర కథలో ఉంటుంది. స్క్రిప్ట్‌పై నమ్మకంతోనే పాన్ ఇండియా మూవీగా తెరకెక్కిస్తున్నాం'' అన్నారు. ''ఈ కథపై నమ్మకంతో నేను సినిమా నిర్మించడంతో పాటు హీరోయిన్‌గా నటిస్తున్నాను'' అన్నారు సుమయా రెడ్డి. ''ఫీల్ గుడ్ లవ్‌స్టోరీతో పాటు మంచి సందేశం ఉంటుంది'' అన్నారు పృథ్వీ అంబర్.



శైలీ సింగ్‌కు కాంస్య పతకం

సేకో గోల్డెన్ గ్రాండ్‌ప్రి అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో భారత యువ లాంగ్‌జంపర్ శైలీ సింగ్ కాంస్య పతకం సాధించింది. జపాన్‌లోని యోకోహామాలో ఆదివారం జరిగిన ఈ మీట్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 19 ఏళ్ల శైలీ 6.65 మీటర్ల దూరం దూకి మూడో స్థానంలో నిలిచింది. అంతర్జాతీయ సీనియర్ స్థాయిలో శైలికిదే తొలి టోర్నీ. భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) హై పర్ఫార్మెన్స్ కోచ్ రాబర్ట్ బాబీ జార్జి వద్ద శిక్షణ తీసుకుంటున్న శైలీ 2021లో ప్రపంచ అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం దక్కించుకొని వెలుగులోకి వచ్చింది.

రన్నరప్ సిక్కి రెడ్డి జోడీ



స్లొవేనియా ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి సిక్కి రెడ్డి రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) జోడీ 12-21, 13-21తో మూడో సీడ్ జెస్పర్ టాఫ్ట్-క్లారా గావర్సన్ (డెన్మార్క్) ద్వయం చేతిలో ఓడిపోయింది. సెమీఫైనల్లో సిక్కి-రోహన్ 21-15, 21-19తో మాడ్స్ వెస్టర్‌గార్డ్-క్రిస్టిన్ బుష్ (డెన్మార్క్)లపై గెలిచారు.

మనిక శుభారంభం



దర్బన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ మనిక బత్రా శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో మనిక 11-1, 11-3, 11-2, 11-5తో లిండా లోగ్రైబి (అల్జీరియా)పై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. పురుషుల సింగిల్స్‌లో ఆచంట శరత్ కమల్, సత్యన్ జ్ఞానశేఖరన్ కూడా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్‌లో శరత్ కమల్ 11-8, 9-11, 11-9, 11-6, 11-6తో డేవిడ్ సెర్డారోగ్లు (ఆస్ట్రియా)పై నెగ్గగా... సత్యన్ 11-9, 11-8, 7-11, 11-2, 13-15, 11-13, 11-6తో టామ్ జార్విస్ (ఇంగ్లండ్)ను ఓడించాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో శరత్ కమల్-సత్యన్ ద్వయం 11-6, 11-9, 11-6తో ఎల్బెలీ-షామస్ (ఈజిప్ట్) జోడీపై విజయం సాధించింది.

'డ్రా'తో గట్టెక్కిన భారత్



అడిలైడ్: ఆస్ట్రేలియా మహిళల జట్టుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత జట్టు 'డ్రా'తో ముగించింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయి సిరీస్‌ను కోల్పోయిన భారత్ ఆదివారం జరిగిన మూడో మ్యాచ్‌ను 1-1తో 'డ్రా' చేసుకుంది. మాడిసన్ బ్రూక్స్ (25వ ని.లో) చేసిన గోల్‌తో ఆస్ట్రేలియా 1-0తో ఆధిక్యంలోకి వెళ్లగా... దీప్ గ్రేస్ ఎక్కా (42వ ని.లో) గోల్‌తో భారత్ స్కోరును సమం చేసింది. ఈ మ్యాచ్‌తో భారత కెప్టెన్ సవితా పూనియా, డిఫెండర్ నిక్కీ ప్రధాన్ తమ కెరీర్‌లో 250 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నారు.

హారిక గేమ్ 'డ్రా'




నికోసియా (సైప్రస్): మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక నాలుగో 'డ్రా' నమోదు చేసింది. కాటరీనా లాగ్నో (రష్యా)తో ఆదివారం జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను హారిక 85 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. ప్రస్తుతం హారిక నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉంది.

ముంబైకి 'గ్రీన్' కార్డ్

- రోహిత్ బృందానికి ప్లే ఆఫ్ బెర్త్
- గ్రీన్ అజేయ శతకం
- 8 వికెట్లతో ముంబై జయభేరి
- 200 చేసినా హైదరాబాద్‌కు నిరాశ





ముంబై: బెంగళూరులో వడగండ్ల వాన కురుస్తున్న సమయంలో... వాంఖెడే స్టేడియంలో ముంబై ఇండియన్స్ జట్టు పరుగుల తుఫాను సృష్టించింది. దీంతో కీలకమైన మ్యాచ్‌లో కఠినమైన లక్ష్యం ఎదురైనప్పటికీ ముంబై ఇండియన్స్ ఒత్తిడికి తావివ్వకుండా ధనాధంచేసింది. హైదరాబాద్‌పై 8 వికెట్ల తేడాతో రోహిత్ శర్మ బృందం ఘనవిజయం సాధించింది. మరోవైపు బెంగళూరులో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ జట్టు చేతిలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఓడిపోవడంతో ముంబై ఇండియన్స్ 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి ప్లే ఆఫ్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీస్కోరు చేసింది. మయాంక్ అగర్వాల్ (46 బంతుల్లో 83; 8 ఫోర్లు, 4 సిక్సర్లు), వివ్రాంత్ శర్మ (47 బంతుల్లో 69; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగారు. తొలి వికెట్‌కు 13.5 ఓవర్లలో 140 పరుగుల భాగస్వామ్యం జోడించారు. ఆకాశ్ మధ్వాల్ (4/37) ఇంకా దంచేయకుండా కట్టడి చేశాడు. అనంతరం ముంబై 18 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసి గెలిచింది. రోహిత్ శర్మ (37 బంతుల్లో 56; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కామెరాన్ గ్రీన్ (47 బంతుల్లో 100 నాటౌట్; 8 ఫోర్లు, 8 సిక్సర్లు) 'శత'క్కొట్టి మ్యాచ్‌ను లాగేశాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	14	10	4	0	20	0.809
చెన్నై	14	8	5	1	17	0.652
లక్నో	14	8	5	1	17	0.284
ముంబై	14	8	6	0	16	-0.044
రాజస్తాన్	14	7	7	0	14	0.148
బెంగళూరు	14	7	7	0	14	0.135
కోల్‌కతా	14	6	8	0	12	-0.239
పంజాబ్	14	6	8	0	12	-0.304
ఢిల్లీ	14	5	9	0	10	-0.808
హైదరాబాద్	14	4	10	0	8	-0.590

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

201 ఉఫ్...

హైదరాబాద్‌కు భారీస్కోరు చేసిన ఆనందం తర్వాత బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ (14)ను అవుట్ చేసిన సంబరమే ఆఖరు! తర్వాత ఎంత శ్రమించినా ఉరుకులు, పరుగులే తప్ప వికెట్లయితే రాలనే లేదు. 'హిట్‌మ్యాన్' రోహిత్, వన్‌డౌన్‌లో వచ్చిన గ్రీన్ పరుగుల తుఫాను సృష్టించారు. ముఖ్యంగా గ్రీన్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో 20 బంతుల్లో ఫిఫ్టీ చేశాడు. దీంతో సగం (10) ఓవర్లు పూర్తవగానే ముంబై 114/1 స్కోరుతో గెలుపుట్రాక్‌లో పడింది. అప్పుడు 60 బంతుల్లో 87 పరుగుల సమీకరణం ముంబై బ్యాటర్లు ఇంకాస్త యథేచ్ఛగా ఆడేలా చేసింది. 31 బంతుల్లో రోహిత్ కూడా అర్ధసెంచరీ సాధించాడు. కాసేపటికి ముంబై కెప్టెన్ వికెట్ చిక్కినా... అప్పటికే హైదరాబాద్‌కు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మయాంక్ డాగర్... రోహిత్‌ను అవుట్ చేసి 128 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యాన్ని ముగిస్తే... 47 బంతుల్లో శతకం చేసిన గ్రీన్ రెండు ఓవర్లు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: వివ్రాంత్ శర్మ (సి) సబ్-రమణ్‌దీప్ (బి) ఆకాశ్ 69; మయాంక్ (సి) ఇషాన్ (బి) ఆకాశ్ 83; క్లాసెన్ (బి) ఆకాశ్ 18; ఫిలిప్స్ (సి) కార్తికేయ (బి) జోర్డాన్ 1; మార్క్‌రమ్ (నాటౌట్) 13; బ్రూక్ (బి) ఆకాశ్ 0; శాన్‌వీర్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 200. వికెట్ల పతనం:** 1-140, 2-174, 3-177, 4-186, 5-186. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 3-0-36-0, గ్రీన్ 1-0-2-0, జోర్డాన్ 4-0-42-1, ఆకాశ్ మధ్వాల్ 4-0-37-4, పీయూష్ చావ్లా 4-0-39-0, కార్తికేయ 4-0-39-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) బ్రూక్ (బి) భువనేశ్వర్ 14; రోహిత్ శర్మ (సి) నితీశ్ కుమార్ రెడ్డి (బి) మయాంక్ డాగర్ 56; గ్రీన్ (నాటౌట్) 100; సూర్యకుమార్ (నాటౌట్) 25; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (18 ఓవర్లలో 2 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1-20, 2-148. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-26-1, నితీశ్ కుమార్ రెడ్డి 3-0-35-0, మయాంక్ డాగర్ 4-0-37-1, కార్తీక్ త్యాగి 2.5-0-41-0, ఉమ్రాన్ 3-0-41-0, వివ్రాంత్ 1-0-19-0, మార్క్‌రమ్ 0.1-0-1-0.

బెంగళూరు ఖేల్‌ఖతం

గిల్ జిగేల్ సెంచరీతో గుజరాత్ గెలుపు • కోహ్లి 'రికార్డు' శతకం వృథా





బెంగళూరు: కోహ్లి తన జట్టు గెలిచేందుకు చేయాల్సిందంతా చేశాడు. కానీ బెంగళూరు చెత్త బౌలింగ్, అడ్డూఅదుపు లేని ఎక్స్‌ట్రాలు అతని శ్రమను నీరుగార్చింది. దీంతో గుజరాత్ 6 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై గెలిచింది. ఈ ఓటమితో బెంగళూరు ప్లే ఆఫ్ దశకు అర్హత పొందలేకపోయింది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 197 పరుగులు చేసింది. కోహ్లి (61 బంతుల్లో 101 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ చేశాడు. ఈ సెంచరీతో ఐపీఎల్ టోర్నీ చరిత్రలో అత్యధికంగా ఏడు సెంచరీలు చేసిన ప్లేయర్‌గా కోహ్లి రికార్డు నెలకొల్పాడు. తర్వాత గుజరాత్ 19.1 ఓవర్లలో 4 వికెట్లకు 198 పరుగులు చేసింది. శుబ్‌మన్ గిల్ (52 బంతుల్లో 104 నాటౌట్; 5 ఫోర్లు, 8 సిక్సర్లు) అజేయ శతకంతో గుజరాత్‌ను గెలిపించాడు. విజయ్ శంకర్ (35 బంతుల్లో 53; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 123 పరుగులు జోడించారు.

ఆఖరి దాకా కోహ్లినే...

మొన్న హైదరాబాద్ ఆటనే కోహ్లి బెంగళూరులో రిపీట్ చేశాడు. ఓపెనింగ్‌లో డుప్లెసిస్ (19 బంతుల్లో 28; 5 ఫోర్లు)తో మంచి ఆరంభం ఇచ్చాడు. డుప్లెసిస్ అవుటయ్యాక మ్యాక్స్‌వెల్ (11), మహిపాల్ (1) వికెట్లను కోల్పోయిన ఆర్సీబీకి కోహ్లినే పెద్దదిక్కయి నడిపించాడు. బ్రేస్‌వెల్ (16బంతుల్లో 26; 5 ఫోర్లు) అండతో కోహ్లి మళ్లీ వేగంగా పరుగులు రాబట్టాడు. 35 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. ధాటిగా ఆడుతున్న బ్రేస్‌వెల్‌ను షమీ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయగా, దినేశ్ కార్తీక్ (0) నిరుత్సాహపరిచాడు. అనూజ్ రావత్ (15 బంతుల్లో 23 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) అండతో కోహ్లి 60 బంతుల్లో సెంచరీ సాధించాడు.

ప్లే ఆఫ్స్ షెడ్యూల్

మే 23: క్వాలిఫయర్-1
గుజరాత్ టైటాన్స్ X చెన్నై సూపర్ కింగ్స్
వేదిక: చెన్నై; రాత్రి గం. 7:30 నుంచి

మే 24: ఎలిమినేటర్
లక్నో సూపర్ జెయింట్స్ X ముంబై ఇండియన్స్
వేదిక: చెన్నై; రాత్రి గం. 7:30 నుంచి

మే 26: క్వాలిఫయర్-2
క్వాలిఫయర్-1లో ఓడిన జట్టు X ఎలిమినేటర్ విజేత
వేదిక: అహ్మదాబాద్; రాత్రి గం. 7:30 నుంచి

మే 28: ఫైనల్
క్వాలిఫయర్-1 విజేత X క్వాలిఫయర్-2 విజేత
వేదిక: అహ్మదాబాద్; రాత్రి గం. 7:30 నుంచి

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (నాటౌట్) 101; డుప్లెసిస్ (సి) తెవాటియా (బి) నూర్ అహ్మద్ 28; మ్యాక్స్‌వెల్ (బి) రషీద్ 11; మహిపాల్ (స్టంప్డ్) సాహా (బి) నూర్ అహ్మద్ 1; బ్రేస్‌వెల్ (సి అండ్ బి) షమీ 26; కార్తీక్ (సి) సాహా (బి) యశ్ 0; అనూజ్ (నాటౌట్) 23; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 197. **వికెట్ల పతనం:** 1-67, 2-80, 3-85, 4-132, 5-133. **బౌలింగ్:** షమీ 4-0-39-1, యశ్ 4-0-39-1, రషీద్ 4-0-24-1, నూర్ 4-0-39-2, మోహిత్ 4-0-54-0. **గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్:** సాహా (సి) పార్నెల్ (బి) సిరాజ్ 12; గిల్ (నాటౌట్) 104; విజయ్ (సి) కోహ్లి (బి) వైశాక్ 53; షనక (సి) సబ్-ప్రభుదేశాయ్ (బి) హర్షల్ 0; మిల్లర్ (సి) సబ్-ప్రభుదేశాయ్ (బి) సిరాజ్ 6; తెవాటియా (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (19.1 ఓవర్లలో 4 వికెట్లకు) 198. వికెట్ల పతనం:** 1-25, 2-148, 3-150, 4-171. **బౌలింగ్:** సిరాజ్ 4-0-32-2, పార్నెల్ 3.1-0-42-0, వైశాక్ 4-0-40-1, హిమాన్షు 3-0-28-0, హర్షల్ 4-0-29-1, బ్రేస్‌వెల్ 1-0-16-0.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2023

యూపీఎస్సీ.. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుల్లో ఉద్యోగాలకు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్‌ఈ)ని నిర్వహిస్తోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 349

» **పోస్టుల వివరాలు:** ఇండియన్ మిలిటరీ అకాడమీ(ఐఎంఏ), డెహ్రాడూన్-100, ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ), ఎజిమల-32, ఎయిర్ ఫోర్స్ అకాడమీ (ఏఎఫ్ఏ), హైదరాబాద్-32, ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ, చెన్నై(మద్రాస్), ఓటీఏ ఎస్ఎస్‌సీ మెన్ నాన్ టెక్నికల్-169, ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ, చెన్నై(మద్రాస్), ఓటీఏ ఎస్ఎస్‌సీ ఉమెన్ నాన్ టెక్నికల్-16.

» **అర్హత:** మిలిటరీ అకాడమీ, ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ పోస్టులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.నేవల్ అకాడమీ ఉద్యోగాలకు ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు అర్హులు. ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంటర్‌లో మ్యాథ్స్,ఫిజిక్స్ చదివి ఉండాలి.ఓటీఏ ఎస్ఎస్‌సీ నాన్ టెక్నికల్ పోస్టులకు మాత్రమే మహిళలు అర్హులు. అర్హత పరీక్ష చివరి సంవత్సరం పరీక్షలు రాసి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

» ఇండియన్ మిలిటరీ అకాడమీ, నేవల్ అకాడమీలకు 02.07.2000 కంటే ముందు, 01.07.2005 తర్వాత జన్మించినవారు అనర్హులు.

» ఎయిర్‌ఫోర్స్ అకాడమీ పోస్టులకు 2024 జూలై 1 నాటికి వయసు 20-24ఏళ్ల మధ్య ఉండాలి.

» ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ పోస్టులకు 02.07.1999 కంటే ముందు, 01.07.2005 తర్వాత జన్మించినవారు అనర్హులు.

» **ఎంపిక విధానం:** రెండు దశల్లో ఉంటుంది. మొదటి దశలో రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఫర్ ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షలు తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.06.2023

» **దరఖాస్తు సవరణ తేదీలు:** 07.06.2023 నుంచి 13.06.2023 వరకు. »**పరీక్ష తేది:** 03.09.2023.

» **వెబ్‌సైట్:** http://upsc.gov.in

యూపీఎస్సీ-ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ పరీక్ష(2)-2023

యూపీఎస్సీ.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ) (2)- 2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా త్రివిధ దళాల్లో నియామకాలు చేపడతారు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 395(నేషనల్ డిఫెన్స్ అకాడమీ పోస్టులు 370(ఆర్మీ-208, నేవీ-42, ఎయిర్ ఫోర్స్-120)ఉన్నాయి. వాటిలో 28 గ్రౌండ్ డ్యూటీకి సంబంధించిన ఖాళీలు, నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్) ఖాళీలు 25 ఉన్నాయి.

» **అర్హత:** ఆర్మీ వింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు ఏదైనా గ్రూపులో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్‌ఫోర్స్, నేవీ పోస్టులకు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్(ఇండియన్ నేవల్ అకాడమీ)కు దరఖాస్తు చేయాలనుకుంటే.. ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. దీనితోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నవారు కూడా అర్హులే.

» **వయసు:** అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు 02.01.2005కి ముందు, 01.01.2008కి తర్వాత జన్మించి ఉండకూడదు.

» **ఎంపిక విధానం:** అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో ఉంటుంది. రాతపరీక్ష, ఇంటెలిజెన్స్-పర్సనాలిటీ టెస్ట్,ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ,మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 06.06.2023.

» **దరఖాస్తు సవరణ తేదీలు:** 07.06.2023 నుంచి 13.06.2023 వరకు .

» **ఆన్‌లైన్ రాతపరీక్ష:** 03.09.2023.

» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.

» **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశాలు

ఏపీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఏపీ మోడల్ స్కూల్ సొసైటీ.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశ పరీక్ష ద్వారా ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి(ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి అయిదో తరగతి చదివి ఉండాలి.

» **వయసు:** ఓసీ, బీసీ విద్యార్థులు 01.09.2011 నుంచి 31.08.2013 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01.09.2009 నుంచి 31.08.2023 మధ్య జన్మించి ఉండాలి.

» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**25.05.2023.

» **ప్రవేశ పరీక్షతేది:** 11.06.2023.

» **వెబ్‌సైట్:** www.apms.ap.gov.in

ఇంటర్‌తోనే కేంద్ర కొలువు

ఇంటర్మీడియెట్‌తోనే కేంద్ర ప్రభుత్వ శాఖల్లో కొలువుదీరే అవకాశం వచ్చింది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) 1600 పోస్టుల భర్తీకి కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (సీహెచ్‌ఎస్ఎల్) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి.. ఆ తర్వాత నిర్వహించే స్కిల్ టెస్ట్‌లోనూ సత్తా చాటితే.. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో కొలువు ఖాయం! తాజాగా ఎస్ఎస్‌సీ సీహెచ్‌ఎస్ఎల్-2023 దరఖాస్తు ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో.. సీహెచ్‌ఎస్ఎల్‌కు దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 1600 పోస్టులతో ఎస్ఎస్‌సీ సీహెచ్‌ఎస్ఎల్ నోటిఫికేషన్

» ఇంటర్మీడియెట్ అర్హతతోనే పోటీ పడే అవకాశం

» విజయం సాధిస్తే.. గ్రూప్-సి హోదాలో కేంద్ర కొలువులు

పోస్టుల సంఖ్య 1600

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజాగా విడుదల చేసిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేసన్ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 1600 పోస్టులను భర్తీ చేయనుంది. పలు కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు, రాజ్యాంగ సంస్థలు, ట్రిబ్యునల్స్ తదితరాల్లో లోయర్ డివిజన్ క్లర్క్/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు నియామకాలు చేపట్టనుంది.

అర్హతలు

- ఆగస్టు 1, 2023 నాటికి ఇంటర్మీడియెట్, తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.
- కాగ్, కన్స్యూమర్ అఫైర్స్ శాఖ, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్‌లలోని డేటా ఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్-ఎ పోస్టులకు ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఉత్తీర్ణులను అర్హులుగా పేర్కొన్నారు.

వయసు

ఆగస్టు 1, 2023 నాటికి 18-27 సంవత్సరాలు ఉండాలి. గరిష్ట వయో పరిమితిలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఇస్తారు.

వేతనం

- **లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ)/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జేఎస్ఏ):** పే లెవల్-2; వేతన శ్రేణి రూ.19,900-రూ.63,200.
- **డేటాఎంట్రీ ఆపరేటర్:** పే లెవల్-4; వేతన శ్రేణి రూ.25,500-రూ.81,100.
- **డేటాఎంట్రీ ఆపరేటర్:** పే లెవల్-5; వేతన శ్రేణి రూ.29,200-రూ.92,300.
- **డేటా ఎంట్రీ ఆపరేటర్:** గ్రేడ్-ఎ; పే లెవల్-4; వేతన శ్రేణి రూ.25,500 - రూ.81,100.

ఎంపిక.. రెండు దశల్లో ఎంపిక

ఎస్ఎస్‌సీ సీహెచ్‌ఎస్ఎల్ ఎంపిక ప్రక్రియను రెండు దశల్లో నిర్వహిస్తారు. ఇందులో టైర్-1, టైర్-2 పేరుతో పరీక్షలు ఉంటాయి.

ప్రాంతీయ భాషల్లో పరీక్ష

ఎస్ఎస్‌సీ సీహెచ్‌ఎస్ఎల్ పరీక్షకు ప్రాంతీయ భాషల్లో హాజరుకావచ్చు. ఇంగ్లిష్, హిందీతోపాటు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, కొంకణి, మళయాళం,మణిపురి, మరాఠి, ఒడియా, పంజాబీ, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో పరీక్ష నిర్వహిస్తున్నారు. స్కిల్ టెస్ట్ మాత్రం ఇంగ్లిష్‌లోనే ఉంటుంది.

టైర్-1 ఇలా

ఎంపిక ప్రక్రియలో మొదటి దశ టైర్-1 పరీక్ష.



ఎస్ఎస్‌సీ సీహెచ్‌ఎస్ఎల్-2023

దీన్ని పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ఇందులో నాలుగు విభాగాల నుంచి ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్,జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి 25 ప్రశ్నలు చొప్పున వంద ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి అర మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం ఒక గంట.

మాడ్యూల్స్, సెక్షన్ల విధానంలో టైర్-2

- టైర్-1 పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా నిర్దిష్ట కటాఫ్ నిబంధనల మేరకు మెరిట్ జాబితా రూపొందిస్తారు. వీరికి రెండో దశ.. టైర్-2 పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో రెండు సెషన్‌లు, మూడు సెక్షన్లు, ప్రతి సెక్షన్‌లో రెండు మాడ్యూల్స్ ఉంటాయి. టైర్ -2 పరీక్ష వివరాలు...
- సెషన్-1లో సెక్షన్-1: మాడ్యూల్-1లో..మ్యాథమెటికల్ ఎబిలిటీస్ 30 ప్రశ్నలు- 90 మార్కులు, మాడ్యూల్-2లో..రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్ 30 ప్రశ్నలు-90 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం ఒక గంట.
- సెషన్ 1లో సెక్షన్-2: మాడ్యూల్-1లో..ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ 40 ప్రశ్నలు-120 మార్కులు, మాడ్యూల్-2లో..జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు- 60 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం ఒక గంట.
- సెషన్ 1లో సెక్షన్-3: మాడ్యూల్-1లో.. కంప్యూటర్ నాలెడ్జ్ 15 ప్రశ్నలు-45 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 15 నిమిషాలు.
- సెషన్2 సెక్షన్-3:మాడ్యూల్-2లో.. స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్‌ను పార్ట్-ఎ, పార్ట్-బిలుగా నిర్వహిస్తారు.
- పార్ట్-ఎ ప్రకారం- డేటా ఎంట్రీ ఆపరేట్ పోస్టుల అభ్యర్థులకు 15 నిమిషాల వ్యవధిలో స్కిల్ టెస్ట్ ఉంటుంది.
- పార్ట్-బి ప్రకారం-ఎల్‌డీసీ, జేఎస్ఏ పోస్టుల అభ్యర్థులకు పది నిమిషాల వ్యవధిలో టైపింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.
- స్కిల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ మాడ్యూల్ మినహా మిగతా విభాగాల్లోని ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి.
- డేటాఎంట్రీ ఆపరేట్ పోస్టులకు నిర్వహించే స్కిల్ టెస్ట్‌లో గంటకు 8000 క్యారెక్టర్స్‌ను కంప్యూటర్‌పై టైప్ చేయాల్సి ఉంటుంది.
- ఎల్‌డీసీ, జేఎస్ఏ పోస్టులకు నిర్వహించే టైపింగ్ టెస్ట్‌లో అభ్యర్థులు ఇంగ్లిష్ టైపింగ్‌లో నిమిషానికి 35 పదాలు, హిందీ టైపింగ్‌లో నిమిషానికి 30 పదాలు టైప్ చేయాల్సి ఉంటుంది.
- డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల అభ్యర్థులకు ఏదైనా ఒక ఇంగ్లిష్ ప్యాజేస్‌ను ఇచ్చి కంప్యూటర్‌పై టైప్ చేయమని అడుగుతారు.

పటిష్ట ప్రణాళికతోనే సక్సెస్

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్, స్పెల్లింగ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ ఇంటెలిజెన్స్

ఇందులో సిరీస్(నంబర్/ఆల్ఫా న్యుమరిక్) విభాగం, అనాలజీస్, ఆడ్ మెన్ ఔట్, సిలాజిజమ్, మ్యాట్రిక్స్, డైరెక్షన్స్, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్(వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్ డీకోడింగ్ అంశాలపై పట్టు సాధిస్తే మంచి మార్కులు స్కోర్ చేసే అవకాశముంది.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

అభ్యర్థుల్లోని గణిత నైపుణ్యాలను పరీక్షించే ఈ విభాగంలో రాణించాలంటే.. సింపుల్ ఇంట్రెస్ట్, కంపౌండ్ ఇంట్రెస్ట్, లాభ నష్టాలు, ప్రాఫిట్ అండ్ లాస్, శాతాలపై ఎక్కువ సంఖ్యలో ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా, త్రికోణమితి, ఆల్జీబ్రా, జామెట్రీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్‌లకు సంబంధించిన ప్రశ్నలపై పట్టు సాధించాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్‌లో జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు మొదలు జనరల్ సైన్స్, ఎకనమిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ విభాగాలపై దృష్టి పెట్టాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలపై ప్రత్యేక దృష్టితో చదవాలి. జాగ్రఫీ విషయంలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌లో ఇటీవల కాలంలో ఆర్థిక వాణిజ్య రంగాల్లో కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పదజాలంపై పట్టు సాధించాలి. సీహెచ్‌ఎస్ఎల్ అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌ను ఎంతో కీలకమని గుర్తించాలి. దీంతోపాటు స్టాక్ జీకేలో ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు వాటి తీర్మానాలు, అవార్డులు-విజేతలు వంటి సమాచారాన్ని ఔపోసన పట్టాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జూన్ 8, 2023
- **ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు చివరి తేదీ:** జూన్ 10, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తులో సవరణ అవకాశం:** జూన్ 14, 15 తేదీలు
- **టైర్-1 పరీక్ష తేదీ:** 2023 ఆగస్టులో నిర్వహించే అవకాశం
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, తిరుపతి, రాజమండ్రి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in/, https://ssc.nic.in/Portal/Notices

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	298	61,730
నిఫ్టీ ▲	73	18,203

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	12,658	▽	31
డోజోన్స్	33,427	▽	109
ఎఫ్‌టీఎస్ఈ 100	7,757	▲	15
డాక్స్	16,275	▲	112
షాంఘై	3,284	▽	14
నికాయ్	30,808	▲	234

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

జీవిత బీమా.. రాబడి చూడొద్దు



- సంప్రదాయ ప్లాన్లలో నికర రాబడి శూన్యం!
- వచ్చే రాబడి ద్రవ్యోల్బణాన్ని మించదు
- మెరుగైన కవరేజీ కూడా తక్కువే
- బీమా, పెట్టుబడి వేర్వేరు
- టర్మ్ ప్లాన్లలో తక్కువ ప్రీమియంతో మెరుగైన రక్షణ
- ముందుగా తీసుకోవాల్సిన ప్లాన్ ఇదే

జీవిత బీమా అనగానే.. ప్రీమియం ఎంత.. రాబడి ఎంత..? అన్న ప్రశ్న వస్తుంది. ఇప్పటికీ జీవిత బీమా విషయంలో ఎక్కువ మంది ఎంపిక సంప్రదాయ ఎండోమెంట్ పాలసీలే. ఇందుకోసం భారీగా ప్రీమియం చెల్లిస్తుంటారు. ఒకవైపు బీమా కవరేజీ. మరోవైపు రాబడి. ఇదే ఎక్కువ మందిని ఆకర్షించే అంశం. బ్యాంక్ డిపాజిట్‌లో మాదిరిగా, లేదంటే అంతకంటే ఎక్కువ రాబడి బీమా పాలసీలో వస్తుందని నమ్ముతుంటారు. దీనికి అదనంగా బీమా రక్షణ ఉంటుందన్న కారణంతో దీనివైపే మొగ్గు చూపిస్తుంటారు. రాబడి ఇవ్వని టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లను అర్థం చేసుకుని తీసుకునే వారు మొత్తం మీద తక్కువ. కానీ, సంప్రదాయ బీమా పాలసీల్లో రాబడి విషయమై ఎక్కువ మందిలో ఉండే అంచనా తప్పు. రాబడి రేటు చాలా తక్కువ. సగటు ద్రవ్యోల్బణం కంటే కూడా తక్కువేనని గణాంకాలు పరిశీలిస్తే తెలుస్తుంది. మార్కెటింగ్‌లో భాగంగా సంప్రదాయ బీమా పాలసీలను ఆకర్షణీయంగా చూపించే ప్రయత్నాన్ని బీమా సంస్థలు, ఏజెంట్లు చేస్తుంటారు. కానీ, ఇక్కడ స్పష్టంగా తేల్చుకోవాల్సింది ఏమిటంటే.. కావాల్సింది బీమా రక్షణా? లేక రాబడా? ఈ అంశాలను వివరించే కథనం ఇది...

సంప్రదాయ బీమా పాలసీలు రెండు రకాల ప్రయోజనాలను ఆఫర్ చేస్తుంటాయి. మరణించినప్పుడు పరిహారాన్ని చెల్లిస్తాయి. పాలసీ కాలం పూర్తయ్యే వరకు జీవించి ఉన్నా ప్రయోజనం లభిస్తుంది. పాలసీదారు ఏదైనా కారణంతో దురదృష్టవశాత్తూ పాలసీ కాల వ్యవధిలో మరణిస్తే నామినీ ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. పాలసీదారు జీవించి ఉంటే చివర్లో అన్ని ప్రయోజనాలనూ కలిపి బీమా సంస్థ చెల్లిస్తుంది. బీమా ప్లాన్ బ్రోచర్‌లో ఈ వివరాలు ఉంటాయి. ఉదాహరణకు ఎల్ఐసీ బీమా జ్యోతి ప్లాన్ పరిశీలిస్తే.. ఇది పొదుపు, బీమాతో కూడిన ప్లాన్. 15–20 ఏళ్ల కాలానికి తీసుకోవచ్చు. పాలసీ కాల వ్యవధి అంతటా ప్రీమియం చెల్లించక్కర్లేదు. 5 ఏళ్లు తగ్గించి మిగిలిన కాలానికి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు 20 ఏళ్ల టర్మ్ ప్లాన్ తీసుకుంటే 15 ఏళ్లపాటు ప్రీమియం చెల్లించాలి.

•••

ఉదాహరణకు 35 ఏళ్ల వ్యక్తి 20 ఏళ్ల కాలానికి బీమా జ్యోతి పాలసీని రూ.15 లక్షల సమ్ అష్యూరెన్స్‌పై (బీమా రక్షణ/కవరేజీ) తీసుకుంటే అప్పుడు ఏటా చెల్లించాల్సిన ప్రీమియం సుమారు రూ.80వేలు. ఇలా 15 ఏళ్లపాటు చెల్లించాల్సి ఉంటుంది. జీవించి ఉంటే రెండు రూపాల్లో ఈ ప్లాన్ ప్రయోజనాలను చెల్లిస్తుంది. 55 ఏళ్ల వరకు జీవించి ఉంటే అప్పుడు రూ.10 లక్షల సమ్ అష్యూరెన్స్‌తోపాటు గ్యారంటీడ్ అడిషన్స్ పొందొచ్చు. గ్యారంటీడ్ అడిషన్ అనేది ప్రతి రూ.1,000పై రూ.50 చొప్పున వస్తుంది. అంటే మొత్తం మీద 20 ఏళ్ల కాలంలో ప్రీమియం రూపేణా రూ.12 లక్షలు చెల్లిస్తారు. అంటే రూ.10 లక్షల కవరేజీ కోసం అంతకంటే ఎక్కువ చెల్లిస్తున్నారు. జీవించి ఉంటే 20 ఏళ్ల తర్వాత వచ్చే మొత్తం రూ.20 లక్షలు. అంటే రాబడి రూ.8 లక్షలే. అది కూడా 20 ఏళ్ల కాలానికి. ఇందులో ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్ (రాబడి రేటు) 4 శాతమే. ఇదనే కాదు. జీవిత బీమా ఎండోమెంట్ ప్లాన్లు అన్నింటిలోనూ దాదాపు ఇదే స్థాయిలో రాబడి ఉంటుంది. ఒకవేళ 30–40 ఏళ్ల కాలానికి తీసుకుంటే ఈ రాబడి రేటు 4.5–5 శాతం మధ్య ఉంటుంది. కానీ, మన దేశంలో సగటు వార్షిక ద్రవ్యోల్బణం 6 శాతం స్థాయిలో ఉండడాన్ని గమనించొచ్చు. ద్రవ్యోల్బణం రేటు, అంతకంటే తక్కువ రాబడి రేటు ఏదైనా.. నికరంగా అది మనకు రాబడిని ఇచ్చినట్టు కాదని అర్థం చేసుకోవాలి.

•••

ఒకవేళ ప్లాన్ కాల వ్యవధిలో పాలసీదారు మరణించినట్టయితే, సమ్ అష్యూరెన్స్‌తోపాటు అప్పటి వరకు సమకూరిన గ్యారంటీడ్ అడిషన్స్ చెల్లిస్తారు. బేసిక్ సమ్ అష్యూరెన్స్‌పై 125 శాతం, వార్షికంగా చెల్లించే ప్రీమియానికి ఏడు రెట్లు, లేదంటే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియంకు 105 శాతం.. వీటిల్లో ఏది ఎక్కువ అయితే అది చెల్లిస్తారు. ఉదాహరణకు 35 ఏళ్ల వయసులో తీసుకుని 50 ఏళ్ల సమయంలో మరణం సంభవించినట్టయితే రూ.20 లక్షలు పరిహారంగా ముడుతుంది.

గ్యారంటీడ్/ పార్టిసిపేటింగ్

బీమా సంస్థలు సంప్రదాయ పాలసీలను ఆకర్షణీయంగా చూపించేందుకు బోనస్‌లను ప్రకటిస్తుంటాయి. బీమా సంస్థ పనితీరుపైనే ఇది ఆధారపడి ఉంటుంది. సంప్రదాయ బీమా ప్లాన్లు సింపుల్ రివర్షనరీ బోనస్, ఫైనల్ మెచ్యూరిటీ బోనస్, లాయల్టీ అడిషన్‌ను ఆఫర్ చేస్తుంటాయి. ఇవన్నీ బీమా సంస్థ వద్ద మిగులు నిల్వలపైనే ఆధారపడి ఉంటాయనే షరతు విధిస్తారు. మిగులు ఉంటే అప్పుడు సింపుల్ రివర్షనరీ బోనస్ ను చెల్లిస్తారు. కొన్ని ప్లాన్లలో సింపుల్ రివర్షనరీ బోనస్ అని కాకుండా, పాలసీ కాల వ్యవధి ముగింపు సమయంలో లాయల్టీ అడిషన్స్ పేరుతో చెల్లిస్తారు. ఇదే తరహా సంప్రదాయ ప్లాన్లు కొన్ని చివర్లో అడిషనల్ బోనస్ చెల్లింపునకు హామీ ఇస్తాయి. పార్టిసిపేటింగ్ బీమా ప్లాన్ తీసుకుంటున్నట్టు అయితే, కాల వ్యవధి ముగిసే వరకు జీవించి ఉన్న సందర్భంలో సమ్ అష్యూరెన్స్‌కు అదనంగా ఏదో ఒక రూపంలో చెల్లింపు ఉంటుంది. అదే నాన్ పార్టిసిపేటింగ్ ప్లాన్ తీసుకుంటుంటే జీవించి ఉంటే చివర్లో ఏమీ రాదు. టర్మ్ ఇన్సూరెన్స్‌ను నాన్ పార్టిసిపేటింగ్ ప్లాన్‌గా పేర్కొంటారు. ఇప్పుడు ప్రీమియం వెనక్కి ఇచ్చే టర్మ్ ప్లాన్లు కూడా వస్తున్నాయి. కనుక ఇక్కడ పొరపాటు పడొద్దు. ప్రీమియం వెనక్కి రాని టర్మ్ ప్లాన్ ప్రీమియంతో పోలిస్తే, చివర్లో ప్రీమియం వెనక్కి ఇచ్చే టర్మ్ ప్లాన్ ప్రీమియం చాలా అధికంగా ఉంటుంది.



ప్రత్యామ్నాయం...

బీమా, పెట్టుబడి ఈ రెండింటినీ కలిపి చూడొద్దని నిపుణులు తరచూ చెబుతుంటారు. ఈ రెండూ కలిపి తీసుకోవడం వల్ల అటు సరైనా బీమా రక్షణ, ఇటు సరైన రాబడి పొందలేని పరిస్థితికి సంప్రదాయ బీమా పాలసీలు అచ్చమైన ఉదాహరణ. అలా కాకుండా అచ్చమైన జీవిత బీమా రక్షణను ఆఫర్ చేసే టర్మ్ ప్లాన్ తీసుకుని, మరోవైపు మెరుగైన రాబడినిచ్చే సాధనంలో పెట్టుబడి పెట్టుకోవడమే మంచి నిర్ణయం అవుతుంది. పై ఉదాహరణ ఆధారంగా బీమా, పెట్టుబడిని వేరు చేస్తే వచ్చే ప్రయోజనం ఏ మేరకు ఉంటుందో చూద్దాం. 35 ఏళ్ల వయసున్న వ్యక్తి 25 ఏళ్ల కాలానికి అంటే 60 ఏళ్లు వచ్చే వరకు (రిటైర్మెంట్ వయసు/బాధ్యతలు ముగిసే సగటు వయసు) రూ.50 లక్షల సమ్ అష్యూరెన్స్‌తో టర్మ్ ప్లాన్ తీసుకుంటే చెల్లించాల్సిన ప్రీమియం రూ.10వేల లోపే. ఎక్కువ కంపెనీల్లో ప్రీమియం రూ.7,400 నుంచి 9,800 మధ్య ఉంది. పొగతాగడం, మద్యపానం, అనారోగ్య సమస్యలు లేని వారికి ఈ ప్రీమియం అని అర్థం చేసుకోవాలి. బీమా జ్యోతి ప్లాన్‌లో ఏటా చెల్లించే ప్రీమియం రూ.80వేలు. కానీ బీమా రక్షణ రూ.10 లక్షలే. ఈ ప్రీమియంలో కేవలం 12 శాతం చెల్లించడం ద్వారా టర్మ్ ప్లాన్‌లో రూ.50 లక్షల బీమా కవరేజీని, అది కూడా 25 ఏళ్ల కాలానికి పొందొచ్చు. కేవలం 12 శాతం ప్రీమియానికే ఐదు రెట్లు అధిక బీమా రక్షణ తీసుకోవడం మెరుగైన నిర్ణయం అనిపించుకుంటుంది. అప్పుడు మిగిలిన రూ.70వేలను 15 ఏళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. బీమా జ్యోతితో ప్రీమియం చెల్లింపు 15 ఏళ్లే కనుక దాన్నే పరిగణనలోకి తీసుకుని చూద్దాం. 12 శాతం రాబడి ఇచ్చే మ్యూచువల్ ఫండ్ పథకంలో ఏడాదికోసారి రూ.70వేల చొప్పున ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళితే 15 ఏళ్ల చివరికి రూ.29.22 లక్షలు సమకూరుతుంది. ఇందులో అసలు రూ.10.5 లక్షలు అయితే, రాబడి రూ.18.72 లక్షలు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో దీర్ఘకాలానికి వార్షిక రాబడి 12 శాతం ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఒకవేళ 10 శాతం రాబడి ఆధారంగా అంచనా వేసుకున్నా.. 15 ఏళ్లలో రూ.24.46 లక్షలు సమకూరుతుంది. విడిగా బీమా ప్లాన్, పెట్టుబడి ప్లాన్ ఎంపిక చేసుకోవడం వల్ల మెరుగైన కవరేజీకితోడు, మెరుగైన సంపద సృష్టి సాధ్యపడుతుందని ఈ ఉదాహరణ తెలియజేస్తోంది.



కాంపౌండింగ్ ఉండదు..

విడిగా ఇన్వెస్ట్ చేసుకుంటే కాంపౌండింగ్ ఉంటుంది. అంటే రాబడిపై రాబడి తోడవుతుంది. కానీ, సంప్రదాయ బీమా ప్లాన్లలో చెల్లించే గ్యారంటీడ్ అడిషన్స్, రివర్షనరీ బోనస్, సింపుల్ అడిషన్స్ మొత్తంపై కాంపౌండింగ్ ఉండదు. అదే బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ లేదా బాండ్లను తీసుకుంటే, మొదటి ఏడాది రాబడిపై తర్వాతి కాలంలో రాబడి జమ అవుతుంది. ఇలా కాంపౌండింగ్ ప్రయోజనం లభిస్తుంది. పైకి కనిపించదు కానీ, సంపద సృష్టిలో కాంపౌండింగ్‌కు చాలా ప్రాధాన్యం ఉంది. సంప్రదాయ పెట్టుబడి సాధనాల్లో రాబడి రేటు ముందే చెబుతారు. అదే, సంప్రదాయ ఎండోమెంట్ ప్లాన్లలో రాబడి రేటు ముందు చెప్పరు. సమ్ అష్యూరెన్స్‌తోపాటు ఇతర ప్రయోజనాలు చెల్లించే విధంగా ప్లాన్ ఉంటుంది. ఇందులో నికర రాబడి ఏ మేరకు అన్నది అర్థం చేసుకోవడం సామాన్యుల వల్ల అయ్యే పని కాదు. సమ్ అష్యూరెన్స్‌కే హామీ ఉంటుంది. ఇతర చెల్లింపులకు హామీ ఉండదు. బీమా సంస్థ పనితీరు (అది చేసే పెట్టుబడులపై రాబడులు)పైనే ఆధారపడి ఉంటాయని అర్థం చేసుకోవాలి. అందుకే అన్నింటికంటే కుటుంబానికి మెరుగైన జీవిత బీమా రక్షణ కల్పించుకోవడం ముందుగా చేయాలి. రాబడి కోసం దీర్ఘకాలంలో ఈక్విటీలే మెరుగైన సాధనమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి అన్ని ఏర్పాట్లు చేసుకున్న తర్వాత, ఇంకా ఆర్థిక వెసులుబాటు ఉంటే అప్పుడు మీకు నచ్చిన ప్లాన్‌ను కొనుగోలు చేసుకోవచ్చు.

లాభాల్లో పీఎస్‌యూ బ్యాంకుల జోరు

- గతేడాది రూ. లక్ష కోట్లకు అప్
- ఎస్‌బీఐ వాటా రూ. 50,000 కోట్లు



న్యూఢిల్లీ: కొంతకాలంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల లాభదాయకత భారీగా మెరుగుపడింది. దీంతో గత ఆర్థిక సంవత్సరం(2022–23)లో మొత్తం పీఎస్‌యూ బ్యాంకుల నికర లాభాలు రూ. లక్ష కోట్ల మార్క్‌ను తాకాయి. దీనిలో ఒక్క ఎస్‌బీఐ వాటానే రూ. 50,000 కోట్లు కావడం గమనార్హం! 2017–18లో పీఎస్‌యూ బ్యాంకులు ఉమ్మడిగా రూ. 85,390 కోట్ల నికర నష్టాలు ప్రకటించాక టర్న్‌అరౌండ్ బాట పట్టాయి. దీనిలో భాగంగా గతేడాదికల్లా రూ. 1,04,649 కోట్ల లాభాలు సాధించాయి. 2021–22తో పోలిస్తే మొత్తం 12 పీఎస్‌బీల నికర లాభం 57 శాతం వృద్ధి చూపింది. రూ. 66,540 కోట్లకు చేరింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అత్యధికంగా 126 శాతం పురోగతి సాధించి రూ. 2,602 కోట్లు ఆర్జించింది. ఈ బాటలో యుకో బ్యాంక్ లాభం రెట్టింపై రూ. 1,862 కోట్లను తాకింది. బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) 94 శాతం వృద్ధితో రూ. 14,110 కోట్లు సాధించగా.. నంబర్ వన్ దిగ్గజం ఎస్‌బీఐ 59 శాతం అధికంగా రూ. 50,232 కోట్లు ఆర్జించింది. కెనరా బ్యాంకు రూ. 10,604 కోట్లు అందుకుంది. కాగా.. పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) మినహా ఇతర పీఎస్‌బీలు ఆకర్షణీయ స్థాయిలో లాభాలు ప్రకటించాయి. పీఎన్‌బీ నికర లాభం 27 శాతం క్షీణించి రూ. 2,507 కోట్లకు పరిమితమైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
22-5-2023	
విశాఖ	495–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	487–00
విజయవాడ	487–00
రిటైల్ ధర (డజను)	72.00
21-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	465–00
వరంగల్	467–00
రిటైల్ ధర	5.25

మారుతీ సుజుకీ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 9,108 టార్గెట్: రూ. 11,500

ఎందుకంటే: పూర్తిస్థాయిలో మార్పుచేసి ప్రవేశపెట్టిన మోడళ్లు బాలెనో, బ్రెజ్జా కార్లకు డిమాండ్ కనిపిస్తోంది. దీనికి జతగా ఇటీవల విడుదల చేసిన గ్రాండ్ వితారా అమ్మకాలు సైతం జోరు మీదున్నాయి. వెరసి కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ దేశీ అమ్మకాలలో ఈ మూడు మోడళ్ల కార్లే 15 శాతం వాటాను ఆక్రమిస్తున్నాయి. కస్టమర్ల నుంచి లభిస్తున్న స్పందన ఆధారంగా చూస్తే ప్రస్తుత ప్రొడక్ట్ సైకిల్‌లో విడుదల చేసిన అన్ని మోడల్ కార్లూ భారీగా విజయవంతమయ్యాయి. ఇక చానల్ చెక్స్ ద్వారా లభించిన సమాచారం ప్రకారం తాజా మోడల్ ఫ్రాంక్స్ కారుకూ సానుకూల స్పందన నమోదవుతోంది. ప్రాథమిక సమాచారం(ఫీడ్‌బ్యాక్)మేరకు మధ్యస్థాయి మోడళ్లలో ఆవిష్కరించిన ఈ కారుకు కస్టమర్ల నుంచి ఆసక్తి వ్యక్తమవుతోంది. ఇందుకు ప్రధానంగా కారు స్టైలింగ్, ఆకర్షణీయ ధర ప్రభావం చూపుతున్నాయి. కారు విడుదలతోపాటు, ధర వివరాలు వెల్లడికావడంతో కస్టమర్ల నుంచి ఎంక్వైరీలు ఊపందుకున్నాయి. ఇక ఈ బాటలో మే లేదా జూన్‌లో జిమ్నీ మోడల్ విడుదలను అంచనా వేస్తున్నారు. పటిష్ట బ్రాండు ప్రాచుర్యం నేపథ్యంలో జిమ్నీ వాహనానికి సైతం డిమాండ్ కనిపించే అవకాశముంది. తాజా మోడళ్ల విడుదలతో బీ సెగ్మంట్(విభాగం)లో మారుతీ ముందడుగు వేయనుంది. రెండు, మూడు పోటీ బ్రాండ్లతో పోలిస్తే ఆరు మోడళ్లను ప్రవేశపెట్టడం ద్వారా బీ సెగ్మంట్‌లో కంపెనీ మరింత పటిష్టంకానుంది. రెండేళ్లపాటు మార్కెట్ వాటాను కోల్పోతూ వస్తున్న కంపెనీ తిరిగి రికవరీ బాటలో సాగే వీలుంది. పటిష్ట ఆర్డర్‌బుక్, విభిన్న మోడళ్లు వంటి అంశాలు కంపెనీకి బలాన్నిస్తున్నాయి.



బ్లూడార్ట్ ఎక్స్‌ప్రెస్ | ఎలారా సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 6,052 టార్గెట్: రూ. 7,700

ఎందుకంటే: సమీకృత లాజిస్టిక్స్ దిగ్గజం బ్లూడార్ట్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ యాజమాన్యం ఇటీవల కంపెనీ భవిష్యత్ ప్రణాళికలను ఆశావహ రీతిలో ఆవిష్కరించింది. కంపెనీ ఒక్కొక్కటీ 22 టన్నుల రవాణా సామర్థ్యాన్ని కలిగిన రెండు 737 బోయింగ్ రవాణా విమానాలను జత చేసుకుంది. కంపెనీ వద్ద ఇప్పటికే గల 33 టన్నుల సామర్థ్యం కలిగిన ఆరు బోయింగ్ 757 రవాణా విమానాలకు ఇవి అదనం. నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు లభించాక టైర్–2, టైర్–3 పట్టణాలలో జూన్ నుంచి కొత్త విమానాల రవాణా సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఎయిర్ కార్గో కార్యకలాపాలకు గువాహటిని 8వ బేస్‌స్టేషన్‌గా వినియోగించుకోనుంది. తద్వారా ఈశాన్య రాష్ట్రాల కార్గో అవసరాల కోసం రోజువారీ విమానాల నిర్వహణలో గువాహటి మద్దతుగా నిలవనుంది. అయితే మొత్తంగా చూస్తే సమీప భవిష్యత్‌లో ఎయిర్ ఎక్స్‌ప్రెస్ ఈల్డ్ నీరసించనుంది. కొత్త రవాణా విమానాలు సైతం తక్కువ ఈల్డ్‌నే సాధించనున్నాయి. విమానాశ్రయం నుంచి విమానాశ్రయానికి నిర్వహించే వస్తు రవాణాకు ప్రాథమిక దశలో విమాన సామర్థ్యాన్ని భర్తీ చేయవలసి ఉంటుంది. వస్తు రవాణాకు అత్యధిక డిమాండును అంచనా వేస్తున్న కారణంగా భూమిమీద సామర్థ్య విస్తరణను కొనసాగించనుంది. ఇందుకు అనుగుణంగా 55కుపైగా సొంత రిటైల్ స్టోర్లను కొత్తగా ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో దేశీయంగా రూ. 70 కోట్లు, వైమానిక అవసరాలపై రూ. 150 కోట్ల పెట్టుబడులను వెచ్చించే ప్రణాళికల్లో ఉంది. రెండేళ్ల కాలంలో వార్షికంగా కంపెనీ ఆదాయం 15 శాతం, లాభార్జన 19 శాతం చొప్పున వృద్ధి చెందగలవని భావిస్తున్నాం.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

భారత్ నుంచి వాల్‌మార్ట్ మరిన్ని ఎగుమతులు

- బొమ్మలు, పాదరక్షలు, సైకిల్స్‌పై దృష్టి



న్యూఢిల్లీ: భారత్ నుంచి మరిన్ని ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేయాలన్న లక్ష్యంతో దిగ్గజ రిటైల్ సంస్థ వాల్‌మార్ట్ ఉంది. ఆట బొమ్మలు, సైకిళ్లు, పాద రక్షలను భారత సరఫరాదారుల నుంచి సమీకరించుకోవాలని చూస్తోంది. ఆహారం, ఫార్మాస్యూటికల్, కన్స్యూమబుల్, హెల్త్, వెల్‌నెస్, అప్పారెల్, హోమ్ టెక్స్‌టైల్ విభాగాల్లో భారత్ నుంచి కొత్త సరఫరాదారులను ఏర్పాటు చేసుకోవడంపైనా దృష్టిపెట్టింది. భారత్ నుంచి ఎగుమతులను 2027 నాటికి 10 బిలియన్ డాలర్లకు (రూ.82,000 కోట్లు) పెంచుకోవాలన్న లక్ష్యాన్ని ఈ సంస్థ లోగడే విధించుకుంది. ఈ దిశగా తన చర్యలను వేగవంతం చేస్తోంది. ఈ సంస్థ ఇటీవలే భారత్‌కు చెందిన పలువురు బొమ్మల తయారీదారులతో వర్చువల్ సమావేశాన్ని నిర్వహించింది. తమకు ఎంత మేర ఉత్పత్తి కావాలి, ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించాలనే విషయాలను వారికి తెలియజేసింది.

ఐకియా సైతం...

మరో ప్రముఖ అంతర్జాతీయ రిటైలింగ్ సంస్థ ఐకియా సైతం తన అంతర్జాతీయ విక్రయ కేంద్రాల కోసం భారత్ నుంచి ఆటబొమ్మలను సమీకరిస్తోంది. ఈ చర్యలు ఆట బొమ్మల విభాగంలో పెరుగుతున్న భారత్ బలాలను తెలియజేస్తోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు మన దేశం ఆటబొమ్మల కోసం దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడేది. చైనా నుంచి చౌక ఆట ఉత్పత్తులు మన మార్కెట్‌ను ముంచెత్తేవి. కేంద్ర సర్కారు దీనికి చెక్ పెట్టేందుకు దిగుమతి అయ్యే ఆట బొమ్మల నాణ్యతా ప్రమాణాలను పెంచడం, టారిఫ్‌లను పెంచడం వంటి చర్యలు తీసుకుంది. ఇవి ఫలితమిస్తున్నాయి. సరఫరా వ్యవస్థ బలోపేతం ఈ నెల మొదట్లో వాల్‌మార్ట్ ఐఎన్‌సీ ప్రెసిడెంట్, సీఈవో డగ్ మెక్‌మిల్లన్ భారత పర్యటన సందర్భంగా సంస్థ ప్రణాళికలను పునరుద్ఘాటించారు. భారత్‌లోని వినూత్నమైన సరఫరాదారుల వ్యవస్థ అండతో 2027 నాటికి ఇక్కడి నుంచి 10 బిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకుంటామన్న ధీమాను వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీని సైతం ఆయన కలిశారు. ఆ తర్వాత సంస్థ లక్ష్యాలను పేర్కొంటూ ట్వీట్ చేశారు. లాజిస్టిక్స్, నైపుణ్యాల అభివృద్ధి, సరఫరా వ్యవస్థ బలోపేతం ద్వారా భారత్‌ను ఆటబొమ్మలు, సముద్ర ఉత్పత్తులు, ఇతర విభాగాల్లో అంతర్జాతీయ ఎగుమతి కేంద్రంగా చేస్తామని ప్రకటించారు.

స్మాల్ క్యాప్ కంటే మిడ్ క్యాప్ బెటరా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను దీర్ఘకాలం కోసం మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలని అనుకుంటున్నాను. అయితే, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ పథకాల్లో ఏవి ఎంపిక చేసుకోవాలి? – వరుణ్ మిశ్రా

స్మాల్‌క్యాప్ మాదిరే మిడ్‌క్యాప్‌లోనూ రాబడులు, సవాళ్లు ఉంటాయి. పేరుకు తగినట్టుగా ఈ పథకాల పెట్టుబడులు ఉండడాన్ని గమనించొచ్చు. మిడ్‌క్యాప్ పథకాలు ఎక్కువ శాతం పెట్టుబడులను మిడ్‌క్యాప్ కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. అదే విధంగా లార్జ్ క్యాప్ స్టాక్స్‌లో చెప్పుకోతగ్గ మేర, స్వల్పంగా స్మాల్ క్యాప్‌లో పెట్టుబడులు కలిగి ఉంటాయి. అదే స్మాల్‌క్యాప్ ఫండ్ అయితే ఎక్కువగా స్మాల్‌క్యాప్ స్టాక్స్‌కు పెట్టుబడులు కేటాయిస్తుంది. అలాగే, మిడ్ క్యాప్‌లోనూ ఎక్స్‌పోజర్ తీసుకుంటుంది. మార్కెట్ విలువ పరంగా టాప్ –100 కంపెనీలను లార్జ్‌క్యాప్‌గా, తదుపరి 150 కంపెనీలను మిడ్‌క్యాప్‌గా వర్గీకరించారు. మిగిలినవన్నీ స్మాల్‌క్యాప్ కంపెనీల కిందకే వస్తాయి. కానీ, మ్యూచువల్ ఫండ్స్ కంపెనీలు తదుపరి 250 కంపెనీల నుంచి పెట్టుబడులకు ఎంపిక చేసుకుంటాయి. అయితే, 101 నుంచి 250 వరకు ఉన్న కంపెనీలన్నీ ఎల్లప్పుడూ మిడ్‌క్యాప్‌లోనే ఉంటాయని కాదు అర్థం. మార్కెట్ విలువ ఆధారంగా ఒక కంపెనీని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ అని చెప్పడమే. ఒకవేళ అది చిన్న కంపెనీయే అయినప్పటికీ గొప్పది అయి ఉండొచ్చు. చక్కని నిర్వహణతో, ఎంతో వేగంగా వృద్ధి చెందుతున్న వ్యాపారంతో, భరోసానిస్తూ ఉండొచ్చు. ఇలాంటి సానుకూల బలాలున్న కంపెనీల విషయంలో అది మిడ్ లేదా స్మాల్ క్యాప్ అన్న నిర్వచనం జోలికి వెళ్లక్కర్లేదు. ఉదాహరణకు ఒక మిడ్‌క్యాప్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. కొంత కాలానికి నిర్వహణ ఆస్తుల పరంగా అది పెద్ద పథకంగా మారొచ్చు. అప్పుడు అవి మిడ్‌క్యాప్ విభాగంలో ఉన్న పెద్ద కంపెనీల్లో ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తాయి. ఉదాహరణకు 101 నుంచి 125 వరకు ఉన్న కంపెనీలను ఎంచుకుంటాయి. అవి పేరుకు మిడ్‌క్యాప్ కంపెనీలుగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో లార్జ్‌క్యాప్‌లోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు అనుకూల సమయం ఏది? – రాధాకృష్ణమూర్తి

డెట్ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో పెట్టుబడులు పెట్టుకునేందుకు సరైన సమయం అంటూ ప్రత్యేకంగా ఉండదు. డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే ముందు మీ పెట్టుబడుల కాల వ్యవధికి అనుకూలమైన పథకాన్ని ఎంపిక చేసుకోవడం మొదటగా చేయాల్సిన పని. చాలా మంది ఇన్వెస్టర్లు దీర్ఘకాల లక్ష్యాల కోసం డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. మీరు ఎంపిక చేసుకునే పథకం రక్షణ ఎక్కువగా ఉండే సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుందా? లేదా అన్నది నిర్ధారించుకోవాలి.

ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్) వల్ల లాభాలేంటి? – రవీంద్రన్

ఫండ్ ఆఫ్ ఫండ్ అంటే సమీకరించిన పెట్టుబడులను తీసుకెళ్లి మరో మ్యూచువల్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేసేది. సాధారణంగా ఎఫ్‌వోఎఫ్‌లను ఆయా ఫండ్స్ హౌస్‌లు వాటికి సంబంధించిన ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ప్రారంభిస్తుంటాయి. ఎఫ్‌వోఎఫ్‌లు ఇతర మ్యూచువల్ ఫండ్స్ పథకాల మాదిరే పనిచేస్తాయి. వీటిల్లోనూ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడి పెట్టుకోవచ్చు. విదేశీ సూచీలు, విదేశీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసే ఎఫ్‌వోఎఫ్‌లు కూడా ఉన్నాయి. ఎఫ్‌వోఎఫ్‌లు వేరే మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి కనుక రెండంచెల్లో ఎక్స్‌పెన్స్ రేషియో భారాన్ని మోయాల్సి వస్తుంది. ఉదాహరణకు ఎఫ్‌వోఎఫ్‌లో 1 శాతం ఎక్స్‌పెన్స్ రేషియో ఉందనుకుంటే, అది ఇన్వెస్ట్ చేసే పథకం ఎక్స్‌పెన్స్ రేషియో 0.50 శాతం ఉంటే మొత్తం 1.5 శాతం ఎక్స్‌పెన్స్ రేషియో చెల్లిస్తున్నట్టు అర్థం చేసుకోవాలి. ఎఫ్‌వోఎఫ్ ఇన్వెస్ట్ చేసే పథకంలో నేరుగా ఇన్వెస్టర్లు పెట్టుబడులకు అవకాశం లేనప్పుడు వీటిని పరిశీలించొచ్చు. ఎఫ్‌వోఎఫ్‌లను నాన్ ఈక్విటీ పథకాలుగా పరిగణిస్తారు. కనుక డెట్ పథకాలకు మాదిరే మూలధన లాభాలపై పన్ను అమలవుతుంది. ఒకవేళ ఎఫ్‌వోఎఫ్ దేశీయ ఈక్విటీ పథకాల్లో 90 శాతానికిపైగా పెట్టుబడి పెడితే ఈక్విటీకి మాదిరే మూలధన లాభాల పన్ను వర్తిస్తుంది.



సముద్ర గర్భంలో ప్లాస్టిక్ పాగా!

కడలిలోకి ఏటా పది లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు

- ఇప్పటికే పేరుకుపోయినవి 6.75 కోట్ల టన్నులు
- ఎల్‌నినో, లానినోల సయ్యాటకు ఇదే కారణం.. రుతుపవనాల గమనంపై తీవ్ర ప్రభావం
- మత్స్య సంపదలోనూ భారీ తగ్గుదల
- వ్యర్థాలు వదిలేస్తున్న దేశాల్లో రెండో స్థానంలో భారత్
- ఐక్యరాజ్యసమితి పర్యావరణ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రపంచంలో ఐదు మహాసముద్రాలు ప్లాస్టిక్ వ్యర్థాలకు కూపాలుగా మారాయా? సముద్ర గర్భం, ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడానికి అవే కారణమా? రుతుపవనాల గమనాన్ని ప్రభావితం చేస్తూ ఎల్‌నినో (పసిఫిక్ సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడం), లానినో(పసిఫిక్ సముద్ర ఉష్ణోగ్రతలు తగ్గడం)ల సయ్యాటకు అవే దోహదం చేస్తున్నాయా? ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోతే భారీ ఉత్పాతాలు తప్పవా? అంటే అవుననే అంటోంది ఐక్యరాజ్యసమితి పర్యావరణ నివేదిక. పర్యావరణ స్థితిగతులపై ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం అధ్యయనం చేస్తూ ప్రపంచ దేశాలను అప్రమత్తం చేస్తోంది. ఈ అధ్యయనంలో వెల్లడైన అంశాలు ఇవీ..

ప్లాస్టిక్ వ్యర్థాల డస్ట్‌బిన్‌గా మహాసముద్రాలు..

వివిధ దేశాల నుంచి ఏటా పది లక్షల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయి. ఆసియా ఖండంలోని ఫిలిప్పీన్స్, భారత్, మలేసియా, చైనా, ఇండోనేషియా, మయన్మార్, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్ దేశాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు అత్యధికంగా కడలిలోకి చేరుతున్నాయి. దక్షిణ అమెరికా ఖండంలోని బ్రెజిల్ నుంచి కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు అత్యధికంగా సముద్రంలో కలుస్తున్నాయి. ఇప్పటికే కడలిలో 6.75 కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. అమెరికాలోని కాలిఫోర్నియా, హవాయి రాష్ట్రాల మధ్య పసిఫిక్ మహాసముద్రంలో చేరిన ప్లాస్టిక్ వ్యర్థాల పరిమాణం ఫ్రాన్స్ దేశం విస్తీర్ణం కంటే మూడింతలు అధికం కావడం గమనార్హం.

కారణాలు ఇవే..

ఆయా దేశాల్లో పేదరికం, తీర ప్రాంతం, వర్షపాతం అధికంగా ఉండటం, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్లే ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా సముద్రంలోకి చేరుతున్నాయి. ఉదాహరణకు ఫిలిప్పీన్స్ ఏడు వేల ద్వీపాల సముదాయం. 36,289 కి.మీ.ల తీర ప్రాంతం ఆ దేశం సొంతం. ఆ దేశంలో 4,820 నదులు కడలిలో కలుస్తున్నాయి. అక్కడ పేదరికం అధికంగా ఉండటం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడికక్కడే పడేస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు వర్షపు నీటితో కలిసి వాగుల్లోకి.. అక్కడి నుంచి నదుల్లోకి.. వాటి మీదుగా సముద్రంలోకి చేరుతున్నాయి. ఏటా సముద్రంలో కలుస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాల్లో 35 శాతం ఫిలిప్పీన్స్‌కు చెందినవి కావడానికి ఇదే కారణం. అలాగే బ్రెజిల్ నుంచి అమెజాన్‌తోపాటు 1,240 నదులు సముద్రంలో కలుస్తున్నాయి. ఆ దేశం నుంచి ఏటా 37,779 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు కడలిలోకి చేరుతున్నాయి.

నియంత్రించకుంటే ఉత్పాతాలే..

సముద్రంలోకి ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా చేరడం వల్ల.. సముద్ర ఉష్ణోగ్రతల్లో భారీ వ్యత్యాసాలు చోటుచేసుకుంటున్నాయి. కడలి గర్భం, ఉపరితల ఉష్ణోగ్రతల్లో భారీ మార్పులకు ప్లాస్టిక్ వ్యర్థాలే కారణం. ఇదే పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో, లానినో ప్రభావాలు ఏర్పడటానికి దారితీస్తోంది. లానినో ప్రభావం ఉంటే.. రుతుపవనాల గమనం సక్రమంగా ఉంటుంది. అప్పుడు ప్రధానంగా భారత్ సహా ఆసియా దేశాల్లో సక్రమంగా వర్షాలు కురుస్తాయి. అదే ఎల్‌నినో ప్రభావం ఏర్పడితే.. రుతుపవనాల గమనం అస్తవ్యస్తంగా ఉంటుంది. భారత్ సహా ఆసియా దేశాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయి. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే.. సాగు, తాగు నీటికి ఇబ్బందులు తప్పవు. ఇది అంతిమంగా ఆహార సంక్షోభానికి.. తద్వారా ఆకలి చావులకు దారితీస్తుంది. ప్లాస్టిక్ వ్యర్థాల ప్రభావం వల్ల సముద్రంలో ఉష్ణప్రవాహాలు పెరగడంతో మత్స్యసంపద నానాటికీ తగ్గిపోతోంది. మత్స్యకారుల ఉపాధినే కాదు.. ఇది పర్యావరణాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తోంది.

వివిధ దేశాల నుంచి ఏటా సముద్రంలో కలుస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు.. (టన్నుల్లో)

ఫిలిప్పీన్స్	3,56,371	మయన్మార్	40,000
ఇండియా	1,26,513	బ్రెజిల్	37,779
మలేషియా	73,098	వియత్నాం	28,221
చైనా	70,707	బంగ్లాదేశ్	24,640
ఇండోనేషియా	56,333	థాయ్‌లాండ్	22,806

ఇతర దేశాలు 1,76,012



మొత్తం 10,12,480

తప్పుదోవ పట్టించేందుకే తప్పుడు రాతలు

▶ మొదటి పేజీ తరువాయి

ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదని అంగన్‌వాడీ నుంచి ఇంజినీరింగ్, మెడిసిన్‌తోపాటు విదేశాల్లో చదువుకునేందుకూ ఈ ప్రభుత్వమే అండగా నిలుస్తోంది. ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థినీ ప్రోత్సహిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత 45 నెలల్లో కేవలం విద్యా రంగంలో సంస్కరణల కోసం రూ.57,642.36 కోట్లు ఖర్చుచేసింది. ఉన్నత సంకల్పంతో అమలుచేస్తున్న పథకాలతో వచ్చిన మార్పులు, వాటి ఫలితాలు కళ్ల ముందే కనిపిస్తున్నా పచ్చ గంతలు కట్టుకున్న 'ఈనాడు' తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తోంది.

సంక్షేమ కేలండర్ ప్రకారమే నిధులు విడుదల

విద్యా సంస్థల యాజమాన్యాల నుంచి విద్యార్థులకు ఫీజుల ఒత్తిడి లేకుండా 'జగనన్న విద్యా దీవెన' కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను క్రమం తప్పకుండా ఏ త్రైమాసికం ఫీజును ఆ త్రైమాసికం పూర్తయిన తర్వాత ప్రభుత్వం చెల్లిస్తోంది. అక్టోబరు-నవంబర్-డిసెంబరు-2022 త్రైమాసికానికి 9,86,092 మంది విద్యార్థులకు రూ.684.52 కోట్లను మార్చి 19న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసింది. జనవరి-ఫిబ్రవరి-మార్చి 2023 త్రైమాసికానికి మే 24న రూ.702.99 కోట్లు అందించేందుకు ఏర్పాట్లుచేస్తోంది. ముందుగా నిర్దేశించిన సంక్షేమ కేలండర్ ప్రకారమే, క్రమం తప్పకుండా ఇలా నిధులు విడుదల చేస్తున్నా.. వాస్తవాలను కప్పిపుచ్చి పచ్చ పత్రిక రోత రాతలు రాస్తోంది. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ చదువుతున్న 9,55,662 మంది పిల్లలకు 'వసతి దీవెన' కింద రూ.912.71 కోట్లను ఏప్రిల్ 26న జమచేసింది. అయినప్పటికీ ఈనాడు పత్రిక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు 'జగనన్నా ఇదేనా విద్యా దీవెన' అంటూ అవాస్తవాలతో కూడిన కథనం వండి వార్చింది.

అప్పట్లో అరకొర చెల్లింపులు.. అనేక కొర్రీలు

గత ప్రభుత్వంలో కాలేజీల ఫీజులు కాలేజీ స్థాయిని బట్టి రూ.70 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు ఉండేవి. విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ మాత్రం రూ.35 వేలకే పరిమితం చేసి, అది కూడా ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి. పైగా ఏళ్ల తరబడి బకాయిలు. అప్పట్లో ఫీజులు కట్టలేక తల్లిదండ్రుల ఆవేదనను కనీసం పట్టించుకోని ఈనాడు.. ఇప్పుడు అన్నీ సక్రమంగా జరుగుతున్నా బురద జల్లుతోంది. చంద్రబాబు హయాంలో చివరి రెండేళ్ల (2017-18, 2018-19) రూ.1,778 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని చెల్లించకుండా ఎగ్గొట్టింది. అలాగే, విద్యార్థుల వసతి కోసం అనేక కొర్రీలూ పెట్టింది. కుల ప్రాతిపదికన, కోర్సుల ప్రాతిపదికన రూ.4 వేల నుంచి రూ.10 వేలు మాత్రమే తక్కువ మందికి ఇచ్చింది. డిపార్ట్‌మెంట్ అటాచ్డ్ హాస్టళ్లల్లో ఈబీసీ, కాపు విద్యార్థులకు చోటులేకుండా చేసింది. అంతేకాక.. బాబు జమానాలో విద్యార్థులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీ విద్యార్థుల కుటుంబ వార్షికాదాయం రూ.లక్ష.. ఎస్సీ, ఎస్టీలకు రూ.2 లక్షల లోపు ఉండాలని నిబంధన పెట్టి ఎంతోమంది విద్యార్థులను ప్రభుత్వ పథకాలకు దూరం చేసింది. ఇవేవీ ఆ పచ్చ పత్రికకు పట్టవు.

ఈ నాలుగేళ్లలో విద్య, వసతి దీవెనకు రూ.14,210 కోట్లు..

కానీ, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల కుటుంబ వార్షికాదాయం రూ.2.50 లక్షలకు పెంచి లక్షల మంది విద్యార్థులను ప్రభుత్వ పథకాలకు చేరువ చేసింది. ఏ విద్యార్థి చదువూ ఆగిపోరాదని ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఏటా సగటున రూ.3,311 కోట్లు చొప్పున రూ.9,934 కోట్లు ఇప్పటికే చెల్లించింది. ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అందరికీ 'జగనన్న వసతి దీవెన' కింద ఐటీఐ విద్యార్థులకైతే రూ.10 వేలు, పాలిటెక్నిక్ వారికి రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ చదువుతున్న వారికి రూ.20 వేలు చొప్పున ఏడాదిలో రెండుసార్లు తల్లుల ఖాతాల్లో జమచేస్తోంది. ఈ పథకం కింద ఇప్పటిదాకా విద్యార్థులకు రూ.4,275.76 కోట్లు చెల్లించింది కూడా. అంటే ఈ రెండు పథకాల కోసమే ప్రభుత్వం 2019-20 నుంచి 2022-23 వరకు (మే 24న విద్యా దీవెన కింద చెల్లించే రూ.702.99తో కలిపి) సుమారు రూ.14,210 కోట్లను క్రమం తప్పకుండా విడుదల చేసింది. ఇదేదీ 'ఈనాడు'కు కనిపించదు.

విద్యార్థులకు అండగా '1902' టోల్‌ఫ్రీ నంబర్..

ఫీజుల విషయంలో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఎవరైనా యాజమాన్యాలు వినకపోతే ఆ ఫిర్యాదులు తీసుకునేందుకు 1902 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరైనా ఈ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే.. ముఖ్యమంత్రి కార్యాలయమే (సీఎంఓ) నేరుగా కాలేజీలతో మాట్లాడుతోంది. పిల్లలకు ఫీజులు పూర్తిగా ఇవ్వడమే కాకుండా, వారు వసతి కోసం, భోజనం కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలని, ఆ ఖర్చులు కూడా భారం కాకూడదని.. తల్లిదండ్రులు ఇబ్బంది పడకూడదని జగనన్న వసతి దీవెన ద్వారా క్రమం తప్పకుండా ఆ మొత్తాన్ని చెల్లిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకం కింద కూడా క్రమం తప్పకుండా నిధులు విడుదల చేస్తోంది. కానీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు నాలుగేళ్ల విద్యా సంవత్సరం ముగుస్తున్నా ఒక్క త్రైమాసికానికి మాత్రమే నిధులు చెల్లించిందంటూ ఈనాడు నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటు.

అప్పిచ్చి ముప్పు తెచ్చుకుంది

రాధ హత్య కేసుపై విభిన్న కోణాల్లో దర్యాప్తు



కోట రాధ (ఫైల్)

కనిగిరి రూరల్: ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం జిల్లెళ్లపాడు వద్ద వివాహిత కోట రాధ (35)ను హతమార్చిన కేసులో విభిన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. రాధను ఆమె భర్త మోహన్‌రెడ్డి హత్య చేశాడని గుర్తించిన పోలీసులు అతడి నుంచి పూర్తి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. రాధ స్వగ్రామమైన వెలిగండ్ల మండలం జిల్లెళ్లపాడులో జరిగే జాతర కోసం 11న మోహన్‌రెడ్డి భార్య, పిల్లలతో కలిసి వచ్చాడు. అప్పటినుంచే రాధను చంపేందుకు మోహన్‌రెడ్డి ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. వేరే వ్యక్తి పేరిట తీసుకున్న ఫోన్ నంబర్, ఫోన్ ద్వారా ఈ నెల 13, 14 తేదీల్లో కూడా మెసేజ్‌లు పెట్టినట్టు ఆధారాలు లభ్యమయ్యాయి. రాధ ఆ మెసేజ్‌లకు స్పందించకపోవడంతో హత్య ప్లాన్‌ను 17వ తేదీకి మార్చుకుని పథకం ప్రకారం కనిగిరికి రప్పించి హతమార్చినట్టు నిందితుడు చెప్పినట్టు తెలిసింది.

గంటకు పైగా శవంతో కారులో..

వేరే వ్యక్తి పేరిట రాధతో చాటింగ్ చేసిన మోహన్‌రెడ్డి నగదు ఇస్తానని నమ్మించి పథకం ప్రకారం 17వ తేదీన ఆమెను కనిగిరి రప్పించాడు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తితో సన్నిహిత సంబంధం, చాటింగ్‌లపై భార్యను అనుమానించి నిలదీసినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఒక్కసారిగా రాధపై దాడి చేసి చున్నీతో గట్టిగా గొంతునులిమి, కొట్టి చంపినట్టు సమాచారం. కారులోనే శవాన్ని పెట్టుకుని వెలిగండ్ల మార్గంలో టిడ్కో గృహాల మీదుగా దాదాపు గంటకు పైగా అటు ఇటూ తిరిగి చివరకు జిల్లెళ్లపాడు క్రాస్ రోడ్డు వద్దకు తీసుకెళ్లి రోడ్డు పక్కన శవాన్ని పడేసినట్టు పోలీసుల విచారణ చెప్పినట్టు సమాచారం. ఆ తర్వాత యాక్సిడెంట్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేశాడా.. అనే కోణంలో విచారిస్తున్నారు.

ఆర్థిక ఒత్తిడి.. అనుమానంతోనే..

ఆర్థిక ఒత్తిడి, కేతిరెడ్డి కాశిరెడ్డితో సాన్నిహిత్యం, మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కలిగి ఉందనే అనుమానంతోనే ఆమెను హత్య చేసినట్టు మోహన్‌రెడ్డి పోలీసుల విచారణలో చెప్పినట్టు తెలిసింది. రాధ తన చిన్ననాటి స్నేహితుడు కాశిరెడ్డికి రూ.80 లక్షల వరకు అప్పు ఇచ్చింది. కాశిరెడ్డికి ఇచ్చిన డబ్బుల విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ వివాదం జరుగుతోంది.

హజ్ యాత్ర ఏర్పాట్లకు ఏడు కమిటీలు

- జూన్ 7 నుంచి యాత్ర ప్రారంభం
- వసతి, ఆహారం, రవాణా తదితర ఏర్పాట్లకు కమిటీలు

సాక్షి, అమరావతి: హజ్-2023 యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించేలా ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చర్యలు చేపట్టింది. ఆదివారం ప్రత్యేకంగా ఏడు సబ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్‌లాజమ్ ఆదివారం మీడియాకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కృషితో కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విజయవాడ (గన్నవరం) ఎయిర్‌పోర్టుకు ఈ ఏడాది ఎంబార్కేషన్ పాయింట్‌కు అనుమతిచ్చింది. దీంతో జూన్ 7 నుంచి విజయవాడ నుంచే హజ్ యాత్రను ప్రారంభిస్తున్నారు. రాష్ట్రంలోని 1,813 మంది విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్తారు. వీరంతా జూన్ 7 నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక విమానాల్లో పయనమై 41 రోజుల యాత్ర ముగించుకుని తిరిగి వస్తారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విజయవాడకు తరలివచ్చే హజ్ యాత్రికుల సౌకర్యార్థం విజయవాడ-గుంటూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మదరసా వద్ద బస ఏర్పాట్లు చేశారు. వసతి నుంచి ప్రయాణం వరకు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా సబ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఏడు కమిటీల్లో ఒక్కో కన్వీనర్‌తో పాటు రెండు నుంచి ఆరుగురు సభ్యులను నియమించారు. ఆహార సదుపాయాల కమిటీ కన్వీనర్‌గా మహ్మద్ ఇబాదుల్లా మరో ముగ్గురు సభ్యులు, వసతి ఏర్పాట్ల కమిటీ కన్వీనర్‌గా ముఫ్తి అబ్దుల్ బాసిత్‌తో పాటు మరో ఇద్దరు సభ్యులు, రవాణా కమిటీ కన్వీనర్‌గా మహ్మద్ తారీఖ్‌తో పాటు ముగ్గురు సభ్యులు, సామగ్రి నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా మునీర్ బాషాతో పాటు ముగ్గురు సభ్యులు, రిసెప్షన్ కమిటీ కన్వీనర్‌గా ముఫ్తి అబ్దుల్ బాసిత్‌తో పాటు ముగ్గురు సభ్యులు, వలంటరీ సేవల కమిటీ కన్వీనర్‌గా ఇస్సాక్ బాషాతో పాటు ముగ్గురు సభ్యులు, విమానాశ్రయంలో ఏర్పాట్లు కమిటీ కన్వీనర్‌గా మహ్మద్ ఇమ్రాన్‌తో పాటు ఆరుగురు సభ్యులతో కమిటీలను నియమించినట్టు హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్ తెలిపారు.

క్రీడల్లో గోల్డెన్ 'హ్యాండ్'!

తెనాలి హ్యాండ్‌బాల్ అకాడమీ మెరుపులు

- అంతర్జాతీయ పోటీల్లో ఆడిన భారత జట్టుకు అకాడమీ క్రీడాకారుడు
- రాష్ట్రం తరపున జాతీయ పోటీల్లో పాల్గొన్న మరో ఆరుగురు
- యూనివర్సిటీ జట్లకు మరో ముగ్గురు క్రీడాకారులు
- 9 నెలల్లోనే అనేక విజయాలు



అకాడమీ క్రీడాకారులు

తెనాలిలోని అన్నాబత్తుని సత్యనారాయణ స్టేడియంలో నడుస్తున్న హ్యాండ్‌బాల్ అకాడమీ ఆశించిన ఫలితాలను సాధిస్తోంది. దాదాపు పది నెలల క్రితం ఆరంభమైన అకాడమీ నుంచి ఒకరు ఏకంగా భారత హ్యాండ్‌బాల్ జట్టుకు ఆడగా, ఆరుగురు రాష్ట్ర జట్లకు ఎంపికై జాతీయపోటీలకు ఆడగా, మరో ముగ్గురు యూనివర్శిటీ జట్లకు ప్రాతినిధ్యం వహించటం ఇందుకు నిదర్శనం.

తెనాలి

హ్యాండ్‌బాల్‌లో గణనీయమైన పురోగతి..

క్రీడారంగంలోనూ జైత్రయాత్ర సాగించిన చరిత్ర కలిగిన తెనాలి, కొంతకాలంగా హ్యాండ్‌బాల్ క్రీడలో గణనీయమైన పురోగతిని సాధిస్తున్న విషయం తెలిసిందే. ఆ క్రమంలో దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేనివిధంగా హ్యాండ్‌బాల్ క్రీడా అకాడమీ గతేడాది ఆగస్టు ఒకటిన ఇక్కడి అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడాస్టేడియంలో ఆరంభమైన విషయం తెలిసిందే. స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ హ్యాండ్‌బాల్ అకాడమీని, ఆ తర్వాత రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా అధికారికంగా ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో దక్షిణ భారత దేశంలో ఈ తరహాలో ఆరంభించిన తొలి క్రీడా అకాడమీగా ప్రత్యేకతను సంతరించుకుంది.

అన్ని వసతులతో..

'శాప్' ఎండీ ఎస్.ప్రభాకరరెడ్డి ప్రోత్సాహం, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అందుబాటులోకి తెచ్చిన వసతులు, దాతల వితరణతో తెనాలిలో హ్యాండ్‌బాల్ అకాడమీ రూపుదాల్చింది. ఇక్కడి స్టేడియంలో రూ.35 లక్షల వ్యయంతో మొదటి అంతస్తును నిర్మించి, క్రీడాకారుల బసకు తగిన డార్మెటరీ, డైనింగ్‌హాలు, కిచెన్, ఆరు వాష్ రూమ్స్, స్టోర్‌రూమ్ సిద్ధంచేశారు. 'శాప్' వీరికి అవసరమైన బెడ్స్‌ను, క్రీడాపరికరాలను సమకూర్చింది. తెనాలి డబుల్‌హార్స్ మినపగుళ్ల వారి సౌజన్యంతో ఈ అకాడమీని ప్రారంభించారు. విజయనగరం, వైజాగ్, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల్నుంచి నలుగురు చొప్పున, కడప, చిత్తూరు, శ్రీకాకుళం, కర్నూలు జిల్లాల్నుంచి ఒక్కొక్కరు ఎంపికకాగా, గుంటూరు జిల్లానుంచి ఏకంగా ఎనిమిదిమంది ఎంపికయ్యారు.

నైపుణ్యమైన క్రీడాశిక్షణ..



క్రీడాకారులు స్టేడియంలో ఉంటూ, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మూడేసి గంటల చొప్పున సాధన చేస్తున్నారు. అనుభవజ్ఞుడైన 'శాప్' కోచ్ కె.నాగరాజు సారథ్యంలో వీరికి నైపుణ్యమైన క్రీడాశిక్షణ లభిస్తోందని చెబుతున్నారు. వీరంతా పేద కుటుంబాల్నుంచి వచ్చినవారే. ఇంటర్ సెకండియర్, డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులే వీరంతా. వీరికి ఉదయం అల్పాహారంతోపాటు రాగి జావ, పండు ఇస్తున్నారు. మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం ఉంది. వారంలో రెండురోజులు నాన్‌వెజ్ ఆహారం, మరో రెండురోజులు గుడ్డును మెనూలో చేరుస్తున్నారు.

భారతజట్టుకు ఎంపిక..



పదినెలలకు చేరువ కావస్తున్న అకాడమీలోని క్రీడాకారులు అద్భుత ప్రావీణ్యాన్ని సంపాదించారు. అకాడమీకి చెందిన జె.మధుబాబు ఏకంగా భారత జట్టుకు ఎంపికవటం విశేషం. గోల్‌కీపింగ్‌లో విశేష ప్రతిభ, నైపుణ్యం కలిగిన మధుబాబు, బల్గేరియా రాజధాని సోఫియాలో గత నెల 25 నుంచి 30వ తేదీవరకు జరిగిన మెన్స్ ఇంటర్నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీల్లో భారత జట్టు గోల్‌కీపర్‌గా అసమాన ప్రతిభను ప్రదర్శించాడు. భారత జట్టు తృతీయస్థానం దక్కించుకోవటంలో మధుబాబు నైపుణ్యం తోడ్పడింది.

జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు నిలయం..



విజయవాడలో జరిగిన జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు విజేతగా నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ జట్టులో అకాడమీ క్రీడాకారులు ఎ.రాజేష్, షేక్‌షావలి ఆడారు. వీరితోపాటు హైదరాబాద్‌లో గత డిసెంబరులో జరిగిన నేషనల్స్‌లో ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్స్ జట్టు కాంస్య పతకం సాధించింది. ఈ పోటీల్లో ఆడిన ఆంధ్ర జట్టులో అకాడమీ నుంచి నవీన్‌కుమార్, శ్యాంసుందర్ ఆడారు. సత్య, రాజేష్ అనే మరో ఇరువురు జాతీయ పోటీల్లో సబ్‌జూనియర్స్ రాష్ట్ర జట్టుకు ఆడారు. డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న అకాడమీ క్రీడాకారుడు శేఖర్, రాయలసీమ యూనివర్శిటీ తరపున అఖిలభారత అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో ఆడాడు. కాలేబు అనే క్రీడాకారుడు, కై లాస్‌లు ఆంధ్రా యూనివర్శిటీ తరపున అదే పోటీల్లో ఆడారు. అకాడమీలోని సగం మంది అంటే పది మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఆడటం అకాడమీకి గర్వకారణమని కోచ్ కె.నాగరాజు అన్నారు. బెహరైన్‌లో జరిగిన 9వ ఆసియా గేమ్స్‌లో భారత జూనియర్ హ్యాండ్‌బాల్ జట్టుకు కోచ్‌గానూ నాగరాజు వ్యవహరించారు. అకాడమీ కొనసాగితే ముమ్ముందు మరిన్ని విజయాలను నమోదు చేస్తుందనటంలో సందేహం లేదనేది క్రీడాకారుల భావన.

పడిలేస్తున్న పౌల్ట్రీ



- నిలకడ లేని గుడ్డు ధర.. వేసవిలో తగ్గిన ఉత్పత్తి
- కరోనా వేళ రూ.2.25కు కనిష్టానికి పతనమైన ధర.. ఏడాదిగా నెక్ ధర రూ.5, ఇటీవల రూ.6, ప్రస్తుతం రూ.4.84
- పొరుగు రాష్ట్రాలకూ మందగించిన ఎగుమతులు

తణుకు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమ ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ప్రస్తుతం గుడ్డు ధర నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాదిగా గుడ్డు నెక్ ధర రూ.5 ఉండగా, ఇటీవల వరకు రూ.6, ప్రస్తుతం రూ.4.84 పలుకుతోంది. వేసవి కారణంగా గుడ్డు ఉత్పత్తి తగ్గగా ఎగుమతులు కూడా మందగించాయి. మూడేళ్ల క్రితం కరోనా కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ కుదేలైంది. అప్పట్లో చికెన్, గుడ్డు వినియోగం తగ్గిన నేపథ్యంలో ఒక్కసారిగా పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. అప్పట్లో చికెన్ ధర తగ్గగా, గుడ్డు ధర సైతం గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.2.25కు పతనమైంది. అయితే కరోనా కట్టడిలో పౌష్టికాహారం అయిన కోడిగుడ్లు, చికెన్ ప్రాధాన్యత పెరగడంతోపాటు ప్రభుత్వం, వైద్యులు సైతం అవగాహన పెంచడంతో పౌల్ట్రీకు కలిసి వచ్చింది. రెండేళ్లుగా గుడ్డు, చికెన్ వినియోగం పెరగడంతో వాటి ధరలు సైతం గణనీయంగా పెరుగుతూ వచ్చాయి. ఈ పరిస్థితుల్లో ఏడాది కాలంగా కోడిగుడ్డు నెక్ ధర రూ.5 పైగా పలుకుతూ వస్తోంది. ఇటీవల బహిరంగ మార్కెట్‌లో రూ.6 పలికింది. ప్రస్తుతం నెక్ ధర రూ.4.84 వద్ద కొనసాగుతోంది.

ఇప్పుడిప్పుడే కోలుకునే దిశగా..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 250 వరకు పౌల్ట్రీలు ఉండగా వీటిల్లో సుమారు 1.20 కోట్ల కోళ్లు పెరుగుతున్నాయి. వీటి ద్వారా నిత్యం కోటి గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. సాధారణ రోజుల్లో 80 శాతం మేర కోడిగుడ్లు పొరుగు రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, ఒడిశా, అసోం, బీహార్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. మిగిలిన 20 శాతం స్థానికంగా వినియోగిస్తుంటారు. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో మూడేళ్లుగా రైతులు పెద్ద సంఖ్యలో కోళ్ల వదిలించుకుని చేతులు దులుపుకున్నారు. తర్వాత బ్యాచ్‌లు వేయకపోవడంతో దాదాపు సగం మేర కోళ్ల ఫారాలు ఖాళీ అయ్యాయి. దీంతో కోడిగుడ్ల ఉత్పత్తి సైతం సగానికి పైగా పడిపోయింది. ఈ పరిస్థితుల్లో 2020 మార్చిలో గుడ్డు ధర రూ. 2.25 కనిష్ట స్థాయికి దిగజారింది. తదనంతరం ధర పెరిగినప్పటికీ నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్కో గుడ్డు ఉత్పత్తి ధర రూ.3.75 అవుతోంది. అయితే రెండేళ్లుగా సరైన ధర లేక పౌల్ట్రీకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. ఆందోళన చెందిన రైతులు కోళ్లఫారాలు ఖాళీ చేశారు. ఇప్పుడిప్పుడే పౌల్ట్రీ పరిశ్రమ కోలుకోవడంతో ఉత్పత్తి పెరిగింది. మరోవైపు నెక్ ప్రకటించిన ధరకు రైతుల వద్ద కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు.

తగ్గిన ఎగుమతులు

వ్యవసాయ అధారిత పరిశ్రమగా ఉన్న పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకునే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన కృషితో పౌల్ట్రీ పరిశ్రమ మరోసారి నిలదొక్కుకుంది. కోవిడ్ కారణంగా సంక్షోభంలోకి వెళ్లిన పౌల్ట్రీ పరిశ్రమను గట్టెక్కించేందుకు పౌల్ట్రీ అసోసియేషన్‌తో కలిసి గతంలో చికెన్, ఎగ్ మేళాలు నిర్వహించారు. ప్రస్తుత వేసవి కాలంలో గుడ్డు ఉత్పత్తి తగ్గుతుండగా ఎగుమతులు సైతం ఆశించిన స్థాయిలో లేవు. ప్రస్తుతం బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో వినియోగం తగ్గింది. ఎండలు పెరుగడంతో కోళ్ల మేతతో పోల్చితే నీళ్లు ఎక్కువగా తీసుకోవడం ద్వారా గుడ్డు పెంకు పటిష్టత తగ్గుతుంది. దీంతో గడ్డు నాణ్యత తగ్గి ఎగుమతులకు ఇబ్బందులు ఎదురవుతోందని రైతులు చెబుతున్నారు. ఇదే వంకతో పొరుగు రాష్ట్రాల్లో వ్యాపారులు గుడ్డు ధరను తగ్గిస్తున్నారని వాపోతున్నారు.

ధర నిలకడగా ఉండటం లేదు

మూడేళ్ల క్రితం కోవిడ్ కారణంగా కోళ్ల పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోయింది. అయితే ఇటీవలి కాలంలో గుడ్డు వినియోగం పెరగడంతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాం. గడ్డు ధర నిలకడగా ఉంటే నష్టాల నుంచి గట్టెక్కుతాం. వేసవి కారణంగా గుడ్డు ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరిగింది.

– పెన్మత్స సుబ్బరాజు, పౌల్ట్రీ రైతు, కావలిపురం, ఇరగవరం మండలం

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943